# గొల్లపూడి కాలమ్ 2012

– గొల్లపూడి మారుతీరావు



శ్రీ కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 95

# Index

(January 02, 2012) Siberian Geetha సైబీరియన్ గీత ..... 4

(January 09,2012) Todikodalu Navvimdi తోడికోడలు నవ్వింది ..... 6

(January 16,2012) Tuntipallu తుంటి పళ్ళు ..... 8

(January 23,2012) Jateeya Rugmata జాతీయ రుగ్మత ..... 10

(January 30,2012) Evee I Padmalu ఏవీ ఈ పద్మాలు ..... 13

(February 06,2012) 49 O – '49 ఓ' ..... 16

(February 13,2012) Boothu Samasya?Parishkarama? బూతు సమస్యా?పరిష్కారమా? ..... 18

(February 20,2012) Nalla Sommu నల్లసొమ్ము ..... 21

(February 27,2012) Mamdu Bghagyulu మందుభాగ్యులు ..... 23

(March 05,2012) Chattalanevi Unnaya? చట్టాలనేవి ఉన్నాయా? ..... 25

(March 12, 2012) Telugu Tegulu తెలుగు తెగులు ..... 27

(March 19,2012) Pidapa Buddhula Peddakka పిదప బుద్ధుల 'పెద్దక్క' ..... 29

(March 26,2012) Chevilo Tufanu చెవిలో తుఫాన ..... 31

(April 02, 2012) Rakshana Neeti Sarawathi Nadi 'రక్షణ' నీతి సరస్వతీ నది ..... 33

(April 09, 2012) Cheekati 'Tera' చీకటి 'తెర ' ..... 35

(April 16,2012) Sexy Story సెక్సీకథ ..... 38

(April 23,2012) Arachetilo Vaikuntham అరచేతిలో వైకుంఠం ..... 40

(April 30, 2012) Mrutyvu Oka Meemamsa మృత్యువు ఒక మీమాంస ..... 42

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

(May 07, 2012) Avyavastha అవ్యవస్థ ........ 44

(May 14,2012) Khareedaina 'Nijam' ఖరీదైన 'నిజం ' ........ 46

May 21, 2012) Seetha Ane Buthu 'సీత' అనే బూతు ........ 48

(May 28, 2012) Gorredatu గొర్రెదాటు ........ 50

(June 04, 2012) Telugu Burada, తెలుగు బురద ........ 52

(June 11, 2012) Maakoddi Nalla Doratanam మాకొద్దీ నల్లదొరతనమూ... ........ 54

(June 18, 2012) Gireesam Avedana గిరీశం ఆవేదన ........ 56

(June 25, 2012) Nijam Nidrapoyindi నిజం నిద్రపోయింది ........ 58

(July 02 2012) Tappu(du)maata తప్పు(డు)మాట ........ 60

(July 09, 2012) Gatamemto Ghanakeerthi గతమెంతొ ఘనకీర్తి ........ 62

(July 16, 2012) Charitarthulu చరితార్థులు ........ 64

(July 23, 2012) Oka asadharanudu ఒక అసాధారణుడు ........ 67

(July 30, 2012)Olympics A Wonder ఒలింపిక్స్:ఒకఅద్భుతం ........ 69

(August 06,2012) Remdu Pustakalu Remdu Prapamchalu రెండు పుస్తకాలు– రెండు ప్రపంచాలు ........ 71

(August 13, 2012) Himanagam ఈ శతాబ్దపు హిమనగం ........ 74

(August 20,2012) Manaki Swatantryam Vacchindi మనకి స్వాతంత్ర్యం వచ్చింది! ........ 76

(August 27,2012) Kotikokkadu కోటికొక్కడు ........ 79

(September 03,2012) Namdo Raja Bhavishyati నందో రాజా భవిష్యతి ........ 81

(September 10,2012) Kopparapu Kavulu కొప్పరపు కవులు ........ 83

(September 17,2012) Eela Vese Vallu ఈల వేసే వాళ్ళు ........ 85

(September 24, 2012) Gurajada 'Desam' Paata గురజాడ 'దేశం' పాట ........ 87





(October 01, 2012) Ettaina Akasam ఎత్తైన ఆకాశం ........ 89

(October 08, 2012) Bhumi Putrulu భూమి పు(శ)త్రుల ........ 91

(October 15,2012) Arachakaniki Akhari Malupu అరాచకానికి ఆఖరి మలుపు ........ 94

(October 22, 2012) Keeerti కీర్తి ........ 96

(October 29, 2012) Gandhi Puttina Desam గాంధీ పుట్టిన దేశం ........ 99

(November 05 , 2012) Anni Unnavade..Emee Leni Vadu అన్నీ ఉన్నవాడే ఏమీలేనివాడు. ........ 101

(November 19,2012) Hasyapu Karuvu హాస్యపు కరువు ........ 103

(November 26,2012) Ekkadiki Potondee Vyavastha ఎక్కడికి పోతోంది ఈ వ్యవస్థ?........ 106

(December 3, 2012) Readymade Jeevithalu రెడీమేడ్ జీవితాలు ........ 108

(December 10,2012) Abhinava Keechakulu అభినవ కీచకులు ........ 110

(December 17,2012) Nijam Nidrapoyindi నిజం నిద్రపోయింది. ........ 112

( December 24, 2012) Manavatvamaa.Ekkada nuvvu?మానవత్వమా! ఎక్కడ నువ్వు ? ........ 114

(December 31, 2012) Telugu Tegullu తెలుగు తెగుళ్ళు ........ 116





# (January 02, 2012) Siberian Geetha సైబీరియన్ గీత

మహాభారతంలో అర్జునుడు దౌర్జన్యకారుడు. కౌరవ సైన్యాన్ని తుదముట్టించడమే అతని లక్ష్యం. కాకపోతే కురుక్షేత్రంలో సైన్యాల మధ్య నిలబడగానే గుండెవణికింది. కాళ్లు తడబడ్డాయి. తన అన్నదమ్ముల్నీ, బంధువర్గాన్నీ చంపాలా అని వాపోయాడు. శ్రీకృష్ణుడనే ఓ జిత్తులమారి – రకరకాల సిద్ధాంతాల్ని ఉటంకించి, పూర్తిగా గందరగోళం చేసి, చంపడమే పరమ కర్తవ్యమని నూరిపోశాడు. కృష్ణుడి విషం తలకెక్కింది. మరో ఆలోచన లేకుండా –తన పర అని చూడకుండా వేలాదిమందిని చంపాడు అర్జునుడు. ఇదీ భగవద్గీత లక్ష్యం, మారణహోమం, జీవహింస, దీనికి కర్మ, విధి, సాంఖ్యం, క్షేత్ర క్షేత్రజ్ఞం వంటి సాకుల్ని జతచేసి మానవాళికి తరతరాలుగా ఎక్కిస్తున్న విషం –ఈ భగవద్గీత. స్థూలంగా అతి స్థూలంగా రష్యాలో సైబీరియాకు చెందిన టోంస్క్ కోర్టులో ప్రాసిక్యూటర్‌గారి ఆరోపణల సారాంశమిది. దీనికి ప్రేరణ ఇప్పటికీ వందలాది దేశాలలో వేలాదిమంది ఆదరిస్తున్న హరేకృష్ణ ఉద్యమ వ్యవస్థాపకులు (ఇస్కాన్) భక్తి వేదాంత ప్రభుపాద వారి భాష్యానికి పట్టినగతి.

క్రైస్తవ ఛాందసం తలకెక్కిన టోంస్క్ విశ్వవిద్యాలయానికి చెందిన ముగ్గురు మేధావులు 'కృష్ణుడు పాపాత్ముడు క్రైస్తవ సిద్ధాంతాలకి ఆయన బోధలు బొత్తిగా చుక్కెదురు' అని సెలవిచ్చారు. అదే దేశంలో రష్యాకవి అలెగ్జాండర్ పుష్కిన్‌కి రామాయణం అభిమాన కృతి. 1792 నాటికే కాళిదాసు శాకుంతలం రష్యన్ భాషలోకి అనువదింపబడింది. 1788లో భగవద్గీత అనువాదం ఆ దేశంలో ప్రచురితమయింది. హిందూ ధర్మమూ, పౌరాణిక చింతనా ఈ దేశానికి కొత్త కాదనడానికి ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే. ప్రముఖ రష్యన్ రచయిత లియొ టాల్‌స్టాయ్ కి భగవద్గీత అత్యంత అభిమాన గ్రంథం. ఈ మేధావి వర్గం నిరసించిన ఈ విషాన్ని 80 దేశాలలో 10 కోట్లమంది యిప్పటికీ చదువుతున్నారు. ఆదరిస్తున్నారు. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, ఎమర్సన్ వంటి ఎందరో మహనీయులు ఈ గ్రంథాన్ని ఎంతగానో ప్రశంసించిన ఉదాహరణలున్నాయి.

ఈ కోర్టు కేసుని నిరసిస్తూ –యిప్పటికే దేశంలో కనీసం 600 పత్రికలు, యితర సంచికలలో వ్యాసాలు, కావ్యాలు, సంపాదకీయాలు రాశారు. పార్లమెంటులో ఎందరో గొంతులెత్తారు. మరీ ముఖ్యంగా మౌలానా ఖాలిద్ రషీద్ అనే ముస్లిం మత గురువు (ఫిరంగి మహల్) లక్నోలో ఇస్లాం మత ప్రచారకులు. ఆయన రష్యా అహంకార యుతమైన చర్యని తీవ్రంగా ఖండిస్తూ అందరు ముస్లింలు ఈ చర్యని నిరసించాలన్నారు. ఇటువంటి మత దుష్ప్రచారాన్ని ప్రభుత్వం తీవ్రంగా గర్హించాలన్నారు. క్రియా యోగ ప్రచారకులు శ్రీశ్రీ రవిశంకర్ యీ చర్య వల్ల రష్యా ప్రజలకే తీరని నష్టమని వాపోయారు. అయితే ఇందులో చిన్న విసర్వయం ఉంది. రష్యాలో ఒక మూల ఇలాంటి దుశ్చర్య సాగుతుండగా, మాస్కోలో వున్న 80 ఇస్కాన్ కేంద్రానికి సంబంధించిన 50 వేలమంది భక్తులు 2012 నాటికి లెనిన్ గ్రాడ్‌స్కీలో మాస్కో వేద కేంద్రాన్ని స్థాపించే ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

అక్టోబర్ విప్లవం తర్వాత –మతాన్నీ, దేవుడినీ అటకెక్కించిన దేశమది. కొన్ని దశాబ్దాలు –ఎక్కడో మారుమూలలో, మరెక్కడో భక్తుల మనస్సుల్లోనో 'దేవుడు' తలదాచుకున్నాడు. దాదాపు 15 సంవత్సరాల క్రితం అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ఒక సినీమా చూశాను. దానిపేరు "పశ్చాత్తాపం" (రిపెంటెన్స్) దేశంలో వామపక్ష సిద్ధాంతాలను వెక్కిరిస్తూ తీసిన ఈ చిత్రం చాలా సంవత్సరాలు బయటికి రాలేదు.




గోర్బచేవ్ కాలంలో దీనికి మోక్షం లభించిందంటారు. ఈ సినీమాలో ఆఖరి సీను –80 ఏళ్లు దాటిన ముదుసలి (ఆనాటి అక్టోబర్ విప్లవాన్ని చూసిన వ్యక్తి) –ఈ ఇంటి ముంగిట ఆగి తలపు కొడుతుంది. 18 ఏళ్ల పిల్ల తలుపు తీస్తుంది. "చర్చికి తోవ ఎటు?" అని అడుగుతుంది. ఆ పిల్ల కంగారుపడి "అటు తోవవుంది. కాని అక్కడ చర్చిలేదు" అంటుంది. ముదుసలి నవ్వుకొంటూ –వెనుదిరిగి 'చర్చిలేని తోవ ఉండేం లేకపోతేనేం?' అనుకొంటూ వెళ్లిపోతుంది. అదీ ముగింపు. ఈ నిర్వీర్యతలోంచి ఇంకా ఆనాటి 'ఛాందసం' నిలదొక్కుకొన్న కొందరు మేధావులున్నారని ఈ కేసు నిరూపించింది. ఇండియాలో రష్యా రాయబారి అలెగ్జాండర్ కడాకిన్ బాధపడుతూ –రష్యావంటి ప్రజాస్వామిక దేశంలో ఇలాంటి ఆలోచనలకు తావులేదు. ఇక్కడ ప్రపంచంలో అన్ని మతాలకూ గౌరవ ప్రపత్తులున్నాయి" అన్నారు. మన పార్లమెంటులో (రాజ్యసభలో) తరుణ్ విజయ్ అనే సభ్యుడు ఆవేశంతో "సూర్యుడిని ఎవరయినా ఆపగలరా? హిమాలయాన్ని బహిష్కరిస్తారా? భూమి చలనాన్ని ఆపుతారా? భగవద్గీతని బహిష్కరించడం అలాంటిది" అన్నారు. టోంస్క్‌లో ఒక పత్రిక ఈ చర్యని ఖండిస్తూ –గీత –ఒక మతాన్ని నిర్దేశించే గ్రంథం కాదు. మానవాళి అంతటికీ సంబంధించిన ప్రబోధం.మానవాళికి మార్గదర్శి అన్నది. టోంస్క్ కోర్టులో జరిగిన అనర్థానికి టోంస్క్ లోనే ఒక పత్రిక సబబైన సమాధానం చెప్పింది. భారతీయ ఆధ్యాత్మిక చింతనని రెండు మాటల్లో సూచించింది. నిజానికి భగవద్గీత మతగ్రంథం. ప్రతిమనిషికీ కరదీపిక. సర్వ కాలికమయిన విశ్వాసాలకు 'దేవుడు' తొడుగువేయడం వల్ల ఆ విశ్వాసాలకు మన్నిక, ఆదరణ లభిస్తుందని –అలనాటి పెద్దలు తొడిగిన 'అంగీ' మతం. శ్రీకృష్ణుడిని, అర్జునుడిని కాదనుకొని చదివినా ఓ గొప్ప గురువు ఓ గొప్ప శిష్యునికి బోధించే అద్భుత జీవన సత్యాలకు నిలయం భగవద్గీత. అన్ని కాలాలకూ వర్తించే గైడ్.

అందుకనే ప్రతీ కాలంలో, ప్రతీ తరంలో, ప్రతీ మతప్రవక్త, నాయకులూ, పెద్దలూ –ఆ కాలానికి, ఆ సమాజానికీ ఆనాటి విలువలకీ అన్వయిస్తూ –భగవద్గీతకి భాష్యం చెప్పారు. అన్ని కాలాలకూ సరిపోయే 'రైల్వే గైడ్' ఉండదు. కాలానికనుగుణంగా, అవసరాలకు అనుగుణంగా మారుతుంది. శంకరాచార్య, రామానుజాచార్య, మధ్వాచార్య, మహాప్రభు, ధ్యానేశ్వర్, స్వామి వివేకానంద, అరవిందులు, సర్వేపల్లి రాధాకృష్ణన్, అనీబిసెంట్, తిలక్, మహాత్మాగాంధీ, ప్రభుపాద, చిన్మయానంద, దయానంద సరస్వతి, పార్థసారధి, సుందర చైతన్య –ఆఖరికి యండమూరి వీరేంద్రనాథ్ –ఈ జాబితా అనంతం –అది మానవాళి జీవన సరళిని సుగమం, సుఖవంతం చేసే ఎలిక్సిర్. ఒకే ఒక్క ఉదాహరణ 12వ అధ్యాయం 'భక్తియోగం'లో 8, 9, 10, 11, 12 శ్లోకాలు. అద్వేష్టా సర్వభూతానాం మైత్ర: కమలావచ" –భక్తుడి (మంచి నడవడికకి) లక్షణాలను గురువు (కావాలనే శ్రీకృష్ణుడనడం లేదు) 31కి సూచించారు. అన్ని ప్రాణులపట్ల కరుణ, మైత్రి, నిర్మమత, సుఖదు:ఖాల పట్ల సమభావం, క్షమ... యిలా. ఈ 31 లక్షణాలనూ దేవుడికే ఏమీ సంబంధం లేదు. ఆ మాటకివస్తే –ఈ లక్షణాలకీ భక్తికీ ఏమీ సంబంధం లేదు. కాని ఈ లక్షణాలు ఏ కొన్నిటినీ, కనీసం ఒక్కటి సాధించినా –అతను 'భక్తుడు' కాదు జీవన్ముక్తుడు –ఒక్క కరుణచే ఈ ప్రపంచంలో అద్భుతమైన సంకేతం –ఏసు ప్రభువు.

ఇంతకంటె భగవద్గీత విశ్వజనీనత, సర్వకాలజ్ఞతని చెప్పడానికి నాకు శక్తి చాలదు. చివరకు సైబీరియాలోని టోంస్క్ స్థానిక కోర్టు 'గీత'పై కేసును కొట్టివేయడం ఊహించినదే

**(జనవరి 2, 2012)**

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

## (January 09,2012) Todikodalu Navvimdi తోడికోడలు నవ్వింది

నా చిన్నతనంలో – నిజానికి 20 సంవత్సరాల కిందటివరకూ – ఆడవాళ్ళు చుడీదార్ డ్రస్సులు వేసుకోవడం తెలీదు. అందరూ పరికిణీ, ఓణీలతో లక్షణంగా తెలుగుదనంతో కనిపించేవారు. అలాంటి డ్రస్సులు ప్రస్థుతం మాయమయిపోతున్నాయి. నేటి తరం సినీమాల్లో హీరోయిన్ల ఒంటి మీద బట్టలు వెద్దుక్కోవలసిన పరిస్థితి.

ఏదో సినీమాలో కూతురు పొట్టి నిక్కరుతో మెట్లు దిగుతూంటుంది. తండ్రి వచ్చి ఇబ్బందిగా "కింద బట్టలు వేసుకోవడం మరిచిపోయినట్టున్నావమ్మా" అంటాడు ఇబ్బందిగా. ఈ సీనుని రాసుకుని నేనూ, విశ్వనాధ్ గారూ ఓ రోజంతా నవ్వుకున్నాం. అది ఆ రోజుల మాట. ప్రస్థుతం చాలామంది ఆడపిల్లలు ఇలా మరిచిపోయి చాలా రోజులయింది. అలాంటి ఇబ్బందులు ఎవరూ పడడం లేదు. మగవాళ్ళు ఆడ డ్రస్సులు వేయడం లేదు కానీ, నూటికి నూరుపాళ్ళు ఆడవాళ్ళు మగ డ్రస్సులు, మగ జుత్తులు, మగ డ్రింక్, మగ సిగరెట్టు, మగ డాన్సులూ – అన్నీ చేస్తున్నారు. దీన్నే ప్రపంచీకరణ అంటారు కాబోలు! మాదక ద్రవ్యాలు నిండిన హుక్కా కేంద్రాలు జంట నగరాల్లో విరివిగా ఆడపిల్లల్ని ఆకర్షిస్తున్నాయని ఆ మధ్య ఓ ఛానల్ ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని చేసింది.

నలభై మూడేళ్ళ నాటి మాట. గగన మహల్ రోడ్డులో నేనూద్దె ఇంటికోసం వెళ్ళాను. స్కాట్స్ ఆఫీసుకి ఎదురుగా ఉన్న క్రిసెంట్ రోడ్డులో సౌందర రాజన్ అనే ఓ తమిళులు ఉండేవారు. ఆయన పద్దెనిమిదేళ్ళు పైబడిన అమ్మాయి ఉంటే ఇల్లు అద్దెకి ఇవ్వనన్నాడు. కారణం – ఆ అద్దె ఇంట్లో ఒక పడకగది ఉన్న పోర్షన్ మాత్రమే ఉంది. పద్దెనిమిదేళ్ళ అమ్మాయి సొంత కూతురయినా, తోడబుట్టిన చెల్లెలయినా – పరాయి స్త్రీ కిందే లెక్క అని ఆయన ఉద్దేశం. ఒక గదిలో ఉండకూడదట! ఇప్పుడు ఇలాంటి దిక్కుమాలిన ఛాందసాలు ఎవరికీ లేవు. ఆ మాటకి వస్తే ఈ విచక్షణ పరాయి అమ్మాయిలకే వర్తించదు. మన నాగరికత పెరిగింది. స్త్రీలలో 'సమాన ప్రతిపత్తి' ఇంకా వెర్రితలలు వేసింది. ఎట్టి పరిస్థితులలోనూ స్త్రీలు మగవారికంటే ముందుండగలరని భేషరతుగా నిరూపించుకుంటున్నారు. ఇది ఆక్షేపణీయంగా అంటున్న మాట కాదు. గర్వపడుతూ చెపుతున్నమాటే. కానీ కొన్ని నియమి తులు ఆ సమాజపు సంస్కృతిని కాపడతాయి. స్త్రీ సంక్షేమానికి గొడుగుని పడతాయి. అయితే ఇలాంటి మాటలెవరయినా అంటే బూతు మాట విన్నంతగా కస్సుమనే రోజులొచ్చాయి.

ఆడవాళ్ళు – ఎంతగా శరీరాన్ని వీధిన పడేస్తున్నారో – హైదరాబాదు సెంట్రల్ మాల్, నెక్లెస్ రోడ్, ప్రసాద్ మల్టీ ప్లెక్స్ ల దగ్గర ఒక్క అరగంట నిలబడితే అర్ధమవుతుంది. ఎవరూ ఈ విషయం చెప్పనక్కర్లేదు. సరే. రేపులూ, హత్యలూ, ఏసిడ్ దాడులూ మనం ఇప్పుడిప్పుడు విరివిగా వింటున్నాం. ఈ విషయాలు – వీటికి కారణాలు – ఇంత అవగాహన పెంచుకున్న స్త్రీలకు మట్టుకు తెలీదా!

ఈ మధ్య పోలీసు డైరెక్టర్ జనరల్ దినేష్ రెడ్డిగారు – పట్టణాల్లో, పల్లెల్లో అమ్మాయిలు రెచ్చగొట్టే విధంగా బట్టలు వేసుకోవడం ఈ నేరాలకు ఒక

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

కారణమని అన్నారు(ట). చాలామంది స్త్రీలూ, సంస్థలూ కోపంతో ఊగిపోయారట. కేంద్ర మంత్రి పురందరేశ్వరి గారికి కోపం వచ్చింది. పోనీ ఆవిడెందుకు పాంటూ చొక్కాతో పార్లమెంటుకి రావడం లేదు? ఇంతమంది కళ్ళుమూసుకుంటున్నారా అని ఆశ్చర్యపోవలసిన సందర్భమిది. బాబోయ్! నేనలా అనలేదు – నా మాటల్లో తప్పుడు అర్థం తీశారు అని వెనక్కు తగ్గారు దినేష్ రెడ్డిగారు. ఆయన అలా అనే మనిషి కాదు – మాకు తెలుసు. ముసిలివారికీ, స్త్రీలకీ ఎంతో ఉపకారం చేసే స్వభావులు – అని ఇద్దరు మహిళా పోలీసు అధికారులు – తేజ్ దీప్, అనురాధ ఆయనకి వత్తాసు పలికారు.

వెనకటికో సామెత ఉంది. అత్తకొట్టిందని కాక తోడికోడలు నవ్విందని ఒకావిడ గింజుకుందట. ఈఆడ సంస్థల గింజుడు అలానే అనిపిస్తోంది. వారికి ఆడపిల్లల వికారాలకంటే దినేష్ రెడ్డిగారి మాటలు ఆక్షేపణీయంగా కనిపించాయి.మొన్న ఒకావిడ టీవీలో చెప్తోంది. కొత్త సంవత్సరం నాడు తాగి క్లబ్బులో తందనాడాడుతున్న అమ్మాయిల్ని పట్టుకుని మీ ఇళ్ళ ఫోన్ నంబర్లు ఇవ్వమన్నారట పోలీసులు. "వద్దండీ. మాడాడీ, మమ్మీ ఇప్పుడు దొరకరు. క్లబ్బుల్లో ఉంటారు – అన్నారట పిల్లలు. యద్యదాచరతి శ్రేష్టః. ఇది ఒక మహిళ కార్యక్రమంలో ఆక్షేపణగా చెపుతోంది.

ఆ మధ్య పూణే వెళ్ళాను. రోడ్డుమీద ప్రతీ ఆడపిల్లా మొహం కనిపించకుండా పెద్ద గుడ్డ – చున్నీనో బన్నీనో చుట్టుకుని కనిపించింది. ఒక పోలీసు అధికారి ఆ నగరానికి వచ్చి "ఇదేంటమ్మా వీరిలో తీవ్రవాదులున్నారా? నేరస్థులున్నారా? రంకు నడిపే పెళ్ళికాని పిల్లలున్నారా? పెళ్ళయిన ఇల్లాళ్ళున్నారా? పెద్ద మనుషులున్నారా? తెలియడం లేదు" అంటూ అభ్యంతరం తెలిపాడట. అంతే. మిన్ను విరిగి అతని నెత్తిన పడింది.

"మమ్మల్ని అలాంటి మాటలంటారా?" అని విరుచుకుపడ్డారట. అభ్యంతరపెడితే హక్కు. పెట్టకపోతే – రంకు, బొంకు, నేరం – ఏదో ఎదో. పాపం ఆయన భయపడిపోయి నోరుమూసుకున్నాడట. ప్రస్థుతం అలాంటి ముసుగులు మన నగరాల్లోకీ రవాణా అవుతున్నాయి. సూర్య నమస్కారాలు చెయ్యడానికి సంస్కారం కావాలి కాని – నేరాలకి 'ముసుగు ' సంపాదించడం ఏం కష్టం? శరీరం వీధిన, మొహాలు ఉసుగులో – ఇది నేటి ఆడపిల్లల సంస్కారానికా? ఈ దేశపు సంస్కృతికా? ఈ సమాజపు స్వేచ్ఛా ప్రవృత్తికా? పెరుగుతున్న పాశ్చాత్య వ్యామోహానికా? విమర్శని సదుద్దేశంతో గ్రహించలేని కుమతికా – అన్నిటికీ మించి "మా ఇష్టం వచ్చినట్టు బతికే హక్కు మాకుంది. అది మా చదువూ, జీవన విధానం నేర్పిన వెసులుబాటు. కాదనడానికి నువ్వెవరివి?" అనే కుహనా అహంకారానికా?

అన్నట్టు – దినేష్ రెడ్డిగారిని ఆర్ ఎస్ ఎస్ కి సంబంధించిన రాష్ట్ర సేవికా విభాగం మహిళా శాఖ సమర్థించి హర్షించింది. అదిగో, ఇది ఛాందసాన్ని ప్రచారం చేసే అతివాద శక్తుల వాగుడు – అని ఎవరో అంటారు. సంస్కారానికి సాకుల ముసుగు, కుసంస్కారానికి స్వేచ్ఛ హక్కుని పులిమే దబాయింపు ఈకాలానిది.

నేను దినేష్ రెడ్డిగారిలాగ గవర్నమెంటు ఆఫీసర్ని కాదు. నా అభిప్రాయాలను చెప్పుకునే హక్కు – ఆడవాళ్ళ బట్టల్లాగ, మొహాల ముసుగుల్లాగ, సగం సగం డ్రస్సులాగ – నాకూ ఉంది.

**(జనవరి 9, 2012)**




# (January 16,2012) Tuntipallu తుంటి పళ్ళు

1971లో 'అండర్సన్ టేప్స్' అనే హాలీవుడ్ చిత్రం వచ్చింది. జేంస్ బాండ్గా నటించిన షాన్ కోనరీ దొంగ. ఒక అపార్టుమెంటునంతా దోచుకోడానికి పన్నాగం చేస్తాడు. కొన్ని నెలలపాటు దొంగతనానికి ఏర్పాట్లు చేస్తాడు. అతను చేసే ప్రతీపనీ – గవర్నమెటులో ఏదో విభాగాంకి తెలుస్తోంది. కారణం – అతను సంప్రదించిన అన్నిసంస్థల, వ్యక్తుల టెలిఫోన్లను ఆయా విభాగాల డిపార్టుమెంటుల నిఘా ఉంది కనుక. అయితే అన్ని వి భాగాల సమాచారాన్ని కలిపే ఆస్కారం లేదు. ఏర్పాటు లేదు. కనుక దొంగతనం గవర్నమెంటుకి తెలియలేదు. నెలల తర్వాత పథకం ప్రకారం దొంగతనం ప్రారంభమయింది. మరో అరగంటలో తప్పించుకుంటాడనగా – ప్రభుత్వం మేలుకుంది. దొంగని పట్టుకుంది. అదీ కథ.

ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి మాయావతి పదవిలోకి వచ్చింది. వచ్చింది లగాయతు కొన్ని వేల కోట్ల ఖర్చుతో లక్నోలో పార్కుల నిర్మాణాన్ని సాగించారు. ఆమె పార్టీ గుర్తు ఏనుగు. కనుక లక్నోలో పార్కుల నిండా బలసిన ఏనుగుల రాతి బొమ్మల్ని చెక్కించారు. మాయావతివి విగ్రహాలు పదకొండు చెక్కించారు. పార్కుల నిండా ఏనుగు బొమ్మల తలుపుల పిడులూ, మాయావతి స్థంభాలు, మాయావతి చక్రాలు, కాన్షీరాం విగ్రహాలు సమృద్ధిగా ఉన్నాయి. నోయిడా పార్కులో రెండు పెద్ద మాయావతి విగ్రహాలు, యాభైరెండు ఏనుగుల రాతి విగ్రహాలు ఉన్నాయి. ఇవన్నీ ఒక్క రోజులో వెలిసినవి కావు. వేలకోట్ల ఖర్చుతో సంవత్సరాల తరబడీ నిర్మించినవి. మెజారిటీ ప్రజల మద్దతుతో పదవిలోకి వచ్చిన నాయకురాలు తన పార్టీకీ, తనకీ ఇష్టమైన – ఇంకా చెప్పాలంటే తన విగ్రహాలను నిర్మించుకోవడం ఏం సబబు? ఈ ప్రశ్న ఇన్ని సంవత్సరాలలో ఎవరూ వేయలేదు. నిరాఘాటంగా నిర్మాణం సాగింది. ఆ మధ్యనే పార్కుల నిర్వహణకు మరికొన్ని వందల కోట్లను కేంద్రం కేటాయించాలని మాయావతి కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

ఎవరో ఈ నిర్మాణాల మీద కోర్టు కెక్కితే కొంతకాలం నిర్మాణాన్ని ఆపివేసింది కోర్టు.

ఇప్పుడు ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం కళ్ళు తెరిచింది. ఈ సంఘం ఇంతకాలం దుబాయిలోనో, హాంకాంగ్ లోనో లేదు కదా? ఇంత విస్తు తంగా నిర్మాణాలు జరుగుతున్నట్టు ఈ సంఘానికి తెలీదా? తెలిసి తెలిసి – ఎన్నికల వరకూ నిద్రపోవడమేనా చెయ్యగలిగిన పని? ఇప్పుడు ఎన్నికలకి పద్దెనిమిది గంటల వ్యవధి ఉండగా – ఈ విగ్రహాల మీద – ఏనుగుల మీదా, మాయావతి విగ్రహాల మీదా ముసుగులు కప్పాలని నిర్ణయం తీసుకుంది.

లక్నో, నోయిడా అధికారులు అప్పుడు సమావేశమయి – ఏ విధంగా విగ్రహాలను కప్పాలి, ఏ రంగు పరదాలతో కప్పాలి? దానికి ఎంత గుడ్డకావాలి అన్న విషయాల మీద చర్చించారు. బహుజన సమాజ్ పార్టీ గుర్తు ఉదా రంగు ఏనుగు. కనుక ఏనుగుని ఊదారంగు ప్లాస్టిక్ పరదాలతో, మాయావతిగారిని ఊదారంగు గుడ్డల్తో కప్పాలని నిర్ణయించారు. ఇందుకు మరికొన్ని లక్షల ఖర్చు.

ఇప్పుడు ఇప్పుడు చూసేవారికి ఏనుగులు కనిపించకపోవచ్చు. మాయావతి విగ్రహాలు కనిపించకపోవచ్చు. కానీ ముందుకన్న కొట్టొచ్చినట్టు అక్కడ ముసుగుల కింద ఏం ఉన్నాయో మరింత స్ఫుటంగా చూపరులకు గుర్తుకొస్తూంటుంది. ఇది ఎన్నికల సంఘం చేసిన ఉపకారం. వెనకటికి "పెళ్ళివారి గుట్టు బయటపెట్టకురా బాబూ!" అని ఓ పెళ్ళికొడుకుకి నచ్చచెపితే – అతను బుద్ధిగా పెళ్ళివారితో అన్నాడట: "అయ్యా ఈ




షర్టూ, పాంటూ నాదే, కానీ ఆ తివాచీ గురించి నన్నడగకండి" అని. ఎన్నికల కమిషన్ మేధస్సుకి జోహారులర్పించాలి. ఒకరోజులో ఎన్నిక జరుగుతుందనగా – అధికార యంత్రాంగాన్ని మేలుకొలిపి, లక్షల ఖర్చుతో ముసుగులు తొడిగి – 'పెళ్ళికొడుకు' ఫక్కీలో "ముసుగుల వెనుక మేం ఉన్నాం సుమా!" అన్న స్పృహని ప్రత్యేకంగా ఈ చర్యద్వారా ప్రసాదించారు.

బహుజన సమాజ్ పార్టీ నాయకులు మిశ్రాగారు ఓ ధర్మసందేహాన్ని వెలిబుచ్చారు.

"అయ్యా, ఏనుగులకి ముసుగులు తొడిగారు. బాగానే ఉంది. మరి సైకిలు గుర్తున్న పార్టీ ఎన్నికల్లో సైకిళ్ళను మాయం చేస్తారా? ఈ దేశంలో రచయితలు ఏనాడయినా మైనారిటీ వర్గమే. చేతన్ భగత్ అనే రచయిత ఓ మాట అన్నాడు. మొదట ఆ విగ్రహాలు కట్టడాన్ని ఆపివుండాలి. తీరా కట్టారు కనుక నోరుమూసుకోవాలి. ఇప్పుడు కావలసింది విగ్రహాలకు ముసుగులు కావు. నిలవనీడయినా లేని ప్రజానీకానికి ఆ డబ్బుతో కప్పుకునే దుప్పట్లు.

ఆకరి క్షణంలో అధికారులు మేలుకొనడం వల్ల – కొన్ని విషయాలు దేశ ప్రజలకు అర్ధమవుతాయి. అధికార యంత్రాంగం వీలయినంతకాలం కళ్ళు మూసుకుని నిద్రపోతుందని. పదవిలో ఉన్నవారు ఏం చేసినా ఎవరూ ఏమీ చెయ్యలేరని. ఏ రోజయినా మొండివాడు రాజుకన్నా బలవంతుడని. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం వల్ల ఆకులకు నష్టం – చేతులకు, చేతలకు లాభం ఉండదని.

కిందపడినా నేనే గొప్ప అన్నట్టు – ముసుగులు కప్పిన ఏనుగులూ, మాయావతులూ – ముసుగుల్ని తలదన్నేలాగ అధికారుల చేతకాని తనాన్నీ, అజ్ఞానాన్నీ, నిస్సహాయతనీ, తెలివితక్కువ తనాన్నీ చెప్పక చెపుతున్నాయి. లేదా ప్రజల కళ్ళు తుడవడానికి ఇదొక దగ్గరతోవా?

ఏతావాతా – తాను మళ్ళీ పదవిలోకి వచ్చాక – అర్ధాంతరంగా కలిసొచ్చిన ఈ లక్షలాది వ్యయంతో సమకూరిన ముసుగులు ఏ సంస్థల కళ్ళ మీద కప్పాలో మాయావతిగారు తన అనుచరులతో ఈ పాటికే చర్చలు జరుపుతూ ఉంటారని మనం ఊహించవచ్చు.

మన దేశంలో ఎప్పుడూ పల్ళు రాలలంటే తుంటి మీదే కొట్టడం ఆచారం.

**(జనవరి 16, 2012)**








# (January 23,2012) Jateeya Rugmata జాతీయ రుగ్మత

క్రికెట్ క్రీడాభిమానులకు ఆనంద్నా కలిగించే ఆట –ప్రపంచంలో చాలా దేశాలలో. కా మన దేశంలో అది జబ్బు. జూదాకి ఆలంబన. వ్యాపార సాధనం. రాజకీయ లబ్ధికి పెట్టుబడి. అవీతికి అవకాశం. అజ్ఞానులకీ, అడ్డమయిన వాళ్లకీ ఫాషన్ సింబల్. వెరసి –క్రీడ తప్ప మిగతా అన్నీను.

1975 లో రిలీజయిన హాలీవుడ్ చిత్రం "మాన్ ఫ్రైడే" గొప్ప చిత్రం. రాబిన్‌సన్ క్రూసో అనే నావికు నౌక మెరకలో దిగబడి ఒక ద్వీపంలో లిచిపోతాడు క్నొ సంవత్సరాలపాటు. అత దగ్గర బంగారు నాణాలు ఉన్నాయి. మఖమల్ వస్త్రాలున్నాయి. అd్స ఉన్నాయి. కా అనుభవించే అవకాశం లేదు. ఆ ద్వీపాకి బందీ అతను. ఓ సారి ఓ చిన్న పడవ గాలివాలుకి కొట్టుకు అటువేపు చేరింది. అందులో నలుగురు నల్లవాళ్లు ఉన్నారు. చేతిలో ఉన్న తుపాకీతో ముగ్గుర్ని చంపాడు. ఒకడు బతికాడు. శరణు జొచ్చాడు. అత్న తన బాస చేసుకున్నాడు. శుక్రవారం నాడు దొరికాడు కనుక అతకి ఫ్రైడే అ నామకరణం చేశాడు. నెమ్మదిగా ఇంగ్లీషు భాష అర్థం చేసుకోవడం ప్రారంభించాడు నల్లవాడు.

"ఇకనుంచీ నేను  నీ యజమనిని" అన్నాడు తెల్ల క్రూసో.

"ఎందుకు బాస్?" అన్నాడు ఫ్రైడే.

ఒక్కక్షణం ఆలోచించాడు క్రూసో. "నా దగ్గర తుపాకీ ఉంది కనుక". ఇప్పటికీ ఈ ఒక్క కారణాకే తమ గొప్పతన్నా మనమీద రుద్దుతున్న పెద్ద దేశాలు ఉన్నాయి. హింసించడం,ఎదుటి వ్యక్తి జీవన్నా నాశనం చేయగలగడం –పెద్దరికం, అధికారం. ఇది నవల. అద్భుతం.

బంతాట ఆడదామంటాడు క్రూసో. "క్రీడ అంటే ఏమిటి?" నల్లవాడి ప్రశ్న.

మళ్లీ ఆలోచనలో పడ్డాడు తెల్లవాడు. చివరికి సమాధానం దొరికింది. "మన సంతోషం కోసం ఎదుటివాడి హింసించడం" నాగరిక ప్రపంచంలో అ్న సంస్కారాల్నీ ఇలాంటి ప్రాథమిక ప్రశ్నలతో దుయ్యపట్టింది రచయిత్రి. దీకి ఓ నల్ల మహిళ రచయిత్రి అ గుర్తు.

ప్రస్తుతం క్రికెట్ ఎన్నోరకాల 'హింస'లకు ఆటపట్టు.

ఈ మధ్య కాళ్లు తిమ్మిర్లు ఎక్కుతూంటే డాక్టర్‌కి ఫోన్ చేశాను. చాలాసేపటి వరకూ ఫోన్ తియ్యలేదాయన. తీరా తీశాక చాలా ఉత్తేజంగా ఉన్నాడు. ఆయనేదైనా ఆయాసంతో, జబ్బుతో బాధపడుతున్నాడేమోన భయమేసింది.

"బాగున్నారా? అ డాక్టర్ని నేనడిగాను.

పరాకుగా "ఊ" అన్నాడు. చెవులు పగిలేలాగ టీవీలో కేకలు విపిస్తున్నాయి. నా రుగ్మత చెప్పబోయాను. "ఓ అరగంట తర్వాత ఫోన్ చేస్తారా?" అన్నాడు ఇబ్బందిగా.








ఏదయినా ఆపరేషన్ హడావుడిలో ఉన్నాడేమో. లేదా అతి ముఖ్యమైన పేషెంట్ చూస్తున్నాడేమోననుకున్నాను. కా సచిన్ తెందూల్కర్ వెస్ట్ ఇండీస్ లో 80 పరుగుల స్కోర్‌లో ఉన్నాడు. ఇంకో 20 పరుగుల్లో వంద వందల పరుగులు తీసిన ఘనత దక్కుతుంది. మా డాక్టర్‌గారికి ఊపిరి తిరగడం లేదు. టీవీ ఆన్ చేశాను. దేశంలో ఛానల్స్ అdి్న్ ఒకే విషయ్నా ప్రసారం చేస్తున్నాయి. సచిన్ జీవితం, అత చిన్నతనం, బొంబాయిలో తొలినాళ్లలో ప్రాక్టీసు, అత విజయాలు, అతకి భారతరత్న యివ్వవలసిన అవసరం, అత వినయ సంపద, ప్రతిభ –రకరకాల మనుషులు ఆవేశంగా చెప్తున్నాను. మధ్య మధ్య క్రికెట్ చూపిస్తున్నాను. బహుశా గాంధీ జయంతినాడు గాంధీగారి కూడా ఇంత భక్తిగా, ఇంత ఆవేశంతో స్మరించి ఉండరేమో!

దేశంలో అ్న కార్యకలాపాలూ లిచిపోయాయి. జన జీవనం స్థంభించిపోయింది. ఎందుకు? సచిన్ వందవ సెంచరీ కోసం. ఎవరి పలకరించినా అదేమాట.

"బాబూ! కడుపునొప్పి!"

"dకు బుద్ధి ఉందా లేదా? అక్కడ సచిన్ సెంచరీ కొడుతున్నాడు –ఇప్పుడా దిక్కుమాలిన కడుపునొప్పి?"

పెళ్లా కాఫీ అడిగినా దక్కదు. "ఇప్పుడేమిటండీ? సచిన్ సెంచరీ కావ్వండి బాబూ మీకు పుణ్యముంటుంది".

ఆ క్షణంలో సచిన్ జాతీయ విపత్తు.

రిక్షావాళ్లకీ, పాన్ షాపులవాళ్లకీ, మరమరాల దుకాణాల వాళ్లకీ యిప్పటికీ క్రికెట్ లోతుపాతులు తెలీవు. కా అది జరుగుతూండగా తన టీవీలకీ, రేడియోలకీ గిరాకీ పెరుగుతుంద తెలుసు. థర్డ్ మాన్, తీన్రా, గుగ్లీ, యార్కర్‌లంటే బొత్తిగా తెలీదు. నాలుగు పరుగులకు బంతి వెళ్లింది.

అరుపులు. "కొట్టమనండి బాబూ. ద్రావిడ్ అయినా నాలుగు దెబ్బలు కొడితే మన పరువు లుస్తుంది. అందాకా ఓ కిళ్లీ బిగించండి గురువుగారూ" ఇదీ ధోరణి. క్రికెట్ గురించి మాట్లాడడం ఓ ఫాషన్, నాగరికతకి చిహ్నం, స్టేటస్ సింబల్. ఆధుక జీవన కృత్రిమత్వంలో కీలక స్థానంలో క్రికెట్ ఉంది ప్రస్థుతం.

ఇది ఒక పార్శ్వం. ఇవdి్స్ తెలియ, తెలియనక్కరలే రాజకీయ నాయకులు –కేవలం అధికారాకి, తేనెపట్టులాగ డబ్బుతో బలిసి ఉన్న వ్యాపార్నా కొల్లగొట్టడాకి క్రికెట్ సంస్థల పదవులు చేపడతారు. నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిగారు విశాఖ సాహితికి అధ్యక్షులుగా ఉంటారా? ప్రతిభా పాటిల్ తెనాలి నాటక సంస్థకి ప్రధాన పోషకురాలిగా ఉంటారా? (ఇది నవ్వులాటగా అంటున్న మాట కాదు. ఇంగ్లండులో షేక్స్పియర్ నాటకం కంపెd ప్రధాన పోషకురాలు ఎలిజబెత్ మహారాణి.) మన దేశంలో క్రికెట్ కంట్రోలు బోర్డ్ అధ్యక్షుడు శరద్ పవార్, బీహార్ క్రికెట్ సంస్థ అధ్యక్షులు లల్లూ గారు! ఇప్పుడిప్పుడు ఏడాది పొడుగునా క్రికెట్ సాగుతోంది. ఇదివరకు ఏడాదికి ఒక సీజన్‌లోనే సాగేది. ఐసిఎల్, ఐపిఎల్, రంజీట్రోఫీ,



మరేదో మరేదో. క్రీడాకారుల్ని సంతలో పశువుల్లాగ వేలం వేస్తారు. ఆటల మీద జూదాలు సాగుతాయి. జూదగాళ్లకి అనుకూలంగా ఆట తగలబెట్టే ప్రబుద్ధుల కథలు ఈ మధ్యనే వెలుగుచూశాయి.

ఇదో ప్రపంచం. వేలం వెర్రి. ప్రపంచంలో మనదేశమే ప్రస్తుతం క్రికెట్‌లో అవమానాల పాలవుతోంది. కా వెర్రి విషయంలో, డబ్బు విషయంలో మనల్ని కొట్టేవాడు లేడు. ఆట జరుగుతూండగా కోట్ల రూపాయలు చేతులు మారతాయి. ప్రతిభలోకాక పెట్టుబడిలో భారతదేశం ముందుంది.

క్రికెట్ ఆట రోజున ఆఫీసుల్లో పని లిచిపోతుంది. వ్యాపారాలు ఆగిపోతాయి. రోడ్లమీద వాహనాలు స్థంభించిపోతాయి. జనజీవనం అస్తవ్యస్తమయిపోతుంది. కోట్లాదిమంది పనులు మానుకు టీవీలకీ, రేడియోలకీ అతుక్కుపోతారు. ఎ్న లక్షల కోట్ల మానవశక్తి (మాన్ అవర్స్) వృధా అవుతోందో ఆలోచించే నాథుడు లేడు.

గత నెల రోజులుగా దేశం క్రుంగిపోయివుంది. కారణం –భారతదేశం ఆస్ట్రేలియా చేతుల్లో చిత్తుగా ఓడిపోతోంది. ఏ బాట్స్‌మేనూ రాణించడం లేదు. దేశమంతా దిగాలు పడిఉంది. టీవీలు పెడితే బ్లేడులూ, పాలపీకలూ, టైర్లూ, మందులూ, ఇన్సూరెన్స్‌లూ, పౌడర్లూ అమ్ముతూ అందంగా కపించే క్రీడాకారులు వెర్రిముఖాలు వేసుకు మనకు దర్శన మిస్తున్నారు. దేశం విషాదంలో మునిగిపోయింది.

సెంచరీ కొట్టడం సచిన్ పకదా? దాకోసం అతను బెంగపెట్టుకోవాలి కదా? దేశం ఎందుకిలా విలవిలలాడుతుంది? అథవా సచిన్ సెంచరీ కొడితే ఏలూరులో మరమరాల వాడికి ఏం లాభం? చెప్పమనండి. ఇది దేశభక్తా? క్రికెట్ భక్తా? సచిన్ భక్తా? పిచ్చా?

నాకూ క్రికెట్ అంటే యిష్టం. కారణం –ముఖ్యంగా దాకీ నా తెలివితేటలకీ ఏమీ సంబంధం లేదు. కొట్టేవాడి ప్రతిభకీ, ఆటకీ సంబంధం. సచిన్ బాగా కొట్టినా, సచిన్ ఎదుటివాడు తెలివిగా అవుట్ చేసినా నాకు ఆనందం, అబ్బురపాటు కలుగుతాయి. క్రీడ నా ఆనందం. ఇండియా గెలవడం మాత్రమే కాదు. ర్ణయించేది ఆనాటి ప్రదర్శన కా మరొకటి కాదు కనుక. క్రీడ ఏకపక్షంగా చూస్తే అది క్రీడ అపించుకోదు. అసలు క్రీడ ఉద్దేశం అదే. షార్జాలో ప్రేక్షకులకు పాకిస్తాన్ గెలవడమే ఆనందం. మనకి సచిన్ సెంచరీయే జీవితలక్ష్యం. ప్రస్తుతం వినోదం ముదిరి వికారమయి, కోట్లాది మంది ర్వీర్యుల్ని చేసే మత్తుమందుగా తయారయింది. ఎందరో దీన్ని వ్యాపారంగా డబ్బు చేసుకుంటున్నారు. ఎక్కువమంది దీని జబ్బు చేసుకుంటున్నారు.

రాబిన్సన్ క్రూసో ఇవాళ ఉంటే ':ఒక జాతి ర్వీర్యం చేసే అద్భుతమైన వ్యాపార సాధనం క్రికెట్'' అనేవాడేమో!

వెనకటికి చలం 'ప్రపంచం బాధ శ్రీశ్రీది' అన్నాడు మహాప్రస్థానాకి ముందుమాట రాస్తూ. ప్రస్తుతం సచిన్ సెంచరీ బాధ దేశాకి పట్టిన బాధ. ఆయన త్వరగా ఆ సెంచరీ కొట్టేసి భారతరత్న తీసేసుకుంటే దేశం ఈ బాధ నుంచి విముక్తం అయే అదృష్టం కలుగుతుంది.

**(జనవరి 23, 2012)**




# (January 30,2012) Evee I Padmalu ఏవీ ఈ పద్మాలు

'సాయంకాలమైంది' అనే నా నవలలో కథానాయకుడు బాగా చదువుకున్నాడు. విదేశాలకు వెళ్లే అవకాశం వచ్చింది.

'మావాడు పై దేశాలకు ఎందుకు వెళ్లాలి?' అనడిగాడు అలాంటి చదువు చదువుకోని తండ్రి.

అమెరికా నుంచి వచ్చిన మనిషి ఎడిత్ కామెరాన్ సమాధానం చెప్పింది. "మీ దేశంలో చదువుకీ, అర్హతకీ, సామర్థ్యానికీ కులాల గుర్తులు పెట్టుకున్నారు. మేం కేవలం సామర్థ్యానికి, విజయానికీ డబ్బు గుర్తు పెట్టుకున్నాం. మీరు ముసిలి వాళ్లను గౌరవించి సంప్రదాయాన్ని గౌరవిస్తున్నామని చంకలు గుద్దుకుంటారు. పద్మభూషణ్‌లూ, భారతరత్నలూ జీవితం ఆఖరి దశలో ఉన్న సమాజానికి సెంటిమెంటల్ తృప్తినిచ్చే పెద్దలు. మా దేశంలో ప్రతీయేటా నోబెల్ బహుమతులు పుచ్చుకునే యువరక్తం కావాలి. ప్రతీ యేటా కొత్త ఆలోచనకి పట్టం కట్టాలి. మేం యువకుల సామర్థ్యాన్ని సంపాదించి, వాడుకోడానికి సముద్రాలు దాటి వెళ్తాం.'

సేవలకు గుర్తింపు ఏనాడూ కొలబద్దకాదు. ప్రతిభకి బిరుదులు ఏనాడూ గుర్తింపు కాదు. కాని గుర్తింపులూ, బిరుదులూ –ఆ సమాజం, వ్యవస్థా ఆ వ్యక్తులకు కృతజ్ఞత చెప్పుకునే ఔదార్యానికీ, పెద్ద మనస్సుకీ, ఉదాత్తతకీ నిదర్శనం.

కుచేలుడిని శ్రీకృష్ణుడు అనుగ్రహించడం కుచేలుడి భక్తికి కొలబద్ద కాదు. కాని శ్రీకృష్ణుడి ముందు కుచేలుడు చెయ్యిజాచక పోవడం కుచేలుడి ఉదాత్తతకీ, ఆ ఆలోచనకయినా తావులేని నిష్కల్మషమైన మైత్రికీ నిదర్శనం.

ఇంత చెప్పాక మరొక్కమాట చెప్పాలి. మన దురదృష్టం –మనం ఆంధ్రులం కావడం. మనల్ని చూసి మనకి గర్వపడడం తెలీదు. అది చిన్న విషయం. గర్వపడాలని తెలీదు. ప్రతి తెలుగువాడూ ఒక ద్వీపం. నాయకులయితే బొత్తిగా కులాల, పదవుల, డబ్బు, స్వజాతీయుల ఎల్లలు గీసుకున్న ద్వీపాలు. ఈ దేశానికి జాతీయ గీతం రవీంద్రుడిది. ఈ దేశానికి మాతృవందనం బంకించంద్ర ఛటర్జీది. ఇద్దరూ వంగదేశీయులు. తమ రాష్ట్రీయుల ప్రతిభను గర్వంగా చాటుకోవడంలో ప్రథమ స్థానం వంగదేశీయులది. ఈ దేశంలో మొట్టమొదటి జ్ఞానపీఠ పురస్కారం శంకర్ కురూప్‌ది. తమ రాష్ట్రంవారి ప్రతిభకు కిరీటం పెట్టే పెద్దమనస్సు గలవారు –మళయాళీలు. ఈ దేశంలో సంగీతానికి మొట్టమొదటి భారతరత్న పొందింది ఎమ్మెస్ సుబ్బలక్ష్మి. సంగీతానికీ, త్యాగరాజుకీ దైవత్వాన్ని కల్పించి ఆరాధించే ఔదార్యం తమిళులది.

మనం ఆంధ్రులం. చాలా సంవత్సరాల క్రితం ఓ ఎమ్మెల్యేగారితో గౌరవ డాక్టరేట్ విషయం ప్రస్తావించాను. 'అదేమిటి? ఎవరిస్తారు?' అన్నారాయన. ఈయనకి మంత్రి అయ్యే అర్హతలున్నాయనుకున్నాను. నిజంగా ఆయన తర్వాత మంత్రి అయ్యాడు!

శ్రీపాద పినాకపాణికి 1984లో పద్మభూషణ్ ఇచ్చారు. ఆయన వయస్సిప్పుడు నూరేళ్లు. గత దశాబ్దంగా మంచంమీద పడుకునే చాలామంది చెయ్యలేని కృషి చేస్తున్నారు. ఈ మధ్యనే వారి సీడీలు హైదరాబాద్ భారతీయ విద్యా భవనంలో విడుదల చేశారు. ఆయనకి పద్మవిభూషణ్ ఇవ్వాలని ఎవరూ అనుకోలేదు.




బాలమురళీకృష్ణ బాలమేధావి. ఓ జీవితకాలం సంగీతాన్ని తపస్సు చేసుకున్న వ్యక్తి, 72 మేళకర్తలలో కీర్తనలు చేశారు. త్యాగరాజు, దీక్షితార్ కీర్తనలన్నింటినీ పాడి రికార్డు చేశారు. ఏనాడో ఆనాటి ముఖ్యమంత్రి జయలలిత వారికి భారతరత్న ఇవ్వాలన్నారు. నేటికీ ఇవ్వలేదు. తెలుగుజాతి గర్వించే చిత్రకారులు బాపూ. రామకథ అంటే ఆయన పులకించిపోతారు. కుంచె వీరవిహారం చేస్తుంది. ఆనాటి 'సీతారామ కళ్యాణం' మొన్నటి 'శ్రీరామ రాజ్యం' గొప్ప కృషి. బాపూకి పద్మభూషణ్ ఇవ్వలేదు. ఈపాటికి పద్మవిభూషణ్ సత్కారం జరపవలసినంత ఎత్తయిన కళాకారుడు బాపూ.

నిన్నకాక మొన్న మంచి రచనలు చేసిన తమ సినీ గీత రచయిత వైరముత్తుని పద్మశ్రీ చేసుకున్నారు తమిళులు. గీత రచనలో చరిత్రను సృష్టించిన ఇద్దరు మహా రచయితలు ఆచార్య ఆత్రేయ, వేటూరి ఆ గౌరవానికి నోచుకోకుండానే నిష్క్రమించారు. గుమ్మడి, సావిత్రి వంటి మహా నటులకి ఆ గౌరవం దక్కలేదు. వేద వాఙ్మయాన్ని, బ్రాహ్మణులను, ఉపనిషత్తులను తెలుగు జాతికి అందించిన రచయిత, అలనాటి తెలంగాణా పోరాటంలో పాల్గొన్న వీరుడు దాశరథి రంగాచార్యను కనీసం పద్మశ్రీని చెయ్యలేదు. గత యాభై సంవత్సరాలుగా తెలుగు భాషకూ, మహిళాభ్యుదయానికీ సేవ చేస్తున్న రచయిత్రి మాలతీచందూర్. కనీసం పది భాషల్లో తనదైన బాణీలో రచనలను అసిధారా వ్రతం లాగ కృషి చేసిన పండిత గాయకుడు పి.బి. శ్రీనివాస్, ఏమయింది మనవాళ్లకి?

ఎనభయ్యో పడిలో కూడా ఎన్నో అపూర్వ త్యాగరాజ కీర్తనలకూ, అన్నమాచార్య కీర్తనలకూ బాణీలను ఏర్పరచిన మహాగాయకులు –ఎమ్మెస్ సుబ్బలక్ష్మి వంటివారికి ఆ బాణీలను నేర్పిన సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తిగారిని పద్మభూషణల్ని చెయ్యడం తెలుగువారు ఆయన కృషికి రుణాన్ని తీర్చుకోవడం. అరవై సంవత్సరాలుగా తనదైన బాణీతో చరిత్రను సృష్టించిన రావు బాలసరస్వతి, ప్రముఖ నేపథ్యగాయని ఎస్.జానకి గార్లకు ఏ పద్మ పురస్కారమూ అందలేదు.

తమిళనాడులో వీధికొక పద్మశ్రీ కనిపిస్తారు. అది వారి అభిరుచి, వారి అవగాహనకి నిదర్శనం. వారి సంస్కారానికి గుర్తు. ఆ రాష్ట్రం చేసుకున్న పుణ్యం. హరిహరన్, చిత్ర, సుధారఘునాథన్, టి.వి.శంకరనారాయణ్, ఈ జాబితా అనంతం. తమ కళాకారుల్ని గౌరవించుకోడానికి అవసరమైతే ఢిల్లీతో తగాదా పడతారు. మనం కులం కోసం, మంత్రి పదవులకోసం, వాటాల కోసం... ప్రముఖ గాయని పి.సుశీలని పద్మభూషణ్ ని చేసింది తమిళులు. బాలసుబ్రహ్మణ్యంను పద్మభూషణ్‌ని చేసింది తమిళులని విన్నాను. ఆనాడు శ్రీపాద పినాకపాణిని పద్మభూషణ్‌ని చేసింది శెమ్మంగుడి అంటారు. మాండలిన్ శ్రీనివాస్‌ని పద్మశ్రీని చేసింది తమిళులు. భూపేన్ హజారికా 85 సంవత్సరాలు బతికారు. గాయక శిఖామణి. ఆయన కన్ను మూశాక పద్మవిభూషణ్‌ని చేసింది ఈ ప్రభుత్వం. ఎవరి కళ్లు తుడవడానికి? అలాగే కార్టూనిస్టు మారియో మిరాండా.

'సాయంకాలమైంది' నవలలో నా పాత్ర ఎడిత్ కామెరాన్ నిద్దట్లో నవ్వుకుంటూంటుంది, ఈ దేశపు ఆత్మవంచనకి.

**(జనవరి 30, 2012)**

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (February 06,2012) 49 O – '49 ఓ'

ప్రజాస్వామిక విధానాలలో కొన్ని సౌకర్యాలున్నాయి. అంతకు మించిన ఎన్నో అనర్థాలున్నాయి. సౌకర్యాలను మింగేసిన అనర్థాలు పెచ్చురేగితే ఏమౌతుంది? అది భారతదేశమౌతుంది.

ఏ విచక్షణా అక్కరలేకుండా కేవలం ప్రజల మద్దతు సంపాదించుకున్న ఎవరయినా 'ప్రజాప్రతినిధి' కావచ్చును. ఇది గొప్ప ఏర్పాటు. అయితే 'ఎవరయినా' అన్న ఒక్క కారణానికే, ఎంతమంది బొత్తిగా అర్హతలేని, చాలని, ఏ విధంగానూ నాయకత్వ లక్షణాలు లేని హంతకులూ, గూండాలూ, తప్పుడు కారణాలకి ప్రాచుర్యాన్ని సంపాదించిన వారూ (ఇందుకు ఉదాహరణ చెప్పాలని నా కలం ఊరిస్తోంది. టీవీ రామాయణంలో సీత, రావణుడు) మనకు నాయకులయి మన దేశాన్ని ఈ స్థితికి తీసుకు వచ్చారు.

ఎన్నికలలో చాలామంది పోటీ చేస్తారు. దానికి పార్టీ మద్దతు, పలుకుబడి, ప్రాచుర్యం (అది ఎలాంటిదయినా కానీ), బలం, బలగం, కులం, మతం, ధనం –ఇవన్నీ కలిసిరావాలి. కానీ ఇవి మాత్రమే కలిసివచ్చిన బొత్తిగా సమర్థత, నిబద్ధత, సమాజహితం తెలియని ఎంతోమందిని ఈ దేశం 64 సంవత్సరాలుగా భరిస్తోంది. ఫలితం నేటి అరాచకం. నాకు అనిపిస్తుంది, ఆయా పార్టీలో, సంస్థలో నిలిపిన వారిని తప్ప, లేదా నిలిపిన వారిలో మాత్రమే ఎన్నోకోవలసిన, ఎన్నుకోక తప్పని పరిస్థితి ఓటరుది. తమిళనాడు సంగతే తీసుకుందాం. అక్కడ ప్రముఖమయిన పార్టీలు రెండే రెండు. పాతికేళ్లుగా ఓటరు ఏ ఒక్కపార్టీనీ రెండోసారి ఎన్నుకోలేదు. ఒక పార్టీ పదవిలోకి వస్తే అయిదేళ్లకి వారి విధానాలకి విసిగి, మొహంమొత్తి తప్పనిసరిగా రెండో పార్టీని ఎన్నుకుంటున్నాడు. మరోగతి లేదు కనుక. ప్రతీసారీ ఎన్నుకొన్న పార్టీని గద్దె దించుతున్నాడు. ఇది వారి నిర్వాకానికీ, ప్రజల నిర్వేదానికీ నిదర్శనం. ఇంతకన్న అతనికి గత్యంతరం లేదు. అది ప్రజాస్వామ్యపు అనర్థం. అవినీతిపరుల అవకాశం.

నిన్నటి వరకు కరుణానిధి నాయకుడు. ఆయన కొడుకు స్టాలిన్ దాదాపు ముఖ్యమంత్రి. ఇవాళ అతని మీద క్రిమినల్ కేసులు బనాయించింది జయలలిత ప్రభుత్వం. ఎందరో డిఎంకె మంత్రులూ, ఎమ్మెల్యేలూ క్రిమినల్ కేసులతో జైళ్లకు వెళ్లారు మేడమ్ ధర్మమంటూ. కరుణానిధిగారి హయాంలో ఆ పని డిఎంకె ప్రభుత్వం చేసింది. జయలలిత పూనుకున్న సెక్రటేరియట్ భవనాన్ని డిఎంకె గ్రంథాలయాన్ని చేసింది. డిఎంకె నిర్మించిన సెక్రటేరియట్ భవనాన్ని జయలలిత ఆసుపత్రిని చేసింది. ప్రజాహితం ఎవరి మనస్సులోనూ లేదనడానికి ఇంతకంటే నిదర్శనం ఇంకే కావాలి? ఇంతకంటే మరోగతి లేదా దేశానికి? మాయావతిగారు అద్భుతమైన మెజారిటీతో పదవిలోకి వచ్చారు. కోట్ల ఖర్చుతో తన బొమ్మలూ, ఏనుగుల బొమ్మలూ, కాన్షీరాం బొమ్మలూ స్థాపించారు.

తన హయాంలోనే పదవుల్లో పాలించిన 26 మంది మంత్రులను అవినీతిపరులని ఎన్నికలముందు బర్తరఫ్ చేశారు. వారంతా తాను పదవుల్లో నిలిపిన వారే. అంటే ఈ అయిదేళ్లూ నాయకురాలి కళ్ల బడకుండా 26 మంది అవినీతిపరులు పరిపాలన సాగించారన్నమాట! ఈ మధ్య తమిళనాడు, మన రాష్ట్రం, ఇంకా చాలా రాష్ట్రాలు వేల కోట్ల రాయితీల్ని ప్రజలకు పంచుతున్నారు. ఆ పని వారి శ్రేయస్సు పట్ల సానుభూతిగా కాక తమ పార్టీ పరపతి పెంచుకునే దేబిరింపుగా అందరికీ అర్థమౌతూనే ఉంది. ఆ సౌకర్యాలు పొందుతున్న వారికీ ఈ విషయం తెలుసు. ఇది ఎవడి బాబు సొమ్ము? ఈ పని ఆయా నాయకుల నెర్వస్‌నెస్‌కీ, లాభసాటి బేరానికీ నిదర్శనం. ఈ రోజుల్లో ఎవరూ పొలాల్లో పనులు చేయడం లేదు.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

చేయాల్సిన అవసరం లేదు. చాలామంది తాగుడు మరిగారు. పల్లెల్లో రైతులు స్వయంగా చెప్పినమాట ఇది. సస్యశ్యామలమైన కోనసీమలో ఈసారి దాదాపు లక్ష ఎకరాల్లో పంటలు వేయలేదట. ప్రభుత్వం చేసే ఉపకారం పనులు చెయ్యడానికి స్ఫూర్తికావాలి కానీ, సోమరితనానికి సాకు కాకూడదు. పదవులకి పెట్టుబడి కాకూడదు. పని చెయ్యకుండా ఓటర్లని ముద్దుచేసే 'మొద్దు' నాయకుల కాలమిది.

వీళ్లందరినీ కాదనే హక్కు ఓటరుకి లేదా? ఇలాంటి దరిద్రాన్ని కాదనే ఓటరు గొంతు వినిపించే మార్గం ఏదయినా వుందా? ఇది పెద్ద మీమాంస. ఉందిబాబూ ఉంది. ఎలక్షన్ కమిషనర్ టి.ఎస్.కృష్ణమూర్తి 2004 లో అప్పటి భారత ప్రధానికి ఒక ప్రతిపాదన చేసారు. '49ఓ' అనే సవరణను సూచించారు. రహస్య ఓటింగులోనే మతాల, కులాల, గూండాల, హంతకుల జాబితాలలో నాయకులు 'ఎవరూ మాకు వద్దు' అని చెప్పగల ఒక ఏర్పాటును చెయ్యాలన్నారు. ఎన్నికయిన కుహనా నాయకుని కంటే 'ఎవరూ వద్దనే' ఓట్లు ఎక్కువయితే ఆ ఎన్నిక రద్దవుతుంది. ఆ నాయకులు జీవితమంతా ఎన్నికల్లో పోటీ చేసే హక్కు పోతుంది.

అయితే ప్రజాస్వామ్యంలో సజావుగా ప్రజా ప్రతినిధుల్ని ఎన్నుకునే ఆదర్శాన్ని ఇది దెబ్బతీస్తుందని పెద్దల భావన. ఈ భావనని చాలామంది 'అవినీతిపరులు, అవకాశవాదులు' ముసుగు చేసుకుంటారని అందరికీ తెలిసిందే. ఆదర్శం చక్కని ఆరోగ్యకరమైన ఆలోచనల పర్యవసానం. అవినీతి ఆదర్శాన్ని దుర్వినియోగం చేసే అడ్డుతోవ. ఈ ఏర్పాటు తప్పనిసరిగా ఉండాలని భావించే ఉద్యమం పేరు అన్నా హజారే. అయితే మహిళా రిజర్వేషన్ బిల్లులాగ, లోక్‌పాల్ బిల్లులాగ ఈ '49 ఓ' ఏనాడూ కార్యరూపం దాల్చదు. దాల్చితే మన ఉచిత టెలివిజన్లు, లాప్‌టాపులూ, సైకిళ్లూ, మంగళసూత్రాలూ, వడ్డీలు లేని రుణాలూ, వెరసి పదవులకి పెట్టుబడులు ఏం కావాలి? మన మధ్య బలిసిన ఏనుగులెన్నో ఉన్నాయి.

వాటి పునాదులు బలంగా ఉన్నాయి.

కొసమెరుపు:ఇలాంటి అవకాశాన్ని ధైర్యంగా అమలు చేసిన దేశం రష్యా. అయితే ఇందువల్ల ఎన్నికలు రద్దయితే ప్రజాధనం వృధా అవుతుంది కనుక, తప్పక వోటుచేసి తీరాలని, అంటే మీకు నచ్చినా, నచ్చకపోయినా, బాచన్ననో, బూచన్ననో, అతను కొంపముంచుతున్నాడని తెలిసినా ఎన్నుకోక తప్పదని నిర్ణయించింది ఆస్ట్రేలియా. క్రికెట్‌లోనే కాదు, మూర్ఖత్వంలోనూ ఇండియాకంటే ఒకడుగు ముందే ఉంది ఆస్ట్రేలియా.

**( ఫిబ్రవరి 06, 2012)**




## (February 13,2012) Boothu Samasya?Parishkarama? బూతు సమస్యా?పరిష్కారమా?

ఈ మధ్య అడ్డమయిన కారణాలెన్నింటికో రాజకీయనాయకుల్ని విమర్శిస్తున్నారు. దుమ్మెత్తి పోస్తున్నారు. ఇళ్ళమీద రాళ్ళేస్తున్నారు. పదవుల్లో ఉన్నవారిని మంత్రి పదవులకు రాజీనామా చేయాలని నినాదాలు చేసి గద్దెలు దించుతున్నారు. ఇది చాలా అన్యాయం. అనుచితం.

నాకింకా తేలని మీమాంస ఒకటుంది. ఒకాయన ఒక అమ్మాయిని రేప్ చేశాడు. అది నేరం. మరొకాయన ప్రజల సొమ్ము తినేశాడు. అది నేరం. ఒకాయన మరొకాయన్ని హత్య చేయించాడు. అది నేరం. ఒప్పుకుంటున్నాను. కానీ ఒకాయన ఓ మూల కూర్చుని తన మానాన తాను ఓ బూతు సినిమాని చుస్తున్నాడు. అది నేరమంటే ఒప్పుకోడానికి నాకు మనస్కరించడం లేదు. కాకపోతే ఆయన మంత్రి కావడం – ఆయన కూచున్నది కర్ణాటక రాష్ట్ర చట్టసభ కావడం కాస్త అభ్యంతరం కావచ్చు. కానీ దానికీ నా సమర్ధన ఉన్నదని మనవి చేస్తున్నాను. ఆ మధ్య ఓ నాస్తికుడు – నన్ను అడిగాడు – రోజూ దేవాలయానికి వెళ్ళడం వల్ల ఏం పుణ్యం వస్తుందని. దానికి రకరకాల సమాధానాలున్నాయి.

కానీ ఎదురుగా ఉన్నది నాస్తికుడు. ఆయనకి గుడిమీదా, గుడిలో ఉన్న దేవుడు మీదా నమ్మకం లేదని తెలుస్తోంది. అతనిదీ ఈ ప్రశ్న. నేను సమాధానం చెప్పాను. "చూడు బాబూ! మనం ప్రతి క్షణం ఏవో దిక్కుమాలిన పనులు చేస్తూ ఉంటాం. అందులో ఎన్నో పక్కవాడి కొంప ముంచేవే అయివుంటాయి. కానీ – అరగంట సేపు గుడికి వెళ్ళినవాడు – ఆ అరగంట సేపయినా తన ఆలోచనలకి సెలవిస్తాడు. అతను వెళ్ళడం వల్ల పక్కవాడికి జరిగే దౌర్భాగ్యపు పని నుంచి సమాజానికి ఓ అరగంట సెలవుని ఇస్తున్నాడు. ఇదీ అతని వల్ల సమాజానికి జరిగే ఉపకారం. ఇదీ గుడివల్ల సమాజానికీ, పరోక్షంగా అతనికి దక్కే పుణ్యం" అన్నాను. ఇది ఒక విధంగా బుకాయింపు. మరో విధంగా సర్ది చెప్పడం. అన్నిటికన్నా ముఖ్యం నాస్తికుడికి అర్ధమయే విధంగా వివరించడం.

పురుషులందు పుణ్య పురుషులు వేరయా అన్నారు. అటువంటి అసమర్ధపు మైనారిటీల గొడవ మనకి వద్దు. ఇప్పుడు నా వాదన వినండి.

నిజమైన, సిసలైన నాయకులు అనుక్షణం దేశాన్ని దోచుకు తింటూంటారు. ఎవరి కొంపలో ముంచుతూంటారు. తెల్లారితే తమది కాని – మరెవరో సుఖంగా ఉండగల అవకాశాన్ని దొంగలిస్తారు. అది నిజమైన అవినీతి. కానీ ఒకాయన – ఇవేవీ చెయ్యకుండా ఓ మూల కూర్చుని బూతు సినిమాలు చూస్తూ ఆనందిస్తున్నాడనుకోండి – ఈయన రాజస్థాన్ లో నర్స్ తో ప్రేమకలాపాలు నడిపి ఆమెని హత్య చేయించిన మంత్రికంటే ఎంత గొప్పవాడు?

ఈయన ఎవరి కొంపలూ ముంచలేదు. ఏ అమ్మాయిని మానభంగం చెయ్యలేదు. టీవీలో విరివిగా వితరణ చేస్తున్న బూతు సినిమాల్ని చూస్తూ – కేవలం ఆనందించడమేకాక మరో ఇద్దరు తోటి సహచరులతో ఆ ఆనందాన్ని పంచుకునే స్నేహశీలత కల మంత్రిగారు.




'బూతు' అభ్యంతరం, అసభ్యం అన్న విషయాన్ని మన సినిమాలు మరిచిపోయి చాలా ఏళ్ళూ పూళ్ళూ అయింది. ఇదివరకు జయమాలిని, జ్యోతిలక్ష్మి , సిల్క్ వగైరాలు బట్టలిప్పుకు చేసిన నృత్యాలు ప్రస్తుతం ముంబైనుంచి హైదరబాదుకి దిగుమతి అవుతున్న ప్రతి తెలుగురాని హిందీ నటీమణి చేస్తోంది. మొన్ననెవరో అద్దం పద్దారనిగాని – ఆ మధ్య బొద్దూడని పిల్లలచేత కూడా ఈ వికారపు డాన్సులు గెంతించి ఆనందించిన తల్లిదండ్రుల అభిరుచిని మనం టీవీల్లో చూశాం.

బజారులో మాంసం దొరుకుతోంది. మాంసాహారి తింటున్నాడు. ఆంక్ష విధించడం అన్యాయం. గుడిలో దేవుడున్నాడు. భక్తుడు గుడికి వెళతాడు. భక్తుడిని విమర్శించడం పాపం. టీవీల్లో బూతు సినిమాలు వస్తున్నాయి సరదా పడేవాడు చూసి ఆనందిస్తాడు. మిఠాయి అమ్ముతూ తినవద్దనడం ఏం న్యాయం?

ఒకే ఒక్క విషయంలో అభ్యంతరాన్ని మనం ఒప్పుకోవాలి. సదరు మంత్రిగారు – స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి. ఆయన ఇలాంటి బూతు సినిమా చట్ట సభలో చూశారన్నది అభ్యంతరం. అయ్యా 'దొరికితే దొంగలు' అన్నది సామెత. దొరికారు కనుక గాలి జనార్ధన రెడ్డిగారు నేరస్తులు. దొరకనంత వరకూ ఆయన సుష్మా స్వరాజ్ దీవెనని స్వయంగా అందుకున్న మంత్రిగారు. అలాగే ఎంతమంది క్లాసురూముల్లో, కాలేజీల్లో, ప్రార్ధనా మందిరాల్లో, పార్కుల్లో – మరెక్కడో ఈ బూతు సినిమాల్ని చూసి ఆనందిస్తున్నారో మనం చెప్పగలమా? వంటవాడు ఎక్కడవుంటాడు? వంటగదిలోనే ఉంటాడు. అతను చేసే ఏ పనయినా వంట గదిలోనే చెయ్యగలడు. లెక్చెరర్ గారు క్లాసు గదిలోనే చేస్తాడు. పూజారిగారు ఏదో ఆనందం కోసం – ఏం చేసినా ఏం చూసినా గుడిలోనే చెయ్యగలడు. అలాగే మంత్రిగారు చట్టసభలోనే చెయ్యగలరు. అందుకాయన్ని మనం అర్ధం చేసుకుని అంగీకరించాలి.

మళ్ళీ మరొక్కసారి – దొరికితే దొంగలు అన్న సామెతని మనం మరిచిపోకూడదు. ఎవరో ఆకతాయి కెమెరామన్ కెమెరాకి దొరికారు కనుక ఇంత రాద్ధాంతం జరిగింది కానీ – వారు తమ ఆఫీసులోనో, కారులోనో, ఇంట్లోనో, డ్రాయింగు రూంలోనో తమకు అభ్యంతరం ఉండేది కాదని త్రుణమూల్ కాంగ్రెసు నాయకులు డెరిక్ ఓబ్రియన్ చెప్పనే చెప్పారు. కనుక – చేసిన పని తప్పుకాదు. చేసిన చోటులో చిన్న పొరపాటు ఉంది. అదీన్నీ కెమెరాకు దొరికింది కనుక.

దేనివల్ల సమాజానికి పెద్ద హాని? అని మనం ప్రశ్నించుకోవాలి. మంత్రిగారు పీకలు కోయిస్తే దుర్మార్గం. కోట్లు దోచుకుంటే అన్యాయం. మన ఐయ్యేయస్సుల్లాగ చట్టాలకు దగ్గర తోవలు వెదికితే ఘోరం. అమ్మాయిల్ని మానభంగం చేస్తే అపచారం. కానీ – వీటి జోలికి పోకుండా – అహింసాయుతంగా, బూతు సినిమాల్ని ఏకాంతంగా చూసుకునే నాయకుల మీద కత్తిగట్టడం చాలా అమానుషం. గాలిజనార్ధన రెడ్డిగారు, రామలింగ రాజుగారు, ఏ.రాజాగారు, సురేష్ కల్మాడీగారు, బి.పి.ఆచార్యగారు – ఇలాంటివారు చట్టాలూ, అవినీతుల జోలికి పోకుండా తమ తమ కార్యాలయాల్లో బూతు సినిమాలు చూసుకుంటూ గడిపితే ఈ సమాజం వారికెంత కృతజ్ఞతలని చూపేదో ఒక్కసారి ఆలోచించాలి.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

పీకలు కోయడం నేరం. కానీ ఎవరి పీకల గురించి ఆలోచించకుండా పీక సౌందర్యాన్ని చూసి పులకించే రసికుడు ఈ దేశానికి అంత హానికాడని గుర్తించాలి. అంతేకాదు. నేరాలు రుజువయినా, సాక్ష్యాలు కనిపిస్తున్నా – రాజీనామాలు చెయ్యండి బాబోయ్ అని రాజకీయ పార్టీలు మొత్తుకుంటున్నా నిమ్మకు నీరెత్తినట్టు పదవుల్ని పట్టుకు వేలాడే ఈ రోజుల్లో టీవీలో పడిందే తడవుగా పదవులకు రాజీనామాలు చేసి, ఈ వ్యవహారం మీద నివేదిక వచ్చే వరకూ చట్ట సభలో అడుగు పెట్టనున్న ఈ ముగ్గురు మంత్రులూ అవినీతిపరులలో అద్భుతమైన నీతిపరులని మనం గుర్తించాలి. అవినీతిలోనూ ఒక నీతిని పాటించిన ఈ మంత్రులకు మనం జేజేలు అర్పించాలి. అసలు నా ఉద్దేశంలో పురుషులందు పుణ్య పురుషులంటే వీరే!

నన్నడిగితే పైన పేర్కొన్న జాబితాలోని పెద్దల్ని ఒకచోట చేర్చి – సమాజాన్ని దాని మానాన దాన్ని వదిలేసి బూతు సినిమాలు చూసుకోవడం ఎంత అహింసాయుతమైన వ్యాపకమో ఒక క్రాష్ కోర్స్ ఇప్పించాలని మనవి చేస్తున్నాను.

**( ఫిబ్రవరి 13, 2012)**

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (February 20,2012) Nalla Sommu నల్లసొమ్ము

సత్యజిత్ రే సినిమా 'పథేర్ పాంచాలీ' సినిమాను తలచుకున్నప్పుడల్లా నాకు ఒళ్లు పులకరించే సంఘటన ఒకటి గుర్తుకొస్తుంది. ఆ ఇంట్లో అక్కా, తమ్ముడూ చిన్నపిల్లలు. ఒక సన్నివేశంలో అక్క పూసలదండ దొంగతనం చేసిందని స్నేహితురాలు నిందవేస్తుంది. తన బిడ్డమీద నింద పడినందుకే ఉదాసీనతతో తల్లి కూతుర్ని కొడుతుంది. తమ్ముడు నిస్సహాయంగా గమనిస్తాడు. తర్వాత అమ్మాయి చచ్చిపోతుంది. కొన్ని నెలల తర్వాత ఆ కుటుంబం వేరే చోటుకి తరలిపోతోంది.

సామాన్లు తీస్తూండగా -ఓ కుండ పిడతలో -పూలదండ -తమ్ముడికి కనిపిస్తుంది. పసివాడు ఏం చేస్తాడు 'ఇదిగో దండ, అక్క నిజంగానే దొంగతనం చేసిందమ్మా' అని తల్లి దగ్గరికి పరిగెత్తుతాడా? రచయిత, దర్శకుడు మహాద్రష్టలు. పసివాడు -ఆ దండ పట్టుకుని యింటికి దూరంగా వున్న కోనేరు దగ్గరికి వస్తాడు. అక్క చచ్చిపోయింది. చచ్చిపోయిన అక్కమీద కళంకం ఇది. దండని కోనేరులోకి విసిరేస్తాడు.

ఎండుటాకుల మధ్య దండ మాయమయే వరకూ నిలబడి వెనుదిరుగుతాడు. ఈ ప్రపంచంలోనే లేని అక్కమీద 'కళంకానికి' ఆ దశలో శాశ్వతంగా తెరవేశాడు. ఇది అతి ఉదాత్తమయిన సన్నివేశంగా నాకెప్పుడూ జ్ఞాపకం వస్తుంది.

ఇంత చెప్పాక, ఇంతటి ఉదాత్తులు మనదేశంలో రాజకీయ రంగంలోనూ ఉన్నారని మనం గర్వపడే రోజులొచ్చాయి. ఈ మధ్యనే మన సిబిఐ డైరెక్టరు ఏ.పి.సింగ్ కేవలం స్విట్జర్లాండు బ్యాంకుల్లోనే 500 బిలియన్ల నల్లధనం ఉన్నదని వక్కాణించారు. నల్లధనాన్ని దాచిపెట్టే దేశాలు ప్రపంచంలో 69 ఉన్నాయట. మారిషస్, స్విట్జర్లాండు, లిస్టెనీర్, బ్రిటిష్ వర్జిన్ ద్వీపాలు, ఇలాగ. అయితే విదేశాల్లో దాచిన ధనం కన్నా మూడు రెట్లు నల్లధనం మన దేశంలోనే ఉంది. మొదట ఇంటగెలిచి రచ్చ గెలవడం మంచిది అన్నారు మాజీ సిబిఐ డైరెక్టర్ జోగీందర్ సింగ్. అన్ని దేశాల్లో నల్లధనం కలిపితే దాదాపు 1456 బిలియన్లు ఉండవచ్చునట.

ఆ మధ్య లోపాయికారీగా జర్మన్ వర్గాల ద్వారా ఇలా నల్లధనం అకౌంట్లున్న 18 మంది పేర్లు ప్రభుత్వానికి అందాయి. అలాగే ఫ్రాన్స్ నుంచి మరికొన్ని జాబితాలు చేరాయి. ఆ పేర్లు బయటపెట్టమని ప్రతిపక్షాలు అంటున్నాయి. 'మీ హయాంలో మీరెందుకు ఆ పని చెయ్యలేదు?' అని దిగ్విజయ్ సింగ్ ధ్వజమెత్తారు.

చాలా సంవత్సరాల కిందట, కేంద్రం ఇలాంటి నల్లధనాన్ని మన దేశానికి తెచ్చుకోడానికి ఒక పథకాన్ని అమలులోకి తెచ్చింది. 'మీ డబ్బుని బయటపెట్టండి. ఫలానా శాతం పన్ను కట్టి బ్యాంకుల్లో వేసుకోండి' అన్నారు. చాలామంది దొంగలు పెద్దమనుషులయిన అరుదయిన సందర్భమిది. మళ్లీ అలాంటి ప్రయత్నం ఈ మధ్యకాలంలో జరగకపోవచ్చునని ప్రభుత్వ వర్గాలంటున్నాయి.

ఈ వ్యవహారంలో అసలు రహస్యం ఏమిటంటే 'దొంగలు'గా బయటపడడానికి ఇష్టపడేవారు కొందరుంటారు. వాళ్లకి డబ్బే ప్రధానం. ఇష్టపడని వారు ఎక్కువమంది ఉంటారు. వారికి డబ్బే కాక, పరపతి, పదవి, కీర్తి, యివన్నీ ప్రధానం. వీరు 'పథేర్ పాంచాలి'లో అక్క లాంటివారు. మనం అర్థం చేసుకోవలసిన విషయం ఏమిటంటే', మన ప్రభుత్వంలో 'పథేర్ పాంచాలి' తమ్ముడు వంటి ఉదాత్త నాయకులున్నారని. వారికి

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

ప్రస్తుతం మన మధ్యలేని వారి పేర్లు, ఉన్న పదవుల్లో ఉన్నవారి పేర్లు, పదవుల్లో లేకపోయినా అపూర్వమైన కీర్తిప్రతిష్టలున్న వారి పేర్లూ, బయటపెట్టడం ఇష్టంలేని ఉదాత్తులు వీరు. అద్వానీగారూ, వెంకయ్య నాయుడు గారూ, సుష్మాస్వరాజ్ గారూ –ఈ 'ఉదాత్తత'ని వారి బలహీనతగా భావించడం అన్యాయం. మనం మహానుభావులని భావించే పెద్దలు సాదాసీదా డబ్బు దొంగలని తెలిస్తే మనగుండె ఎంత పగిలిపోతుంది? కొన్ని పేర్లయినా చెప్పాలని వుంది. కాని నేనూ 'తమ్ముడు' లాంటివాడిని. కనక చెప్పడానికి సాహసించడంలేదు. అసలు దిగ్విజయసింగ్' 'మీ బి.జె.పి. హయాంలో చర్యలు ఎందుకు తీసుకోలేదయ్యా?' అనడంలోనే మనకు ఆ సూచనలు తెలుస్తున్నాయి. 'బాబూ! ఇప్పుడు మేం పడ్డ బాధలే అప్పుడు మీరు పడ్డారని మా కర్థమవుతోంది. కనుక, ఒకరి నొకరు అర్థం చేసుకొని నోరు మూసుకొందాం, అని వారి తాత్పర్యం. కడుపు చించుకుంటే తప్పనిసరిగా కాళ్లమీద పడుతుంది. కేవలం డబ్బుకోసం, దశాబ్దాలుగా మనం పెంచుకున్న గౌరవాలు, ఇచ్చిన పదవులకి ఎసరు పెట్టడం మంచిది కాదన్న పెద్ద మనస్సుతోనే ప్రభుత్వం తొందర పడడం లేదని మనం గ్రహించాలి. ప్రతిరోజూ పేపర్లలో వెయ్యి రూపాయలకి కక్కుర్తిపడిన అమాయకపు కానిస్టేబుల్, మూడు వేలకి గడ్డి కరిచిన రెవిన్యూ గుమాస్తా, రెండు వేలకి తప్పుపని చేసిన మంత్రసానుల కథల్నీ వింటున్నాం కానీ, 1400 కోట్లు దేశం నుంచి దాటేయించిన ఖత్రోచీలు, హర్షద్ మెహతాల కథలు –అధవా బయట పడినా నిరూపణ అయ్యాయా? చేతికందిన 18 నల్లధనం 'పెద్దల' జాబితాలో ఎంతమంది పెద్దల గోత్రాలున్నాయో?!

'వినిపించని రాగాలు తియ్యన' –అన్నాడు ఆత్రేయ. దొరకని కారణాన, మన దేశానికి 18 మంది 'పెద్ద మనుషుల్ని' మిగిల్చిన ఈ ప్రభుత్వం పెద్ద మనసుని గుర్తించి, మరోసారి పదవుల్లోకి తీసుకురావాలని ఓటర్లకి మనవి చేస్తున్నాను.

**(ఫిబ్రవరి 20, 2012)**

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (February 27,2012) Mamdu Bghagyulu మందుభాగ్యులు

దాదాపు ముప్పై సంవత్సరాల కిందటిమాట. అప్పట్లో ఇప్పటి పద్మవిభూషణ్ ప్రతాప్ సి.రెడ్డి నాకు వైద్యులు. సెయింట్ మేరీ వీధిలో హెచ్.ఎం. ఆసుపత్రిని నిర్వహించేవారు. నాకు ఆ రోజుల్లో గుండె నొప్పి వస్తుందేమోనన్న భయం ఎక్కువగా ఉండేది. ప్రతి చిన్న అసౌకర్యం నాలో ఆ భయాన్ని రెచ్చగొట్టేది. ఆయన దగ్గరికి వెళ్లాను. అన్ని రకాల పరీక్షలూ చేసి, నన్నెలా ఒప్పించాలో తెలీక 'మీకు గుండె నొప్పి ఎట్టి పరిస్థితిలోనూ రాదని రూపాయిన్నర స్టాంపు పేపరుమీద రాసి ఇవ్వగలను' అన్నారు. అప్పుడే మందు అలవాటు గురించి మాట్లాడుతూ ఆయన చెప్పిన మాటలు గుర్తున్నాయి. 'మొదటి పెగ్గు ఔషధం. రెండోది అలవాటు. మూడోది అనర్థం' అని. మధ్యలో చాలాసార్లు కలిసినా ఈ మధ్య ప్రత్యేకమైన పనిమీద ఆయన దగ్గరికి వెళ్లినపుడు ఆనాటి మాటని గుర్తు చేశాను. ఆయన మనస్ఫూర్తిగా నవ్వి 'మీకింకా గుర్తుందే!' అన్నారు. 'లేదు. గుర్తుంచుకున్నాను. చాలామందికి గుర్తు చేస్తూంటాను' అన్నాను.

ఈ దేశంలో సెక్స్, పదవి, డబ్బు –అదే వరసలో భయంకరమైన లౌల్యాలు. వాటన్నిటినీ మించినది –మందు. కాళ్లకూరి నారాయణరావు సరిగ్గా పట్టుకోలేనిది శరత్‌బాబు పట్టుకోగలిగారని నాకనిపిస్తుంది. చింతామణి మీద వ్యామోహాన్ని తట్టుకోలేక భవానీశంకరుడు అర్ధరాత్రి వర్షంలో పాముని పట్టుకుని చింతామణి ఇంటిగోడని ఎగబాకాడు. కానీ ఆయన చేతికి మందు సీసా ఇచ్చివుంటే దేవదాసులాగ ఓ మూల పడివుండేవాడు. మిగతా వ్యసనాలన్నీ మనస్సుని మత్తెక్కించి నరాలు రిలాక్స్ అవడానికి సహకరిస్తాయి. అంటే అవన్నీ ఆనందానికో, మత్తుకో పరోక్షమైన ఆలంబన. కానీ మందుకి ఆ గొడవ లేదు. సరాసరి నరాల మీదే పనిచేస్తుంది. తన పని ముగించుకుంటుంది. మీకు ఆనందం కావాలన్నా, అలసట నుంచి విముక్తి కావాలన్నా, ఆటవిడుపు కావాలన్నా, విషాదం నుంచి తప్పుకోవాలన్నా దేనికైనా సరాసరి రక్తాన్ని వేగవంతం చేసి, వేడెక్కించే ఆల్కెమీ మందు.

కనకనే కాయకష్టం చేసే కూలీ దగ్గర్నుంచి, ఏడు నక్షత్రాల హోటల్ గదిలో విశ్రమించే కోటీశ్వరుడిదాకా, మందు స్థాయిలో మార్పే, కానీ పర్యవసానం ఒకటే. అందుకే మందు ప్రభుత్వాలకి బలమైన, బరువైన ఆదాయం. ఆ కారణానికే బలమైన అవినీతికి ఆలంబన. కొన్ని దశాబ్దాలుగా ఈ మందుని నమ్ముకుని లక్షలు, కోట్లు గడించిన మహానుభావులు నాకు తెలుసు. అలవోకగా కోట్లు కుమ్మరించి సినిమాలు తీసినవారిని గురించి నాకు తెలుసు. మందు కారణంగానే అతి సుతారంగా, అతి ఉదారంగా పీకలు కోసిన సంఘటనలు మనం విన్నాం. 'మందు' సభ్య సమాజంలో సరస్వతీ నదిలాంటిది. ఉందని అందరికీ తెలుసు, కళ్లకి కనిపించదు. ఈ మందు పెట్టుబడిగా దశాబ్దాలుగా కానిస్టేబుళ్లూ, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లూ, మధ్యవర్తులూ, అమ్మకందారులూ, టోకు వ్యాపారులూ, రవాణాదారులూ నిరంతరం లక్షలు గడిస్తున్నారని అందరికీ తెలుసు. ప్రభుత్వానికీ, అవినీతి నిరోధకులకీ తెలియదంటే పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగినట్టే.

మందు కథ చెప్పుకుంటున్నాం కనుక ఈ మాట మందుతో సరిపెట్టుకుంటున్నాం కానీ నిజానికి 'అవినీతి' అన్నిటా సరస్వతీ నదిలాగ ప్రవహిస్తోందని తెలియనివారు లేరు. ఎందుకనో, ఎవరి కారణంగానో, పాపం బద్ధలయి ఈ మందు మాఫియా మీద వేట మొదలయింది. న్యాయంగా ఎప్పుడో కావలసింది. స్థాలీపులాక న్యాయంగా –లాంఛనంగా కొందరు కానిస్టేబుళ్లూ, కొందరు సిబ్బంది, కొందరు మాఫియా ఘనులూ అరెస్టయారు. ఇంకా బోలెడంత 'కంపు' వుంది. కొన్ని వర్గాలు బయటపడకపోవడానికి మళ్లీ కొన్ని లక్షలో, కోట్లో చేతులు మారి




ఉంటాయి. ఈమాటే తెలుగుదేశం నిలదీస్తోంది. పదవిలో ఉంది కనుక కాంగ్రెస్‌కి ఇది గొంతులో పచ్చి వెలగకాయ అయింది కానీ ఈ భాగోతం తెలుగుదేశం రోజుల్లోనూ సాగిందే!

అయితే ఈ చర్యకు కారణమైన మహానుభావులకి చేతులెత్తి నమస్కారం పెట్టకతప్పదు. అవినీతిమయమై పోయిన ఈ వ్యవస్థలో ఒకానొక రంగంలో వీధినపడిన కేవలం నమూనా 'అవినీతి' కథలివి.

ఇందులో మంత్రిగారికి స్వయానా ముడుపులు చెల్లించినట్టు అరెస్టయిన ఒకాయన రుజువులతో సహా విన్నవించారు. అవినీతి గుండె ఎంత బలమయినదో, ఎంత గుండెలు తీసిన వ్యవహారమో మనకిప్పుడిప్పుడే అర్థమౌతోంది. ఆయన అరెస్టు కాకముందు ఈ విషయం బట్టబయలు చేస్తే వారి నిజాయితీ తెలిసేది. 'ముత్యాలముగ్గు'లో రావుగోపాలరావు అన్నట్టు 'ఆ మాట ముందు చెప్పాల'. తీరా మంత్రిగారు ఆ ముడుపుపుచ్చుకున్నారో లేదో మనకు తెలియదు. హిరణ్య కశిపుడు 'నిన్నరాత్రి కలలో విష్ణుమూర్తి కనిపించి నన్ను క్షమించమని వేడుకున్నాడు' అని చెప్తే మనం ఎంత విలువనివ్వగలం? నేరస్తుడి నీతికీ, నిజాయితీకీ అంతే విలువ.

అయితే నేరస్తుల్ని వీధిన పెట్టిన వ్యవస్థ –మహానుభావుల ధైర్యానికి నివాళులర్పిస్తూ మంత్రిగారు నిజంగా 10 లక్షలు పుచ్చుకుంటే ఇద్దరు సాక్షుల సమక్షంలో ఆ పదిలక్షలూ ఆ పెద్దమనిషికి వాపసు ఇప్పించి, మంత్రికి లంచం ఇచ్చినందుకు మరో కేసుని ఆ నేరస్తుడి మీద నిందారోపణ చెయ్యాలని నాకనిపిస్తుంది. దీనినే కోర్టులో 'అప్రూవర్' అంటారు. ఈ రోజుల్లో అంటే అవినీతి మయమైన కాలంలో ఏ ప్రక్షాళన జరగాలన్నా అవినీతి నుంచి అవినీతివరకే జరగాలి. తప్పదు. అది సర్వాంతర్యామి కనుక.

శివుడిని పూజించే భక్తుడు 'స్వామీ! నిన్నెలా పూజించాలన్నా ప్రపంచమంతా ఎంగిలిగా కనిపిస్తోంది' అని వాపోయాడట. 'అవినీతి' మయంగా వున్న ఈ వ్యవస్థలో దశాబ్దాలుగా తినమరిగిన నేరస్తుల్ని బయటపెట్టే ప్రక్రియలో లాంఛనపు అవినీతి ఒకవేళ నిజమైనా సరిపెట్టుకోవలసిన అగత్యం ఉన్నదని వార్తాపత్రికలు మాత్రమే చదివి స్పందించగల నాలాంటి 'అవినీతి' లోతులు తెలియని, అర్థం కాని, అవగాహన లేని అజ్ఞానికి అనిపిస్తుంది.

**(ఫిబ్రవరి 27, 2012)**

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (March 05,2012) Chattalanevi Unnaya? చట్టాలనేవి ఉన్నాయా?

టెలికాం శాఖకీ, అవినీతికీ అనాదిగా అవినాభావ సంబంధం వుంది. 1996 నుంచీ ఈ చరిత్రకి పునాదులు ఉన్నాయి. అలనాడు పండిట్ సుఖ్ రాం పూజా మందిరంలో, పడక గదిలో 3.6 కోట్ల రూపాయల సొమ్ము దొరికింది. ఇవాళ ఏదో పత్రికలో చక్కని కార్టూన్ వచ్చింది. భర్త, భార్యతో అంటాడు, 'మన రాజా అవినీతిని చూశాక, పాపం సుఖ్ రాం అవినీతి బొత్తిగా ట్రాఫిక్‌లో ఎర్ర దీపాన్ని దాటినంత చిన్నదిగా కనిపిస్తోంది' అని. ఏమైనా కాలం మారింది. దేశం మారింది. అవినీతి కూడా అభివృద్ధి చెంది ఈ దేశంలో లక్షా డెబ్భై అయిదు కోట్ల స్థాయికి చేరింది. ఆ రోజుల్లో పండిట్ సుఖ్‌రాంని 'బాండిట్' సుఖ్‌రాం అన్నారు. ఆ లెక్కన ఇవాళ కల్మాడీకీ, రాజాకీ పెట్టుకోడానికి ఏ ముద్దుపేర్లూ చాలవు.

అయితే అసలు కథ ఇదికాదు. పదహారు సంవత్సరాల కిందట ఈ నేరం జరిగింది. ఆ రోజుల్లో నేరస్థుడికి బెయిల్ ఇచ్చారు. తీరా అది నేరమని రుజువు కావడానికి 16 సంవత్సరాలు పట్టింది. ఈలోగా సుఖ్‌రాం హిమాచల్‌ప్రదేశ్‌లో సొంత పార్టీ పెట్టి, ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కూడా అయ్యారు. విధానసభకి అయిదుసార్లు, లోక్‌సభకి మూడుసార్లూ ఎన్నికయ్యారు! వారు ప్రస్తుతం తన 86వ యేట తీహార్ జైల్లో రాజా సరసన ఉన్నారు. ఇదే లెక్కల రాజా, కనిమొళి నేరాలు రుజువుకావడానికి ఎంత లేదన్నా మరో 19 సంవత్సరాలు పట్టవచ్చు. అప్పుడు మన రాజా తన 76వ యేట తీహార్ జైలుకి సాధికారికంగా వేంచేస్తారు.

ఈ దేశంలో చట్టాలు 1860 నాటివి. పాత బడ్డాయి. పాడుబడ్డాయి. 150 సంవత్సరాల కిందటి సంప్రదాయాన్ని, మర్యాదల్ని దృష్టిలో పెట్టుకుని బ్రిటిష్‌వారు ఆ రోజుల్లో రూపొందించిన చట్టాలు ఈనాటికీ మనకి శ్రీరామరక్ష. వాటిని కదిలిస్తే తేనెతుట్ట కదులుతుంది కనుక వాటి నీడలోనే విశ్రమిస్తున్నారు ఈనాటి అవినీతిపరులు. ఆ రోజుల్లో నేరం రుజువయ్యేదాకా నేరస్థుడు బోరవిరుచుకుని తిరగని రోజులు. బ్రిటిష్ సంప్రదాయం ప్రకారం నేరస్థుడిని వేలెత్తి చూపితే అతని ప్రజాజీవితం అంతటితో ముగిసినట్టే. ఆ మర్యాదని పాటించిన వ్యక్తులను ఉద్దేశించిన చట్టాలవి. నేరం వేలెత్తి చూపితే 'నేను చెయ్యలేదు. ఇది కుట్ర' అనే బుకాయింపు ఈనాడు సామాన్యమయిపోయింది. ఉదాహరణకు మాయావతి, ములాయం సింగ్, లాలూ, జయలలిత వగైరా. తీరా అరెస్టుచేసి జైలుకి పంపితే బెయిలు పుచ్చుకు రావడమే విజయంగా బోర విరుచుకుని ఊరేగే 'సిగ్గు'లేని నాయకుల రోజులొచ్చాయి. ఈ నేరస్థుడు బయట తిరగడం వల్ల నేర విచారణకి ఎటువంటి ఇబ్బందీ రాదని న్యాయస్థానం నమ్మిన తర్వాతే బెయిలు ఇస్తారు. నిరపరాధిత్వం నిరూపణ అయినందుకు కాదు. కానీ అలా బయటికి రావడమే గొప్ప విజయంగా కనిమొళికి చెన్నై విమానాశ్రయంలో పార్టీశ్రేణులు బ్రహ్మరథం పట్టడం మనం చూశాం.

అంతకన్న అనర్థమైన విషయం, ఈ సమాజానికీ, వ్యవస్థకీ పట్టిన ముఖ్యమైన 'అనర్థం' మరొకటి ఉంది. నేరం రుజువుకాని దశలోనే, తర్వాత నేరస్థుడని తేలిన ఒక నేరస్థుడు (సుఖ్‌రాం) హిమాచల్‌ప్రదేశ్‌లో కొత్త పార్టీని స్థాపించి, ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. గడ్డి తిన్న లల్లూ ప్రసాద్ బీహార్ ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన పదవిలో ఉండడానికి వీలులేదని న్యాయస్థానం అన్నప్పుడు వంటగదిలోంచి తన శ్రీమతిని సరాసరి ముఖ్యమంత్రి గద్దెకి బదిలీ చేశారు.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బా నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

మరో 16 సంవత్సరాల తర్వాత నిన్న వారిమీద చార్జిషీటు నమోదయింది. తీరా తీర్పు వచ్చేనాటికి వారికి 90 ఏళ్లు వచ్చినా ఆశ్చర్యం లేదు. ఇన్నాళ్లూ న్యాయస్థానం ఎందుకు నిద్రపోయింది? వ్యవస్థ ఎందుకు చర్య తీసుకోలేదు? ఇదే పెద్దమనిషి, లోక్‌పాల్ బిల్లు చట్టమయితే మనమంతా జైల్లో ఉంటామన్న నిజాన్ని బహిరంగంగా పార్లమెంటులోనే వక్కాణించారు. స్వస్వరూపజ్ఞానం తెలిసిన అవినీతిపరుడిగా లాలూకి పెద్దపీట వేయాలి. మరో గొప్ప ఉదాహరణ జయలలిత. ఆమె మీద బోలెడు కేసులు నడుస్తున్నాయి. ఆమధ్య ఆమె పదవిలో ఉండరాదని కోర్టు తీర్పు ఇచ్చింది. ఆమె తన 'చెంచా'ని ముఖ్యమంత్రిగా నిలిపి రాష్ట్రాన్ని పరిపాలించింది. తనే రెండుసార్లు ముఖ్యమంత్రి అయింది. రేపు ఆవిడ నేరస్థురాలని న్యాయస్థానం నిర్ణయిస్తే? ఒక నేరస్థుడి పరిపాలనలో రాష్ట్రం నిలవడం ఎంత దురదృష్టం? కాక, ఆమె నిరపరాధి అని న్యాయస్థానం తీర్పు ఇస్తే –ఒక నిజాయితీ పరురాలయిన నాయకురాలికి ఎంత అన్యాయం జరిగినట్టు? అలాగే ములాయం మీద కేసులున్నాయి. మాయావతి మీద ఉన్నాయి. ఇవికాక మన ఘనత ఇతరత్రా బోలెడు ఉంది. రాజీవ్ గాంధీని దారుణంగా హత్య చేసినందుకు మరణశిక్ష పడిన హంతకులు 21 సంవత్సరాలుగా జైళ్లలో మ్రగ్గుతున్నారు. అఫ్జల్‌గురు సంగతి సరేసరి. ఈ అలుసు చూసుకుని మన కళ్లముందే ఎందరినో చంపిన అజ్మల్ కసబ్ తనకి న్యాయం జరగాలని వాపోతున్నాడు. ఇది ఈ దేశానికి హాస్యాస్పదమైన దుస్థితి. మొన్ననే సుప్రీంకోర్టు రాష్ట్రపతిని ఈ శిక్షల మీద తాత్సారానికి సంజాయిషీని కోరింది.

డబ్బున్న వాళ్ల బరితెగించిన పిల్లలు తాగి, మనుషుల మీద కార్లని నడుపుతున్నారు. గాజులు తొడుక్కున్న చట్టాలు వారిని విడుదల చేస్తున్నాయి. టీవీల వాళ్లూ, పత్రికల వాళ్ల పుణ్యమా అని అమ్మాయిని చంపి ఆటగా తిరుగుతున్న మనూశర్మ గతిలేక జైలుకి వెళ్ళాడు. ఎప్పుడో 1860 నుంచీ మురిగిపోయిన ఈ ముసలి చట్టాలు నేరస్థులకి గుండె ధైర్యాన్ని పెంచుతున్నాయి. పైగా సిగ్గులేని తనం నేరస్థుడికి ఈ తరం సమకూర్చిన మొదటి ఆయుధం. మనకి నేరాలు తెలుస్తున్నాయి. నేరస్థులు పదవుల్లో కనిపిస్తున్నారు. రుజువు కానివ్వక పోవడం తన నిర్దోషిత్వంగా జబ్బలు చరుస్తున్నారు. మంచో, చెడో, అటు పక్కన ఉంచితే, నేరస్థుడని భావించిన సద్దాం హుస్సేన్ మీద నెలలలోనే శిక్ష అమలు జరిపారు. అలనాడు జుల్ఫికర్ ఆలీ భుట్టో మీద అలాగే శిక్ష అమలయింది. ఈ దేశపు దురదృష్టం, న్యాయ వ్యవస్థ చేతులు కట్టేసే ముసలి చట్టాలు అండకావడం. నాయకత్వం వాటిని అలుసుగా తీసుకోవడం. వెయ్యిమంది అవినీతిపరులు తప్పించుకున్నా ఒక నిరపరాధికి అన్యాయం జరగకూడదన్న అపురూపమయిన మానవతా దృక్పథం పెట్టుబడిగా బ్రిటిష్ సంప్రదాయపు చట్టాలు అలనాడు ఏర్పడ్డాయి. కానీ 90 మంది నీతిపరులు బలి అయిపోయినా (అక్టోబర్ విప్లవంలాగ) ఈ దేశాన్ని భ్రష్టు పట్టించే ఒక్క అవినీతి పరుడిని నేల కరిపించే చట్టాలు ఈ రోజు అవసరం. నిజంగా న్యాయస్థానం కళ్లు తెరిస్తే మనం కొత్త జైళ్లను కట్టుకోవాలి. తీహార్ చాలదు. మనకి ప్రస్తుతం పదిమంది శేషన్‌లూ, పది సుప్రీంకోర్టులూ, ఓ డజను సుబ్రహ్మణ్య స్వాములూ, ఇద్దరు అన్నా హజారేలూ కావాలి.

**(మార్చి 5. 2012)**

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (March 12, 2012) Telugu Tegulu తెలుగు తెగులు

ఈ దేశంలో తెలుగు మీద తెగులు 120 సంవత్సరాల క్రితమే ప్రారంభమయింది. ఆ రోజు అది సరదా. ఓ ముచ్చట, గొప్ప. ఇంకా చెప్పాలంటే అభివృద్ధి. కాకపోతే ఇప్పటికీ అదే అభివృద్ధి అని భావించేవాళ్లే ఎక్కువగావున్నారు. అందులో ఈనాడు చదువుచెప్పే పాఠశాలల ప్రిన్సిపాళ్లూ ఉన్నారు. 1890 ప్రాంతంలో రాసిన కన్యాశుల్కంలో గురజాడ అప్పారావు గారు పాత్ర చేత కూడా అనిపించారు. అగ్నిహోత్రావధాన్లు భార్య సుబ్బమ్మ గిరీశాన్ని అడుగుతుంది: 'ఏదీ! మావాడూ' మీరూ ఇంగ్లీషులో మాట్లాడుకోండి, అని. నానా చెత్తా వాగినా, అర్థం కాకపోయినా ఆవిడ పొంగిపోతుంది. విశేషమేమంటే ఈనాడూ మన మధ్య సుబ్బమ్మలున్నారు. వారికి ఇంగ్లీషు గురించి ఏమీ తెలియకపోవచ్చు. కానీ అదే అభివృద్ధి అని నమ్ముతున్నారు మరో కారణానికి.

ఆ రోజుల్లో చదువంటే శిష్ట వ్యవహారికులకు వేదం, శాస్త్రం, ఛందస్సు, జ్యోతిషం, వ్యాకరణం వగైరా. పామరజనానికి శతకం, పాట. జానపదులకు కాచి వడపోసిన జీవన సత్యాల సామెతలు, నానుడులూ, పదాలెన్నో వీటి వేటికీ ఆదాయం లేదు. ఆనాడు అవసరమూ లేదు. నిజానికి గురువు శిష్యుడిని తన ఇంట్లో ఉంచుకుని అన్నం పెట్టి చదువు చెప్పేవాడు. ఆ కుర్రాడూ చదువుకుని పెద్దవాడయి అదేపని చేస్తాడు. ఈ చదువు వల్ల ఏతావాతా ఉపయోగం ఏమిటి? చదువు లక్ష్యం సంస్కారం, సత్ప్రవర్తన, సౌశీల్యం, ధర్మపాలన వంటివి. ఇవన్నీ ప్రస్తుతం బూతుమాటలు. చదువుతో వ్యాపారం, ఆర్జన మనకి బ్రిటిష్‌వారు పెట్టిన భిక్ష. నీకు ఎకౌంట్లు రాయడం వచ్చా? అయితే నీ జీతం ఇంత. రాదా? నేర్పే చదువులు మేం ప్రవేశపెడతాం. ఉద్యోగాల దృష్టితో కొత్త రకం చదువులు వచ్చాయి. డిగ్రీలు వచ్చాయి. కన్యాశుల్కం నాటికే ఈ భాగోతం ప్రారంభమయిపోయింది. మావాడు పట్నం చదువు చదువుకుంటే ఏనాటికైనా కానిస్టేబులు అవుతాడు. తనకి దిక్కుమాలిన చదువు చెప్తున్నాడని కరటక శాస్త్రిని –అంటే గురువుని శిష్యుడు ఆక్షేపిస్తాడు. బండి చక్రాలు తప్పడం కొత్త సంస్కారంగా మహాకవి వెక్కిరించిన తొలిరోజులవి. మనకి తెలియని, అక్కరలేని, మరెవరికో ఉపయోగపడే చాకిరీ నువ్వు చేసిపెట్టు, నీ జీతం ఇంత రేపు వయస్సు మళ్లినా నీకు పింఛను వస్తుంది నువ్వు చస్తే నీ పెళ్లానికి అందులో సగం వస్తుంది. నీ ఆలోచనతో ప్రమేయం లేకుండా నీ శక్తిని తాకట్టు పెట్టడానికి ఇది జీవితకాలమంతా ఏర్పరిచిన రుసుము. నీ స్వేచ్ఛ ఖరీదు. ఈ సర్వీసులో ఉన్నంతకాలం నువ్వు అనుమతి లేనిదే ఊరు వదిలి వెళ్లరాదు. అదనపు సంపాదన పనికిరాదు. ఆస్తులు పెంచుకోరాదు. మళ్లీ పెళ్లి చేసుకోరాదు. ప్రభుత్వం మీద నీ అభిప్రాయాలు చెప్పరాదు. ఏ పార్టీలోనూ చేరరాదు. వెరసి నువ్వు ప్రభుత్వానికి బానిసవి. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ పరిశ్రమ ఉంది. ఎవరో తెలివైన వ్యాపారి మరో దేశపు చాకిరీని లాభసాటి ధరకి ఒప్పుకుంటాడు. నువ్వు రాత్రి పగలుగా, పగలు రాత్రిగా పనిచేస్తావు. ఆ లాభాలతో నీకు ప్రమేయం లేదు. నీ జీతం లక్షల్లో ఉంటుంది. ఇది ప్రస్తుతకాలపు ఖరీదైన బానిసత్వం. ఇప్పటికీ పల్లెలో రచ్చబండ దగ్గర శతకం చదివేవాడికి తృప్తి ఉంది. పద్యం చదివేవాడికి ఉంది. కాని రచ్చబండ ఎక్కడిది? ఇప్పుడు చదువుకీ, డబ్బుకీ మాత్రమే లంకె. చదువు విలువకి స్కేలు –సంపాదన. తెలుగు చదువుకుంటే ఏం వచ్చి చస్తుంది? మావాడు సాఫ్ట్‌వేర్ ఇంజనీరు అమెరికాలో. సంవత్సరానికి 18 లక్షలు జీతం. అదీ కొలబద్ద. ఆదాయం కొద్దీ కట్నాలు. మొన్నటిదాకా డాక్టర్‌కి పదిలక్షలు. ఇంజనీరుకి ఎనిమిది. ఇప్పుడు సాఫ్ట్‌వేర్‌కి గిరాకీ.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

ఏం చేస్తావయ్యా? అని ఏ కుర్రాడినయినా అడగండి. 'మీకు తెలీదులెండి' అంటాడు. నిజానికి వాడికీ తెలీదు, వాడెందుకు చేస్తున్నాడో! టాటా కంపెనీకి తెలుసు. ముఖేష్ అంబానీకి తెలుసు. ఖోటక్ మహేంద్రాకి తెలుసు. గుర్రానికి పెట్టే గడ్డికీ, కుర్రాడి చదువుకు పెట్టే పెట్టుబడికీ పెద్ద తేడా లేదు. ఈ మాటే నాచేత 29 సంవత్సరాల కిందట 'మనిషికో చరిత్ర'లో చెప్పించారు. 'నీకంటే మా పెరట్లో ఉన్న గౌడు గేదె నయమయ్యా' అంటాడు అవధాని డిగ్రీ కుర్రాడితో. అయితే ఆనాడు నవ్వుకుని మరిచిపోయారు. ఈనాడూ అంతకంటే ఏమీ చెయ్యలేరు. 'కుల విద్యకు సాటిలేదు గువ్వల చెన్నా' అన్నా, స్వధర్మం గొప్పది పరధర్మం కన్నా అని గీతాకారుడిని ఉదహరించినా చాలామంది నవ్వుతారు. కొందరికి కోపమూ రావచ్చు. విద్వత్తుకీ, విద్యకీ, విజ్ఞానానికీ, సంస్కారానికీ, సంపాదనకీ ఏమీ సంబంధం లేదు. అందుకనే మన తల్లులూ, తండ్రులూ ఉగ్గుపాలతో ఇంగ్లీషునే నేర్పిస్తున్నారు. 'ఒరులేయని యొనరించిన' అనే దిక్కుమాలిన పద్యం ఎవడిక్కావాలయ్యా? మావాడు కానిస్టేబులయి మరో పది లక్షలు పెట్టుబడి పెడితే ఎక్సైజ్ డిపార్టుమెంటులో ఉద్యోగం వస్తుంది, తనో సిండికేటుకి పెట్టుబడిదారుడవుతాడు అంటారు. మాతృభాషని వదిలిపెట్టే చదువుని పెంచిన ఘనత ఈ దేశంలో ఆంధ్ర దేశానిదేనని మొన్ననే అంకెలతో సహా ప్రకటించారు. తమిళ గవర్నరు వచ్చీరాని తెలుగులో మాట్లాడితే మనం ఆనందంతో చప్పట్లు కొడతాం. మన్మోహన్ సింగ్ గారు 'మీకు వందనాలు' అంటే పొంగిపోతాం. కానీ తెలుగింటి అమ్మాయి తెలుగుదేశంలో చదువునేర్పే బడిలో తెలుగులో మాట్లాడితే తెలుగు ప్రిన్సిపాల్ చావగొట్టి తట్లు తేలేలాగ కొడతారు. అదీ మన ఘనత.

ఇప్పటికీ కరుణానిధిగారు ఒక్కటి ఒక్కటంటే ఒక్క ఇంగ్లీషు మాట మాట్లాడగా నేను వినలేదు. మన తెలుగు మంత్రులు ఎక్కడో ఆఫ్రికా నుంచి దిగుమతి అయినట్టు దిక్కుమాలిన తెలుగు మాట్లాడి మనల్ని రంజింపజేస్తూంటారు. అది మన నాయకత్వం చూపే మార్గదర్శకత్వం. చెట్టుకొమ్మలకి చెదపట్టింది. కానీ ఇంకా మూలాల్లో చెమ్మ ఉంది. నాయకులు, చదువుకున్న పెద్దలు ఆర్జన కోసం చదువుని అమ్ముకుంటున్నారు. కానీ నేర్పితే 'పావని' వంటి చిన్న పిల్లలు తెలుగు నేర్చుకుంటారు. విశాఖపట్నం మురళీనగర్‌లో ఎమ్.ఎస్.ఎమ్. పబ్లిక్ స్కూలు ప్రిన్సిపాల్ మూర్తిగారు పెద్దల తలకెక్కిన విషానికి మూర్తీభవించిన ప్రతిరూపం. పాపం. ఆయన ఒక్కడినీ ఏకాకిని చేసి నిందించడం సబబు కాదు. ఈ ముష్కరత్వంలో తలా పాపం ఉంది. ఆయన కేవలం ఈ సమాజంలో లాభసాటి చదువులు నేర్పే ప్రతినిధి. ఈ వాతలు పావని శరీరం మీద కాదు, తెలుగు అధికార భాష కావాలంటూ తమ పిల్లలకి కాన్వెంటు చదువులు చదివించే పెద్దల ఆత్మవంచనకి కేవలం గుర్తులు. దమ్ముంటే అధికార భాష కోసం ఢిల్లీ పరుగులు మాని తెలుగుదేశంలో ప్రతీ బడిలో ఒక్కటి –కనీసం ఒక్క తెలుగు పద్యం నేర్పించే ప్రయత్నం చేయమని పెద్దల్ని ప్రార్థిద్దాం. ఐక్యరాజ్యసమితి పరిశోధనల ప్రకారం వినియోగంలేని కారణాన మాయమయే భాషల జాబితాలో తెలుగు పదకొండో స్థానంలో ఉన్నదని మనవి చేస్తున్నాను.

**(మార్చి 12. 2012)**

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (March 19,2012) Pidapa Buddhula Peddakka పిదప బుద్ధుల 'పెద్దక్క'

'క్షణ క్షణముల్ జవరాండ్ర చిత్తముల్' అన్నారు. జవరాండ్ర మాటేమోగానీ తృణమూల్ కాంగ్రెస్ పెద్దక్క మమతా బెనర్జీ విషయంలో ఆ మాట నిజం. మొన్నటిదాకా వారి పార్టీలో సీనియర్ సహచరుడు, ప్రభుత్వంలో తృణమూల్ ప్రతినిధి రైల్వేమంత్రి దినేష్ త్రివేదీ. కానీ నిన్ననే ఆయన 'ద్రోహి' అయిపోయాడు. ఆయన చేసిన ద్రోహం అల్లా పెద్దక్కని సంప్రదించకుండా బడ్జెట్‌ని తయారు చేయడం, కాంగ్రెస్‌తో కుమ్మక్కయి సామాన్య ప్రజల మీద అదనపు ఖర్చుల భారాన్ని వేయడం. అది తప్పే కావచ్చు. చెయ్యకూడని పని కావచ్చు. కానీ ఒక్క రోజులోనే 'ద్రోహి' అయిపోతాడా? సరే. మొన్న మార్చిలో ఆయన ఇంతకన్నా పెద్ద ద్రోహమే చేశాడే! రైల్వే రవాణా ఖర్చులను పెంచాడు. అది పరోక్షంగా సామాన్య ప్రజల నడుం విరగగొట్టడం. అయితే ఆ 'విరుగుడు' ప్రజలకి సూటిగా 'తెలియదు'. కనుక ఆ ద్రోహాన్ని పెద్దక్క మౌనంగా సరిపెట్టుకున్నారు. 'ద్రోహా'లు రెండు రకాలు. సూటిగా ప్రజలకి అర్థమయి –ఓట్లను భంగపరిచే ద్రోహాలు.

పోలీసోడి దెబ్బల్లాగ తగిలినా తమదాకా రాని ద్రోహాలు. ఇది దినేష్ త్రివేదీకి అర్థం కాలేదా? లేదా మొన్నటి రవాణా వ్యవహారం లాగే పెద్దక్క దీన్నీ సరిపెట్టుకుంటారని భావించారా? రైల్వే బడ్జెట్ రాగానే రెండు నిర్ణయాలు చేశారు పెద్దక్క. దినేష్ త్రివేదీని ద్రోహిని చేశారు. ముకుల్ రాయ్‌ని రైల్వే మంత్రిని చేయాలన్నారు. తమ వంటగదిలో కూరల మార్పిడిలాగ. ఈ రెండూ జరగాలని ప్రధానిని డిమాండ్ చేశారు. పాపం, మన్మోహన్ సింగ్ గొంతుపోయి చాలా రోజులయింది. ఆయన ఏం చెప్పాలనుకున్నా ప్రణబ్ ముఖర్జీ గొంతుని ఎరువు తెచ్చుకుంటారు. అప్పుడప్పుడు ధనంజయ పూజారీ, రేణుకా చౌదరీ వంటి చిల్లర గొంతులను వాడుకుంటూంటారు. ప్రస్తుతం కేంద్రంలో బొత్తిగా నోరులేని వాళ్లు ఇద్దరున్నారు, సోనియాగాంధీ, మన్మోహన్ సింగ్. ఇందులో మరో విచిత్రం ఉంది. ఎనిమిదేళ్లుగా రైలు టిక్కెట్ల చార్జీలు పెరగనందుకు దేశంలో చాలామంది ఆనందించారు. ఇది ఆఫీసర్లకి టూరుల్లో జరిగే రాచమర్యాదల్లాంటివి. మంత్రిని ఫలానా ఉద్యోగి సత్కరిస్తున్నాడంటే పక్కన ఎవడి జేబుకో కన్నం వేస్తున్నాడనే అర్థం. మరి ఇంత విస్తృతమైన రైల్వే ఖర్చు ఎలా సాగుతోంది? ఎవడిక్కావాలి? పోనీ, ఇప్పుడు చార్జీలు పెరిగినందుకు ఎవరూ గగ్గోలు పెట్టినట్టు కనిపించలేదు. ప్రజల కంటే పెద్దక్క కోపం అసలు విషయాన్ని మరిపించినట్టుంది. దొంగపోటు కంటే లింగపోటు ఎక్కువయిపోయిందన్నాడట వెనకటికి ఒక భక్తుడు. ప్రస్తుతం దినేష్ త్రివేదీ, పెద్దక్కల వీరంగమే రంగస్థలం మీద సాగుతోంది. నాకు భగత్‌సింగ్ త్యాగం లక్ష్యం అంటున్నారు త్రివేదీ. ఆయన్ని తీసెయ్యడమే నాకు కావాలి అంటున్నారు పెద్దక్క.

ఎనిమిదేళ్లుగా మంత్రులు ఎందుకు చార్జీలు పెంచలేదు? అవి మామూలు ప్రజలకి తట్టే విషయాలు కావు. వెనకటికి గిరీశం బండివాడితో గంటసేపు రాజకీయాల గురించి మాట్లాడితే 'మావూరి కానిస్టేబుల్‌ని ఎప్పుడు బదిలీ చేస్తారండీ' అని అడిగాడట బండివాడు. కొన్ని పార్టీలకి కొన్ని ఊతపదాలున్నాయి. బడుగు వర్గాలు, సామాన్య ప్రజలు, తిండికీ బట్టకీ నోచుకోని పేద ప్రజానీకం యిలాగ. ఇవన్నీ కాదనలేని నిజాలు.

కానీ ఇవి కొన్ని పార్టీలకి పెట్టుబడులుగా ఉపయోగపడే ఇజాలు. నిజంగా ఈ బడుగువర్గాల గురించే పాటుబడితే లక్షల ఆదాయం ఉన్న మాయావతి వ్యక్తిగతమైన ఖజానాలో వందల కోట్లు ఎలా చేరతాయి? లక్నోలో ఒక్కొక్క ఏనుగు ఎంతమంది తిండిలేని ప్రజలకి ఆహారాన్ని




ఇవ్వగలదు? లెక్కల్లోకి వెళ్తే చాలామందికి అర్థం కాదు కానీ, ముక్తసరిగా చెప్పుకుందాం. మనదేశంలో రైలు ఒక కిలోమీటరు నడిస్తే పాసింజరు తలా ఒక్కడికీ సగటున 412.22 రూపాయల ఆదాయం రైల్వేకి దక్కుతుంది. కానీ రైలు ఒక కిలోమీటరు నడవడానికి ఇంధనం, ఖర్చులు, జీతాలు, బొగ్గు, పెట్టుబడులు –అన్నీ కలిస్తే 550.97 రూపాయలు ఖర్చు అవుతుంది. ఇలా రోజుకి 250 లక్షల మంది 64 వేల కిలోమీటర్లు ప్రయాణం చేస్తున్నారు. ఇది కేవలం 2008 మాట. 2012కి ధరలూ, ఖర్చులూ అన్నీ పెరిగాయి. మొన్నటిదాకా సరకుల రవాణా మీదా, నేటిదాకా –గత ఎనిమిదేళ్లలో పాసింజర్ల చార్జీల ద్వారా ఆదాయం పెరగలేదు. ఇక్కడితో అంకెల్ని వదిలేస్తే గత ఎనిమిదేళ్లుగా ఆయా మంత్రులు ఆయా బడ్జెట్లతో ప్రజల్ని ఆనందపరిచి తమ భుజాలు చరుచుకుని పార్టీలకి ఓట్లని దండుకునే పనిలో దేశం సొమ్మును ఖర్చు చేస్తున్నారు.

ఈ ఘనత మన లాలూతో ప్రారంభమయి, పెద్దక్కదాకా కొనసాగింది. ప్రస్తుతం దినేష్ త్రివేదీ లాంఛనంగా పెంచారు కానీ అలా వచ్చే ఏడు వేల కోట్ల ఆదాయం కొండల్ని మింగేవాడికి వేరుశనగ గింజ తినిపించినట్టు. తాను రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు రైల్వే శాఖ పాలిచ్చే జెర్సీ ఆవు. ఇప్పుడు వట్టిపోయిందన్నారు లాలూ. సరే, బడ్జెట్‌ని ప్రతిపాదించగానే తన పార్టీ మంత్రినే పదవిలోనుంచి తొలగించాలంటూ పాలక యంత్రాంగంలోనే భాగమయిన ఒక పార్టీ నాయకురాలు పెద్దక్క వీధిన పడడం చరిత్రలో ఇది మొదటిసారి. కేంద్రం ఏమైనా తన ఓట్లని పెంచుకోవాలనుకున్న రాజకీయమైన యావకి –సమష్టి బాధ్యత అనే నీతిని పక్కన పెట్టడానికి ఇది నాంది. ఇంతకీ దినేష్ త్రివేదీ ఉండేనా? ఊడేనా? ఛార్జీలు పెరిగేనా? వెనక్కి తిరిగేనా? భగత్‌సింగ్ వంటి త్యాగశీలత కలిగిన మంత్రి పార్లమెంటులో మిగిలేనా? కలకత్తా రైలెక్కేనా? సామాన్య మానవుడి నడ్డి విరిగేనా? ప్రస్తుతానికి మిగిలేనా? ప్రజల కళ్లు తుడిచి కుళ్లిన మేడిపండుకి ఏటేటా కొత్తరంగులు పులిమే జెర్సీ ఆవు పాలకుల ఆటలు ఇంకా సాగేనా? ఆగేనా? ఇవన్నీ భేతాళుడి ప్రశ్నలు. తెలిసి చెప్పకపోతే తల వెయ్యి చెక్కలవుతుంది. తెలియక చెప్పకపోతే పార్టీల 'బడుగు' వర్గాల లిస్టులో మనమూ ఉంటాం క్షేమంగా.

**(మార్చి 19. 2012)**

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!






# (March 26,2012) Chevilo Tufanu చెవిలో తుఫాన

చాలా సంవత్సరాల తర్వాత మా మిత్రుడొకాయన నైరోబీ నుంచి వచ్చాడు. ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో మన దేశం సాధించిన గొప్ప అభివృద్ధి ఏమిటని అడిగాను.

తడువుకోకుండా 'సెల్ ఫోన్' అన్నాడు.

నిజమే. ఈ మధ్య పేపర్లో చదివాను. ఈ దేశంలో మరుగుదొడ్లు లేని ఇళ్లు బోలెడన్ని ఉన్నాయి. కానీ ఒక్క సెల్ ఫోనయినా లేని కుటుంబాలు వీటిలో లేవట. ఇంకా చెప్పాల్సి వస్తే దేశంలో ప్రతి పదిమందిలో ఒక్కరికయినా రెండేసి సెల్‌ఫోన్లు ఉన్నాయి. రోజుకి 28.65 రూపాయలు ఖర్చు చేస్తున్న వారందరూ పేదరికం పరిధిలోకి రారు అని మన ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ చైర్మన్ మాంటేక్ సింగ్ అహ్లూవాలియా సెలవిచ్చారు. అయితే సెల్‌ఫోన్లు? వాటి అవసరం, అలవాటు దాదాపు అందని వారు లేరేమో!

వీళ్లకి ఆదాయం ఎలా? ఈ ఖర్చుని ఎలా భరిస్తారు? ఒక పేద సెల్‌ఫోన్‌దారుడు నాతో చెప్పాడు. ఎలాగో తంటాలుపడి పాత సెల్‌ఫోన్ కొనుక్కుంటాడు. అవసరానికి ఫోన్‌లో అందుబాటులో ఉన్న కారణానికే అతనికి పనిదొరుకుతూంటుంది. అందులో పదిరూపాయల చార్జీ వేస్తాడు. ఎవరికీ ఫోన్ చెయ్యడు. కావాలనుకున్నప్పుడు మిస్డ్ కాల్ ఇస్తాడు. అవతలివాడికి అర్ధమౌతుంది ఫలానా వాడి ఫోనని. అతను ఫోన్ చేస్తాడు. వచ్చేకాల్‌కి చార్జీ లేదు. పది రూపాయలు భద్రంగా ఉంటాయి. అందరికీ అతనితో మాట్లాడే సౌకర్యం ఉంది. అతనికి ఫలానా వాడితో మాట్లాడాలని చెప్పే సౌకర్యం ఉంది. చాలు. సెల్‌ఫోన్ ప్రయోజనం సాధించినట్టే. నాకు తెలిసి చాలామంది డ్రైవర్లు చేసే పని ఇదే. ఈ దేశంలో ఎరువుల కుంభకోణాలున్నాయి. గడ్డి కుంభకోణాలున్నాయి. స్టాంపుల కుంభకోణాలున్నాయి. కాని వీటన్నిటినీ తలదన్నే కుంభకోణం –సెల్ ఫోన్లకి సంబంధించింది –2జి కుంభకోణం. దేశంలో కోట్ల మంది అలవాట్లకు ప్రాణం పోసే వ్యాపారం, వ్యాసంగం. మాట్లాడడం ఒక వ్యసనం. ఒక ఆకర్షణ. ఒక వ్యాపకం. నేను పనిచేసే సీరియల్ డ్రైవరు ఒకడున్నాడు. ఏ విధంగా చూసినా అందంగా ఉండడు. చదువు పెద్దగా లేదు. రోజూ కారుని ఒక కలవారి ఇంటిపక్కన ఉంచి కడుగుతూంటాడు. ఆ ఇంటి అమ్మాయి అతన్ని చూస్తూంటుంది, యధాలాపంగానే. అది ఆకర్షణ కాకపోవచ్చు. చూడడం అలవాటు. ఓ రోజు ఆమెకి తన సెల్‌ఫోన్ నంబరు ఇచ్చాడు యధాలాపంగానే. ఆమె ఫోన్ చెయ్యడం ప్రారంభించింది. ఇద్దరూ తమ అంతస్తుల్ని, మరిచిపోయి –క్రమంగా కేవలం మాట్లాడుకోవడం అనే వ్యాపకానికి అలవాటు పడ్డారు. రోజూ ఓ కుర్రాడితో కబుర్లు చెప్పడం ఒక ఊసుపోని పని ఆ అమ్మాయికి. మాట్లాడేది అమ్మాయి కావడం ఈ కుర్రాడికి ఆకర్షణ. దీనికి 'ప్రేమ' అని దొంగపేరు పెడదామా? లేదా క్రమంగా శారీరకమయిన దగ్గరితనానికి దగ్గరితోవ అందామా? ఏదయినా సాధనం –సెల్ ఫోన్. అడ్డమయిన కారణాలకి అడ్డంగా ఆకర్షణని పెంచే తాయిలం.

హైదరాబాద్‌లో ఓ రియల్ ఎస్టేటు వ్యాపారి ఉన్నాడు. నా అభిమాని. అప్పుడప్పుడు పార్టీలిస్తూ ఆహ్వానిస్తూంటాడు. ఓసారి ఫోన్ చేశాను. 'అర్జంటు పనిమీద బెంగుళూరు వచ్చాను సార్. ఈసారి కలుస్తాను' అన్నాడు. సరేనన్నాను. ఆ సాయంకాలం నెక్లెసు రోడ్డులో పుస్తకాల ఎగ్జిబిషన్ ముందు దిగాను. దూరంగా ఈ మిత్రుడు కనిపించాడు. అతను నన్ను చూస్తే తన అబద్ధం దొరికిపోయినందుకు సిగ్గుపడతాడేమోనని –అతని



అబద్ధాన్ని కాపాడడానికి నేను కారెక్కి వెళ్లిపోయాను. సెల్‌ఫోన్ చక్కని అబద్ధాలకు దగ్గరతోవ. సెక్స్ కంటే, మందు కంటే, టీవీ కంటే సెల్‌ఫోన్ భయంకరమైన వ్యసనం. అర్థంలేని కారణాలకు, అవసరం లేని ఆకర్షణగా –అకారణంగా దగ్గరతనాన్ని కల్పించే దుర్మార్గమయిన సాధనం సెల్‌ఫోన్.

సెల్ ఫోన్లు రహస్య వ్యాపారాలకు, రంకుకి, దౌర్జన్యకారులకీ, హత్యలకీ, రాజకీయాల లావాదేవీలకీ, ఆత్మహత్యలకీ, విడాకులకీ అన్నిటికీ సర్వరోగ నివారిణి. ఈ మధ్య హార్వర్డ్ బిజినెస్ స్కూలువారు ఓ విచిత్రమైన పరిశోధన జరిపారు. ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో 1400 మంది ఉద్యోగుల్ని ఎంపిక చేశారు. వాళ్ల చేత వారానికి ఒకరోజు, సాయంత్రం ఆరు గంటల తర్వాత సెల్‌ఫోన్లు వాడకుండా చేశారు. ఇలా మూడు సంవత్సరాల పాటు ఈ ప్రయోగం జరిగింది. మూడేళ్ల తర్వాత 78 శాతం మందికి తమ పనిలో రుచి పెరిగింది. కొత్త ఉత్సాహం వచ్చింది. మళ్లీ లేని ఊతం శరీరంలో, మనస్సులో కనిపించింది.

మొన్నటిదాకా మనం సెల్‌ఫోన్లు లేకుండా బతికాం. మన తాత, ముత్తాతలకి అవేమిటో తెలీదు. ఇప్పుడు వారానికి ఒకరోజు వాడకం మానుకొనే ప్రయోగాలు చేస్తున్నారు. కొత్త సదుపాయాలు వ్యసనాలయి ఎలా నెత్తికి చుట్టుకుంటున్నాయో, మానవ జీవితాల్ని ముంచి ఎత్తుతున్నాయో చెప్పడానికి ఇది శాస్త్రీయమైన ప్రయోగపు నమూనా.

మా మిత్రుడు మూడు నెలల తర్వాత నైరోబీకి బయలుదేరాడు.

'ఏంటి భాయ్! ఈ దేశానికి పట్టిన అనర్థం' అని అడిగాను.

'సెల్‌ఫోన్' అంటూ కారెక్కాడు.

**(మార్చి 26, 2012)**




# (April 02, 2012) Rakshana Neeti Sarawathi Nadi 'రక్షణ' నీతి సరస్వతీ నది

ఈ దేశంలో ఇంకా పూర్తిగా గబ్బు పట్టని వ్యవస్థలు రెండు ఉన్నాయి. న్యాయ వ్యవస్థ, సైనిక వ్యవస్థ. ఒకటి వ్యక్తి నైతిక జీవనాన్ని, మరొకటి వ్యక్తి స్వాతంత్ర్యాన్ని కాపాడే ఆదర్శాలు. కానీ ఈ రెండింటి మీదా ప్రజల నమ్మకం క్రమంగా సన్నగిల్లే చాలా దయనీయమైన పరిణామాలు ఈ మధ్య మరీ ముమ్మరంగా కనిపిస్తున్నాయి. మొన్నటిదాకా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వున్న కె.జి.బాలకృష్ణన్ ఆదాయానికి మించిన ఆస్తులను కూడబెట్టిన కేసు నడుస్తోంది. ఇది న్యాయవ్యవస్థకి పట్టిన గ్రహణం. ఇక సైనిక వ్యవస్థలో అడపా తడపా పునాదుల్ని కదిపే చారిత్రక కుంభకోణాలు ఎన్నో తలెత్తుతూనే ఉన్నాయి.

1948లో అంటే ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇంకా సంవత్సరం దాటకుండానే భయంకరమైన అవినీతి కుంభకోణం జరిగింది. ప్రధాని నెహ్రూ హయాంలో ఆయన ప్రియతమ మిత్రులు కృష్ణమీనన్ ఇంగ్లండులో హైకమిషనర్‌గా ఉన్నారు. రక్షణ శాఖకు కావలసిన 2000 జీపుల కొనుగోలుకి అన్నిరకాల నియమాలనూ ఉల్లంఘించి ఆయనే స్వయంగా 80 లక్షల కాంట్రాక్టుని సాధికారికమైన నిబద్ధత లేకుండా, బొత్తిగా పేరులేని సంస్థతో ఒప్పందం చేశారు. చాలామట్టుకు డబ్బుని ముట్టచెప్పింది ప్రభుత్వం. 2000 జీపులు రాలేదు. కేవలం 155 జీపులే దిగుమతి అయ్యాయి. పార్లమెంటులో దుమారం లేచింది. అనంత శయనం అయ్యంగార్ పరిశీలన జరగాలన్నారు. కానీ నెహ్రూ తన మిత్రుడి మీద కేసుని అర్థంతరంగా ముగించేశారు. 'గవర్నమెంటు ఈ ఫైలుని ఇంతటితో మూసేస్తోంది. ప్రతిపక్షాలకు ఈ చర్య నచ్చకపోతే రేపు ఎన్నికలలో మామీద కత్తి కట్టవచ్చు' అన్నారు. ఇది గుండెలు తీసిన బుకాయింపు. ఆనాటి నెహ్రూ పాపులారిటీకీ, ఆయన పట్ల వ్యవస్థ ఆనాడు ఉంచిన విశ్వాసానికీ ఇది నిదర్శనం. ఈ రోజుల్లో ఈ మాటని ఏ నాయకుడికైనా అనగల దమ్ము ఉందా? ప్రజలూ, ప్రతిపక్షాలూ నోరుమూసుకున్నాయి. కాంగ్రెస్‌ని గద్దె దింపడానికి మరో 29 సంవత్సరాలు పట్టింది. అదీ చరిత్ర.

మరో 32 సంవత్సరాల తర్వాత ఈసారి నెహ్రూ మనుమడు రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్న రోజుల్లో బోఫోర్స్ శతఘ్నులు 155 హోవిట్జర్స్ కుంభకోణం వెలుగుచూసింది. ఈ కొనుగోలుకి ముడుపులు ఖత్రోచీ, విన్‌చద్దా, రాజీవ్‌గాంధీ ప్రభృతులకి దక్కాయని, లక్షల డాలర్లు అకౌంట్లు మారాయని రుజువులతో సహా బయటపడింది. పార్లమెంటులో తుపాను చెలరేగింది. అయితే పదవిలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి అందమైన సమాధి కట్టింది. ఇది మరో చరిత్ర.

ఇప్పుడు టెట్రా వాహనాల కుంభకోణం వెలుగుచూసింది. అవి నాసిరకం వాహనాలయినా అభ్యంతరం చెప్పకుండా బేరాన్ని సాగించడానికి సరాసరి సైనిక ప్రధానాధికారి జనరల్ వి.కె.సింగ్‌కే మరొక సైనిక ఉద్యోగి లెఫ్టినెంట్ జనరల్ తేజీందర్ సింగ్ లోపాయకారీగా 14 కోట్లు ముట్టజెప్పడానికి బేరం చేశాడట.




పుట్టినరోజు తగాదాతో గట్టి దెబ్బతిన్న వి.కె.సింగ్ ఎప్పుడో ఈ విషయాన్ని రక్షణమంత్రికి చెప్పారు. ప్రస్తుతం ఈ రహస్యాన్ని పత్రికలకు చెప్పారు. పార్లమెంటులో నిప్పు రగిలింది. తీరా చెప్పి, ఏ చర్యా తీసుకోనక్కరలేదన్నారట. మంత్రి ఆంటోనీ వారి మాటని ఆనాడు గౌరవించి ఊరుకున్నారు. మరి ఇప్పుడు పుట్టిన రోజు తగాదాని చినికి చినికి గాలివాన చేశారేం?!

ఆంటోనీ నీతికి ఈ దేశంలో ఘనమైన పేరుంది. 'నిజాన్ని వెలికితీస్తాం, వెదికి తీస్తాం' అని వారు పార్లమెంటులో బల్లగుద్దుతూ తగుపాళ్లలో కన్నీరు కూడా కార్చారు. కన్నీరు నిరపరాధిత్వానికి బలమైన సాక్ష్యం. అలనాడు ఇలాంటి పరిస్థితుల్లోనే కపిల్ దేవ్ కంట తడిపెడితే దేశం కరిగిపోయింది. భారతీయులది జాలి గుండె. కన్నీరు చాలా 'నిజాయితీ'లకు పెట్టుబడి.

ఇంతకీ ఎవరిది నిజాయితీ? రక్షణ శాఖలో ఇలా చాలామంది అధికారులు గడ్డికరవడం ఆనవాయితీ అని తేజీందర్ సింగ్ వక్కాణించినట్టు వి.కె.సింగ్ మనకి చెప్పారు. తేజీందర్ సింగ్ కోర్టుకు ఎక్కారు. మరి ఎవరిది నిజం?

ఇది విక్రమార్కుడి మార్కు ప్రశ్న. ఈ మీమాంసలన్నింటిలో ఏది నిజం? ఇద్దరు సింగ్‌లూ, ఒక ఆంటోనీ కన్నీరు మధ్య దేనికి విలువ ఎక్కువ? రక్షణ శాఖలో నీతి సరస్వతీ నదిలాంటిది. అది ఉందని అందరికీ తెలుసు. కానీ ఎక్కడ, ఎలా వుందో తెలీదు. అయినా మన విశ్వాసం సడల లేదు. త్రివేణీ సంగమంలో రెండు నదులతోపాటు కంటికి కనిపించని సరస్వతీ నదిని తలుచుకొంటూ తరతరాల విశ్వాసాన్ని నిలుపుకుంటున్న భారతీయులకి సైనిక వ్యవస్థలో ఇంకా నీతి ఉన్నదని ఆత్మవంచన చేసుకోవడం ఏమంత కష్టం కాదు.

**(ఏప్రిల్ 2, 2012)**




# (April 09, 2012) Cheekati 'Tera' చీకటి 'తెర '

ఫ్రెంచ్ దర్శకుడు లూక్ గొదార్ద్ సినిమా ప్రభావాన్ని గురించి చెబుతూ ఒక మాటన్నాడు. సినిమా సెకెనుకి 24సార్లు నిజాన్ని చెబుతుందట. సినిమా ప్రక్రియ తెలియని వారికి ఒక నిజం చెప్పాలి. సినిమా రీలు 24 ఫ్రేములు కదిలితే తెరమీద బొమ్మ కదులుతుంది. అదీ రహస్యం. గొదార్ద్ అనే నిజాయితీపరుడు రొమ్ము చరుచుకున్న మాధ్యమం ప్రభావం అంత గొప్పది.

అయితే అది ఆ రోజుల మాట. ఆనాటి సినిమాల మాట అప్పటి సినిమా ఫ్రేముల మాట. ఇప్పటి సినిమాలు సెకెనుకి 24 సార్లు కాలకూట విషాన్నీ, గ్లామర్‌నీ, ఆకర్షణనీ, నినాదాన్నీ– అన్నిటికీ మించి అబద్ధాన్నీ సంధిస్తున్నాయి. నేను సి◌ినిమాల వాడిని. ఈ మాట చెబుతున్నపుడు ఇంటిగుట్టు తెలిసిన మేనమామ రట్టు చేసినట్టు చాలామందికి అనిపించవచ్చు. తోటి, సాటి సినిమాల వారికి బాధగానూ ఉండవచ్చు. కానీ ఈ కాలమ్ ప్రయత్నం రొమ్ము చరుచుకోవడం కాదు. రొమ్ము చీల్చుకు నిజాల్ని విప్పుకోవడం, ఒప్పుకోవడం.

సినిమా ప్రభావాన్ని నిర్మాతలూ, దర్శకులూ మరిచిపోయి చాలా రోజులయిపోయింది. సినిమాని ఎలా అమ్ముకోవడమో – అన్న ఒక్క ఆలోచనతోనే తంటాలు పడుతున్న యావ మనకి తెలుస్తోంది.

గొదార్ద్ కాలంనాటి సినిమా – నిజాన్ని ఆకాశంలో నిలిపే సినిమాని – 'పోతన'ని ఓ కుర్రాడు అలనాడు చూశాడు. అతను జీవితకాలమంతా ధ్యానముద్రలో బాలయోగిగా ముమ్మిడివరంలో నిలిచిపోయాడు.

నేను చెప్పిన మార్కు సినిమా ప్రభావం ఎలాంటిది? తమిళనాడులో అలనాడు కె. బాలచందర్ 'నూతిక్కి నూరు' అనే చిత్రాన్ని తీశారు. ఆ చిత్రాన్ని చూసి ప్రభావితుడైన సూర్యప్రకాష్ అనే ఓ కుర్రవాడు కేవలం ఎనిమిది హత్యలే చేశాడు. మొన్ననే – తల్లిదండ్రులకు తనమీద టీచర్ ఫిర్యాదు చేసిందన్న కోపంతో ఆమెని స్కూలులో వెంటాడి కత్తితో ఎనిమిది సార్లు పొడిచి చంపాడు ఓ కుర్రాడు. అతనికి 'అగ్నిపథ్' అనే చిత్రం స్ఫూర్తినిచ్చిందని తెలిసింది.

పూణ□లోనే – మొన్ననే – 16 ఏళ్ల కుర్రాడిని – అతనితో చదువుకుంటున్న సహచరుడు మరో ఇద్దరు మిత్రులతో (అంతా మైనర్లు) ఎత్తుకుపోయి – తండ్రిని 50 వేలు చెల్లించమన్నారట. తర్వాత తమ డిమాండ్‌ని 15వేలకి కుదించారట. బెదిరిపోయిన నిస్సహాయపు తండ్రి డబ్బుని చెల్లించాడు.

కానీ కుర్రాళ్లకి కావల్సింది డబ్బు కాదు. తన తోటి విద్యార్థిని ధిగీ ప్రాంతపు అడవుల్లోకి తీసుకెళ్లి గొంతు పిసికి చంపేశారు. ఈ కుర్రాళ్లకి టీవీల్లో వస్తున్న 'సిఐడి' సీరియల్ స్ఫూర్తినిచ్చిందట. అన్నట్టు – సినిమా ప్రక్రియ తెలియని వారికి – టీవీలో బొమ్మ కదలడానికి 26 ఫ్రేములు కదలాలి. అంటే గొదార్ద్ అనే అమాయకుడి మాటల్లో టీవీ సెకెనుకి 26 సార్లు నిజాన్ని – ఈ సందర్భంలో – దురాలోచనని సంధిస్తోందన్నమాట. కొందరు కుర్రాళ్లని మాధ్యమం రెచ్చగొట్టింది. దుర్మార్గానికి రెక్కలు తొడిగింది. ఎవరూ ఊహించలేని ప్రభావం చూపే మాధ్యమానికి మిడి మిడి జ్ఞానం



ఇవ్వగలిగే అనర్థానికి ఇది మచ్చుతునక. సరైన తూకంలో నిజాన్ని చెప్పలేని మాధ్యమం – చెయ్యి జారిన – లేదా చెయ్యిదాటిన అబద్ధాన్ని అద్భుతంగా అలంకరిస్తుంది. నరాలని రెచ్చగొడుతుంది. ముఖ్యమైన విషయం గమనించాలి. పైన చెప్పిన అన్ని ప్రభావాలూ – బాలయోగితో సహా – రెచ్చగొట్టే వయస్సులో ఉన్నవారి పైన చూపినవే. సినిమా గురిపెట్టిన తుపాకీ. సంధించడం తెలియని వాడి చేతుల్లో అది ఆయుధం. తన పని తెలియని ఒక్క ఎడిటరు చేతిలో చిన్న ఆలోచన పెద్ద ఉద్యమం కాగలదు. భయంకరమైన క్షిపణీ కాగలదు. ఒకాయన 'మంచి'ని చెబుతున్నాడు. ఒకసారి చెబితే అది సూక్తి. రెండోసారి చెబితే అది నీతి. మూడోసారి అది ఉద్బోధ. నాలుగోసారి నినాదం. అయిదోసారి ఉద్యమం. ఆరోసారి విప్లవం. ఏడోసారి వినాశనం. ఒక్క ఫ్రేముకు ఉన్న శక్తి అది. అన్నా హజారే మాలేగావ్‌లో చెప్పింది నీతి. ఢిల్లిdలో లక్షల సమక్షంలో చేసింది ఉద్యమం.

ప్రసక్తి వచ్చింది కనుక చెబుతున్నాను. ఉద్యమాలకీ, రాజకీయాలకీ, నాకూ ఎలాంటి సంబంధమూ లేదు. ఇది కేవలం మాధ్యమం శక్తిని ఉటంకించడానికి ఉదాహరణ మాత్రమే. ఆత్మహత్య– ఓ వ్యక్తి బలహీనతకు పర్యవసానం. ఆవేదనకి అంతిమ చర్య కాదు. అది సైకిక్ న్యూరోసిస్. దాన్ని క్లినికల్ డిప్రెషన్ అంటారు. తన ఉద్దేశాన్ని వాస్తవం చెయ్యలేని, చేసుకోలేని వ్యక్తి వెదుక్కునే దారి. ఎస్కేప్ రూట్. (రైతుల ఆత్మహత్యలు బలమైన ఉదాహరణలు) ఇది చాలా దయనీయమైన పరిణామం. మార్కులు సరిగ్గా రాని కారణాన, రావేమోనన్న భయానికి, తండ్రి తిట్టాడన్న కారణానికి, ప్రేమ ఫలించని కారణానికి మనం ఆత్మహత్యల్ని ఎన్ని చూడడం లేదు? తమిళనాడులో ఎమ్.జి.రామచంద్రన్ పోయినప్పుడు, మన రాష్ట్రంలో ఎన్.టి.రామారావు పోయినప్పుడు ఆత్మహత్యలు చేసుకున్న వారున్నారు. తమ అభిమాన నటుడు రజనీకాంత్ సినిమాకి టిక్కెట్లు దొరక్కపోతే ఆత్మహత్య చేసుకున్న సందర్భాలున్నాయి. ఇవన్నీ 'న్యూరోసిస్'లో భాగాలే. సరే. ఇందులో మాధ్యమం ప్రసక్తి ఎక్కడ? ఇది ఆ వ్యక్తికీ, ఆ కుటుంబానికీ సంబంధించిన తీర్చలేని విషాదం. దాన్ని భూతద్దంలో చూపి, నినాదాలు చేసి, చచ్చిన వ్యక్తిని హీరోని చేసి, త్యాగశీలుడిని చేసి, ఫ్లెక్సీలు, బ్యానర్లతో జిల్లాల్లో, రాష్ట్రంలో, ఢిల్లిdలో ఊరేగింపులు జరిపి పెద్దలు నీరాజనాలర్పిస్తే – మాధ్యమాలూ, పత్రికలూ ఆ నిస్సహాయుడి ఫోటోల్ని ప్రచురిస్తే– వైద్య సహాయం అవసరమైన, తొందరపడిన ఓ నిస్సహాయుడి దుర్మరణం – ఓ జాతిని మేల్కొలిపే సమిధిగా రూపు దాల్చితే – ఒక వైద్యపరమైన రుగ్మత గ్లామరైజ్ అవుతుంది. అర్థంలేని పాప్యులారిటీకి దగ్గరితోవ అవుతుంది. ఎంతమంది – ఇలాంటి నిస్సహాయపు స్థితిలో ఉన్న – న్యురోసిస్‌లో ఉన్న యువకులు – ఆ చిన్న 'అంగ'ని వెనక్కి తీసుకోలేని మార్గంలో వేస్తారు? ఇందులో పెద్దల, మాధ్యమాల వాటా ఉంది. సెకెనుకి 26 ఫ్రేముల ఫోకస్ ఉంది. బలహీనుడిని కొండమీద నుంచి దొర్లించే స్ఫూర్తి ఉంది. పూణ□లో ముగ్గురి కుర్రాళ్ల హత్యకీ, ఇక్కడ మాధ్యమం నిర్వహించే ప్రోత్సాహానికి పెద్ద తేడా లేదు. ఆర్టీసి బస్సు కిందపడి కన్నుమూసిన కుర్రాడి కథ ఎందరికి తెలుసు? అది తీర్చలేని ఆ కుటుంబపు విషాదం. పూణ□లో 16 ఏళ్ల కుర్రాడు బస్సు కిందపడితే అది పత్రికలో ఆరోపేజీలో ఓ దురదృష్టకరమైన సంఘటన. కానీ ఈ హత్య – మాధ్యమాల తప్పుడు ప్రభావానికి 90 శాతం బాధ్యతని వహించవలసిన దుర్ఘటన.

అమ్మాయిలతో పన్నెండు రీళ్లు ఊరేగిన విలన్‌ని ఆఖరి రీలులో చంపినంత మాత్రాన సత్యానికి పట్టాభిషేకం జరగదు. పైగా అవినీతికి గ్లామరు పెరుగుతుంది. 16 ఏళ్లు నిండని కుర్రాడిని చంపిన సాటి యువకుల తలల్లోకి పాకిన విషం దిగడానికి – వాళ్ల జీవితకాలం చాలదు. వాళ్లని –



మరో 40 ఏళ్ల తర్వాత – ఎవరయినా ప్రశ్నించగలిగితే – వాళ్ల చూపుడువేలు చివరన – ఒకటే ఒక్కటి ఉంటుంది. సినిమా – ఇంకాస్త ముందుకుపోయి – టీవీ– ఇంకాస్త ముందుకుపోయి – మాధ్యమం.

రెండే రెండు విషయాల్ని చెప్పి ముగిస్తాను. మొదటిది ప్రపంచ ప్రఖ్యాత దర్శకులు ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ చెప్పినది: సినిమా తాలూకు భయంకరమైన బలహీనత – నిర్దేశించిన చెలియలికట్టని దాటడం. విలన్ ఎంత విజయవంతమైతే సినిమా అంత రాణిస్తుంది. మరొక మాట: విలన్లలో ఆకర్షణ – మానవ స్వభావంలో ప్రాథమికమైన బలహీనతలకు ప్రాతినిధ్యం వహించడం. వాళ్లలో ఉన్న బలహీనతలే – వాళ్లని ప్రేక్షకులకు మరింత దగ్గర చేస్తాయి. వారి జీవితాల్లో అసమగ్రత లోపం కాదు – సి◌ినిమాకు పెట్టుబడి. సగటు మానవుడి బలహీనతల్ని అద్దంలో చూపించి ఆ విలన్లని వారిలో ఒకరిని చేస్తాయి కనుక. తెరమీద తన సాటిమనిషి – విలన్ – చెయ్యగలిగిన పని జీవితంలో తను ఎందుకు చెయ్యకూడదు? అని ఆలోచిస్తాడు. అదే అనర్థానికి పునాది. ఒకరు బలహీనతలకి బలి అవుతున్నారు. మరొకరు బలహీనతల్ని వాడుకుంటున్నారు.

**(ఏప్రిల్ 9, 2012)**




# (April 16,2012) Sexy Story సెక్సీకథ

సెక్స్ వస్తుతః జంతు ప్రవృత్తి. సంస్కారం దానికి ముసుగు. అందం సాకు. పరపతి పెట్టుబడి. వ్యభిచారం వ్యాపారం. పోలీసు దర్యాప్తు ముఖం దిగదుడుపు.

మనిషి ఈ ప్రాధమిక దశకి పెద్ద ప్రయత్నం అక్కర్లేకుండా అతి సుళువుగా, అతి త్వరగా దిగజారిపోగలడు – అది అతని స్వభావ దశ కనుక. కృతయుగంలో సెక్స్ కేవలం సంకల్పం. త్రేతాయుగంలో ఆలోచన. ద్వాపర యుగంలో అనుషంగం. కలియుగంలో సంఘర్షణ. ఈ యుగంలో మనిషి సమగ్రతను సాధించిన పూర్తి జంతువు. విచక్షణ, పదవి, సంపద, సంస్కారం, పరువు – వీటన్నిటినీ మరిపింపజేసే ప్రవృత్తి, క్రీడ – సెక్స్. అసలు – మధ్యధరా సంస్కృతిలోనే – అలనాటి పురాణాలు, చరిత్ర, సాంఘిక జీవనంలోనూ సెక్స్ ఒక బలమైన ఆయుధం. మహాభారతంలో కరువు కాటకాలు ముసురుకున్న ప్రాంతంలో వర్షాలు కురియడానికి మహాయాగం తలపెట్టారు. చేసే ఋత్విక్కు ఋశ్యశృంగుడు. అతనికి పుట్టుకనుంచే స్త్రీ అంటేనే తెలియదు. ఆయన్ని సామ్రాజ్యానికి తీసుకురావడానికి ఒక దేవ వేశ్యని నియోగించారు. ఆమె పేరు వైశాలి. ఇది ప్రముఖ రచయిత ఎం.టి.వాసుదేవన్ నాయర్ అద్భుత చిత్రం.

ఎవరైనా మహా తపస్సు చేస్తే – తన ఇంద్రపదవి ఊడుతుందని భయం కలిగినప్పుడు – ఇంద్రుడు ఏం చేస్తాడు? తపస్సుని భగ్నం చెయ్యడానికి ఒకే ఒక మార్గం. సెక్స్. దేవవేశ్యల్ని పురమాయిస్తాడు. మహర్షి విశ్వామిత్రుడంతటివాడు మేనక ముందు బలాదూరు అయిపోయాడు. ఇంత ఉదాత్తమయిన ఉదాహరణలు చెప్పడానికి కారణం – నిన్నకాక మొన్న తారా చౌదరి ఉచ్చుల్లో పడిన పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, విద్యార్థులు ఏ మాత్రం సిగ్గుపడనక్కరలేదని. వారందరూ మహర్షి ఋశ్యశృంగుని వారసులుగా గుర్తుంచుకోవాలి.

ప్రతీ వ్యవస్థలోనూ ఒక తార ఉంటుంది. అలనాడు క్లియోపాత్రా ఉంది. 1963 ప్రాంతాల్లో బ్రిటిష్ రాజకీయ వ్యవస్థని పునాదుల్తో కదిపిన క్రిస్టిన్ కీలర్ కథని మనమింకా మరిచిపోలేదు. అప్పటి ప్రధాని మాక్మిలన్ మంత్రివర్గంలో రక్షణ మంత్రి ప్రొఫ్యూమో 1961లో ఆ అమ్మాయిని కలిసి వ్యామోహంలో పడ్డారు. అదంతా పెద్ద కథ.

మొన్నటికి మొన్న మోనికా లెవెన్ స్కీ అమెరికాలో శ్వేతభవనాన్ని వణికింపజేసింది. బిల్ క్లింటన్ దొరగారితోనే శృంగారం నెరిపింది. 1995 – 97 మధ్య జరిపిన ఈ రంకుని సాటి ఆడవారితో పంచుకోవడం సరదాగా ఉంటుంది. ఆమె తన సహచరురాలు లిండా ట్రిక్ తో ఈ రంకు కథలు చెప్పుకుని ఆనందించేది. లిండా ఈ కథల్ని బుద్ధిగా రికార్డు చేసింది. తర్వాత ప్రపంచానికి తెలిసింది.

ప్రస్తుతం తారాచౌదరి అనే శృంగార మూర్తిని లక్ష్మి అనే విశాఖపట్నం అమ్మాయి వీధిన పెట్టిందికాని తారా చౌదరికి తెలుసు ఇలాంటి ఒకరోజు వస్తుందని. అందుకనే డిజిపీలు, డి.ఎస్పీలు, పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యేలు, వ్యాపారవేత్తలు, సినీ ప్రముఖులు తదితర పెద్దల శృంగార లీలల టేపులూ, వీడియోలూ సిద్ధంగా ఉంచుకుంది. నిన్న ఆవిడ టీవీ కెమెరాల ముందు స్పష్టంగా చెప్పింది – ఇవన్నీ బయటపెట్టడం తన ఉద్దేశం




కాదని. రాజకీయనాయకులు పదవితో బెదరిస్తారు. ఆమె 'పరువు'తో బెదిరిస్తుంది. అవసరమైనప్పుడు అడపా తడపా డబ్బు చేసుకుంటుంది. మనిషిలో జంతువు మేల్కొన్నప్పుడు చేసే పనులను పెద్దమనిషి ముసుగు తొడుక్కున్నప్పుడు ఎవరూ గుర్తుచేసుకోవాలనుకోరు. అది తారకూ తెలుసు. పెద్దమనిషి తనాన్ని పెట్టుబడిగా ఉపయోగించుకునే పెద్దలు ఈ మధ్య 'మందు' కుంభకోణాల్లో వీధిన పడి ఎలా గింజుకుంటున్నారో మనం చూస్తున్నాం. మందు ప్రసక్తే అవినీతి అని చెప్పిన మహాత్ముని పార్టీ జెండా ఎగురవేసే ఈ సభ్యులంతా నీతికి కొత్త అర్థాలు కల్పించే వ్యవస్థ నేపధ్యంలో ఆ 'నీతి'కి ధర కట్టే తారలు ఉండడం విడ్డూరమూ కాదు. విశేషమూ కాదు. తారా చౌదరి అరెస్టయాక ఆమె లాప్ టాపుల్లో, సీడీల్లో బయట పడిన పెద్దల్ని లోపాయకారిగా పోలీసులు చాకచక్యంగా బ్లాక్ మెయిల్ చేస్తున్నారనే ఓ కథనం వినవచ్చింది. పాపం. బంజారా హిల్స్ పోలిసు అధికారి తనని పక్కలోకి ఆహ్వానించాడని తార కోర్టులో చెప్పుకుంది. ఇంత విస్తృతమైన రంకుని బయట పెట్టే పోలీసులందరూ మహాత్మా గాంధీ వారసులయి ఉంటారని మనం ఊహించడం, ఆశించడం అన్యాయం. నోరూరించే పాయసాన్ని వండుతున్న వంటవాడు ఒక కిస్మిస్ పండుని నోట్లో వేసుకోబోవడం అబ్బురం కాదు. పురుషులందు పుణ్య పురుషులు నిన్నటి బూతుమాట. జంతువులందు కొత్త జంతువులు నేటి సాధారణాంశం.

ఇలాంటి మరొక తారామణి కథ – గుంటూరు శ్రీదేవి హైదరాబాదులో చేస్తున్న వ్యాపారం కూడా ఇప్పుడే వెలుగులోకి వచ్చింది. గురజాల మాజీ ఎమ్మెల్యే నరిసిరెడ్డిగారు ఈ గుట్టును బయట పెట్టారని టీవీలు చెపుతున్నాయి.

ఆయా స్థాయిలను బట్టి, పదవులను బట్టి – ముందు ముందు ఆయా వ్యక్తుల ఉపయోగాన్ని బట్టి (తెనాలి రాజకీయ నాయకులొకాయన తారకు ప్రియతమ ముఖ్య మంత్రి రాజశేఖర రెడ్డిగారితో ఫోటో తీయించారట.) సరసమయిన ధరలకు మనుషుల్లో జంతు ప్రవృత్తిని మచ్చికచేయడానికి అలవాటు పడింది తార. ఇంకా అలనాటి సినీతార యమున (ఒక హిట్ సినీమా 'పుట్టింటి పట్టుచీర'లో నా కూతురుగా నటించింది), సైరాబాను, భువనేశ్వరి, జ్యోతి – ఈ జాబితా అనంతం.

మర్రిచెట్టుకు మామిడికాయలు కాయవు. గంజాయివనంలో తులిసిమొక్కలు పెరగవు. తారా చౌదరులకు ఆలవాలమయిన వ్యవస్థలో – ఒక రిటైర్డ్ డీజీపీ, ఆంధ్ర ప్రాంతపు పార్లమెంటు సభ్యులు, తెలంగాణా ఎమ్మెల్యేలు, ఆంధ్రదేశపు ఆరుగురు ఎమ్మెల్యేలు, సినీ ప్రముఖులు, ఎనిమిదిమంది రాజకీయ నాయకులు, 20 మంది వ్యపారవేత్తలు – వీరందరి రాసక్రీడలు తార టేపుల్లో ఉన్నాయి. ఇదంతా 2జి కంటే అతి విలువైన, అతి ముచ్చటైన సమాచారం. 2జి కేవలం మనిషి ప్రలోభాన్ని బయటపెట్టే కథ. ఇది మనిషి నైతిక పతనానికి అద్దం పట్టే కల. కిందటి తరం నాయకులు బొత్తిగా అసమర్థులు, పిరికివాళ్ళు. వాళ్ళు ఒక ఎమ్మార్ పనిని చేసుకోవడం తెలీదు. ఒక బోఫోర్స్ వ్యవహారం చేతకాదు. ఏదీ? తెన్నేటి విశ్వనాధం, టంగుటూరి ప్రకాశం, చంద్ర రాజేశ్వర రావు, గోవింద వల్లభ్ పంత్ లకు ఇలా తారా చౌదరిని ఆశ్రయించే దమ్ముందా?

ఎంత చెట్టుకి అంతగాలి. నేటి వ్యవస్థలో విశృంఖలమైన జంతు ప్రవృత్తికి తారా చౌదరి అందమైన భూతద్దం.

**(ఏప్రిల్ 16, 2012)**



# (April 23,2012) Arachetilo Vaikuntham అరచేతిలో వైకుంఠం

నేను భారతీయుడినైనందుకూ అందునా ఆంధ్రుడి నయినందుకూ ఈ మధ్య మరీ గర్వంగా ఉంది. అంతా మన నాయకుల చలవ అని మరిచిపోలేకుండా ఉన్నాను. బ్రతుకు బంగారు బాటలో నడుస్తున్నందుకు గర్వంగా ఉంది.

మొన్నటికి మొన్న కొయ్యలగూడెంలో మన రాష్ట్ర ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు గారు –తమ పార్టీ పదవిలోకి వస్తే ఉచితంగా బియ్యం యిస్తామని శెలవిచ్చారు. అంతేకాదు. వృద్ధులకి, వితంతువులకీ 500 రూపాయిలు, వికలాంగులకయితే వెయ్యి, నిరుద్యోగులకు వెయ్యి యిస్తారు. ఇవన్నీ యిస్తూనే పెద్దయెత్తున ఉద్యోకావకాశాలు కల్పిస్తారు. నిరుద్యోగులకు వెయ్యి రూపాయిలు దక్కుతూండగా ఉద్యోగాలు ఎవరు చేస్తారు? హాయిగా ప్రభుత్వం పేరు చెప్పుకుని కాలుమీద కాలేసుకుని బ్రతకవచ్చుకదా?

మన ముఖ్యమంత్రిగారు యిప్పటికే కిలో రూపాయికి బియ్యం యిస్తున్నారు. బడుగు వర్గాల శ్రేయస్సుకి ప్రతిరోజూ యుద్ధ ప్రాతిపదికన కోట్ల రూపాయిలను మంజూరు చేస్తున్నారు. ఈ శ్రేయస్సుని తెలుసుకుని, తలచుకుని ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఆ మధ్య చిరంజీవిగారు పోటీ చేసిన రోజుల్లో ప్రతి ఇంటికీ కావలసిన పప్పు దినుసులు వగైరాలను కూడా నూరు రూపాయలకే సమకూర్చుతామని ఆయన హామీ ఇచ్చారు.

కొంచెం అటు జరిగి, తమిళనాడుకి వెళ్తే –అక్కడి నాయకులు మరొక అడుగు ముందుకు వేసి, అలనాడు అన్నగారు నడిచిన మార్గంలో కిలో రెండు రూపాయిలకే బియ్యాన్ని యిస్తున్నారు. కరుణానిధి గారు కలర్ టీవీలు యిచ్చారు. చదువుకునే వాళ్లకి సైకిళ్లు యిచ్చారు. మేడమ్ జయలలిత కాలేజీ కుర్రాళ్లకు లాప్ టాపులు యిస్తున్నారు. పెళ్లి చేసుకునే ఆడపిల్లలకు మంగళసూత్రం యిస్తున్నారు. నాయకులు ఇంత ముమ్మరంగా ప్రజాశ్రేయస్సును దృష్టిలో పెట్టుకున్న శుభతరుణం యిదేననిపిస్తుంది.

అయితే ఈ నాయకులు బొత్తిగా భార్యల్ని పట్టించుకోవడం లేదని నా ఉద్దేశం. వారు వెంటనే భార్యల్ని సంప్రదించాలి. కుటుంబాలు కేవలం బియ్యాన్ని బొక్కుతూ గడపరని వారి వారి భార్యలు చెప్పగలరు. అయితే మన రాష్ట్ర నాయకులు ఉచితంగా బియ్యాన్ని యిస్తే కేంద్ర నాయకులు వంట గ్యాసు ధరలు పెంచుతున్నారు. పోనీ, వండుకోకుండా ఉచిత బియ్యాన్ని తింటూ గడపలేరుకదా? అందుకని మన రాష్ట్ర నాయకులు – బియ్యంతోపాటు తగు మాత్రం చింతపండు, ఉప్పు, కందిపప్పు, వేరుశనగ మాంసాహారులకయితే చిన్నసైజు కోడిపెట్ట –అటూ యిటూ కాని నాలాంటి బ్రాహ్మణ పౌరులకు కోడిగుడ్లు వంటివి ఉచితంగా ఇవ్వాలని మనవి.

తమిళనాడులో కిలో రెండు రూపాయిల బియ్యాన్ని అక్కడివారు అమ్ముకోగా –లారీల్లో మేలురకం బియ్యం పొరుగు రాష్ట్రాలకు తరలిపోతూండగా పోలీసులు పట్టుకున్నారు. ఏమిటీ విపరీతం? మేలురకం ఆహారాన్ని యిస్తే అనుభవించలేం? ఇక్కడే ఉంది విచిత్రం. గుడిసెల్లో ఉండేవాడిని రాష్ట్రపతి భవనానికి పంపితే నిద్రపట్టదు. హఠాత్తుగా అతని ఆలోచనా ధోరణి, దృక్పథం,

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పొల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

జీవనసరళి మారిపోదు. మార్పు లేదా 'మేలు' ఉచితంగా యిచ్చే సౌకర్యాల వల్ల జరగదు. అవసరమైన సౌకర్యాలను అమర్చుకునే వెసులుబాటు, సామర్థ్యం, అవకాశం, విజ్ఞతా ఇవన్నీ కలిసివస్తే జరుగుతుంది. అంతకంటే దీర్ఘకాలిక ప్రాతిపదికన వారి జీవన సరళిని మార్చే పథకాలు, వాటిపట్ల వారి అవగాహన కలిసిరావాలి.

తమిళనాడు ఇచ్చిన కలర్ టీవీలు 24 గంటలు తిరగకుండా బజారులోకొచ్చాయి. సైకిళ్లు 90 శాతం హైస్కూలు కుర్రాళ్ల యిళ్లు దాటిపోయాయి. రెండు రూపాయల బియ్యాన్ని అమ్ముకుని బెల్టుషాపులకు పరిగెత్తినవారి కథలు ఎన్నో ఉన్నాయి.

సరే. మరి ఇన్ని వనరులు –యుద్ధప్రాతిపదికన రాష్ట్రం ఏర్పరుస్తూండగా 'ప్రజాపథం' కార్యక్రమంలో ప్రజలు ప్రజాప్రతినిధుల మీద విరుచుకు పడుతున్నారేం? ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పలేక, సముదాయించలేక ముఖం చాటుచేసుకుని పారిపోతున్నారేం? కారణం –నేలబారు కుటుంబానికి కావలసిన, తీరవలసిన సమస్యలు వేరే ఉన్నాయి. మంచినీరు, మురుగునీటి పారుదల, చెత్తకుప్పల నిర్మూలన –ఇవన్నీ వారి సుఖవంతమైన జీవనానికి అవసరం. వాటిని పట్టించుకునే నాథుడు లేడని వారు గొంతులు చించుకోవడం ఈ పథంలో మనం చూస్తున్నాం.

రాజనీతిజ్ఞుడు వచ్చేతరం గురించి ఆలోచిస్తారు. రాజకీయ నాయకుడు వచ్చే ఎన్నికల గురించే ఆలోచిస్తాడు. ఈనాటి పార్టీలకు వచ్చేతరం వరకు మన్నిక ఉంటుందన్న నమ్మకం లేదు. అందుకని హడావుడిగా తమ యిళ్లను చక్కబెట్టుకునే ప్రయత్నమిది. అలనాడు పండిత నెహ్రూ కన్న మూడు బంగారు కలలు –నాగార్జునసాగర్, హీరాకుడ్, భాక్రానంగల్ ప్రాజెక్టులు. ఈనాటి నాయకులు –కిలో బియ్యం, సైకిళ్లు, కలర్ టీవీలు. ఈ నాయకులు చేసే ఉపకారం తాత్కాలికంగా వారి అవసరాలను తీర్చే పనులు. ఏ భూకంపమో, వరదలో, అగ్నిప్రమాదాలో సంభవించినప్పుడు 'మాత్రమే' చేయగలిగే, చెయ్యవలసిన ఉపకారాలు. దీర్ఘకాలిక ప్రయోజనాలు మనస్సులోలేని ప్రభుత్వం కేవలం తమ వోటు కోసమే పబ్బం గడుపుకొంటోందని సామాన్య ప్రజలకీ అర్థమౌతోంది.

ఇదివరకటి కంటే కెమెరాలూ, మైకులూ నాయకుల్ని వీధిన పెడుతున్నాయని వారికి అర్థమౌతోంది. ఈ ఉపకారాలు కేవలం ఉపకారాలు కావనీ, తమ ఓట్లకి తాయిలాలని వారికి తెలుసు.

వాటి మన్నికా తెలుసు. అందుకనే ఇదివరకు నెహ్రూగారికి, పటేల్ గారికీ, టంగుటూరి వారికీ యిచ్చే గౌరవాన్ని ప్రజలు వీరికి ఇవ్వడం లేదు. ఊళ్లోకి వచ్చిన నాయకుల్ని నిలదీస్తున్నారు. చిన్న చిన్న సంఘాలు, కులాలు, వర్గాలు, పేటలూ, గూడాలు, మతాలవారు తమ అవసరాల కోసం నాయకుల్ని నిలదీస్తున్నారు. బేరాలు తేల్చుకుంటున్నారు. బుకాయిస్తున్నారు. బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. డిమాండ్ చేస్తున్నారు. హెచ్చరిస్తున్నారు. దుయ్యపడుతున్నారు. బొడ్డులో చెయ్యి వేసి తమ హక్కుగా ముక్కు పిండుతున్నారు.

కల్లుపాకకీ దేవాలయ ప్రాంగణానికీ చాలా దూరం ఉంది. ఎంత చెట్టుకి అంత గాలి.

**(ఏప్రిల్ 23, 2012)**

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (April 30, 2012) Mrutyvu Oka Meemamsa మృత్యువు ఒక మీమాంస

ఒక దయనీయమైన కథ. అత్యంత హృదయ విదారకమైనది. పొలాల్లో కూలి చేసుకునే భార్యాభర్తలకి ఒక్కడే కొడుకు. విమానయాన శాస్త్రంలో పట్టభద్రుడయాడు. ఆస్ట్రేలియాలో ఉద్యోగానికి సిద్ధపడుతూండగా ఆక్సిడెంటయింది. 15 సంవత్సరాల పాటు కేవలం అచేతనమైన స్థితిలో ఉండిపోయాడు. అయిదేళ్లు కోమాలో ఉన్నాడు. క్రమంగా తెలివొచ్చింది. కానీ మాట్లాడలేదు. కాళ్లూ చేతులూ చచ్చుబడ్డాయి. అప్పటికి కుర్రాడి వయస్సు 36 సంవత్సరాలు. ఆ దంపతులు నెలకి 500 సంపాదిస్తారు. బిడ్డని సాకలేక తండ్రి చచ్చిపోయాడు. తల్లికి 75 సంవత్సరాలు. మానవతా దృక్పథంతో కుర్రాడిని ఇంజక్షనిచ్చి అతన్ని నరకయాతన నుంచి విముక్తం చేసెయ్యమని కోర్టుకి మొరపెట్టుకుంది. తర్వాత తాను మనశ్శాంతితో పోగలనని చెప్పుకుంది. బిడ్డని సాకే స్థోమతులేదు. శక్తి చాలదు. కాని కోర్టు అందుకు అంగీకరించలేదు. ఈ తల్లి దండువారి పల్లెలో (చిత్తూరు జిల్లా) ఉంటోంది. బహుశా ఆంధ్రదేశంలో ఇలాంటి కేసు –బిడ్డ ప్రాణాలు తీయమని (మానవతా దృక్పథంతో) కోరిన కేసు ఇదేనేమో. న్యాయమూర్తి మరొకరి ప్రాణాలను ఎటువంటి పరిస్థితిలో నయినా తీసే హక్కు ఎవరికీ లేదన్నారు.

★★

ఎప్పుడో హైస్కూలులో చదువుకునే రోజుల్లో దువ్వూరి రామిరెడ్డి 'పానశాల' చదువుకున్నాం. ఉమర్ ఖయ్యాం అంటాడు:

ఇలకు రాకపోకల నాకు స్వేచ్ఛయున్న
రాకయుందును, వచ్చిన పోకయుందు
వీలుపడునేని ఈ పాడు నేలయందు
ఉనికి పట్టువు చావు లేకున్న మేలు.

పాడు జన్మ అంటూనే చావులేని అమరత్వాన్ని కోరుకుంటాడు. అతనికి జీవించడం ఒక అవకాశం. ఆనందంగా జీవించడం వ్యసనం. జీవితాన్ని జీవనయోగ్యం చేసుకోవడం అభిరుచి. మృత్యువు అతనికి అభ్యంతరం. ఆనకట్ట.

★★

భారతీయ కర్మ సిద్ధాంతాన్ని నమ్మిన వారందరికీ –మృత్యువు జీర్ణ వస్త్రాల్ని విడిచి కొత్తవాటిని ధరించే మజిలీ. మృత్యువు ఒక శరీరం నుంచి మరొక శరీరానికి బదిలీ. బహుశా భారతీయ వ్యవస్థ మనిషిని మృత్యువుకి సిద్ధపరిచినట్టు మరే ఇతర మతం ప్రయత్నించలేదేమో.

మృత్యువు మరో కొత్త పేజీని తెరవడం.

★★




చాలామందికి మృత్యువు ఆయుధం. కొందరికి ఉద్యమం. ఎక్కువమందికి అవకాశం. తెల్లారిలేస్తే తమ స్వప్రయోజనాలకు, తాము నమ్మిన సామాజిక సిద్ధాంతాలకి, తన కోపం తీరడానికి, తన పబ్బం గడవడానికి, తన మేలుని పొందడానికి –ఎంతమంది మృత్యువుని వాడుకుంటున్నారో తెల్లారి పత్రిక తెరిస్తే కోకొల్లలు. మృత్యువు చాలా మందికి సాకు. కొందరికి సామాజిక న్యాయం. కొందరికి తప్పించుకునే దొంగదారి.

★★

ప్రయత్నం లేకుండా, ఆలోచించకుండా, ఆశించకుండా, ఎదురుచూడకుండా మృత్యువు వాతని బడే ఎందరో దురదృష్టవంతుల కథలు మనం వింటూంటాం. వారి బ్రతకాలనే ఆశకీ, బ్రతకలేని నిస్సహాయతకీ పొంతన లేదు. జీవితం దుర్మార్గంగా వారిని ఆ అవకాశానికి దూరం చేస్తుంది.

మృత్యువు కొందరికి ఎదురుచూడని అతిథి. ఆశించని అనర్థం. మీదపడే దురదృష్టం.

★★

ఊహించని ఘోరమయిన నేరం చేసినవాడికి, భయంకరమైన తప్పిదం చేసినవాడికి వ్యవస్థ మరణ శిక్షని విధిస్తుంది. గాంధీ హంతకుడిని ఉరి తీసింది. వందలమందిని చంపిన అజ్మల్ కసబ్‌కి చావు సరైన శిక్ష అని నిర్ణయించింది. అది వ్యవస్థ నిర్ణయించే న్యాయం. ఎవరికయినా, ఏ కారణానికయినా మరొకరి ప్రాణం తీసే హక్కు ఎవరిచ్చారు? మృత్యువు వ్యవస్థ నీతికి చెలియలికట్ట. శిష్ట సమాజం దుర్మార్గానికి నిర్ణయించిన ఆఖరి మజిలీ.

★★

బలవంతంగా చంపినవాడిని ఉరికంబం ఎక్కించే న్యాయవ్యవస్థ –ఊహించని నేరాన్ని చేసిన నేరస్థుడిని జీవితాంతం జైలుకి పంపగలిగిన వ్యవస్థ –ఒక నిస్సహాయుడి నిరర్థక జీవితానికి ముగింపు రాయడానికి వణికిపోతుంది. అపరాధికీ, నిస్సహాయత నెత్తిన పడిన నిర్భాగ్యుడికీ మధ్య ఎక్కడో 'నీతి'కి సంబంధించిన మీమాంస చిక్కుకుని ఉంది. మానవాళి మానవత్వపు విలువల ఔన్నత్యం ఉంది. అయితే అది ఔన్నత్యమా? నిస్సహాయతా? ద్వంద్వనీతా? విచికిత్సా? ఏమో! ప్రపంచంలో ఏ న్యాయవ్యవస్థా యిప్పటికీ ఆ సాహసం చెయ్యలేకపోతోంది.

మృత్యువు కొందరి నెత్తిమీద పిడుగు
కొందరు నిస్సహాయుల మనుగడకి గొడుగు
మనకిష్టం ఉన్నా లేకపోయినా
ప్రతీ వ్యక్తీ చేసే ఆఖరి అడుగు

**(ఏప్రిల్ 30, 2012)**




# (May 07, 2012) Avyavastha అవ్యవస్థ

నిన్న ఇంగ్లీషు వార్తల ఛానల్‌లో నలుగురయిదుగురు మహిళలు -'త్వరగా విడాకులు' ఇచ్చే చట్టం గురించి చర్చిస్తున్నారు. వారందరూ స్త్రీలకు ఇంకా దక్కని స్వాతంత్ర్యం గురించీ, ఆర్థిక స్తోమతు గురించీ, భర్త ఆస్తిని పంచుకునే హక్కుని గురించీ -యిలాంటివన్నీ ఆవేశంగా, అర్థవంతంగా, అనుభవపూర్వకంగా మాట్లాడుతున్నారు. అందరూ ప్రసిద్ధులయిన మహిళలు. అందరి ఉద్దేశమూ, ఆదర్శమూ అభినందనీయం, వాంఛనీయం. కానీ వారంతా నేలవిడిచి సాము చేస్తున్నారని నాకనిపించింది. నిజానికి -చాలారంగాలలో 'ఆధునికం' పేరిట -మనం ఎన్నో సంవత్సరాల నుంచీ నేలని విడిచాం. మనకాళ్లు నేలమీద లేవు. మన కళ్లు మనకి అక్కరలేని, పొంతనలేని, బొత్తిగా పొసగని విదేశీ వ్యామోహం మీద ఉంది. ఆకర్షించే, తాత్కాలిక ప్రయోజనాలను తీర్చే, అవసరాలను తీర్చుకునే, ఆనందానికి ఆలంబనగా నిలిచే 'సాము'లు చేస్తున్నాం. వాటికి రకరకాల 'సాకు'ల పూటుల్ని సిద్ధం చేసుకుంటున్నాం.

ఈ రోజునే పేపర్లో ఒక వార్త. ముంబైలో రమేష్ షినాయ్ (30) తన భార్య ప్రీతి తన బట్టలు సరిగ్గా మడతపెట్టడం లేదనీ, వంట చెయ్యడం లేదనీ, ఇంకా ఆర్థిక కారణాలు చూపి కేవలం నాలుగు నెలల క్రితమే కోరి పెళ్లి చేసుకున్న భార్య నుండి విడాకుల్ని కోరుకుంటున్నాడు! ఈ దేశంలో 'విడాకుల' అవసరం ఒక వ్యవస్థ పతనానికి నిదర్శనం. ఇంకా ఏ కాస్తో, ఎంతో కొంత బలహీనంగా తూర్పు ఆసియా దేశాలలో ఈ వ్యవస్థ బతికి ఉంది. ఇప్పుడిప్పుడు -మనం కూడా ఆ వ్యవస్థలో పాశ్చాత్య దేశాలతో పోటీ పడుతున్నాం. నా మట్టుకు నాకే -జీవితంలో రెండుసార్లు పెళ్లి చేసుకుని విఫలమయిన 35 ఏళ్ల అమ్మాయిల్ని -ప్రసిద్ధుల్ని -కనీసం ముగ్గుర్ని తెలుసు. విడాకులు తీసుకునో, అవసరం లేకో -భర్తలకి దూరంగా ఉంటున్న స్త్రీలని కనీసం 15 మందిని తెలుసు. వారందరూ బాగా చదువుకున్నవారు. అందమయినవారు. పిల్లలు గలవారు. వయస్సులో ఉన్నవారు.

ఇప్పుడిప్పుడు మనకి తొందరగా విడాకులు తీసుకునే సౌకర్యం కూడా కలిసివచ్చింది. "ఆత్మహత్యకు దగ్గర తోవ" వంటి మెలకువ ఇది. ఎంతో ఆలోచనతో, ముందుచూపుతో, పరస్పరం సహజీవనం చేసే ఒద్దికతో -పిల్లల భవిష్యత్తునీ, విలువల్నీ, శ్రేయస్సునీ, దక్షతనీ, పెద్దల వృద్ధాప్యపు అవసరాల్నీ కాపాడే లక్ష్యంతో ఒక సమగ్రమైన ప్రణాళికగా ఏర్పడిన వివాహ వ్యవస్థ యిప్పుడిప్పుడు ఛిన్నాభిన్నమవుతోంది.

కూతురు అమెరికాలో ఇజ్రేలీ వ్యక్తిని ప్రేమిస్తుంది. తల్లి ఇండియాలో ఒంటరిగా వండుకు తింటూంటుంది. తల్లీ తండ్రీ వృద్ధాశ్రమంలో ఉంటారు. భర్త ఓ తాత్కాలిక భార్యతో కాపురం చేస్తూంటాడు. తాత్కాలికం ఎందుకు? ఇప్పటి భార్యకి ఆదాయం, వేరయిన భర్త, ఆధారపడే కొడుకూ ఉన్నారు కనుక. ఇద్దరూ 'రేపు' గురించి చర్చించుకోరు -ఇద్దరి రేపూ ఒకటి కాదు కనుక. ఎంతకాలం ఇలా? ఒకావిడని అడిగాను. నవ్వి -సాగినంతకాలం -సాగుతోంది కదా? అంది. ఆ నవ్వులో గర్వం లేదు. తృప్తి లేదు. తప్పనిసరి అయిన రాజీ వుంది. రాజీ ఎందుకని? ఏ దశలోనో తీసుకున్న నిర్ణయం పట్ల తొందరపాటా? ఇద్దరి మధ్య ఏర్పడిన పరిచయం స్నేహమయి, ప్రేమగా మారి, అనుబంధంగా స్థిరపడడానికి వ్యవధి కావాలి. ఇద్దరి అవగాహనా కావాలి. త్యాగాలు కావాలి. ఇప్పటికీ -మా ఆవిడ నామీద కేకలేస్తే -గత ఏభై ఏళ్లలో అంతకన్న ఘోరంగా కేకలేసి నా మాటని చెల్లించుకున్న వెయ్యి సందర్భాలు గుర్తు చేసుకుని నోరుమూసుకుంటాను. వెయ్యి రాజీల పెట్టుబడి, 50 ఏళ్ల వ్యవస్థ యిచ్చిన దన్ను. అవసరమా ఇది? ఎవరు నిర్ణయిస్తారు? పెళ్లయిన రెండో ఏటనే విడాకులా? పరవాలేదు. నాలుగో నెలకే విడాకులా! మీ తాతని అడగండి. మీ



అమ్మా నాన్నా గంజి తాగి అయిదు రూపాయలు పంపడం ద్వారా పట్నంలో మీ చదువుని సాగనిచ్చిన వారి త్యాగాన్ని అడగండి. అది సమష్టి కార్యం. ఎప్పుడూ విలువల్ని పరిణామాల ఫలితాలతో కాదు వ్యక్తుల పెట్టుబడితో, పరిణతితో బేరీజు వెయ్యాలి. జాతిలో సంప్రదాయ వైభవం కొరవడుతోంది. అమెరికాలో ఇఙ్రేలీ ప్రియుడు 'జన గణ మణ' పాడడు. "ఫలానా వ్యక్తి ఫలానా మహానుభావుడి తరం" అని చెప్పుకునే గర్వం పోయింది. ఈలోగా భర్తలో, ప్రియునిలో, జీవితమో 'జీన్స్'ని కలగాపులగం చేసేసింది. చేస్తే నష్టమేం? అది అభిశప్తుడి ఆఖరి వైరాగ్యం.

ఓ వ్యవస్థ నిలదొక్కుకోడానికి –అది ఏ వ్యవస్థ అయినా –అక్టోబరు విప్లవం అయినా –వ్యక్తుల త్యాగాలు కావాలి. చెట్టు పెరగాలంటే నీరు పట్టాలి. ఆ త్యాగాలు ఒకప్పుడు సంప్రదాయం, కట్టుబాట్లు, సదాచారం, కుటుంబ పరపతి, పెద్దల ఆంక్షలు –వీటిలో వేటి కారణంగానో సాగుతూ వచ్చాయి.

మా అమ్మ మారుటి తండ్రి దగ్గర నన్ను పెంచలేదు. మా పొరుగింటి అమ్మకి తన కూతురు పెళ్లి చేసుకున్న దెవర్నో తెలీదు. ఇంకాస్త ముందుకి వెళ్తే ఆ కూతురుకే తెలీదు. తెలిసేనాటికే తత్తరపాటు, విడాకులు. హఠాత్తుగా వచ్చిన ఆర్థిక స్వాతంత్ర్యం –కొంత ఆత్మస్థైర్యాన్ని, చిన్న అహంకారాన్ని, అనాదిగా వస్తున్న పురుషాధిక్యతని సజావుగానే ప్రశ్నించే నిజాయితీని –యిన్నిటిని ఇచ్చింది. పాపం. మా అమ్మకి ఇవేవీ తెలీవు. ఆవిడ ఆఖరి రోజుల్లో కొడుకుని పది రూపాయలు అడిగేది –ఎవరయిన దండం పెడితే యివ్వడానికి. ఆమె సమాజ ధర్మాన్ని పాటించి జీవనాన్ని సాగించిన నేలబారు జీవి.

అనూహ్యమయిన వెర్రితలలు వేస్తున్న –పిచ్చి పిచ్చి ఆలోచనల ప్రోగుగా తయారయిన ప్రపంచ చలన చిత్రరంగంలో –మొన్నటికి మొన్న బెర్లిన్‌లో గోల్డెన్ బేర్‌ని పుచ్చుకున్న ఉత్తమ ఇరాన్ చిత్రం (విచిత్రంగా ఆ సినిమా పేరు 'సెపరేషన్' అంటే విడాకులు!). భార్య భర్తనుంచి విడాకుల్ని కోరుకుంటుంది. భర్త అంగీకరిస్తాడు. (11 ఏళ్ల కూతురు తండ్రితో ఉండాలని కోరుకుంటుంది.) ఎందుకు? 80 ఏళ్ల రోగిష్టి తండ్రిని సాగడానికి. ప్రపంచంలో ఏ మూలనో ఇంకా కుటుంబ వ్యవస్థని పట్టుకు వేలాడే సభ్య సమాజాలున్నాయి. మనం విడాకుల్నీ వీలయినంత శీఘ్రవంతం చేసుకుంటున్నాం.

మన వివాహంలో 'స్థాళీపాకం'లో ఒక మంత్రాన్ని భర్త భార్యతో చెప్తాడు –ఆమె రెండు చేతులూ పట్టుకుని 'నాకు నీ ద్వారా పదిమంది సంతానాన్ని యివ్వు (ఎందుకు? ఈ సమాజ ధర్మాన్ని కాపాడడానికి) నేను నీకు పదకొండో సంతానాన్ని అవుతాను' అని.

వీలుంటే విడాకుల కోర్టుల్లో గోడలకి ఈ శ్లోకాన్ని అతికించండి. ఈ దేశంలో వివాహ వ్యవస్థ శరీర స్పర్శకి ముందుగానే స్త్రీలో తల్లిని చూడడం, ఆశించడం నేర్పిందని ఒకరికొకరు దూరం కావాలని కోరుకునే ఈ కాలం ముంబై మార్కు భార్యాభర్తలకి అర్థమవుతుందని.

(మే 07, 2012)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!




gollapudimaruthirao.blogspot.com gmrsivani@gmail.com

## (May 14,2012) Khareedaina 'Nijam' ఖరీదైన 'నిజం '

సత్యమేవ జయతే అన్నది పాత నానుడి. సత్యం వల్ల మాత్రమే జయం లభిస్తుంది – అంటే ఈ రోజుల్లో చాలామందికి నవ్వు వస్తుంది. అయితే 'అసత్యం'తో 18 సంవత్సరాలు స్వేచ్ఛగా ఉన్న పండిత్ సుఖ్ రాం ని చూసినా, తెల్లరేషన్ కార్డులతో మద్యం వ్యాపారం చేసే బడాబాబుల కథలు చదివినా 'సత్యం' ఎంత నిస్సహాయమయిన జడపదార్థమో అర్థమౌతుంది. మరెందుకీ నానుడి? దీనిని 'కర్మ'అని సరిపెట్టుకున్న వేదాంతులూ, 'ఖర్మ' అని తలవంచిన వాస్తవిక వాదులూ ఎందరో ఉన్నారు.

ఈ మధ్య – అంటే మొన్న ఆదివారం ఈ సత్యం మళ్ళీ వీధిన పడింది. కారణం – ఈ సత్యానికి ఈ దేశంలో బహుళ ప్రాచుర్యాన్ని సాధించిన ఓ ప్రముఖ నటుడి దన్ను లభించింది కనుక. 'సత్యమేవజయతే' అని ఎక్కడో ఢిల్లీలో ఉన్న వెంకయ్య అన్నా, మరో చంద్రయ్య అన్నా దేశం ఇంత తుళ్ళిపడదు. కానీ ఈ మాట అన్నది అమీర్ ఖాన్. ఆయన గొంతుకి ఎంత బలం ఉందంటే – సత్యానికి కాదు – ఆయన చేపట్టిన కార్యక్రమానికి ("సత్యమేవ జయతే") 6 కోట్ల అడ్వర్టయిజు మెంట్లు వచ్చాయి. వ్యాపార సంస్థలు 90 కోట్లు ఇచ్చి ఈ కార్యక్రమాన్ని స్పాన్సర్ చేశారు. ఈ కార్యక్రమం ప్రసారమవుతున్న గంటలో కేవలం దేశం నలుమూలలనుంచీ లక్షమంది ఫోన్లు చేశారు. ఇక ఈ మెయిళ్ళతో ఛానళ్ళ సమాచార స్రవంతి తెగిపోయింది. ఆరు దేశ భాషలలో ఈ కార్యక్రమం ప్రసారమయింది. దూరదర్శన్ ప్రసారం చేసింది. ఏ ఛానల్ చూసినా రాష్ట్రపతి ప్రసంగంలాగ అమీర్ ఖాన్ గొంతే వినిపించింది. ముఖమే కనిపించింది. కార్యక్రమాన్ని చూస్తున్న ప్రేక్షకుల చేతుల్లో టర్కిష్ టవల్స్ కన్నీరుతో తడిసిపోయాయి. ప్రశ్నలడుగుతూ అమీర్ ఖాన్ ఏడ్చాడు. చెపుతూ తల్లులు ఏడ్చారు. వింటున్న ప్రేక్షకులు ఏడ్చారు. గంటన్నర సేపు దేశం దుఃఖ సముద్రంలో మునిగిపోయింది.

ఈ కార్యక్రమం భ్రూణ హత్యల గురించి. శిశువు ఇంకా తల్లి కడుపులో ఉండగానే ఆడో మగో తెలుసుకుని ఆడపిల్ల అయితే కడుపులోనే గర్భస్రావం చేయించే గర్భస్రావాల గురించి. పల్లెటూరివారూ, చదువుకున్న పట్నాలవారూ, వ్యాపారంగా డాక్టర్లూ, ఆడపిల్లని కనడం లాభసాటి కాదని భావించే అత్తలూ, మామలూ, భర్తలూ – సంవత్సరాల తరబడి ఈ దేశంలో సాగిస్తున్న సామూహిక భ్రూణ హత్యల దారుణ మారణకాండ ఈ కార్యక్రమం ఇతివృత్తం. అయితే ఈ దారుణాన్ని తెలిసినవారు చాలామంది ఉన్నారు. ఆపలేకపోతున్నవారున్నారు. పుట్టిన ఆడపిల్లని పశువులాగ హింసించినవారున్నారు. ఇవన్నీ రాజకీయ నాయకులకి ఎంతో కొంత తెలుసు. అయినా ఈ అరాచకం చెల్లి పోతోంది. రహస్యంగా గర్భ స్రావం జరిపించి డబ్బు చేసుకునే వైద్యులున్నారు. ఇది నిశ్శబ్ద మారణ హోమం. స్త్రీని తల్లిగా, దేవతగా, కులదైవంగా పూజించే భారతదేశంలో జరుగుతున్న దారుణం. ఈ దారుణాన్ని ఆపుతున్నామని బోరవిరుచుకునే రాజకీయ నాయకులున్నారు. తెలివైన దుర్మార్గులున్నారు. చెయ్యలేదన్న సాక్ష్యం ఉంది.

ఒక భార్యకి భర్త – ఆడపిల్లని గర్భం దాల్చిందన్న కారణానికి ఆరుసార్లు వరసగా గర్భస్రావం చేయించాడు. మరొక భర్త పుట్టిన బిడ్డని పశువులాగా హింసించాడు. ఇందులో ఎవరిది ఎంత భాధ్యత? ఇలా జరుగుతూపోతే దేశం ఏమవుతుంది? ఆయా వర్గాల వారితో సమగ్రమయిన సత్యశోధన జరిపిన కార్యక్రమమిది.

భారతదేశాన్ని ఒక్క కుదుపు పలకరించిన వందకోట్ల వ్యాపారమిది. ఇందులో ఓ సినీనటుడి నిజమైన పరివేదన ఉంది. పరిష్కరించవలసిన సమస్య ఉంది. సామాజిక స్పృహ ఉంది. తీరా ఈ కార్యక్రమం ప్రసారమయాక – మేం చర్యలు తీసుకుంటామని కెమేరాల ముందుకొచ్చిన



రాజస్థాన్ ముఖ్యమంత్రిగారున్నారు. సత్యం తప్పక జయిస్తుందని భావించే – ఆరోగ్యకరమైన – కానీ బలహీనమయిన మూలుగు ఉంది. ఈ కార్యక్రమం ఓ గొప్ప సినీనటుడి వ్యాపారమని (సెలబ్రిటీ ఏక్టివిజం), కేవలం సానుభూతి, పాపులారిటీ ప్రసారానికి దగ్గర తోవ అని పెదవి విరిచినవారున్నారు. టీవీ కార్యక్రమాల రేటింగు పెంచుకోడానికి, డబ్బు చేసుకోడానికీ ఈ కార్యక్రమం ఉపయోగిస్తుంది తప్ప సామాజికంగా పెద్ద ప్రయోజన ఉండదనే నిరాశావాదులున్నారు. ఇది కేవలం పరపతిని పెంచుకోవడం వంటిదని భావించిన సంజయ్ ఝూ వంటి కాలమిస్టులున్నారు. నిజాయితీగా కెమెరాముందు కూర్చుని కళ్ళు ఒత్తుకున్న అమీర్ ఖాన్ ఉన్నాడు. తల్లుల కన్నీటిలో వేదన ఉంది. కార్యక్రమంలో అంతర్లీనంగా ఒక అన్యాయానికి పర్యవసానాన్ని ప్రజల ముందు పెట్టాలన్న తపన, పెట్టిన చిత్తశుద్ధి ఉంది. ఈ దేశంలో రాముడు వారధి నిర్మిస్తూండగా ఓ ఉడత నాలుగు చుక్కల నీటిని విదిలించడం – గొప్ప నీతి కథ. 'ఉడతా భక్తి ' ఈదేశంలో గొప్ప ఆదర్శానికి సామన్యుడి చేయూతకు గొప్ప ఉదాహరణ. వంద కోట్ల వ్యాపారాన్ని చెయ్యగల ఓ నటుడి చిత్తశుద్ధి సమంజసమా? ఆక్షేపణీయమా? ఇది వ్యాపారానికి దగ్గర తోవగా సరిపెట్టుకుని మరిచిపోవాలా? ఇందులో ప్రయోజనాన్ని వడగట్టాలా? ఎంతోమంది ఉద్యమకారులు పూనుకున్నా అరికట్టలేని ఒక సామాజిక దురన్యాయాన్ని – అరికట్టడానికి ప్రజాభిప్రాయాన్నో (అన్నా హజారేలాగ), అరికట్టడానికి రాజకీయ నాయకుల్ని ఉద్యుక్తపరచలేని నేపథ్యంలో ఓ ప్రముఖ నటుడి వ్యాపారాన్ని సాధించే సామాజిక చైతన్యం ఏ విధంగా, ఏ మేరకు సమంజసం? ఏ మేరకు ఉపయోగకరం? ఏ మేరకు వాంఛనీయం? ఇది కార్యక్రమాన్ని అమ్ముకునే వ్యాపారస్థుల గడుసుదనానికి నిదర్శనమా? సామాజిక స్పృహతో దేశానికి ఏదో సేవచేయాలని తహ తహ లాడే ఓ నటుడి ఆరోగ్యకరమైన ఆదర్శానికి మాత్రమే నిదర్శనమా?

ఇన్ని లక్షల మందిలో కలిగిన 'స్పందన ' కార్యక్రమాన్ని మాత్రమే దీవించి, వ్యాపారస్థుల జేబులు నింపి మరుగున పడిపోతుందా? చర్మ మందంగా ఉన్న వ్యవస్థనాయకులు, మంత్రులు – ఈ కార్యక్రమం గ్లామర్ ని వాడుకుని యధాప్రకారంగా సమస్యని ఓ అటకెక్కించేస్తారా? 1930 లో ఉప్పు సత్యాగ్రహానికి మహాత్మాగాంధీ సబర్మతీ ఆశ్రమం నుంచి 25 రోజులపాటు 322 కిలోమీటర్లు దండీ వరకూ లక్షలాదిమందితో నడిచాడు. అది చరిత్ర. ఈ అవకాశాన్ని తీసుకుని 322 మైళ్ళూ జంగిడీ పట్టుకుని ఉప్పు శనగలు అమ్ముకున్న ఓ వ్యాపారస్థుడి వ్యాపారదక్షత కారణంగా వందలు సంపాదించి దాన్ని వేలూ లక్షలూ చేసుకున్న ఆరో తరం ఇప్పుడు సంపన్నంగా బతుకుతూ ఉండవచ్చు. కానీ చరిత్ర దండీయాత్రది. సంపన్నుడి అవకాశానిది కాదు. (ఇది కేవలం ఉదాహరణ)

రామాయణంలో ఉడతది – ఎంత చిన్నదయినా గుర్తుంచుకునే పాత్ర. మనం ఇప్పుడు ఉప్పు సత్యాగ్రహమనే చరిత్రకి జేజేలు చెప్తామా? ఉప్పు శనగల వ్యాపారస్థుడి వ్యాపార దక్షతకి తప్పు పడతామా? అన్యాయంగా లక్షలాది ఆడపిల్లలు తల్లుల కడుపుల్లోనే దారుణంగాబలి అయిపోతున్నారు. చర్యలు తీసుకోవలసిన నాయకులు నిద్రపోతున్నారు. సజావుగా, నివారణోపాయాల్ని చేపట్టవలసిన రాజకీయ నాయకుల అలసత్వం కంటే, సమాజంలో ఓ స్పందనని కల్పించాలనే యావతో ఓ నటుడు పూనుకున్న ప్రయత్నం – కేవలం 'ఉడత' స్థాయిలోనిదే అయినా – కేవలం ఉప్పు శనగల వ్యాపారం కారణంగా రాళ్ళు వేయడం సమంజసం కాదేమోనని నాకనిపిస్తుంది.

నూరుకోట్ల వ్యాపారం మన ఏ.రాజాగారు బొక్కిన డబ్బుకంటే ఎక్కువకాదు. ఒక సాయంకాలం దేశాన్నంతటినీ పలకరించే స్పృహని కల్పించిన ఓ నటుడి చిత్తశుద్ధి ఏ ఆరోగ్యకరమైన పరిణామాలకు దారితీయగలదో వేచి చూడాలి. తీయకపోయినా ఒక అరాచకానికి ఒక సాయంకాలం దేశమంతటా కల్పించిన స్పందన విలువ నూరుకోట్లని సరిపెట్టుకుందామా?

**(మే 14,2012)**




# May 21, 2012) Seetha Ane Buthu 'సీత' అనే బూతు

దాదాపు 30 ఏళ్ళ కిందట 'ఆరాధన' అనే సినీమాకి మాటలు రాశాను. (మహ్మద్ రఫీ పాట పాడిన సినీమా అంటే చాలా మందికి జ్ఞాపకం వస్తుంది – నా మది నిన్ను పిలిచింది గానమై) ఎన్.టి.రామారావు పశువుల కాపరి. వాణిశ్రీ సంపన్నురాలయిన నర్తకి. పట్నం తీసుకు వస్తుంది అతన్ని. గోపీ మూగవాడయాడు. ఓ దశలో రహస్యంగా తన ఊరికి వెళ్ళిపోబోతాడు. వాణిశ్రీ అడ్డుపడి "నన్ను వదిలిపోతావా గోపీ?" అంటుంది. ఈ ఆస్తీ అంతస్తుకి నేను సరితూగను – అని సూచిస్తాడు. వాణిశ్రీ అడవుల్లో తిరుగుతున్న సీతారాముల బొమ్మదగ్గరికి తీసుకు వెళుతుంది. "ఈ దంపతుల్ని చూశావా గోపి. రాముడు తండ్రి మాటకోసం అడవులకు వెళ్ళాడు. కానీ సీత భర్త నీడకోసం అడవులకు వెళ్ళింది" అంటుంది. ఇది ముప్పై ఏళ్ళ కిందటి ఊకదంపుడు ఇప్పటివాళ్ళకి. అప్పుడు ప్రజలు చూశారు. సినీమా పెద్ద హిట్.

నేటి కథ. ఓ భార్యాభర్తలు బొంబాయిలో కాపురం చేస్తున్నారు. వారికో కొడుకు. భర్తకి అండమాన్స్ బదిలీ అయ్యింది. నేను రానంది భార్య. రాకపోతే ఎలాగ? అన్నాడు భర్త. విడాకులు కావాలని కోర్టులో కేసు పెట్టింది భార్య. పాపం, ఆ జడ్జిగారు 30 ఏళ్ళ కిందటి ఆలోచనలున్న 'పాత'బడిన మనిషి. "అమ్మా, ఈ దేశంలో భార్య సీతలాగ భర్తని అనుసరించాలి కదమ్మా" అన్నాడట. అంతే. మిన్ను విరిగి మీద పడింది. ఆడదాన్ని – అందునా ఆధునిక మహిళని – ఆ పాతచింతకాయ పచ్చడి సీతలాగ భర్త వెనుక నడవమంటారా? అని ఎదురు తిరిగారు. ఓ ఇంగ్లీష్ ఛానల్ ఆ జడ్జీగారిని తప్పుపడుతూ ఓ చర్చను జరిపింది. అందరూ – బాబూ! ఈ రోజుల్లో ఎవరూ మొగుళ్ళ వెనుక నడవడానికి సిద్ధంగా లేరు. ఈ జడ్జిగారెవరో బొత్తిగా 'ముసలి' ఆలోచనతో ఉన్నారు – అని వాపోయారు.

మనం గొప్ప వ్యక్తిత్వాన్ని చెప్పడానికి రాముడిని ఉదహరిస్తాం. రాముడు మర్యాద పురుషుడనీ, సద్గుణ సంపన్నుడనీ – దాదాపు 300 తెలుగు రామాయణాలు, మధ్యధరా సంస్కృతికి తూర్పున ఉన్న 30 దేశాల సమాజ సంస్కృతి చెపుతుంది. 2012 లో ఎవరయినా ఎదురు తిరిగి "హాత్తెరీ! నన్ను సగం బట్టలు కట్టుకుని లేళ్ళని వేటాడుతూ తిరగమంటావా?" అంటేనో, "ఎవడో నా పెళ్ళాన్ని ఎత్తుకుపోతే కోతుల్ని వెంటబెట్టుకుని యుద్ధం చెయ్యమంటావా? ఆ మాత్రం పెళ్ళాం దొరక్కపోతుందా?" అంటేనో మనం మొహం ఎక్కడ పెట్టుకోవాలి? ఈ మధ్య హిట్టయిన తెలుగు సినీమాలో ఓ మహానుభావుడైన కవి పాట రాశాడట. "నాకు రాముడులాంటి మొగుడొద్దు బాబూ – ఆడుతూ పాడుతూ అమ్మాయిల వెంట తిరిగే నీలాంటి మొగుడే కావాలి" అంటూ సగం బట్టలిప్పుకుని గెంతుతుందట. శుభం. ఆవిడకి సీత కష్టాలు లేవు. దిక్కుమాలిన రామాయణం లేదు. కానీ తన స్వేచ్ఛనో, వెసులు బాటునో కోరుకోడానికి మొన్న వ్యభిచారం కేసులో 'తార ' కాక 'సీత ' ఎందుకు కావలసివచ్చింది ఈ మహానుభావుడికి? వ్యక్తిత్వంలో ఇంకా ఈ సమాజానికి రాముడు 'ఆదర్శం ' అన్న విషయాన్ని ఈ మహా రచయిత మరిచిపోలేదు. భారతీయ సమాజంలో కొన్ని ఎల్లల్ని చెరిపేయడానికైనా కొన్ని గుర్తులు కావాలి. అవే రామాయణం, రాముడు, సీత.

మనకి తెలివితేటలు పెరిగాయి. స్వేచ్ఛ పెరిగింది. అడ్డమయిన ఆలోచనల్నీ పంచే ఛానల్స్ విచ్చలవిడితనం పెరిగింది. ఏదయినా సభలో చెప్తే సవరించడానికో, వివరించడానికో ఎవరో దొరికేవారు. ఆలోచనల్ని విశృంఖలత్వంగా భావించే 'ఆధునికత' పైత్యం ముదిరింది. ఇంగ్లీషు ఛానల్ నిర్వహించే బర్ఖా దత్ కి గిల్లి రెచ్చగొట్టే 'అమ్ముడు పోయే' చర్చకావాలి. అందులో నోరు పారేసుకునే 'కుహనా' మేధావులు కావాలి. పాపం, ఆ జడ్జి గారెవరో – ఈ అభ్యుదయ ఆదర్శవాదుల నోళ్ళలో బలి అయిపోయాడు.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

"నా మొగుడు అండమాన్ వెళ్తే నేనెందుకు వెళ్ళాలి? కొడుకు ఉంటే ఉండొచ్చుగాక – మరో మొగుడిని వెదుక్కుంటాను" అంటూ స్వేచ్ఛని ఆశించే అపర సీతల కాలం 2012లోనే అర్జంటుగా వచ్చేసిందని ఆ జడ్జిగారికి తెలీదు.

రాముడు తండ్రి మాటని గౌరవించి పన్నెండేళ్ళు అడవులకి వెళ్ళే తెలివితక్కువ కథానాయకుల కథ అమెరికాకి వలస వెళ్ళి వృద్ధాశ్రమాలలో తండ్రుల్ని మరిచిపోయే నేటి తరం కుర్రాళ్ళకి విపరీతంగా ఉంటుంది. ఆ రోజుల్లో మా నాన్న ఓ పంజాబీ అమ్మాయిని తగులుకుని తాగి మాటిచ్చాడు. నేనెందుకు ఆస్తిని వదులుకోవాలి అంటూ తండ్రులను వెళ్ళగొట్టే రాంరావ్ ల కాలమిది.

రామాయణాన్ని ఈ తరం క్షమించాలి. నేడు అండమాన్ వెళ్ళని, విడాకులు కోరే భార్యకి 'సీత' పురుషాధిక్యతకి బానిస. మరిదిని తగులుకుని మొగుళ్ళని చంపే మోడ్రన్ సీతలకి 'రామాయణం' విషవృక్షం.

ఈ మధ్య క్లాస్ రూముల్లో జొరబడి – 60ఏళ్ళ కిందటి కార్టూన్లకి కొత్త అర్థాల్ని, అభ్యంతరాల్నీ వెదుకుతున్నారు – ఈనాటి తెలివైన అభ్యుదయ నాయకులు. దేశంలో తెలివితేటలు ముదిరాయి. ఎప్పుడో – రామాయణాన్ని ఉతికి ఆరెయ్యాలని ఓ మళయాళం టీవీ ప్రోగ్రాంలో ఓ దృశ్యాన్ని చూసిన గుర్తు. ఉతికినా ఉపయోగపడని స్థాయిలో రామాయణం ఇప్పుడు చిదికిపోయింది. చివికిపోయింది. రామాయణం ఓ సంస్కృతికి ప్రతీక. కొన్ని ఆదర్శాలకు ఆవలిగట్టు. దేవుడూ, దేవతల్ని పక్కన పెడితే – ఓ ఆదర్శానికి సంకేతం. 'సీత'లాగ ఉండాలంటే నార చీరెలు కట్టుకుని, అడవులు పట్టుకు తిరగాలని కాదు. ఆదర్శం ఆవలిగట్టు ఆ పాత్ర. అదొక ప్రతీక. ఆదర్శవంతమయిన మానవ జీవితానికి ప్రతినిధి – రాముడి పాత్ర. ప్రతీకాత్మక మయిన ఆదర్శం – తనని అనుసరించమనదు. అనువదించుకోమంటుంది. అన్వయించుకోమంటుంది. చేసినట్టు చెయ్యమనదు. చేసిన కారణాన్ని గ్రహించమంటుంది ఇక్కడ ఆదర్శం అంటే అద్దం కాదు. చూసే దృష్టి. ఈ ఆదర్శం అక్కరలేకపోతే – జడ్జీల్ని క్షమించండి. మరో మొగుడిని తెచ్చుకుని సుఖంగా బతకండి. రామాయణంలోనూ అలాంటి పాత్రలున్నాయి. అండమాన్ వెళ్ళడానికి ఇష్టం లేని భార్యకి 'సీత' ఉదాహరణ రుచించని ఈ సమాజం – ఈ 'కుహనా' మేధావుల పుణ్యమా అని రామాయణాన్ని బహిష్కరిస్తుందనడంలో నాకెటువంటి అపనమ్మకం లేదు. తులసీదాసు, మొల్ల, విశ్వనాథ – అచిరకాలంలో అటకెక్కిపోతారు. అప్పటికి నాలాంటి 'భయపడే ' నిన్నటి తరం ఉండదు. అది మా అదృష్టం.

(మే 21,2012)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (May 28, 2012) Gorredatu గొర్రెదాటు

చాలా సంవత్సరాల క్రితం అమెరికాలో ప్రదర్శనలకు వెళ్లినప్పుడు నా నాటిక "దొంగగారొస్తున్నారు స్వాగతం చెప్పండి" ప్రదర్శించాం. అందులో తాగుబోతు మేనమామ జే.వీ. సోమయాజులు లాయరు. మేనకోడలు తులసి. నెక్లెసు దొంగతనం జరిగింది. పడకగదిలోనే దొంగ పట్టుబడ్డాడు. "తలుపు వేసియున్న కారణాన మీకు సహాయం చెయ్యాలన్న ఆతృతతో ఫలానా పెద్దమనిషి కిటికీలోంచి దూకి నీ వస్తువు మీకు ఇచ్చిపోదామని వచ్చివుండొచ్చుకదా?" అంటాడు మత్తులో ఉన్న లాయరుగారు. దొంగకీ పెద్దమనిషికీ ఉన్న వ్యత్యాసాన్ని ఇంత ఉదారంగా విశ్లేషిస్తాడు. ఈ మధ్య తిరణాల లాగ -కేంద్ర మంత్రులూ (ఎ.రాజా), పార్లమెంటు సభ్యులూ (సురేష్ కల్మాడీ, కనిమొళి), ముఖ్యమంత్రులూ (మధుకోడా, యెద్యూరప్ప, రాష్ట్ర మంత్రులు (మోపిదేవి), ఇక ఐయ్యేయస్‌లు సరేసరి (శ్రీలక్ష్మి , ఆచార్య, వి.డి.రాజగోపాల్, ప్రదీప్‌శుక్లా, గుజరాత్, అరవింద్ జోషీ టినూ జోషీ -యిలా) జైళ్లకు వెళ్లి వస్తున్నారు. అభియోగాలున్నవారూ, ఇంకా వెళ్లవలసినవారూ చాలామంది ఉన్నారని మనం వింటున్నాం. నేర పరిశోధక సంస్థ పరిశోధన జరిపి వారు నేరాలు చేశారని సాక్ష్యాలు చూపాక, న్యాయస్థానం అవి నేరాలేనని నిర్ధారణ చేసుకున్నాక అరెస్టులకు ఆమోదించాక కూడా వారు విచిత్రమైన వాదనలను వినిపిస్తున్నారు.

"నేను చేసినా పని ప్రధానికి ముందే చెప్పేశాను" అని ఒకాయన అంటారు. అంటే ప్రధానికి చెప్పడం వల్ల అవినీతి నీతి అవుతుందా? లేక ఈ అవినీతిలో ప్రధానికి వాటా ఉందని తాత్పర్యమా? ఈ మంత్రిగారు దాదాపు పది నెలలు జైల్లో ఉండి వచ్చారు. నిరపరాధిగా కాదు, బెయిల్‌మీద. ఓ ఐయ్యేయస్ ఆఫీసరు నేను రాకముందే జీవోలు తయారయాయి. మంత్రిగారు సంతకాలు పెట్టమన్నారు. నేను కేవలం సంతకాలు మాత్రమే పెట్టాను -అని వాక్రుచ్చారు. మంత్రిగారు సంతకాలు పెట్టమంటే, పెట్టమన్న చోట సంతకాలు చెయ్యడానికి ఐయ్యేయస్‌లే అక్కరలేదు. ఇంటి నౌఖర్లు చాలు. (అయితే అలాంటి తెల్లరేషన్ కార్డుదారుల భాగోతాలూ ప్రస్తుతం మనం వింటున్నాం) ఈ దేశం గర్వించే పాలక వ్యవస్థకు దన్నుగా నిలిచి -రక్షణ, దక్షత కల్పించే ఉద్యోగ శ్రేణిగా రూపుదిద్దుకున్న సివిల్ సర్వీస్ ఆఖరికి ఈ దశకి వచ్చింది. ప్రపంచంలో ఏ దేశంలోనూ, ఏ ఉద్యోగానికీ యింత రక్షణ కల్పించిన దాఖలాలు లేవు. నిజానికి ప్రజాస్వామిక వ్యవస్థలో ప్రజాప్రతినిధులుగా ఎన్నికయిన నాయకులకు సజావయిన పాలక యంత్రాంగపు మద్దతునిచ్చే 'పెద్దరికం' సివిల్ సర్వీసులది. వారి కుతంత్రాలకు తాళం వేసే భజనపరులు కాదు.

ఈ దేశంలో అవకాశ వాదం నీతిని గొయ్యి తీసి కప్పెట్టింది. ఒక లాల్ బహదూర్ శాస్త్రికీ, ఒక వావిలాలకూ, ఒక టంగుటూరికీ అర్థంకాని వ్యవస్థ ఇది. మంత్రిగారు చెప్పినట్టు సంతకాలు చేసి తలవొంచుకు జైళ్లలోకి పోయే ఈనాటి ఆఫీసర్లు -అలనాటి జె.పి.ఎల్.గ్విన్, హెచ్.వి.ఆర్. అయ్యంగార్, వి.కె.రావు (యిప్పటికీ తొంభైయ్యవ పడిలో ఉన్నారు) -వంటి వారిని చూసిన ఈ తరానికి షాక్, బాధ కలుగుతుంది. అయితే అప్పటి నాయకుల శ్రేణులకీ ఇప్పటికీ పోలిక లేదు. ఇప్పటివారంతా సామ్యం తెస్తే మరుగుజ్జులు. న్యాయంగా ఇది అందరి గురించే అనాల్సిన మాటకాదు. ఉన్న ఆ కాస్త నీతిపరులూ తాటిచెట్టుకింద పాలు తాగుతున్నారు. అదే దురదృష్టం. ఇక మంత్రులు. "మా నాయకుడు చెప్పారు కనుక చేశాం" అనడం విడ్డూరంగా ఉంటుంది. అది అవినీతి పని అని తెలిసే చేశారా? అప్పుడు తమకూ ఆ కార్యక్రమంలో వాటా ఉందికదా? సమిష్టి బాధ్యత ఏమయింది? తెలియక చేశారా? అప్పుడు నాయకుల ప్రసక్తి ఎందుకు? మీరే బాధ్యులు కదా? ఒక కుంభకోణంలో మేనేజింగ్ డైరెక్టరూ, ఒప్పందాల మీద సంతకం చేసినవారూ అంతా జైళ్లలో ఉండాల్సిన నేరస్థులుగా కోర్టు నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ప్రభుత్వం

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

తరఫున సంతకాలు చేసిన నాయకత్వం నిర్దోషి ఎలా అవుతుంది? చేస్తున్న పని సబబో కాదో నిర్ణయించుకునే విచక్షణ లేని స్థాయిలో బాధ్యతల్ని చేపట్టారా? నిర్ణయించగలిగితే పర్యవసానంలో కుంభకోణంలో వారికీ వాటా ఉన్నట్టే కదా? సుప్రీం కోర్టు కూడా ఎత్తిచూపిన లొసుగులున్న నాయకులు –తమ 'పెద్దల' గొడుగుకింద సాకుల్ని వెదకడం విడ్డూరం. ఈ సంవత్సరం మార్చి 21 ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.కె.భాషిన్ ఒక తీర్పు నిచ్చారు. (చూ.హిందూ.22.3.2012. పేజీ 4) ఇది ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లకీ, మేనేజింగ్ డైరెక్టర్లకీ, రాష్ట్రపతులకీ, ప్రధానులకీ, ముఖ్యమంత్రులకీ, నాయకులకీ వర్తిస్తుందని చెప్పిమరీ ఈ వార్తని పత్రిక ఉటంకించింది.

తమరు చాలా బిజీగా ఉండి తమ హయాంలో వున్న పరిపాలనలో అవకతవకలూ, అక్రమాలను తెలుసుకోలేకపోతే అది సమర్ధన కానేరదు. నాకు తెలియదని తప్పించుకునే వీలులేదు. నన్ను విడిచి పెట్టండి కాని నాకిందనున్న వాళ్లందరినీ ఉరితీయండి అనే ధోరణిని న్యాయమూర్తి విమర్శించారు. ఇవీ న్యాయమూర్తి మాటలు: ఒక నౌక కెప్టెన్‌గా తన హయాంలో అవినీతి జరిగినప్పుడు –ఒంటరిగా బోటు తీసుకుని నౌకలోంచి గెంతి పారిపోవడం తగదు. కెప్టెన్‌గా అతనూ నౌకలో ప్రయాణం చెయ్యాల్సిందే. లేదా సిబ్బంది అందరితోనూ కలిసి మునిగిపోవాలి". మన రాష్ట్రంలోనే కాదు, మన దేశంలోనే కాదు, ప్రపంచంలో నేటి 'నిజాయితీ' రూపు రేఖలు తలచుకుంటేనే ఆశ్చర్యం కలుగుతుంది. మొన్న మొన్నటిదాకా ఒసామా బిన్ లాడెన్ ఎక్కుడున్నారో తెలియదంటూ చెప్పింది పాకిస్తాన్. (ఇప్పటికీ మహమ్మద్ ఇబ్రహీం, టైగర్ మెమూన్ ఎక్కడున్నారో తెలీదు –అంటోంది). తీరా అమెరికా– పాకిస్తాన్ సైనిక స్థావరాలకు పక్కనే ఉంటూ, పెళ్లానికి మూడు పురుళ్లు పోయించిన బిన్ లాడెన్‌ని చంపాక– ఈ విషయాన్ని అమెరికాకు తెలిసేటట్టు చేసిన షకీల్ అఫ్రిదీకి 33 ఏళ్లు కఠిన శిక్షని విధించింది.

తమకి తెలిసింది అమెరికాకు తెలియజేసినందుకా? ప్రస్తుతం రుజువులు కళ్లముందు కనిపిస్తూండగా నిరపరాధులమనే మన నాయకుల నేరాలు రుజువు కావడానికి మరెవరో పూనుకోవాలి. అప్పుడు పాకిస్తాన్ సంప్రదాయంలో రుజువులు చూపించినవారిని జైళ్లకి పంపించే గుండె ధైర్యాన్ని కూడదీసుకుంటామేమో. అవినీతిపరుడికి ఆత్మవంచన వెన్నతో పెట్టిన విద్య. తమ ముందున్న రుజువులతో నేరం జరిగిందని నమ్మి ప్రతిరోజూ జైళ్లకు పంపించే ఆఫీసర్లు, నాయకులూ తాము నిర్దోషులమని –ఆ మంత్రులో, తమ నాయకులో, ఆనాటి ముఖ్యమంత్రో, ప్రధానో, ఆర్థిక మంత్రో మరెవరో మరెవరో చెప్పగా చేశామని, చెప్పి చేశామని, చేసి చెప్పామని, తెలిసేటట్టు చేశామని అనడం ఆశ్చర్యంగానూ, ఆత్మవంచనగానూ ఉంటుంది. నేరం అభియోగానికీ, రుజువు కావడానికీ కనీసం 18 సంవత్సరాలుంటుంది దురదృష్టవశాత్తూ ఈ దేశంలో. ఉదాహరణ: పండిత్ సుఖ్‌రాం. ఈ 18 సంవత్సరాలూ ఆయా ఆఫీసర్ల, నాయకుల బుకాయింపుల్ని భరిస్తూ –పదే పదే వారిని ఎన్నుకునే గొర్రెదాటు వ్యవస్థ పేరు – ప్రజాస్వామ్యం.

(మే 28,2012)




# (June 04, 2012) Telugu Burada, తెలుగు బురద

తెలుగు అధికార భాష అయిన రోజులివి. మన నాయకులు తెలుగుని అందలం ఎక్కిస్తున్న రోజులివి. కాకపోతే ఇందులో చిన్న తిరకాసు ఉంది. చాలామంది నాయకులకే సరైన తెలుగు రాదు. అందువల్ల వారు అప్పుడప్పుడు పప్పులో కాలు వేయడం, తప్పులో కాలు వేయడం జరుగుతూంటుంది.

కిరణ్ కుమార్ రెడ్డిగారితో నాకేమీ తగాదా లేదు. ఆయన ఆలోచనలు ఆరోగ్యకరమైనవే. కానీ చెప్పే ధోరణిలో ఇబ్బంది ఉంది. దానిని ప్రతిపక్షాలూ, ఎన్నికల ప్రధానాధికారి భన్వర్‌లాల్ గారూ అపార్థం చేసుకుంటున్నారని నా ఉద్దేశం. కిరణ్‌కుమార్ రెడ్డిగారు వెంటనే నన్ను ఆయన తరఫు తెలుగు లాయరుగా నియమించుకోవాలని సూచిస్తున్నాను.

మన నాయకులు –తెలుగును వారి వారి ప్రాంతీయ భాషలలో గుప్పిస్తారు. 'చెయ్యటాకి', 'చేస్తేగినా', 'సేత్తారంటూ', 'చెప్పిందు', 'చేయించినారంటేనే', 'ఇంగ, గిట్ల జేస్తే, చెప్పరబ్బ మీరు', ఏం చెప్పినావ్', 'ఏమి అట్లంటవ్' –యివన్నీ తెలుగు ప్రాంతీయ భాష సౌందర్యాలు. ఇక భాష సరిగా రానివారు అర్థం లేని, అక్కరలేని ఊతపదాలను వాడడం మనం వింటూంటాం. 'ఇక అసలు విషయానికొస్తే', 'అదేవిధంగా', 'నేను మనవి చేస్తున్నాను', 'ఇక ప్రధానంగా', 'మరి ఇప్పుడు పెట్రోలు గురించి చెప్పాలంటే', –ఇలా సాగుతాయి. మధ్య మధ్య 'సమాజ సేవ', 'నీతివంతమైన పాలన', 'దేశానికి అంకితం', 'సమాజ కళ్యాణం' వంటి బూతు మాటలు వినిపిస్తూంటాయి.

కిరణ్‌కుమార్ రెడ్డిగారు చిత్తూరు మండలం భాషని విరివిగా వాడతారు. వారు తెలుగు స్కూల్లో చదువుకోలేదేమో నాకు తెలీదు. ఆయన సహృదయతతో సమాజ శ్రేయస్సుని దృష్టిలో పెట్టుకునే ప్రతి వోటరూ పదివోట్లు వేయాలని అన్నారు. ఆయన ఉద్దేశాన్ని అర్థం చేసుకోకుండా కోడి గుడ్డుమీద వెంట్రుకలు ఏరుతున్న పనిగా నేను భావిస్తాను. ఏ ముఖ్యమంత్రీ, ఏ బహిరంగ సభలోనూ, ఏ వోటరునీ –అయ్యా, మీరెలాగయినా ఒక్కొక్కరూ పదేసి వోట్లు గుద్దెయ్యమని చెప్పరు. కిరణ్ కుమార్ రెడ్డి అస్సలు చెప్పరు –ఆయన ఏనాడూ మంత్రి కాలేదు కనుక. ఒక్కొక్కరూ కనీసం పదిమందిచేత వోటు వేయించాలని వారి తాత్పర్యం.

మన నాయకుల సమస్యలు –ప్రధానంగా తెలుగు సమస్యలు. 'అధికార' తెలుగుని కాస్సేపు పక్కనపెట్టి వీరందరికీ 'అర్థమయే' తెలుగు మాట్లాడే క్లాసులు నడపాలని నా మనవి.

రాయలసీమ కవి తిక్కన "అన్నా ఫల్గుణ" అని ధర్మరాజు తన తమ్ముడు అర్జునుని పిలిస్తే దాన్ని తప్పుగా భావించేవారుంటారు. కానీ ఆ ప్రాంతంలో 'అన్న' అనే పిలుపు ఏకోదరుడి వరుసకాదని, కేవలం గౌరవ వాచకమని తెలియజెప్పాలి. అలాగే నెల్లూరు నాయకులు 'దొబ్బ' మంటే బాధపడేవారుండవచ్చు. కానీ ఆ మాటకు గ్రంథసమ్మతం ఉన్నదని నచ్చజెప్పాలి.

భాష భావాన్ని అందించే సాధనం. అపార్థాన్ని సంధించే ఆయుధంగా –ఉద్దేశం వల్లకాక, ఉద్ధతి లోపం వల్ల జరుగుతోందని మనం అర్థం చేసుకోవాలి. ఎవరి భాషలో వారు రచనలు చేసుకుని, ఎవరి సినీమాలు వారు తీసుకుని, ఎవరి ధోరణిలో వారు తిట్టుకుని తిమ్మకుని, ఎవరి




భుజాలు వారు చరుచుకుంటే ఎవరికీ గొడవలేదు. ఇష్టమున్నవారు చదువుతారు, కష్టమున్నవారు చదవరు. చూడరు. వినరు. కానీ శ్రీకాకుళం నాయకులు ప్రజలకు చేసిన వాగ్దానం అదిలాబాద్ పౌరునికి అందాలంటే –ఏదో మధ్యేమార్గం ఉండాలి. ముఖ్యమంత్రిగారి ఉద్దేశం భన్వర్‌లాల్ గారికి 'అభ్యంతరంగా' పరిణమిస్తే ఆ నేరం వారు సరిగ్గా చెప్పలేని 'తెలుగు'ది కాని –నాయకులది కాదని నా నమ్మకం.

అందువల్ల ఎన్నికలలో పోటీ చేసే నాయకులకు –ఆస్తి ఎంతవుంది? రెండో పెళ్లాం ఉన్నదా? ఎప్పుడయినా జైలుకి వెళ్లారా? ఎవరి పీకయినా కోశారా? –యిలాంటి ప్రశ్నలకు సమాధానాలు వెదకడంతోపాటు –అందరికీ అర్థమయే, ఎవరికీ అభ్యంతరం లేని తెలుగు ఎంతవరకూ వచ్చునో తెలుసుకోవడం కూడా అవసరం. అలాగే ఎన్నికల కమిషన్ –రాబోయే ఎన్నికలలో పోటీచేసే నాయకులకు తెలుగులో క్రాష్ కోర్స్ నడపాలని నా ఉద్దేశం. అయితే ఆ కోర్సులు ఎవరు నిర్వహిస్తారు? ఇది పెద్ద సమస్య అయే ప్రమాదం ఉంది కనుక ముందు జాగ్రత్తగా –ఇద్దరు వెనుకబడిన పెద్దలు, ఒక ముందుపడిన పెద్ద, మరొక మహిళా పెద్ద, మరొక అంగవైకల్యం గల పెద్ద, మరొక తెలుగు వచ్చిన పరాయి భాష పెద్ద, మరొక వెనుకబడినవారిలో ముందు పడిన పెద్ద, ఒక గిరిజన పెద్ద, ఒక క్రిస్టియన్, ఒక ముస్లిం, ఒక హిందీ పెద్ద –ఉండాలని ప్రతిపాదిస్తున్నాను.

(జూన్ 04,2012)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

## (June 11, 2012) Maakoddi Nalla Doratanam మాకొద్దీ నల్లదొరతనమూ...

విమానయాన శాఖ మంత్రి అజిత్ సింగ్ గారు ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణాలు చేసేవారందరినీ పార్లమెంటు మెంబర్లుగా గౌరవించాలని యాజమాన్యానికి విన్నవించారు. ఇది చాలా అన్యాయమని నా మనవి. బెర్నార్డ్ షా "ఆండ్రోక్లిస్ అండ్ లైన్" నాటకంలో ననుకుంటాను. ఒకాయన పక్కవాడిని 'కుక్కా' అని తిడతాడు. వెంటనడుస్తున్న అతని కుక్క అభ్యంతరం తెలుపుతుంది. "స్వామీ! ఇది అన్యాయం. నేనేం తప్పు చేశాను?" అని. కుక్కకీ మనిషికీ ఉన్న తేడాని చక్కగా విశ్లేషించిన ఒకే ఒక్క రచయిత మార్క్‌ట్వేన్. "ఆకలి వేస్తున్న కుక్కకి అన్నం పెడితే అది నిన్ను కరవదు. కుక్కకీ మనిషికీ ఉన్న తేడా యిదే" అన్నాడు. వెనకటికి –నేను పత్రికలో పనిచేస్తున్న రోజులలో జి.కృష్ణగారు మాకు చిత్తూరులో ఎడిషన్ ఎడిటరు. ఓ కుర్రాడు నౌఖరు ఉద్యోగానికి వచ్చాడు. "ఏం చదువుకున్నావు?" అని అడిగారు కృష్ణగారు. కుర్రాడు గర్వంగా "ఎస్సెల్సీ –పాసయానండి" అన్నాడు. "పాసయావు కనకే ప్యూన్ ఉద్యోగానికి వచ్చావు. ఫెయిలయితే మా ఎడిటర్ అయే వాడివి" అన్నారు. ఆయనకీ ఎడిటర్‌గారికీ ఆ రోజుల్లో చుక్కెదురు. ఏమయినా సొంత ఖర్చులతో టిక్కెట్టుకొనుక్కొని, మర్యాదగా ప్రయాణం చేసే ప్రయాణీకుల్ని బొత్తిగా 'పార్లమెంటు మెంబర్ల' స్థాయికి దిగజార్చడం చాలా క్రూరమని నేను బల్ల గుద్దుతున్నాను.

ఇంతకీ వాళ్లు చేసిన నేరమేమిటి? భక్త రామదాసు అడిగినట్టు అడుగుతున్నాను. లక్షా డెబ్భైయ్యారు వేల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టి సంవత్సరంపాటు చిరునవ్వుతో జైల్లో గడిపారా? తన నిరపరాధిత్వాన్ని నిరూపించుకోడానికి టీవీ ఛానల్ మీద పరువునష్టం దావా వేస్తానని బోరవిరుచుకుని వేల కోట్ల ధనాన్ని ఫలహారం చేసిన క్రీఢాభిరాముడికి దీటుగా నిలబడగలరా? శృంగారానికీ, వ్యాపారానికీ అడ్డుతోవలు మలిచి, అడ్డమయిన కిట్టింపులతో ఒక సరికొత్త ఛానల్‌కే శ్రీకారం చుట్టిన ఓ ముఖ్యమంత్రిగారి ముద్దుల కూతురు సామర్థ్యానికి పొలిమేరల్లోనయినా నిలవగలరా?

కెమెరాల ముందు పోలీసులకీ, ఉద్యోగులకీ చెంపదెబ్బ కొట్టే చేవని వారు అలవరచుకోగలరా? సభల్లో చెప్పుల మర్యాదకి నోచుకోగలరా? పడగ్గదిలో కోట్లు దాచి పద్దెనిమిదేళ్ల తర్వాత జైల్లో విశ్రాంతి తీసుకుంటున్న 'నిజాయితీపరులు' 80 ఏళ్ల సుఖ్‌రాంగారి పాటి చెయ్యగలరా? తప్పుడు సంబంధాలతో సంకర సంతానానికి నీరుపోసి పార్లమెంటు దగ్గర్నుంచి, మంత్రిపదవులు, రాజ్ భవన్‌ల దాకా ఎగబాకిన ఎన్ .డి.తివారీలు –90 ఏళ్ల వృద్ధ జంబుకం కాగలరా? అన్నా ఉద్యమం ప్రకారం లోక్‌పాల్ బిల్లు చట్టమయితే అందరు పార్లమెంటు సభ్యులూ జైళ్లలోనే ఉంటారన్న స్వస్వరూప జ్ఞానాన్ని పోగుజేసుకున్న లల్లూ ప్రసాద్ గారి వంటి మేధావుల వర్గమది. వీళ్లెవరూ తమ సంపాదనతో విమానాలు ఎక్కరు. మామూలు ప్రయాణీకులు చక్కగా చదువుకొని, తమ సామర్థ్యంతో ఉద్యోగాలు సంపాదించుకుని, వ్యాపారాలు చేసుకుని – టిక్కెట్టు కొనుక్కుని ప్రయాణం చేసే నేలబారు నిజాయితీపరులు. బంగారు లక్ష్మణ్‌లాగ చేతివాటం చూపించి ప్రస్థుతం జైల్లో సేద తీర్చుకుంటున్న పెద్దమనుషులు కారు. కాలేరు. నాలుగుసార్లు బీహారులో పార్లమెంటుకి ఎన్నికయిన మహమ్మద్ సహాబుద్దీన్‌గారు –హత్యలు చేశారు. డబ్బుని కొల్లగొట్టారు. కిడ్నాపులు చేశారు. ఇది నేను చెప్పిన మాట కాదు. న్యాయస్థానం నిర్ధారణ చేసుకుని వారికి యావజ్జీవ కారాగార శిక్షని విధించింది. కాని వారెప్పుడూ అనారోగ్యంతో ఆసుపత్రులలోనే ఉంటారు. ఆ మధ్య అమర్‌సింగ్ గారూ న్యాయస్థానం పంపగా చుట్టపు చూపుగా




జైలుకి వెళ్లారు. గొప్ప నాయకులకి జైలుకి వెళ్లగానే గుండె జబ్బులు, రక్తపు పోటూ వస్తుంది. వెంటనే వారు ఈ దేశంలో కల్లా గొప్ప ఆసుపత్రిలో చేరతారు. తరువాత బెయిల్ మీద ఇంటికి, సరే. మనుషుల్ని ఊచకోత కోసిన పూలన్ దేవిని మనం పార్లమెంటుకి పంపి సత్కరించుకున్నాం. తప్పుడు పనిచేస్తున్న తనని ఫొటో తీసినందున నడిరోడ్డు మీద –మొన్న తిరుపతిలో ఒక ప్రజానాయకుడు పోలీసుల్ని "ఏమనుకుంటున్నావు నన్ను?" అని నిలదీసి సంస్కారం వున్న నాయకత్వం మనది.

వారికి తప్పనిసరిగా రెండు అక్కరలేదు –సిగ్గు, లజ్జ. సిగ్గు తన ప్రత్యేకతనో, తన లోపాన్నో, తన బలహీనతనో పక్క వ్యక్తి తెలుసుకున్నాడన్న స్పృహతో కలిగే తత్తరపాటు. దీనిలో చిన్న రుచి వుంది. లజ్జ –తన సంస్కార లేమికి, తన అశక్తతకి, తన అసమర్థతకి తలవొంచే గొప్ప సద్గుణం. ఈ రెండూ ఈ తరం నాయకులకి అవసరం లేదని –నెలల తరబడి జైళ్లలో వుంటూ –నేరారోపణ అలా వుండగానే బెయిల్ మీద బయటికి వచ్చి –అదే తమ నిర్దోషిత్వానికి విజయంలాగ పండగలు చేసుకునే దృశ్యాలే చెప్తాయి. జైళ్లలోంచి చిరునవ్వులతో, దొంగ నమస్కారాలతో, షోకయిన బట్టలతో, సమాజాన్ని క్షమించగల ఉదాత్తతని నటించే హుందాతో మనకి దర్శనమిచ్చే ఈ నాయకుల్ని చూస్తే మనకి సిగ్గేస్తుంది –ఎండ్రోక్లిస్ అండ్ లైన్‌లో కుక్కలాగ –యిలాంటి వారా మనకి నాయకులని.

అజిత్ సింగు గారూ! మా మీద కోపం వుంటే మరో విధంగా తిట్టండి. పైలట్ల పొట్టకొట్టినట్టు మమ్మల్నీ కొట్టండి. భరిస్తాం. కాని పార్లమెంటు సభ్యుల మర్యాదలకి మమ్మల్ని బలిచేసి బొత్తిగా చులకన, హేళన, అవమానం, చిన్నచూపు చూసే హక్కు మీకు లేదని ఈ పత్రికా ముఖంగా మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను –ఇవి అడ్డమయిన వాళ్లూ, ప్రతీ అడ్డమయిన కారణాలకీ ప్రభుత్వాన్ని 'హెచ్చరించే' రోజులు కనుక.

(జూన్ 11,2012)









# (June 18, 2012) Gireesam Avedana గిరీశం ఆవేదన

వెనకటికి ఒకాయన రేడియోలో కర్ణాటక సంగీతాన్ని వింటూ పక్కాయన్ని అడిగాడట;

"ఏమండీ, ఆ పాడేది ఎమ్మెస్ సుబ్బులక్ష్మే కదా?" అని. "తమకెందుకూ అనుమానం వచ్చింది?" అన్నాడట పక్కాయన. "ఏం లేదు. పాట మధ్యలో అపశ్రుతి వస్తేను" అన్నాడట. ఎమ్మెస్ సుబ్బులక్ష్మి అయినంత మాత్రాన అపశ్రుతి రాకూడదన్న రూలు లేదు. తప్పటడుగు మానవమాత్రులకి సహజం. మొన్న పేపరు చదువుతూ ఒకాయన గుండె బాదుకున్నాడు. "ఇదేమిటండీ –ఈయన –పట్టాభిరామారావు – న్యాయమూర్తి అంటున్నారు –ఈయన కూడా లంచం..." అంటూ బుగ్గలు నొక్కుకున్నాడు. అయ్యా, వ్యామోహం మానవమాత్రులకి సహజం. పట్టాభిరామారావు గారు కూడా మానవ మాత్రులే. అయితే కన్యాశుల్కంలో గిరీశం తన శిష్యుడయిన వెంకటేశానికి ఓ రస్తా వేశాడు. 'పెద్దవాళ్లకి పెద్ద కాయలు, చిన్నవాళ్లకి చిన్నకాయలు' అంటూ.

ఇది అవినీతికీ వర్తిస్తుంది. పాతిక రూపాయల అవినీతి అయితే –ఆయన దవాలా బంట్రోతు అయివుంటాడు. నాలుగు వేలయితే ఏ రెవిన్యూ గుమాస్తావో అయివుంటాడు. పదివేలయితే ఎలక్ట్రిసిటీ ఇంజనీరు అయివుంటాడు. లక్షరూపాయలు దాటితే సెక్రటేరియేట్ ఫైళ్లకి సెక్షను హెడ్డు అయివుంటాడు. కోటి వరకూ కేంద్రం సెక్రటరీ అనుకోవచ్చు. లక్షకోట్లయితే ఏ ఏ రాజాగోరో అయివుంటారు. 10 కోట్లకు 'న్యాయం' ఈ దేశంలో రాజీపడడంలో ఆశ్చర్యంలేదు. పెద్దవాళ్లకి పెద్దకాయ. కాకపోతే ఈ పట్టాభిరామారావుగారు బొత్తిగా అనుభవంలేని అవినీతిపరుడిగా ఆయన మీద మనకి జాలి కలుగుతుంది. ఆయన అవినీతిపరుడికి బెయిల్ ఇవ్వడంలో కక్కుర్తి పడి వుండవచ్చుగాక కాని డబ్బుని తీసుకోవడంలో, దాన్ని సరిగ్గా దాచుకోవడంలో యింకా కొంత అనుభవం సంపాదించాలని నా కనిపిస్తుంది.

అవినీతి గురించి తన సొంత సెల్‌ఫోనుల్లోంచే మాట్లాడడం, కాస్త ముందు జాగ్రత్తగా భావించి తన కొడుకు సెల్‌ఫోన్‌లోంచే మాట్లాడడం – డబ్బుని తన లాకర్లలోనే పెట్టుకుని –కొడుకు దగ్గరే లాకర్ తాళం చెవులు ఉండడం వంటివి –అతి ప్రాథమికమైన విషయాల్లో పప్పులో కాలేసే తప్పటడుగులు. సంవత్సరం పాటు మన రాజాగారు జైల్లో వున్నారు. ఆయన లక్షాడెబ్బై కోట్లు స్వాహా చేశారని అందరూ గొంతులు చించుకుంటున్నారు. కాని ఏ రోజయినా ఆయన దగ్గర సాంబారు ఇడ్లీ తినడానికి అయిదు రూపాయల నోటు దొరికిందా? సురేష్ కల్మాడీ గారి దగ్గర జేబులో ఏనాడయినా చిల్లర డబ్బులు చూశామా? బంగారు లక్ష్మణ్‌గారు అలనాడు నోట్ల కట్టలతో దొరికిపోయారు కానీ, వారి దగ్గర బస్సు టిక్కెట్టుకి సరిపోయే చిల్లరయినా కనిపించిందా? డబ్బు లాకర్లలోనే ఉంటుంది. కాని తాళాలు కొడుకుల దగ్గర ఉండకూడదు. ఇలాంటి వ్యవహారాల్లో అయిదారు సెల్‌ఫోన్‌లు ఉండాలి. చిల్లర హత్యలు చేసేవారే నాలుగయిదు సెల్‌ఫోన్లు వాడడం మనం చూస్తున్నాం. పోలీసుల సోదాల్లో ఎప్పుడూ సెల్‌ఫోన్లు దొరికినంత విరివిగా లాకర్ తాళాలు దొరకడం మనం వినలేదు.

తీసుకున్నది బోడి 10 కోట్లు. ఆమాత్రం డబ్బుని ఈ మధ్య సాదా సీదా రియల్ ఎస్టేటు బ్రోకర్‌లు తీసుకుంటున్నారు. మన నిమ్మగడ్డవారి నడగండి. ఎలా యివ్వాలో వారు చక్కగా నిర్వహించగలరు. ఈ విషయాన్ని ఆయన జైల్లో పేపర్లో చదివి నవ్వుకుంటూ ఉంటారని నా నమ్మకం. పట్టాభిరామారావు గారికి డబ్బు ఇప్పించిన సాటి న్యాయమూర్తి చలపతిరావు గారి దగ్గర, సోమశేఖర రెడ్డిగారి దగ్గర మధ్యవర్తిగా వున్న



బాలాజీరావు (ఐటీసీ మేనేజరు గారి దగ్గరా), నాచారం యాదగిరి దగ్గరా –అందరి దగ్గరా చిల్లర డబ్బులాగ దొరికిపోయింది –ఒకచోట కోటి, మరొకచోట కోటీ 60 లక్షలు –యిలాగ. న్యాయమూర్తి పట్టాభిరామారావుగారిది బొత్తిగా అనుభవం చాలని అవినీతిగా నాకు తోస్తుంది. గాలి జనార్ధనరెడ్డి గారి వంటి ప్రసిద్ధులయిన మంత్రిగారు, కోట్ల కోట్ల సొమ్మును కొల్లగొట్టడంలో అందెవేసిన చెయ్యిగా– న్యాయమూర్తికి మరింత పకడ్బందీగా, గుంభనంగా సొమ్మును అందజేసే ఏర్పాట్లు చేయకపోవడం శోచనీయం. ఇందువల్ల నష్టాలు –గిరీశం పద్దు ప్రకారం –(అ) గాలి వారికి బెయిల్ దక్కలేదు. వ్రతమూ చెడింది. ఫలమూ కలిసి రాలేదు. (ఆ) పట్టాభిరామారావుగారికి డబ్బు మిగలలేదు. (ఇ) ఇచ్చిన డబ్బు గవర్నమెంటు ఖాతాలోకి వెళ్లిపోయింది. (ఈ) ఇంతవరకూ దేశం ఆశలు పెట్టుకున్న న్యాయశాఖ పరువుకూడా భ్రష్టు పట్టిపోయింది. (ఉ) ముందు ముందు న్యాయస్థానాలు తమని కాపాడుతాయన్న సామాన్య మానవుడి కల మంటగలిసిపోయింది. ఇంతకూ ఈ కథలోని నీతి ఏమిటయ్యా అంటే –గాడిద చేసే పని గాడిదే చేయవలెను. ఒకవేళ గుర్రము చేసినా దానికి గాడిద మద్దతు పూర్తిగా ఉండవలెను. గుర్రములు గాడిద స్థాయికి ఎగబాకే ప్రయత్నము చేయరాదు. ఎన్నడూ గాడిదల్ని చిన్నచూపు చూడరాదు. నీతిని పాటించవలసిన, కాపాడవలసిన న్యాయమూర్తి అవినీతికి తలవొంచితే –దానికి చాలా కట్టుదిట్టమయిన ప్రణాళిక కావలెను. న్యాయవ్యవస్థకి పట్టాభిరామారావు గారు ఒక గుణపాఠం. ఒక చెలియలికట్ట. వారికీ, వారి అడుగుజాడల్లో ప్రయాణం చెయ్యాలని కలలు గంటున్నవారికీ ఒక హెచ్చరిక. బోనులో నిలబడిన నేరస్థులందరినీ చిన్నచూపుచూడడం తగదు. వారు ఎంతో కృషి చేసి, ఎన్నో లాకర్లు, తాళాలు, మధ్యవర్తులను సిద్ధం చేసుకుని ఆ పనులను చేసి ఉంటారని మనం గ్రహించాలి. ఆఖరుగా గిరీశంగారి సూత్రం మరువరాదు. పెద్దవాడికి పెద్దకాయలు. చిన్నవాడికి చిన్నకాయలు. చేసుకున్నవాడికి చేసుకున్నంత. తీసుకున్నవాడికి తీసుకున్నంత.

(జూన్ 18,2012)









# (June 25, 2012) Nijam Nidrapoyindi నిజం నిద్రపోయింది

చాలా సంవత్సరాల కిందటిమాట. ఒక ఆస్తి రిజిస్ట్రేషన్‌కి 30 లక్షలు అదనంగా స్టాంపు చార్జీలు కట్టాలి. మినహాయింపుని కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశాను. లాయరుగారు చిరునవ్వు నవ్వుతూ రెండు మూడు సుళువులు చెప్పారు. ఈ చార్జీలు ఎంతకాలం కట్టకుండా వాయిదా వెయ్యాలి? అయిదేళ్లా? ఆరేళ్ల? సుళువులు వున్నాయి. మీ ఫైలు అయిదేళ్లు కనిపించకుండా మాయమయిపోతుంది. అసలు పూర్తిగా కట్టకుండా దాటెయ్యాలా? ఫైలు శాశ్వతంగా మాయమైపోతుంది. ఈ పనులకి సరసమైన ధరలున్నాయి. ఆశ్చర్యపోయాను. గవర్నమెంటు మన గురించే ఆలోచిస్తూ గడపదు. ఫైలు కనిపించకపోతే ఆ వివరాలన్నీ పూర్తిగా నిద్రపోతాయి. ఈ సౌకర్యాలు చేసే అవినీతి ఆయా కార్యాలయాలలో ఉంటుంది. సరసమైన ధరలకు మనం ఆ అవినీతిని కొనుక్కోవచ్చు. నార్లగారూ, శ్రీశ్రీ, ఆరుద్ర దగ్గర్నుంచి నా దాకా –ఆ రోజుల్లో మద్రాసులో మూర్ మార్కెట్ సెకెండ్ హాండ్ పుస్తకాల షాపుల్లో తిరగడం అలవాటు. విశ్వవిద్యాలయం ఇంగ్లీషు డిపార్టుమెంటువారు చెప్పలేకపోవచ్చు గాని –క్రిస్టొఫర్ ఫ్రై నాటకాలున్నాయా? ఎమిలీ డికిన్సన్ పొయిట్రీ ఉందా? ఆ షాపువాడు అలవోకగా తీసి యివ్వగలడు. వారంతా తమిళులు. బి.సీతారామాచార్యులవారి శబ్దరత్నాకరము ఉందా? సుళువుగా తీసి యివ్వగలడు. ఎన్నో అరుదయిన, అమూల్యమైన పుస్తకాలను, సరసమయిన ధరలకి కొనుక్కున్న సందర్భాలున్నాయి. దువ్వూరి రామిరెడ్డి 'పానశాల' మొదటి ముద్రణ ప్రతి అక్కడ నాకు దొరికింది. ఆ భవనం కొన్ని శతాబ్దాల పాతది. ఆ దుకాణదార్లకు మమ్మల్ని తెలుసు. మాకు వాళ్లని తెలుసు. "ఏం ముత్తుస్వామీ! కొత్త పుస్తకం...?" అంటే "మీకోసమే చూస్తున్నాను సార్! ఇదిగో ముద్దుపళని 'రాధికా స్వాంతనం" అని యిచ్చేవాడు. తంజావూరు సరస్వతీ గ్రంథాలయం లాగ ఈ మూర్ మార్కెట్టుని జాతీయం చెయ్యాలి అనుకునే వాళ్లం.

మూర్ మార్కెట్టుని ఆనుకునే సెంట్రల్ స్టేషన్ ఉంది. రాను రాను ప్రయాణీకుల రద్దీ పెరిగింది. స్టేషన్ సౌకర్యాలు పెంచవలసిన అగత్యం పెరిగింది. మూర్ మార్కెట్‌ని అక్కడినుంచి పెకళించాలని ప్రయత్నించారు. వందల దుకాణదారులు గొల్లుమన్నారు. మాలాంటి సాహితీపరులు కస్సుమన్నారు. అన్నివైపులనుంచీ ప్రతిఘటన వచ్చింది. అప్పుడేమయింది? ఓ తెల్లవారు ఝామున మూర్ మార్కెట్‌కి నిప్పంటుకుంది. దుకాణదారులకు తెలిసేలోపున లక్షలాది పుస్తకాలు, యితర దుకాణాల సామగ్రి బూడిదపాలయింది. ప్రభుత్వం, రాజకీయ నాయకులు పశ్చాత్తాపం ప్రకటించారు. లారీలతో బుగ్గిని తీసి పారబోశారు. కొత్త రైల్వే భవనాలు వెలిశాయి. కొన్ని సమస్యల పరిష్కారానికి అగ్నిహోత్రుడు దగ్గర తోవ. నిన్న మహారాష్ట్ర ప్రభుత్వ కార్యాలయం 'మంత్రాలయం'లో అగ్నిప్రమాదం అలాంటి చక్కని పరిష్కారం. రాష్ట్ర ప్రభుత్వం ఆఫీసులో దేశాన్ని నిర్ఘాంతపోయేటట్టు చేసిన మహారాష్ట్ర ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, పార్టీ నాయకులు, సైన్యాధిపతులతో కూడిన పెద్ద ఆదర్శ కుంభకోణం ఫైళ్లున్నాయి. ఇంకా ఇంకా రకరకాల కుంభకోణాలు –మనదాకా రానివి ఉండవచ్చు. వాటిని శాశ్వతంగా సమాధి చెయ్యడానికి 'ఫైళ్ల మాయం' లాయకీ కానప్పుడు మూక ఉమ్మడి చర్య అవసరం. అదే మంత్రాలయంలో అగ్నిప్రమాదం. అందరికీ ఇద్దరి చావు, వందలాది మంది ప్రాణాలతో బయట పడడమే తెలుస్తోంది కాని ఈ అగ్నిప్రమాదం ముందు ముందు కొన్ని సంవత్సరాల పాటు 'అవినీతి'ని బూడిద చెయ్యగలదు. అందులో కాలని ఇబ్బంది ఫైళ్లు కూడా ముందు ముందు కొన్ని ఏళ్లపాటు ఆ అగ్నిప్రమాదం పేరిట మాయమయే అవకాశాలున్నాయి. చేసుకున్నవాడికి చేసుకున్నంత. డబ్బు కొద్దీ అవినీతి. ఈ అగ్నిప్రమాదంలో



3.18 కోట్ల పేజీల కాగితాలు, 2.27 లక్షల ఫైళ్లు ఆహుతి అయిపోయాయి. ఇందులో ఎంతమంది గొప్పవాళ్ల గోత్రాలున్నాయో ఆ భగవంతుడికే తెలుసు. ఎంతమంది ఈ శుభపరిణామానికి పండగ చేసుకుంటున్నారో మనకి తెలియదు.

నాలుగు రోజుల కిందటే ఎర్ర చందనాన్ని రవాణా చేస్తున్న ఓ డ్రైవరు శరీరం వొంటి నిండా బులెట్ గాయాలతో దొరికిందని మనం పత్రికల్లో చదివాం. డ్రైవరు బతికుంటే ఎంతమంది గుట్లు బయటపెట్టగలడో మనం ఊహించవచ్చు. లోగడ ఇలాగే మాఫియా రహస్యాలు తెలిసిన చాలామంది అన్యాయంగా హత్యలకు గురికావడం విన్నాం. ఇక్కడొక ధర్మ సందేహం. అన్యాయాలు ఎల్లకాలం జరుగుతూంటాయి. దొరికినవాళ్లు దొరుకుతారు. తెలివైనవాళ్లు బయటపడతారు. దొరకకుండా తప్పించుకోదలచినవారు ఇలా కొందరి ప్రాణాలు తీస్తారు. అయితే మనుషుల్ని చంపడం మంచిదా? ఫైళ్లని తగలెయ్యడం మంచిదా అని బేరీజు వేసుకుంటే –గిరీశం అడుగుజాడల్లో –యింప్రిమిస్ ఒకటో పద్దు ప్రకారం ఫైళ్లు మాయమవడమే శ్రేయస్కరం అని అనిపిస్తుంది. అవినీతిని ఎలాగూ ఆపలేం కనుక –నీతి ఎలాగూ బుట్టదాఖలు అవుతుంది కనుక మనుషుల్ని నష్టపోవడం కంటే అగ్నిప్రమాదాల్లో ఫైళ్లని నష్టపోవడమే శ్రేయస్కరం.

ఒక్క ఫైలు మాయమయితేనే నాలాంటివాడికి 30 లక్షలు కిట్టుబాటుకాగల నేపథ్యంలో –ఈ అగ్నిప్రమాదం ఎన్ని కోట్ల అవినీతికి ఉపకారమో, ఎందరి పదవులను సుస్థిరంగా కాపాడిందో, ఎందరి కీర్తిప్రతిష్టలకు గొడుగు పట్టిందో, ఎంతమంది సైనిక అధికారుల పింఛనులకు రక్షణ కల్పించిందో వారికి తెలుసు. ఆ పరమాత్మకి తెలుసు.

అగ్నిహోత్రుడు సర్వనాశనకారి అనే అపప్రధ ఉంది. కాని ఎంతోమంది కీర్తులు, పదవులు, ఆస్తులు, జీవితాలు కాపాడే చల్లని చలివేంద్రం. పెద్దమనిషి. నిన్నటి మంత్రాలయం మంటలు అగ్నిప్రమాదం కాదని నా ఉద్దేశం. చాలామందికి 'అగ్నిప్రమోదం'.

(జూన్ 25,2012)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (July 02 2012) Tappu(du)maata తప్పు(డు)మాట

ప్రజాస్వామ్యం పెద్ద గాడిద అన్నాడొకాయన. ఈ మాట అక్కసుతో, నిష్ఠూరంగా, కాస్త అన్యాయంగానూ అన్న మాటగా నాకనిపిస్తుంది. మరి ఎందుకన్నాడాయన?

ప్రజాస్వామ్యంలో ఒక సుఖం ఉంది. ఏ పనిచెయ్యడానికయినా, ఎవరికయినా హక్కు ఉంది. అర్హతలతో పనిలేదు. "అందరికీ అన్నీ తెలుసు. అదే మన అజ్ఞానం" అనంది మరో అన్యాయమైన శ్రీశ్రీ ఉవాచగా మనం సరిపెట్టుకోవచ్చు. నిన్న రాష్ట్ర పతి ఎన్నికల నామినేషన్ల కథని తీసుకుందాం. తన 34వ ఏట పార్లమెంటులో ప్రవేశించింది లగాయతు దాదాపు 40 సంవత్సరాలపై చిలుకు రాజకీయ రంగంలో పండి ముదిరిన ఒకాయన పేరుని రాష్ట్ర పతి పదవికి ప్రతిపాదించారు. తూర్పు భారతానికి సంబంధించిన మరొకాయన గిరిజనాభివృద్ధికి కంకణం కట్టుకుని, పార్లమెంటు స్పీకర్ గా పనిచేసిన నాయకుని పేరుని మరికొందరు ప్రతిపాదించారు. ఎన్నికల ఫలితం మాట ఎలా ఉన్నా ఆ పదవికి రాణింపు తేగల అనుభవం, దక్షత ఉన్న పెద్దలు వీరు. ఎన్నికలో పోలికలెందుకు? కావలసింది మెజారిటీ కదా? – తేల్చుకోవలసింది బలబలాలు కదా? ఈ రెండూ సరే. రాష్ట్రపతి పదవికి ఒక పాన్ షాప్ వాలా, ఒక టీకొట్టు వ్యాపారీ తమ పేర్లు ఇచ్చారు. అందరికీ అన్నీ అయే హక్కు ఈ దేశంలో ఉంది. అదే ప్రజాస్వామ్యం. ఇదిదేశపు మొట్టమొదటి పౌరుడి ఎన్నికకు జరిగిన తతంగం. ఇక రాష్ట్రశాసన సభలకూ, పార్లమెంటుకీ పోటీ చేసే రకరకాల అభ్యర్థుల అద్భుతాలు, అనూహ్యాలు. హరికథలు చెప్పేవారూ, నాటకాలు వేసేవారూ, టీవీ సీరియల్స్ లో ప్రాచుర్యాన్ని సంపాదించి వాటిని వోట్లుగా తర్జుమా చేసుకునేవారూ, హత్యలు చేసేవారూ, దోపిడీలు చేసేవారూ, ఖూనీలు చేసినవారూ, డబ్బిచ్చి వోట్లను కొనుక్కునే స్థోమత గలవారూ – మీ ఇష్టం.

జైలుకెళ్ళడం ఈ పోటీకి ఆంక్ష అయితే జైళ్ళలోంచే పోటీ చేసేవారూ, జైళ్ళలోంచే తమ నీతిని చాటేవారూ మనకు దర్శనమిస్తారు. అలనాడు అక్కరలేని చదువులు చదువుకున్న మోహందాస్ కరంచంద్ గాంధీ, జవహర్లాల్ నెహ్రూ, చక్రవర్తి రాజగోపాలాచారి, ఎన్.జి.రంగా, టంగుటూరి ప్రకాశం పంతులు, డాక్టేర్ అంబేద్కర్ – వీ రంతా లాయర్లు. కొందరు బారిష్టర్లు. ఈ దేశపు ఔన్నత్యానికి, దాస్య శృంఖలాల విముక్తికీ పాటుపడినవారు. న్యాయ పట్టాలతో వ్యాపారాన్ని పరాయి పాలకుల్తో పోరాటాన్ని సాగించడానికి వదులుకున్నవారు. మొన్న సంవత్సరం పాటు జైల్లో ఉండి బెయిల్ మీద వచ్చిన ఏ.రాజాగారు జైలునుంచి వచ్చాక మొదటిసారి ఊటీకి వెళ్ళారు. వారికి అక్కడ ఒక దేశాన్ని జయించి వచ్చినంత వీరస్వాగతం లభించింది. ఆయన్ని ఎండీటీవి ప్రతినిధి శ్రీనివాసన్ జైన్ ఏదో అడగబోయారు. "నేను లాయర్ని. నువ్వేం అడుగుతున్నావో తెలుసు" అంటూ అతన్ని ఖండించి నిష్క్రమించారు రాజాగారు. ఈ మంత్రిగారు తమ లాయరు పట్టాని ఈ దేశాన్ని దోచుకోడానికి వినియోగించారు. పైన చెప్పిన లాయర్లు ఈ తాజా రాజా దగ్గర నేర్చుకోవలసింది చాలావుంది. అవనీతి పనులు చేసి, కోర్టులు ఇంకా వారి నేరాల పట్ల తీర్పు ఇవ్వకముందే – చిరునవ్వులు చిందిస్తూ – కెమెరాలకీ, ప్రజలకీ నమస్కారాలు పెట్టే ధోరణిని "సోషలైజ్డ్ ఏంటీ సోషల్" ధోరణిగా మనస్తత్వ శాస్త్ర వేత్తలు పేర్కొన్నారు. అపోలో ఆసుపత్రి సైకియాట్రీ ప్రొఫెసరుగారు "పెద్ద నేరాలు చేసే ఈ 'పెద్దరికం' నేరస్థులు – ఈ రాజకీయ నాయకులు – ప్రజలలో తమ ఇమేజ్ ని కాపాడుకోవడం అవసరం. వాళ్ళు సాధారణంగా పశ్చాత్తాపం, గిల్ట్ మీద 'ముందు జాగ్రత్తా అనే ముసుగు కప్పుతారు" అన్నారు. ఒక పక్క కోర్టుల సమక్షంలో వారి నేరాలు ఏకరువు అవుతున్నా

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

– వీరు నవ్వుతూ తిరగడంలో అంతరార్థం ఏమిటి? నిజంగా నేరాలు చెయ్యలేదా? చేస్తే అంత ధైర్యమూ, నిబ్బరమూ ఎలాగ సాధ్యం? అనే సందిగ్ధం ప్రజల మనస్సులో కలిగితే చాలు. ఆ మేరకు వారి నేర చరిత్ర పల్చబడుతుంది. చేశారా అన్న సందిగ్ధం – చేశారన్న తీర్పు (ఈ దేశంలో ఏ 18 సంవత్సరాల తర్వాతి మాట!) వాళ్ళకి కొంగు బంగారమౌతుంది. వీళ్ళకి భావవ్యక్తీకరణలో ఆరితేరిన 'నిబ్బరం' ఒక ఆటో పైలెట్ లాగ పనిచేస్తుంది – అన్నారు మరో క్లినికల్ సైకాలజిస్టు సీమా హింగోరనీ.

ఏమైనా ఇది ప్రజాస్వామ్యంలో ఉన్న విసులుబాటు. ఈ ప్రజాస్వామ్యం పేర – సామూహిక హత్యలు చేసిన పూలన్ దేవి– ఈ దేశపు అత్యున్నత సభలో సభ్యురాలు.

ఏతావాతా, ఈ దేశంలో అందరికీ అన్నీ అయే హక్కులున్నాయి – టీ కొట్టువాలాతో సహా. దానిపేరే ప్రజాస్వామ్యం. టీకొట్టు వ్యాపారి రాష్ట్రపతి కావడం – కాగలగడం – ఒక గొప్ప సదవకాశం. మహద్భాగ్యం. ఇది ఈ దేశ సామాజిక ప్రగతిలో సర్వులకూ వాటాని కల్పించాలన్న జిజ్ఞాసువుల ఉదాత్తమయిన కల. కానీ రాష్ట్రపతి భవనాన్ని టీ దుకాణం చేయగలవారు చాలామంది ప్రస్తుతం ఎన్నికవుతున్నారు.

అందుకేనేమో – ఆ పెద్దమనిషి ఎవరో "ప్రజాస్వామ్యం పెద్ద గాడిద" అని వాపోయాడు.

(జూలై 02,2012)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

## (July 09, 2012) Gatamemto Ghanakeerthi గతమెంతొ ఘనకీర్తి

ఈ మధ్య టీవీలో ఏదో ఛానల్‌లో ఓ సరదా అయిన కార్యక్రమాన్ని చూశాను. రామబాణం అణ్వస్త్రమా? ఆ విస్ఫోటనానికీ నిన్నకాక మొన్న (పోనీ 77 సంవత్సరాల కిందటి) విస్ఫోటనానికీ ఏమైనా పోలికలున్నాయా అంటూ ఎన్నో చిత్రాలు, రుజువులతో ఓ కార్యక్రమాన్ని ప్రసారం చేశారు. ఇదేమిటి దేశం ఇంత వెనక్కు పోతోందా అని ఆశ్చర్యపోయాను. ఇంతలో ఈ 'దైవ కణం ' ప్రసక్తి. వివరాలు మనకి చాలా అర్థం కావు. వద్దు. గత నలభై అయిదు ఏళ్లుగా కొన్ని వందలమంది పరిశోధనలు చేస్తున్న విషయానికి చిన్న తలా తోకా దొరికినందుకే పీటర్ హిగ్స్ ఆనందంతో కళ్లనీళ్లు పెట్టుకున్నాడు. దీనికి 'హిగ్స్‌బోసోన్ ' కణం అని పేరుపెట్టారట. నాకాశ్చర్యం లేదు. ఇదే మన దేశంలో అయితే దీనికి 'సోనియోన్ ' అనో, 'రాహులోన్ ' అనో, 'రాజీవోన్' అనో పేరు పెట్టాలని ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసేది. సిపిఐ, బిజెపి దీన్ని వ్యతిరేకించేవారు. అసలు విషయాన్ని వదిలేసి (అసలు విషయం ఎవరికయినా తెలిసి చస్తేకదా) 60 ఏళ్ల కిందటి కార్టూన్‌ని రాజకీయం చేసిన 'నవ్వుకోవడం ' తెలీని రాజకీయ నాయకులున్న దేశం ఇది. ప్రతీవాడికీ పెద్ద భుజాలున్నాయి –తడువుకోడానికి.

సరే. హిగ్స్ మాటల్లో 'సృష్టిలో ఈ కణం సర్వాంతర్యామి ' అన్నారు. The particle is omnipresent and imperceptible. It is likely to shed light on other mysteries of the universe. ఇవీమాటలు. ఒకాయన చాలా దశాబ్దాల కిందట ఈ మాటే చెప్పాడు: ఎవ్వనిచే జనించు, జగమెవ్వని లోపలనుండు లీనమై. ఎవ్వని యందు డిందు, పరమేశ్వరుడెవ్వడు.. అంటూ. దీన్ని ఇంగ్లీషులో అనువదిస్తే హిగ్స్ ప్రకటన అవుతుంది.

అణ్వస్త్రాల రహస్యాలంటే బాంకుల్లోనో, కర్మాగారాల్లోనో దాచేవికావు. మేధస్సుతో దర్శించిన శాస్త్రీయమైన ప్రయోగాలు. మనకి నమ్మకం లేకపోతే పొరుగుదేశం ఐ.క్యూ. ఖాన్‌ని అడిగితే తెలుస్తుంది. ఒక గొప్ప ప్రయోజనాన్ని సాధించడానికి –ఒకాయన్ని 16వ యేటనుంచీ రుషులు అడవులకు తీసుకుపోయారు. మరో 14 ఏళ్లు ఈ అస్త్రాల రహస్యాలను ఆయనకి అప్పగించారు. లోకకళ్యాణం వారి లక్ష్యం. ఇరాన్‌కి అమ్ముకోవడం కాదు. దుష్టసంహారం ఆదర్శం. ఆ రుషుల్లో ఐ.క్యూ. ఖానుల్లేరు. ఇప్పుడిప్పుడు టీవీలకు ఈ అణ్వస్త్రాల వివరాలు అందుతున్నాయి. ఏతావాతా, దీన్ని 'దైవకణం ' అని ఎందుకన్నారు సృష్టిలో ఇంత సమగ్రమైనదీ ఇంత సూక్ష్మాతి సూక్ష్మమైనదీ ఇంత బలమైనదీ మరొకటి లేదు కనుక. సృష్టిలో ఈ శక్తికి మరో పేరు అందదు కనుక. అతి ప్రాథమికమయిన –నా అనుభవంలోకి వచ్చిన ఒక ఉదాహరణని చెప్తాను. నేను సినీనటుడిని అయే తొలిరోజుల్లో –1981 ప్రాంతంలో తలమీద నుంచి నుదురు వరకూ పాకే సోరియాసిస్ ఉండేది. భయపడి –దేశంలోకల్లా పెద్ద చర్మవ్యాధి నిపుణుడు, డాక్టర్ బి.సి.రాయ్ బహుమతిని అందుకున్న డాక్టర్ తంబయ్య (పూనమల్లి హైరోడ్డులో దాశ్ ప్రకాష్ హోటల్‌కి ఎదురుగా ఆయన క్లినిక్) దగ్గరికి వెళ్లాను. ఆయన పరీక్ష చేసి తలకి నువ్వుల నూనె రాసుకుని పది నిముషాలు ఉదయం ఎండలో నిలబడి స్నానం చెయ్యమన్నాడు. 'చర్మవ్యాధులు రాకుండా ఉండాలంటే సరిగ్గా ఆ పనే చెయ్యరావెధవాః ' అని మా అమ్మమ్మ చెప్పేది. మరి పది నిముషాలు ఏం చెయ్యాలి 'సూర్యనమస్కారాలు ' చేసుకో అనేది. నేను ఇప్పుడు హిందూ పేపరు చదువుకున్నాను. మనం సింబల్స్‌ని వదిలి 'హిందూ పేపరు వల్ల చర్మవ్యాధులు పోతాయా ?' అని నవ్వుకునే తెలివితేటల్ని పెంచుకున్నాం. రుషులు గుహల్లో సంవత్సరాల తరబడి యోగముద్రలో ఉంటారు. అన్ని రోజుల తాటస్థ్యాన్ని శరీరం తట్టుకోలేదు. కీళ్ల నొప్పులకీ, గుండె నొప్పికీ, గర్భకోశ సమస్యలకీ వారు




హిమాలయాలనుంచి అపోలో ఆసుపత్రికి రాలేరు. రారు. మరెలాగ కేవలం కూర్చునే, సాగిలపడే, నిలబడే పద్ధతులలో –ఆసనాల ద్వారా తమ రుగ్మతల్నితీర్చుకుని ఏకాంతాన్ని కాపాడుకునే పద్ధతుల్ని శతాబ్దాల తరబడి నిర్దేశించుకున్నారు తమకు తామే. ఇవి ఎంపెరికల్ సాధనాలు. యోగాసనాలు. క్రమంగా అది శాస్త్రమయింది. వీటిని అమెరికా పేటెంటు చేశాక మనకి ఆసక్తి పెరిగింది. ఇది సైన్సుని తలదన్నే తాత. మనం చాలా చదువుకున్నాం. చదువులసారమేమిటో తెలియనక్కరలేనంత చదివాం. ఆడా మగా తేడా లేకుండా సంస్కారాన్ని మరిచిపోయి, రెచ్చిపోయి –మన తెలివితేటల కందని వాటిని ప్రశ్నించే 'కుహనా ' తెలివితేటల్ని పెంచుకున్నాం. 45 సంవత్సరాల పైగా పరిశోధనలు జరిపి –ఫలితాలకు 'దైవం ' పేరుతప్ప మరోమాట చెల్లదని ఓ విదేశీయుడు తేలిస్తే భుజాలు తడువుకుంటాం. పోతనకాక హిగ్స్ దొరగారు చెప్తే మనకి నచ్చుతుంది. మనం ప్రస్తుతం విషవృక్షాల ఛాయల్లో ఉన్నాం. ఒక చిన్న అలవాటుని పెంచుకోమని మన పెద్దలు ఏనాడో చెప్పిన మాటని మనం మరిచిపోయాం. ఆ మాట పేరు 'విశ్వాసం '

అదొక్కటే ఉంటే ప్రపంచం మన కాళ్ల దగ్గర ఉండే వైభవం మన సంస్కృతిలో ఉంది. ప్రస్తుతం దొరగారు చెప్పే 'దైవకణం ' దాకా మన తెలివి ప్రయాణం చేస్తోంది. శుభం.

(జూలై 09,2012)




# (July 16, 2012) Charitarthulu చరితార్థులు

2001లో నా నవల 'సాయంకాలమైంది'కి వరంగల్లు సహృదయ సాహితీ సంస్థ 'ఒద్దిరాజు స్మారక ఉత్తమ నవలా' పురస్కారాన్ని ఇచ్చింది. ఒద్దిరాజు కవుల పేర్లు నేను అదే వినడం. ఎవరీ ఒద్దిరాజు కవులు? వారిని ఇంతగా స్మరించుకునే కృషి ఏం చేశారు? అని తెలుసుకోవడం ప్రారంభించాను. తెలిసిన విషయాలు విన్నకొద్దీ నిర్ఘాంతపోయాను. నమ్మశక్యం కాలేదు. ఒక జీవితకాలంలో మానవమాత్రులకు ఇన్ని పనులు సాధ్యమా? అని ఆశ్చర్యపోయాను. వీరు 'ఒద్దిరాజు కవులు' అన్నారు. కాని అది వారి విస్తృతమైన కృషికి చిన్నమూస. నిజానికి వారు పరిశోధకులు, సంఘ సంస్కర్తలు, రచయితలు, కవులు, విమర్శకులు, చిత్రకారులు, ప్రచురణ కర్తలు, ముద్రాపకులు, సంపాదకులు, చర్మకారులు, కుట్టుపనివారు, సూట్‌కేసుల తయారీ చేసినవారు, గృహనిర్మాతలు, వాస్తునిపుణులు, జ్యోతిష్కులు, ఆయుర్వేదం, హోమియోపతీ, అల్లోపతీలలో వైద్యులు, నూతన ఔషదాల తయారీ చేసినవారు, ఫార్మసీలు స్థాపించినవారు, శస్త్రచికిత్స జరిపినవారు.

బియ్యం మిల్లు, నూనె మిల్లు, పిండిమరలు స్థాపించి నడిపినవారు. సబ్బులు, ఇంకులు, రకరకాల నూనెలు, రొట్టెలు తయారీ చేసినవారు, పుస్తకాల బైండింగులు చేసినవారు, తాపీపని, వడ్రంగి పని చేసినవారు, పశువైద్యం తెలిసినవారు, ఆర్కిటెక్చర్‌లో నైపుణ్యం సాధించినవారు.

వీటితోపాటు పొలంలో నాగలిపట్టి సేద్యం చేసినవారు. అన్నిటికీ మించి –మానవ కళ్యాణమే లక్ష్యం గల మానవతావాదులు. ఒక్కమాటలో చెప్పాలంటే ఒక జీవితకాలంలో చరిత్రను సృష్టించినవారు. ఇన్ని రంగాలలో కృషి చేసినవారు అప్పటికీ ఇప్పటికీ లేరంటే అతిశయోక్తి కాదు.

వరంగల్లులో మానుకొండ తాలూకాలో ఇనుగుర్తి గ్రామం వారిది. వారు సీతారామచంద్రరావు, రాఘవరంగారావు. ఏడేళ్ల తేడాలో జన్మించి 62 సంవత్సరాలు కలిసి జీవించారు. కథలు, నాటికలు, చారిత్రక నవలలు, కవితలు, వేదాలపై విస్తృతమైన వివరణ గ్రంథాలు రాశారు.

'పాణియాష్టాధ్యాయి', 'సిద్ధాంత కౌముది' వంటి గ్రంథాలకు భాష్యాలు రాశారు. ఇంగ్లీషులో కవితలు రాశారు. ప్రచురితమైన రచనల కన్న కానివే ఎన్నో ఉన్నాయి. విజ్ఞాన ప్రచారిణీ గ్రంథమాల అనే ప్రచురణ సంస్థను ప్రారంభించి వందకుపైగా పుస్తకాలను ప్రచురించారు. ప్రచురించారనడం తప్పు. తమ ఇంట్లోనే ముద్రణా యంత్రాన్ని ఏర్పరుచుకొని, పుస్తకాలను కంపోజ్‌చేసి, ట్రెడిల్ స్వయంగా తొక్కుతూ తామే ముద్రించారు. 'బాల విజ్ఞాన మంజూష' అనే పేరిట చిన్నపిల్లలకు 500 పైగా చేతి పనులు నేర్పే పుస్తకాన్ని ప్రచురించారు.

ఇనుగుర్తిలో తామే స్వయంగా ఇల్లు కట్టుకుని కాగితం మీద సీతారామచంద్రరావు అనే అక్షరాలను చెక్కి, వాటిని బయటి గోడమీద సిమ్మెంటుతో దిద్దారు. 72 సంవత్సరాల తర్వాత ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది! ఇంటి ముఖద్వారం మీద భగవద్గీత శ్లోకాన్ని రాశారు.

ఆ రోజుల్లో హోమియోపతీ బెంగాలులో ప్రసిద్ధంగా ఉండేది. ఆ విద్య నేర్చుకోడానికి కలకత్తా వెళ్లారు. అప్పటికే వారి మనసుల్లో ఒక పత్రికను నడపాలనే కోరిక బలంగా ఉండేది. రోజూ 'అమృత బజార్ పత్రిక' కార్యాలయం ముందు గంటల కొద్దీ నిలబడి ఆ సంస్థ కార్యకలాపాలను వంటబట్టించుకున్నారు. ఇంటికి వచ్చాక తెలుగులో –బహుశా మొట్టమొదటి పత్రిక 'తెనుగు పత్రిక'ను ప్రారంభించారు. అందులో ప్రాంతీయ వార్తలు, విదేశీవార్తలు, వ్యాసాలు, కథలు, సంపాదకీయాలు అన్నీ వారే రాసేవారు. వారే ప్రింటు చేసేవారు. వారే పంచేవారు. నైజాము

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

ప్రాంతంలో తొలి దినపత్రిక అవసరాన్ని ఆ రోజుల్లోనే గుర్తించిన క్రాంత దర్శులు వారు. అది 1922 మాట. మొదట 500 కాపీలు ప్రింటు చేశారు. క్రమంగా సర్క్యులేషన్ రెట్టింపు అయింది. ఈ పత్రిక 8 సంవత్సరాలు నడిచింది.

వైద్యం ప్రాక్టీసు చెయ్యడమేకాక మలేరియాకి 'తిక్త' అనే మందు, విరేచనాలకి 'మధుర', ఇన్‌ఫ్లూయంజాకి మరో మూలికా ఔషధాన్ని కనుగొన్నారు. ఆ చుట్టుపక్కల వారందరికీ ఉచితంగా వైద్యం చేసేవారు. వారా వృత్తిని మానుకోవడానికి ఒక మానవీయమైన కథ ఉంది. వారి మిత్రుడు గోవిందరాజులు నాయుడు మేనల్లుడు సారంగపాణి సింగరేణిలో ప్రాక్టీసు చేస్తున్నాడు. ఏదో కారణానికి ప్రాక్టీసు చెడింది. ఇనుగుర్తిలో ప్రాక్టీసు పెట్టాలనుకున్నాడు. ఇక్కడ ఉచితంగా అందరికీ ఒద్దిరాజు సోదరులు వైద్యాన్ని అందిస్తున్నారు. వారిని కలిసి ఉచితంగా వైద్యాన్ని మానుకోమని అర్థించారు. అతని ఉపాధికోసం సోదరులు వైద్యాన్ని తమ కుటుంబానికే పరిమితం చేసుకున్నారు! ఆ రోజుల్లో గ్రామీణులు ఏనాడూ చూడని ఎన్నో చెత్త వస్తువులను గ్రామానికి తెచ్చారు. థర్మోస్ ఫ్లాస్క్, టార్చిలైటు, సైకిలు, గ్రామఫోను వంటివి వారు గ్రామానికి తెస్తే అందరూ విచిత్రంగా చూసేవారట.

వారు పది భాషల్లో నిష్ణాతులు. వాటిని నేర్చుకున్న తీరు ఇంకా అద్భుతం. ఆనాటి ఒక ముస్లిం ఉపాధ్యాయుడు హసన్ ఖాన్ వారికి భారతం, భాగవతం నేర్పాడు. తమిళనాడులోని ఓ ఊరిలో జంతు చర్మాలను శుభ్రంచేసే అబ్దుల్లా అనే తమిళుడి నుంచి తమిళం నేర్చుకున్నారు. నీటిపారుదల శాఖలో పనిచేసే యూరోపియన్ జిడబ్ల్యూడి కెంప్ అనే ఉద్యోగి ద్వారా ఇంగ్లీషు నేర్చుకున్నారు. మధ్యలో అతనికీ బదిలీ అయిపోతే కేసముద్రం స్టేషన్ మాస్టర్ దగ్గర కలోనియల్ ప్రొనన్సియేషన్ డిక్షనరీని తెచ్చుకుని, శంకరనారాయణ డిక్షనరీని పెట్టుకుని చదువుకొని, రవీంద్రుడి 'నౌకా భంగము' నవలని తెలుగులోకి అనువదించారు.

ఇంకా నమ్మశక్యం కాని విజయం 1911 నాటిది. మునగాల రాజా నాయని వెంకటరంగారావు గారు ఇనుగుర్తి వచ్చినప్పుడు సోదరుల్ని మద్రాసులో విజ్ఞాన చంద్రికా పరిషద్ పరీక్షలు రాయమని సూచించారు. ఆ రోజుల్లో నైజాం కరెన్సీ హాలీ అనేవారు. బ్రిటిష్ ఆంధ్రా కరెన్సీ కాల్దర్. అంటే డబ్బు సింగరేణిలో పోస్టాఫీసుకి వెళ్లి చెల్లించాలి. కట్టారు. కాని మద్రాసు నుంచి పుస్తకాలూ, హాల్ టిక్కెట్టూ ఎన్ని నెలలయినా రాలేదు. పరీక్ష 18 రోజులుందనగా వచ్చాయి. 18 వాచకాల్ని 18 రోజుల్లో చదివి పరీక్ష రాయాలి. అయినా ధైర్యంగా రైలెక్కారు.

తీరా ఆ హడావుడిలో ఇంటి దగ్గర పుస్తకాలు మరిచిపోయారు. అయినా మద్రాసు చేరుతూనే వాషర్‌మాన్ పేటలో పుస్తకాల్ని ప్రచురించిన జయశంకర్ అండ్ కో యజమాని వీరన్న శెట్టిని కలిశారు.

పరీక్షకు 13 రోజుల ముందు పుస్తకాలు చదవకుండా పరీక్ష రాయడానికి వచ్చిన ఇద్దరు కుర్రాళ్లని చూసి ఆయన ఆశ్చర్యపోయాడు. నవ్వుకున్నాడు. పుస్తకాల మొదటి ముద్రణ కాపీలు లేవు. రెండో ముద్రణ అవుతోంది. ఫారాలు ఒక పక్క ప్రింటవుతూంటే వీరికి ఇవ్వడానికి ఒప్పుకున్నాడు.




తీరా పరీక్ష రాసేనాటికి సీతారామచంద్రరావుగారికి వొళ్లు కాలిపోయే జ్వరం. పరీక్ష హాలులో పేపరు రాస్తూండగా కుడిచెయ్యి పనిచేయలేదు. కొంకర్లు పోయింది. ఎడం చేత్తో రాయడానికి సిద్ధపడ్డారు. కాని కాగితాలలో రెండు దస్తూరీలు ఒకరివేనని పరీక్షాధికారి నమ్మాలి కదా? పర్యవేక్షక అధికారి –ఆన్సర్ పేపరు మీద ఆ విషయాన్ని తెలియజేస్తూ సంతకం చేశారట. ఆ పరీక్షల్లో మొదటి తరగతిలో మొదటివారిగా నిలిచి బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. అలాంటి అనూహ్యమైన కార్యదక్షులు, ఏకసంతాగ్రాహులు ఆ సోదరులు.

వారి గ్రామంలో త్యాగరాజ ఉత్సవాలు జరిపేవారు. స్వయంగా వీణ, వయొలిన్, వేణువు నేర్చుకున్నారు. అది ఎవరైనా చేయగలిగిన పని. ఆయా వాద్యాల్ని వారేతయారు చేసుకునేవారట!

ఈ కాలమ్ చదివిన ఒక తమిళుడు నిర్ఘాంతపోయి: "అయ్యా, ఇది కేవలం పత్రికలో చదువుకునే చరిత్ర కాదు. ప్రతీవిద్యార్థి పాఠ్యపుస్తకంలో చేర్చాల్సిన చరిత్ర" అన్నాడు.

భోజనానికి కూర్చుని ఔపోశన పట్టి, ఉత్తరాపోశన పట్టేలోగా 500 పద్యాల ప్రబంధాన్ని ఆశువుగా చెప్పిన కొప్పరపు కవులు, ఒద్దిరాజు సోదరుల వంటి చరితార్థులను కన్న దేశం మనది అని గర్వపడాలనిపిస్తుంది. సీతారామచంద్రరావుగారు 1956 జనవరి 28న కేన్సర్‌తో కాలధర్మం చెందారు. రాఘవరంగారావుగారు తన 79వ యేట 1973 మే 17న పరమపదించారు.

(జూలై 16,2012)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (July 23, 2012) Oka asadharanudu ఒక అసాధారణుడు

హత్యలు చేసినందుకు, ఏసిడ్ ముఖం మీద జల్లినందుకు, ప్రజల సొమ్ము దోచుకున్నందుకు, ప్రభుత్వ ఖజానాలు కొల్లగొట్టినందుకు –అలవోకగా కీర్తి ప్రతిష్టలు పెరిగి రోజూ పత్రికలలో దర్శనమిచ్చే ప్రాచుర్యం పెరుగుతున్న ఈ రోజుల్లో 40 ఏళ్ల కిందట యివేవీ చెయ్యకుండానే మంచిమాటతో, పాటతో, చక్కని నటనతో 4 దశాబ్దాల పాటు ప్రజల మనస్సుల్లో నిలిచిన ఓ సరళమయిన సినీ నటుడి కథ ఈ మధ్యనే ముగిసింది. ఆయన రాజేష్ ఖన్నా. రాజేష్ ఖన్నా రాజ్‌కపూర్ లాగ అన్ని సినీ విభాగాలనూ ఔపోశన పట్టిన నటుడు కాదు. దిలీప్‌కుమార్ లాగ సమగ్రమైన నటుడు కాదు. దేవానంద్‌కి ఉన్నంత అందం, స్టైల్ ఉన్నవాడు కాదు. కాని వీరందరిలో ఉన్న కొన్ని ప్రత్యేకతల్ని కలబోస్తే రాజేష్ ఖన్నా అవుతాడు. ఆయన కన్ను మూసినప్పట్నుంచీ యిప్పటిదాకా ఆయన ప్రతిభను నెత్తికెత్తుకుంటున్నవారంతా చెప్పని ఒక విషయం ఒకటుంది. అలనాడు రాజేంద్రకుమార్ అనే నటుడు పట్టుకున్నదంతా బంగారమయినట్టు (ఆయనకు సిల్వర్ జూబ్లీ హీరో అనే పేరుండేదంటారు) ఓ దశలో హిందీ చలన చిత్రరంగంలోని బంగారమంతా రాజేష్‌ఖన్నా చిత్రాలలోనే పెట్టుబడి జరిగింది. ఎస్.డి.బర్మన్, సలీల్ చౌదరి, ఆర్.డి.బర్మన్, కళ్యాణ్‌జీ ఆనంద్ జీ వంటి హేమాహేమీలు చలన చిత్రరంగంలో అజరామరం చేసిన బాణీలు, గుల్జార్, గుల్షన్ ఆనంద్ వంటి రచయితల రచనలు, ఆనంద బక్షీ, గుల్జార్, యోగేష్, ఇందీవర్ వంటి కవుల కలాలు, ముఖేష్, కిశోర్‌కుమార్, రఫీ వంటి గళాలు, హృషీకేష్ ముఖర్జీ, శక్తి సామంత వంటి దర్శకుల కళాత్మక కృషీ –ఇన్నింటి కలబోత రాజేష్ ఖన్నా అనే హీరో విజయానికి దోహదకారులు. మళ్లీ హృషీకేష్ ముఖర్జీ, శక్తి సామంత యిద్దరూ రెండు ధోరణులకు ప్రతినిధులు. ఆనాటి 'ఆనంద్', 'ఆరాధన' ఓ నటుడిని చరిత్రగా మలిచాయి. ఆయన్ని ఆకాశంలో నిలిపాయి. 'సూపర్ స్టార్' అనేమాట ఆయన కోసమే, ఆయనతోటే పుట్టింది. అభిమానుల ఆరాధన అంచుల్ని చూసిన, లేదా అంచుల్ని చూపిన ఘనత రాజేష్‌ఖన్నాది. 1969 ప్రాంతాలలో ఆయన భారతదేశంలో లక్షలాది మందికి దేవుడు. ఆయన కారు నడిచిన నేలమీది మట్టిని తలమీద పెట్టుకున్న వీరాభిమానులూ, ఆయన పటానికి తాళికట్టించుకున్న అమ్మాయిలు, తమ రక్తంతో ప్రేమలేఖలు రాసిన పిచ్చి ప్రేమికులూ –ఇది కనీ వినీ ఎరగని మత్తు. ఆవేశం.

తర్వాత కథలూ, పాటలూ సినిమా రాణింపుకి కారణమయిన రోజులుపోయి, పాత్రీకరణలూ, సన్నివేశాలూ సరిపోయే (స్పాట్ ఇంట్రెస్ట్) సినిమాల రోజులు వచ్చాయి. యాంగ్రీ యంగ్‌మాన్ కథలు (జంజీర్, దీవార్, త్రిషూల్) ట్రిక్కులూ, కిక్కులూ చెల్లిపోయే రోజుల్లో రాజేష్ ఖన్నా శలవు తీసుకున్నాడు. పాట కథలో భాగమయిన చిత్రంలో కథకి ప్రాణం వస్తుంది. పాట మాత్రమే అలరించే స్థాయిలో (ఐటెమ్ సాంగ్స్) సినిమాకి ఆకర్షణ వస్తుంది, డబ్బు వస్తుంది. కాని చిత్రానికి జబ్బు వస్తుంది. ప్రసార మాధ్యమాలు పెచ్చురేగిపోయిన రోజుల్లో ఆకర్షించే చిత్రాలే వస్తాయి. నోరున్న, డబ్బున్న నిర్మాతలూ ఆకర్షణని సొమ్ము చేసుకుంటారు. అదే ఆనాటి సూపర్ నటులకీ, ఇప్పటికీ తేడా. ఇప్పుడు అక్కినేని, ఎన్టీఆర్, దిలీప్, రాజ్‌కపూర్, రాజేష్‌ఖన్నాలను చూడలేము. బాక్సాఫీసులను బద్దలు కొట్టడాన్ని, టీవీ తెరలమీద వ్యాపారాన్ని చూస్తాం. మారే కాలంతో పాటు మాధ్యమమూ మారుతుంది. అది సహజం. రాజేష్ ఖన్నా ఆనాటి, మన్నికయిన సూపర్ హీరో. అందుకే ఒక ఎన్టీఆర్‌కీ, ఒక శివాజీకీ, నిన్న రాజేష్‌ఖన్నాకీ అంత స్థాయిలో అభిమానులు నివాళులర్పించారు. ముందు ముందు అలాంటి అభిమానాన్ని చూడం. కర్ణుడిలాంటి మహావీరుడికి పదిరకాలయిన అనర్థాలు తోడయి రణరంగంలో పరాజితుడయాడు. రాజేష్‌ఖన్నా పదిరకాలయిన ప్రతిభల సమ్మేళనానికి ప్రతీక. దాన్ని అదృష్టమని ఒక్కమాటలో కొట్టిపారేయడానికి వీలులేదు. సునీల్‌దత్ ఆయనకంటే అందగాడు. శతృఘ్నసిన్హా




ఆయనకంటే క్షుణ్ణంగా నటనని ఎరిగినవాడు. కాని ఓ నటుడు 'సూపర్ స్టార్' అనిపించుకోడానికి ఇవి మాత్రమే చాలవు. తెలుగు సినిమాలో అందమయిన నటుల్లో రామకృష్ణ నాకెప్పుడూ గుర్తుకొస్తాడు. కాని బహుళ ప్రాచుర్యాన్ని సాధించడం వేరేకథ. ఆ 'కెమిస్ట్రీ' కి కేవలం అదృష్టం అని సరిపెట్టుకోవడం దొంగదారి వెదకడం లాంటిది. రాజేష్ ఖన్నా తన కీర్తిని అతి సహజంగా నిలుపుకున్నాడు. భేషజాలు లేకుండా గడుపుకున్నాడు. ప్రజల మధ్య క్రమంగా గోమతేశ్వరుడిలాగ పెరిగాడు.

'ఆనంద్' చేస్తున్నప్పుడు –ఆనాటి అద్భుతమైన హిట్‌ల మధ్య హీరోయిన్ కూడా లేని, చివరలో చచ్చిపోయే పాత్రని చేస్తున్నందుకు ఇబ్బంది పడేవాడట రాజేష్ ఖన్నా. పది గొప్ప ఆనందాల్ని ఒకే ఒక్క విషాదం తలదన్నుతుందని ఎరిగిన ఒక గొప్ప దర్శకుని చేతుల్లో –అయిదారు దశాబ్దాలు పైగా ప్రాణం పోసుకు బతికే గొప్ప దృశ్య కావ్యం తయారవుతోందని ఆయనకి తెలీదు. ఆ మాటకి వస్తే హృషీకేశ్ ముఖర్జీకీ తెలీదు. వండే పాయసంలో ప్రతీ జీడిపప్పు రుచీ ఎవరూ పసిగట్టలేరు –వండే మనిషితో సహా. మరో గొప్ప పార్శ్వం –ఆయన కీర్తి ప్రతిష్టలనే గొప్ప పర్వతాన్ని గర్వంగా అధిరోహించాడు. కాని కొండ దిగడానికి ఇష్టపడలేదు. అశోక్ కుమార్‌లాగనో, అమితాబ్ బచ్చన్‌లాగనో కారెక్టర్ పాత్రలు నటించలేదు. హీరో దశ గడిచాక పక్కకి తప్పుకున్నాడు. నాకు తెలిసి ప్రపంచ సినిమా చరిత్రలో అలాంటి పని చేసిన హీరోయిన్లు ఇద్దరే ఇద్దరు – గ్రేటా గార్బో, సాధన. రాజేష్ వృద్ధాప్యాన్ని ఈ మధ్యనే దేశం చూసింది. ఆయన మాసిన గెడ్డాన్ని ఆ తరం ఏనాడూ చూడలేదు. "మీరు సూపర్ స్టార్ కాదని మీకు ఎప్పుడు అర్థమయింది?" అని ఎవరో అడిగారట. "రోజూ నా యింటికి ట్రక్కుల్లో వచ్చే పూల గుత్తుల సంరంభం ఆగిపోయినప్పుడు" అన్నారట రాజేష్ ఖన్నా.

'ఇక చాలు' అనడం జీవితంలో గొప్ప సంస్కారం. దాన్ని వయస్సో, అసమర్థతో, ప్రేక్షకులో నిర్దేశిస్తారు. చివరి దశలో ఎదురయిన విషాదాన్ని – కేన్సర్‌ని –ప్రపంచం ముందు పరచకుండానే తన పాత్ర 'ఆనంద్' అంత హుందాగా నిష్క్రమించిన మొదటి సూపర్ స్టార్ రాజేష్‌ఖన్నా. ఆయన కన్ను మూశాక కూడా ఆయన పంచిన ఆనందాన్నే అభిమానులు గుర్తుచేసుకున్నారు. ఆయన దయనీయమయిన దురదృష్టాన్నో, ఆఖరి రోజుల యాతననో కాదు. అది ఆయన డిగ్నిటీకి ఉదాహరణ. మృత్యువుని కేవలం నిష్క్రమణకి సంకేతంగా మాత్రమే నిలిపిన కారణజన్ముడు –ఆ కారణానికీ 'సూపర్ స్టార్' రాజేష్‌ఖన్నా.

(జూలై 23,2012)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (July 30, 2012)Olympics A Wonder ఒలింపిక్స్:ఒకఅద్భుతం

కొన్ని క్రీడల్ని చూస్తున్నప్పుడు –ఇంత చిన్నవయసులో –యింత సుతిమెత్తని శరీరాల్లో ఈ క్రీడాకారిణులు ప్రపంచాన్ని జయించాలనే వజ్రసంకల్పాన్నీ, జయించే ప్రతిభనీ భగవంతుడు ఎలా సిద్ధం చేశాడా అని ఆశ్చర్యం కలుగుతుంది. తొలి వింబుల్డన్ విజయం నాటి మేరియా షారాపోవా, అలనాటి మార్టినా హింగిస్, 16 ఏళ్లనాటి ఒలింపిక్స్ క్రీడాకారిణి కెర్రీ స్ట్రగ్ కొన్ని ఉదాహరణలు. సరిగ్గా 16 ఏళ్ల కిందట అప్పటి 18 ఏళ్ల అమ్మాయి కెర్రీ స్ట్రగ్ ప్రపంచాన్ని జయించిన అద్భుతమయిన కథని ఆ రోజుల్లోనే ఒక కాలమ్ రాశాను. ఒలింపిక్ క్రీడలు ఇంగ్లండులో ప్రారంభమయిన ఈ సందర్భంలో ఆ అనూహ్యమైన విజయాన్ని మరొక్కసారి జ్ఞాపకం చేసుకోవడం విషయాంతరం కాదు. ఒలింపిక్ చరిత్రలోనే అది మరిచిపోలేని క్షణం. ప్రపంచమంతా విస్తుపోయి చూసిన క్షణం. అందరి కళ్లల్లో నీళ్లు తిరిగిన క్షణం. మానవుని సంకల్పబలానికి శారీరకమైన పరిధులు కూడా అడ్డంగా నిలవలేవని 18 ఏళ్ల అమ్మాయి నిరూపించిన అపూర్వమైన సందర్భం. క్రీడా స్థలంలో ఉన్న 32 వేలమంది, టీవీల్లో చూస్తున్న లక్షలాదిమంది గుండె చప్పుళ్లు ఒక్కక్షణం నిలిచిపోయిన క్షణం.

అది 'జిమ్నాస్టిక్స్' పోటీ. వాల్ట్స్ మీద క్రీడాకారిణులు చేసే విన్యాసాలు. విన్యాసం ముగిశాక వాల్ట్స్ మీదనుంచి చివర కిందకి దూకాక తడబడకుండా క్రీడాకారిణి ఒక్కక్షణం నిలవాలి. అప్పుడూ క్రీడ పూర్తయినట్టు. ఈ క్రీడలో సాధారణంగా ముందు నిలిచే రష్యా, రుమేనియా ఆనాడు వెనుకపడ్డారు. అమెరికా క్రీడాకారిణి కెర్రీ స్ట్రగ్ ముందంజ వేసింది. అయితే తొలి రౌండ్స్‌లో ఆమెకి మిణుకు దగ్గర బెణికింది. దాన్ని ప్రేక్షకులు గుర్తించారు. కోచ్ కెరోల్యీ కూడా గుర్తుపట్టాడు. ఇక ఆఖరి అవకాశం ఉంది. ఈ రౌండు పూర్తి చేయగలిగితే స్వర్ణం ఆమెదే. కాదు అమెరికాది.

"ఆగిపోతేనో!" అంది స్ట్రగ్.

"వద్దు. నువ్వు గెలుస్తావమ్మా. నువ్విప్పుడు కెర్రీవి కావు. ఒక దేశానివి" అని ప్రోత్సహించాడు కెరోల్యీ. వస్తున్న కన్నీళ్లని బనీనుతో తుడుచుకుంది. వాల్ట్స్ దాకా వెళ్లడానికే కాళ్లు సహకరించలేదు. ప్రేక్షకులకూ ఆమె బాధ అర్థమౌతోంది. ఒక్క పరుగులో ఎగిరి వాల్ట్స్ మీద విన్యాసం చేసి దూకింది. అంతే. కాలి మణికట్టు దగ్గర ఎముక విరిగింది. విరిగిన శబ్దం అందరికీ తెలిసింది. ఆమె శరీరంలో ప్రకంపన తెలిసింది. ప్రేక్షకులు 32 వేలమందీ గతుక్కుమన్నారు. ప్రపంచం ఆ క్షణంలో ఊపిరి బిగబట్టింది. ఆ దశలో ఆమె ఆమె కాదు. ఒక దేశపు ఘనత. ఒక లక్ష్యానికి సంకేతం. ఆమె జీవితంలో కాదు, దేశ చరిత్రలో కాదు –ఒలింపిక్స్ చరిత్రలో ఒక మైలురాయి. గాలిలోకి లేచింది. ఎత్తివేసే ప్రతి అడుగులోనూ విరిగిన ఎముక మరింత తునాతునకలవుతోంది. గాలిలో ఒకటిన్నర మొగ్గ. విరిగిన కాలిమీద నేలమీదకు దిగాలి. అదొక భయంకరమైన క్షణం శరీరానికి. కాని అదొక అద్భుతమైన చరిత్ర –దేశానికి, ఒలింపిక్స్‌కి.

ఇదే భగవద్గీత. 'నియతం కురు కర్మత్వం...'

ఈసారి మరిన్ని ఎముకలు విరిగాయి. నిలదొక్కుకుని నిలుస్తుందా? ప్రపంచమంతా ఒక్కటయి ఆమె నిలవాలని ప్రార్థించింది. ఊపిరి బిగబట్టింది. ఒక్కక్షణం. నిలిచింది కెర్రీ స్ట్రగ్. ప్రపంచం నిలబడి నివాళులర్పించింది. న్యాయనిర్ణేతలూ నివ్వెరపోయారు. ఇది ఒక క్రీడాకారిణి




ప్రతిభకే కాదు. అద్భుతమైన లక్ష్యశుద్ధికీ సంకల్పబలానికీ విజయం. ఒక్క క్షణం తర్వాత –నేలమీద కుప్పలాగ కూలిపోయింది స్ట్ర గ్. కోచ్ కెరోల్యీ వచ్చి ఆమెని గర్వంగా రెండు చేతుల్లోకీ ఎత్తుకున్నాడు.

"వెళ్లి స్వర్ణాన్ని అందుకోవచ్చా?" అంది కెర్రీ.

"ప్రపంచమంతా ఎదురయినా నీతో నేను నిలబడతానమ్మా" అన్నాడు కెరోల్యీ. ఆ ఫొటో ఒక అద్భుతమైన జ్ఞాపకం."భగవంతుడు అందమైన రబ్బరు బొమ్మల్ని తయారు చేసి అందులో ఎముకల్ని ఉంచడం మరిచిపోయాడేమో!" అన్నాడో పాత్రికేయుడు ఈ విన్యాసాన్ని చూసి. అతను పొరపాటు పడ్డాడు. భగవంతుడు ఎముకల్ని ఉంచి అందులో అనూహ్యమైన చిత్తశుద్ధినీ, సంకల్పబలాన్నీ ఊహించలేని పదార్థంతో నింపాడు.


ఇది 1996లో జరిగింది. ఇప్పుడు కెర్రీ స్ట్రగ్‌కి 34. ఆమె ఒలింపిక్స్ క్రీడల్లో చరిత్ర.

మనిషి మనస్సులో ఏర్పరుచుకున్న సాధనాబలంతో శరీరానికి మించిన లక్ష్యాల్ని సాధించవచ్చునని నిరూపించిన అమృత క్షణాలవి.

(జూలై 30, 2012)



# (August 06,2012) Remdu Pustakalu Remdu Prapamchalu రెండు పుస్తకాలు– రెండు ప్రపంచాలు




అనుకోకుండా రెండు వేర్వేరు కారణాలకి రెండు విచిత్రమైన, విభిన్నమైన పుస్తకాలను ఒకదాని వెంట మరొకటి చదివాను. ఒకటి: దలైలామా ఆత్మకథ (మై లైఫ్ అండ్ మై పీపుల్, మెమొరీస్ ఆఫ్ హిజ్ హోలీనెస్ దలైలామా). రెండోది: ఒక నేర పరిశోధకుడు హుస్సేన్ జైదీ రాసిన దావూద్ ఇబ్రహీం జీవిత కథ (డోంగ్రీ టు దుబాయ్).

ఈ రెండింటిలో సామాన్య గుణాలేమిటి? ఇద్దరూ తమ మాతృదేశం నుంచి వెళ్లిపోయిన కాందిశీకులు. దలైలామా టిబెట్ నుంచి భారతదేశం వచ్చారు. దావూద్ ఇబ్రహీం భారతదేశం నుంచి పాకిస్థాన్ వెళ్లారు. ఒకాయన తన దేశం మీద జరిగిన దురాక్రమణ నుంచి తలదాచుకోడానికి దేశం వదిలిపెట్టారు. మరొకాయన తన దేశంలో జరిపిన నేరకాండ నుంచి తప్పించుకోడానికి దేశం ఎల్లలు దాటారు. ఇద్దరూ ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధులు. ఫోబ్స్ పత్రిక దావూద్ ఇబ్రహీంని ప్రపంచంలోకెల్లా అతి శక్తివంతులయిన వ్యక్తుల జాబితాలో 50వ స్థానంలో నిలిపింది. దలైలామా ఆ జాబితాలో లేరు! చెడు విశ్వవిఖ్యాతిని సాధించింది. మంచి ఇంకా మరుగునే ఉంది!

దలైలామా సాక్షాత్తూ గౌతమ బుద్ధుని అవతారంగా ఆ దేశ ప్రజలు భావిస్తారు. ఆరాధిస్తారు. ఇప్పటికీ ఆయన ధరమ్ శాల నుంచి తమ ప్రజల్ని పాలించే మహారాజే. దావూద్ ఇబ్రహీం మాఫియా గాంగ్‌కి మహారాజు. దొంగరవాణాదారుడు. మాదకద్రవ్యాల పంపిణీదారుడు. పట్టపగలే ఎన్నో

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

హత్యలు చేయించాడు. కొన్ని చేశాడు. అతని కార్యకలాపాలు ఎన్నో దేశాలలో నిర్విఘ్నంగా సాగుతున్నాయి. పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, ఇండోనీషియా, నేపాల్, థాయ్‌లాండ్, దక్షిణ ఆఫ్రికా, బ్రిటన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సింగపూర్, శ్రీలంక, జర్మనీ, ఫ్రాన్స్, బంగ్లాదేశ్, ఫిలిప్పైన్స్, మలేషియా, ఇండియా. దావూద్ ఇబ్రహీం నిస్సందేహంగా నేర చరిత్ర మూర్తీభవించిన అవతారం. దాదాపు నూరు హత్యలు చేయించిన ఘనత ఆయనది. దలైలామా దయ, కారుణ్యం మూర్తీభవించిన వ్యక్తి. దావూద్ ఇబ్రహీం పగ, కార్పణ్యం, అధికార వ్యామోహం మూర్తీభవించిన వ్యక్తి. దలైలామా ఓ మామూలు రైతుబిడ్డ. దావూద్ ఇబ్రహీం నిజాయితీపరుడైన ఓ పోలీసు కానిస్టేబుల్ కొడుకు. దలైలామాను పదవి, అధికారం వరించింది. దావూద్ ఇబ్రహీం రక్తపాతంతో, దుర్మార్గంతో అధికారాన్ని చేజిక్కించుకున్నాడు. దలైలామా చెప్పిన ఈ వాక్యం మరువరానిది. 'బాధ ఆనందాన్ని తూకం వేసే కొలబద్ద' అని. కానీ దావూద్ ఇబ్రహీంకి 'హింస ఆనందాన్ని చేజిక్కించుకునే మార్గదర్శి'. ఇద్దరూ కొన్నివేల మైళ్ల దూరంలో పొరుగు దేశాలలో ఉంటున్నారు. గత కొన్ని దశాబ్దాలుగా లక్షలాది టిబెట్టన్లను చైనా మట్టుబెట్టినా దలైలామా ఒకమాట అన్నారు: వస్తుత: చైనీయులు ఉత్తములు. కాని పాలక యంత్రాంగంలో కొందరు వ్యక్తుల దుశ్చర్యల ఫలితం ఈ వినాశనం. ఆయన పుస్తకంలో ఆఖరి మాటలివి: "టిబెట్టు ప్రజల ఓర్పు సహనాల మీద నాకు అపారమైన నమ్మకం ఉంది. మానవాళి అంతరంగాలలో నిజాయితీ, న్యాయదృష్టి మీద నా విశ్వాసం యింకా సడలిపోలేదు". దావూద్ ఇబ్రహీం జీవిత చరిత్ర రాసిన రచయిత ఇలా అంటారు: దావూద్ ఇబ్రహీం పగని దాటి చూడలేడు. తన చుట్టూ ఉన్నవారంతా తనకి కీడు తలపెట్టేవారేనన్న భయం కలవాడు. వ్యక్తిగా హత్యలు చేసే ప్రవృత్తి అతనిది. వివేక రహితమైన ఆవేశం, ఆక్రోశం అతని స్వభావం.

విచిత్రంగా ఒక్కసారి –ఒకే ఒక్కసారి –ఇద్దరి ప్రపంచాలూ ఒక సందర్భంలో దగ్గరయాయి. ఇందులో ముఖ్య పాత్ర హిందీ సినీనటి మందాకినిది. ఆమె మీరట్ వాస్తవ్యురాలు. అసలు పేరు యాస్మిన్ జోసెఫ్. ప్రముఖ నిర్మాత, నటుడు రాజ్‌కపూర్ తన చిత్రం "రామ్ తెరీ గంగా మైలీ"లో నటించడానికి ఆమెని ఎంపిక చేశాడు. తడిసిన బట్టల్లో ఆమె శరీరాన్నీ, అంగాంగాల్నీ చూసి దేశం మూర్ఛపోయింది. అతి విచిత్రంగా నా సరసన 'సార్వభౌముడు' అనే బాలకృష్ణ చిత్రంలో నా ఉంపుడుకత్తెగా నటించింది. మత్తెక్కించే అందం, కైపెక్కించే శరీరం ఆమె సొత్తు. ఒకసారి షార్జాలో జరిగిన భారత –పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్‌లో ప్రేక్షకుల్లో దావూద్ ఇబ్రహీం సరసన ఆమె కనిపించింది. పాత్రికేయులకు ఈ కొత్త సంబంధం –దాని వెనక గల కథా చాలా ఆసక్తిని కలిగించింది. వివరాలను బయటికి లాగగా ఆమె పేరిట బెంగుళూరు శివార్లలో ఓ తోట రిజిస్టర్ అయినట్టు బయటపడింది. తరువాత ముంబయి సినీరంగం ఆమెని దూరంగా ఉంచింది. చిత్రాలు కరువయాయి. అయితే ఈ ఇద్దరి ప్రపంచాలకూ ఈ పాత్రకీ ఏమిటి సంబంధం? చాలా సంవత్సరాల తర్వాత ఈ యాస్మిన్ జోసెఫ్ –ఊహించలేని వ్యక్తిని –దలైలామా అనుచరుడు డాక్టర్ కుగయూర్ రింపోచో ధాకూర్‌ను పెళ్లి చేసుకుంది. అంతేకాదు. తనూ బౌద్ధమతాన్ని స్వీకరించింది. తరతరాలుగా శాంతియుతంగా బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా జీవించే దేశం –టిబెట్ మీద దాడి చేసి, మత ప్రాతిపదికతో తమ మానాన తాము జీవించే ప్రజల మీద అమానుష చర్యలను చైనా జరిపినప్పుడు, దలైలామా అన్న మాటలివి: "హింస ఏనాటికీ ఆచరణ యోగ్యం కాదు. అహింస ఒక్కటే నైతికమయిన ప్రత్యామ్నాయం... మమ్మల్ని హింసించవచ్చు. తరతరాల మా వారసత్వాన్ని నాశనం చెయ్యవచ్చు. అయినా తలవొంచే మా జాతి ధర్మాన్ని వదులుకోం". దావూద్ సోదరుడు సబీర్‌ని శత్రువర్గం వారు చంపినప్పుడు, ఇవీ దావూద్ కథని రాసిన రచయిత మాటలు:




"దావూద్‌లో క్షమించే గుణం ఏకోశానికీ లేదు. తన తమ్ముడిని చంపిన ప్రతీ వ్యక్తినీ చంపి పగ తీర్చుకుంటానని ప్రతిజ్ఞ చేశాడు. దరిమిలాను అతన్ని చంపాడు. అతని శరీరం మీద బులెట్ల వర్షం కురిపించాడు. చచ్చిన శవం మీద కాండ్రించి ఉమ్మాడు. తన సొంత చేతుల్తో చంపే అవకాశం, చర్య దావూద్‌కి ప్రీతిపాత్రమైనది. కోపంతో అతనికి విచక్షణా జ్ఞానం పోతుంది."ఇటు ఓ మామూలు రైతుబిడ్డ భగవంతుడి అవతారమై నిలిచాడు. అటు ఓ నిజాయితీపరుడి కొడుకు రాక్షసత్వానికి ప్రతిరూపమై నిలిచాడు.మానవస్వభావం పరిపుష్టం కావడానికి పుట్టుక తప్పనిసరిగా ఏ కాస్తో కారణమవుతుంది. కాని అంతకంటే పెరిగిన వాతావరణం, మన చుట్టూ ఉన్న వ్యక్తులూ పూర్తిగా మన జీవికనీ, మన సంస్కారాన్నీ నిర్దేశిస్తాయి. ఇందుకు ఆదిశంకరుల మాటే అక్షరాలా సాక్ష్యం చెప్తుంది. సత్సాంగత్యమే మనిషి ఎన్నో మెట్లు ఎక్కించి జీవన్ముక్తిని కలిగిస్తుందన్నారు ఆదిగురువులు. ఇందుకు రెండు వైపులా రెండు విభిన్నమైన ఎల్లలు ఈ ఇద్దరు వ్యక్తులూ, వారి జీవితాలూ.

(ఆగస్టు 06, 2012)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (August 13, 2012) Himanagam ఈ శతాబ్దపు హిమనగం



నాకు తెలిసి గత వంద సంవత్సరాలలో ముగ్గురే ముగ్గురికి తమ జీవితకాలంలోనే శతజయంతి ఉత్సవాలు జరిగాయి. ఒకరు: ప్రముఖ ఇంజనీరు, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య, కంచి కామకోటి పీఠాధిపతి, పరమాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి, మూడవ వారు సంగీత కళానిధి, పద్మభూషణ్, కళాప్రపూర్ణ డాక్టర్ శ్రీపాద పినాకపాణి. నా ఉద్దేశంలో వందేళ్ల బ్రతకడానికి శరీర ఆరోగ్యంకంటే ముఖ్యమైందీ, అవసరమైందీ మరొకటి ఉన్నదని, జీవితం పట్ల ఒక ఆరోగ్యకరమైన దృక్పథం, ఒక ఉదాత్తమయిన వర్తన కేవలం ఆహారంకంటే మరేదో జీవలక్షణాన్ని ప్రోదు చేస్తుంది.ఈ మధ్య ఆయన పాత పేపర్లని వారబ్బాయి తిరగేస్తూండగా ఆ రోజుల్లో రేడియోలో పాడినందుకు గాను యివ్వగా మార్చుకోని ఎన్నె చెక్కులు బయటపడ్డాయట. ఆయన జీవితంలోఎందరో సత్కరించిన బంగారు పతకాలు తను సంపాదించినవి కావని నమ్మి – భద్రాచలంలో సీతమ్మకి పాదుకలు చేయించాలని సంకల్పించారు. అయితే విగ్రహాలకు అవి అమరవని ఆలయ అధికారులు చెప్పిన మీదట సీతమ్మకు వడ్డాణం చేయించారు. ఈ రెండు సంఘటనలూ ఆయన కీర్తి ప్రతిష్టలూ, సంపాదనకు అతీతమైన మరేదో స్థాయిలో తన దృక్పథాన్ని నిలుపుకున్నారని అర్థమౌతుంది. ఇదే నేను చెప్పిన ఆ 'మరొకటి'. ఇది ఒక కారణం. యోగశాస్త్రం రీత్యా 'ప్రాణాయామం' చిరంజీవత్వానికి దగ్గర తోవ అన్నది లోకవిదితం. మరి 88 సంవత్సరాల పాటు వందలాది వేలాది ప్రయోగాలతో ఎన్నో రాగాలను లయబద్ధంగా, శృతిబద్ధంగా గానం చేసిన గాయకులు –ఆ యోగాన్ని మరొక ఉన్నత స్థాయిలో ఉపాసన చేశారు. తన శరీరాన్ని ఒక శృతిబద్ధమైన వాద్యంగా తీర్చిదిద్దుకున్నారు. అది మహాయోగం. దీన్ని తపస్సులాగ నిర్వర్తించి చిరాయువుని పొందిన మరికొందరి ఉదాహరణలు –శెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్, ఎమ్.ఎస్ .సుబ్బులక్షి , డి.కె.పట్టామ్మాళ్. నా జీవితంలో ప్రత్యేకమైన అదృష్టం శ్రీపాదవారి ఇంటి అల్లుణ్ణి కావడం. పినాకపాణి గారి పెద్దన్నయ్యగారు నాకు పిల్లనిచ్చిన మామగారు. 51 సంవత్సరాల కిందట పినాకపాణి గారు నా పెళ్లిలో చాంబరు కచ్చేరీ చెయ్యడం నాకు గొప్ప జ్ఞాపకం. ఆనాడు వారు పాడిన ఒక కీర్తన కూడా గుర్తుంది. కాపీనారాయణి రాగంలో త్యాగరాజ కీర్తన 'సరససామదాన'. తర్వాత నేను ఆలిండియా రేడియోలో చేరడం –వారితో, వారి సంగీతంతో మరింత దగ్గర సంబంధం ఏర్పడింది.




నేను కడప రేడియో స్టేషన్ ఇన్‌చార్జిగా ఉన్నప్పుడు పినాకపాణిగారు కచ్చేరీకి వచ్చారు. అది 1981. ప్రముఖ మృదంగ విద్వాంసులు పాల్ఘాట్ మణి అయ్యర్ అంతకుముందే గతించారు. ఆ సందర్భాన్ని గుర్తు చేస్తూ "ఆయన పోయినప్పుడు వారి పాత రికార్డింగులు ప్రసారం చేశారు. మా రికార్డింగులేమైనా ఉంచుతున్నారా?కాలం ఒక్కలాగ ఉండదు. ఎప్పుడేం జరుగుతుందో!" అన్నారు నాతో. నేను నవ్వి చాలా ఉంటాయన్నాను. తర్వాత మరో 31 సంవత్సరాలు జీవించారు! ఇంకా జీవిస్తున్నారు. వారు కాలాన్ని జయించిన చిరంజీవులు. మరోసారి వారింటికి వెళ్లినప్పుడు అన్నారు: "75 ఏళ్లు వచ్చాక నా జీవితంలో చరమ దశకి వచ్చాను. ఇక చాలు అనుకున్నాను" అన్నారు. కాని సంగీత ప్రపంచానికి వారి నిజమైన సేవలన్నీ ఆ తర్వాతే జరిగాయి. వారి 'సంగీత సౌరభం –700 పుటల నాలుగు భాగాలు, ఇంకా ఎన్నో గ్రంథాలు ప్రచురితమయ్యాయి. ఒకసారి నాతో తిరువయ్యూరులో వారి తొలినాటి కచ్చేరీ గురించి ప్రస్తావించారు. కచ్చేరీ అయాక అరియక్కుడి వారి భుజం తట్టి "మీ గానంలో ఎందరో సంప్రదాయజ్ఞుల బాణీలు తెలుస్తున్నాయి" అన్నారట. ఆయన మార్గదర్శకులలో అరియక్కుడి ఒకరు. నేనన్నాను –మీరు ఆత్మకథ ఎందుకు రాయకూడదు? అని. రాస్తే ఎవరూ నమ్మరేమో! అన్నారు. "అది వారి ఖర్మ. కాని ముందు తరాలకి మీ కథ మార్గదర్శకమవుతుంది" అని అప్పట్లో ఆంధ్రప్రభ వారపత్రికని చూస్తున్న మిత్రులు వాకాటి పాండురంగరావుగారికి ఉత్తరం రాశాను –మీరు ఆత్మకథని వ్రాయమని పినాకపాణిగారిని ఆహ్వానిస్తే బాగుంటుందని. పాండురంగరావుగారు ఉత్తరం రాశారు. తత్ఫలితంగా 'నా సంగీత యాత్ర' రూపుదిద్దుకుంది. అదినాకు ప్రత్యేకమైన గర్వకారణం.విశ్వనాథవారు చెప్పినట్టు పినాకపాణి గారి శిష్యులు గర్వంగా 'అల నన్నయ్యకు లేదు తిక్కనకు లేదా భాగ్యము' అని చెప్పుకోగలిగే ధిషణాహంకారం చూపగలిగినంత ఉద్దండులు. ఈ పద్మభూషణ్ శిష్యుడు మరొక పద్మభూషణ్ నూకల చినసత్యనారాయణ. ఈ సంగీత కళానిధి శిష్యుడు మరొక సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి. ఇంకా పద్మశ్రీ శ్రీరంగం గోపాల రత్నం, ఈ బిరుదులు లేకపోయినా ఆ స్థాయిలో నిలవదగిన మరొక గాయకులు వోలేటి వెంకటేశ్వర్లుగారు. నా అదృష్టం రేడియోలో వీరందరితోనూ కలిసి పనిచెయ్యడం. వారి మనోధర్మాన్ని ఈ తరంలో అందలమెక్కిస్తున్న రెండవతరం గాయకులు మల్లాది సోదరులు, వైణికురాలు జయలక్ష్మి శేఖర్. సంగీతానికి సరికొత్త బాణీని –పాణిబాణిని పరిచయం చేసిన సంగీత మూర్ధన్యులు పినాకపాణి. ఈ వయస్సులోనూ వారి మనస్సంతా సంగీతమే నిండిపోయింది. ధమనుల్లో గానసుధే ప్రవహిస్తోంది. ఆ మధ్య వారిని కలిసినప్పుడు పాడుకొంటూ "ఇంకా భైరవి పూర్తి స్వరూపం అందడం లేదండీ!" అన్నారు గత 88 సంవత్సరాలుగా సంగీతాన్ని ఉపాసిస్తున్న ఈ రుషి. "ఇప్పుడు వెళ్ళిపోవాలని లేదు. నాకున్నదంతా, నాకు తెలిసిందంతా నలుగురికీ పంచిపెట్టేసి, పిండేసిన గుడ్డలాగ ఈ కట్టె కట్టెలమీదకి పోవాలి" అన్నారు. ఏ చిన్న గమకమైనా, స్వరమైనా ఆర్ద్రమై ఆయన హృదయాన్ని తాకుతుంది. కళ్లు ఆనందంతో నీటి చెలమలౌతాయి. నూరేళ్ళ జీవితాన్ని చరితార్థం చేసుకున్న ఈ గాయకుని మరో అరుదైన అదృష్టం –గత ఎనిమిదేళ్లుగా మంచం మీదే పడుకుని ఉన్న వారిని కంటికి రెప్పలాగా సాకే ఇద్దరు కుమారులు ఉండడం –కా.పాప, డాక్టర్ గోపాల్. ఇద్దరూ ఆలయంలో మూలవిరాట్టుకి చేసినట్టు సేవలందిస్తున్నారు. మూర్తీభవించిన శ్రావణ కుమారులు. సంగీత ప్రపంచం వారికీ రుణపడి ఉంటుంది.మనస్సుని సంగీతానికి ఆలయాన్ని చేసి, జీవితాన్ని ఉపాసన చేసుకున్న ఈ శత వర్షగాయకులు మరిన్ని సంవత్సరాలు రోగ్యంగా, వారి లక్ష్యం వేపు యాత్రని కొనసాగించగలరని ఆ పరమేశ్వరుడిని ప్రార్థిద్దాం.

(ఆగస్టు 13, 2012)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (August 20,2012) Manaki Swatantryam Vacchindi మనకి స్వాతంత్ర్యం వచ్చింది!

మనకి 65 ఏళ్ల కిందట స్వాతంత్ర్యం వచ్చింది.

మనం గర్వపడే అభివృద్ధిని చూసుకుందాం

ఈ దేశ చరిత్రలో మొదటిసారిగా ఓ కేంద్ర మంత్రి అవినీతి ఆరోపణలకి జైలుకి వెళ్లాడు.

అతని మీద క్రిమినల్ చర్యని ప్రారంభించవచ్చునని సుప్రీం కోర్టు ఆదేశించింది.

ఓ ముఖ్యమంత్రి కూతురు అవినీతితో కోట్లు దోచుకున్నందుకు జైలులో ఉంది, ఈ దేశం గర్వపడే కామన్వెల్త్ క్రీడల వ్యవహారంలో కోట్లు దోచుకున్న నాయకుడు, పార్లమెంటు సభ్యుడు –సురేష్ కల్మాడీ జైలుకెళ్లాడు.

లక్షల కోట్ల (5 బిలియన్లు) నల్లధనం విదేశీ జైళ్లలో మగ్గుతోందని బాబాలు, నీతిపరులూ నిరాహార దీక్షలు చేస్తున్నారు. ముంబై ఆదర్శ కుంభకోణంలో నేటి ముఖ్యమంత్రులూ, కేబినెట్ మంత్రులూ, సైనిక అధికారులూ వాటాలు పంచుకున్నారు.

ధనాన్ని దోచుకున్న ఓ రాష్ట్ర ముఖ్యమంత్రి –మధు కోడా –జైలు కెళ్లారు.

రెండుసార్లు క్రిమినల్ చార్జీల మీద అరెస్టయిన శిబు శొరేన్ కేంద్రంలో కేబినెట్ మంత్రి అయారు.

రాజస్థాన్ మంత్రి ఓ నర్సుతో ప్రేమ వ్యవహారం నడిపి ఆమె హత్యకి కారణమయ్యాడు. ఇప్పుడిప్పుడే మరో మంత్రిగారు ఎయిర్ హోస్టెస్‌తో రంకు నడిపి ఆమె ఆత్మహత్యకి కారణమయి పోలీసులకు లొంగిపోయాడు.

ఓ ముఖ్యమంత్రిగారి కొడుకు తన తండ్రిగారి హయాంలో లక్షల కోట్లు కొల్లగొట్టారని ఈ దేశపు నేరపరిశోధక సంస్థ కేసులు నడుపుతూండగా ఆయన జైలులోంచి ఒక పార్టీని నడుపుతున్నారు.

తేలికగా డజన్ల కొద్దీ ఐయ్యేయస్ ఆఫీసర్లు అలవాటుగా జైళ్లల్లో మగ్గుతున్నారు.

కనీసం ఆరుగురు రాష్ట్రమంత్రుల మీద అవినీతి పరిశీలన జరపాలని సుప్రీం కోర్టు ఆదేశించింది.

అవినీతి నేరానికి అరెస్టయి ఇప్పటికే ఒక రాష్ట్ర మంత్రి జైలులో ఉన్నారు.

నేరం నిరూపణ అయి శిక్ష పడిన మంత్రి ఇంకా పదవిలో ఉండే హక్కుని సమర్థించుకుంటున్నారు.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

నేరం చేశారని సిబిఐ చార్జిషీటు ఫైలు చేసిన మంత్రివర్యులు రాజీనామా చెయ్యనవసరం లేదని ఓ ముఖ్యమంత్రి గారు, సహచర మంత్రులు భావిస్తున్నారు!

తప్పులు చేసిన నాయకులు –తమ తప్పులో అందరివాటా ఉన్నదని తప్పించుకోవాలని చూస్తున్నారు. గాంధీ పుట్టిన దేశంలో కల్లు, మందు వ్యాపారాలు చేస్తున్న పెద్దలు నాయకులుగా చెలామణీ అవుతున్నారు.

గడ్డి తిన్న కుంభకోణంలో ఇరుక్కున్న నాయకులు పార్లమెంటులో నీతులు వక్కాణిస్తున్నారు.

నిజాన్ని బయట పెట్టే యువకులు నిర్దాక్షిణ్యంగా హత్యలకు గురవుతున్నారు.

ఏ కారణానికయినా తెలుగుదేశంలోనే తెలుగుదనాన్ని చాటిన మహానుభావుల విగ్రహాలను తెలుగువారే నేలమట్టం చేస్తున్నారు.

గనుల కుంభకోణంలో జైలు పాలయిన కర్ణాటక మంత్రి, తెలుగు రెడ్డిగారు కోట్ల ఖర్చుతో స్వేచ్ఛకి పెట్టుబడి పెట్టారు.

చట్టాన్ని ఖరీదుకి అమ్మే న్యాయమూర్తులు డబ్బుకి గడ్డి కరిచి ప్రస్థుతం జైళ్లలో మ్రగ్గుతున్నారు.

మన దేశంలో అక్రమ సంపదని చూసి సిగ్గుపడాలని ఒక రాజకీయ విశ్లేషకుడు స్వాతంత్ర్య దిన సందేశాన్నిచ్చారు.

రంకుతనానికి అరెస్టయిన యువతి తగిన రక్షణ కల్పిస్తే పెద్దల రంకుని బయటపెడతానని గర్వంగా జైల్లో రొమ్ము చరుస్తోంది.

తల్లీ తండ్రీ తర్వాత దైవంగా భావించే గురువు శిష్యులతో లైంగిక వేధింపులకి పాల్పడినందుకు ఒక విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌గారు అరెస్టయారు. శిష్యురాండ్రకి సాక్షాత్తూ తల్లి కావలసిన గురుపత్ని భర్తకి సహకరించిన నేరానికి అరెస్టయింది.

ఈ దేశంలోనే –ఈ దేశ ప్రజలకే రక్షణ లేదని ఈ మధ్య అస్సాంలో మత రాజకీయాలు నిరూపించాయి. అస్సాంలో దౌర్జన్యం, మారణకాండ ప్రకంపనలు మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, ముంబై, పూణ□, హైదరాబాద్‌లలో కనిపిస్తున్నాయి.

పార్లమెంటు అనే 'ఆత్మ'ని పవిత్రంగా కాపాడుకోవాలని ఈ దేశం రాష్ట్రపతి వాపోతూ స్వాతంత్ర్య దిన సందేశాన్ని ఇస్తున్నారు.

రాష్ట్రంలో మంత్రి పదవిలో ఉన్న ఘనత వహించిన మంత్రిగారు కష్టపడి పనిచేసి –కాస్త దోచుకుంటే తప్పులేదని –ఇప్పటికే దోచుకుంటున్న ఐయ్యేయస్‌లకు హితవు చెప్తున్నారు.

పదవిలో ఉన్న ముఖ్యమంత్రిగారు తమ నివాసానికి, తమ పార్టీకీ, తమ నాయకులకీ, తమ కులానికీ కోట్లు ప్రజాధనాన్ని వెచ్చించి స్మారక మందిరాలను నిర్మించుకుంటున్నారు.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

ప్రజాభిప్రాయం బహిరంగంగా చెప్పిన ప్రొఫెసర్లను ఓ ముఖ్యమంత్రి గారు హుటాహుటిన అరెస్టు చేయిస్తున్నారు. గుండాయిజం జరిపిన తమ పార్టీవారిని పోలీసులు అరెస్టు చేస్తే ముఖ్యమంత్రి స్వయంగా పోలీసు స్టేషన్‌కి వచ్చి వారిని విడిపించుకుపోయారు.

ఏ కారణానికయినా ఈ దేశపు ప్రధాన సైనికాధికారి ప్రభుత్వం మీద కోర్టుకెక్కారు.

ఏ కారణానికయినా ఈ దేశంలో ఉపాధ్యాయులు విద్యార్థుల్ని కొట్టి చంపుతున్నారు. అమ్మాయిల్ని బట్టలిప్పి పదిమంది ముందూ నిలబెడుతున్నారు.

కాశ్మీరు పండితుల్ని కాశ్మీరులోంచే తగిలేసిన మతం వారు కాశ్మీరు మన దేశంలోనే భాగంగా ఉండరాదంటున్నారు. కేంద్రం ఆదాయంలో 90 పాళ్లు అవినీతి పరుల ఖాతాల్లోకి పోతోందన్న శుభవార్తని ప్రధానమంత్రిగారు స్వాతంత్ర్య దిన సందేశంగా జాతికి వక్కాణించారు.

మన దేశంలో ప్రధాన న్యాయమూర్తి అక్రమ సంపాదన మీద కేసులు నమోదు అయ్యాయి.

ప్రపంచ అవినీతిలో మన దేశం 87వ స్థానంలోవుంది.

న్యాయమూర్తుల తీర్పుల్ని డబ్బిచ్చి కొనుక్కోవచ్చునని ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగారు సెలవిచ్చారు.

ఆడపిల్లలు బట్టలు సరిగ్గా వేసుకోని కారణం చేతనే వారిమీద అత్యాచారాలు ప్రబలుతున్నాయని భావించిన ఓ పోలీసు అధికారిమీద మహిళా సంఘాలు కత్తులు దూశాయి. ఉచిత మొబైళ్లూ, రూపాయి బియ్యాలూ పంచి వోట్లు దండుకోవాలని చూసే రాజకీయ పార్టీలు ప్రజల సామర్థ్యాన్ని పెంచాలన్న విషయాన్ని మరిచిపోయాయి. వారు మరిచిపోయారన్న విషయాన్ని ప్రజలూ మరిచి పబ్బం గడుపుకొంటున్నారు.

ప్రతిరోజూ చేపల్ని పంచి, చేపల్ని పట్టే రహస్యాల్ని గడుసయిన ప్రభుత్వాలు ఇప్పటికీ తమ చేతుల్లోనే ఉంచుకుంటున్నాయి. తమిళనాడులో బియ్యం నుంచి లాప్‌టాప్ దాకా, సైకిళ్ల నుంచి టీవీసెట్ల దాకా, మంగళసూత్రాల దగ్గర్నుంచి మాన మర్యాదలదాకా అన్నీ ఫ్రీ!

దౌర్జన్యకారుల పేరిట నోరులేని గిరిజనులను అధికారం అనునిత్యం చంపుతోంది. విప్లవం పేరిట ఈ తిరుగుబాటుదారులు పోలీసుల్ని చంపి భుజాలు చరుచుకుంటున్నారు.

జీవితం –కుళ్లిపోయిన పుల్ల విస్తరాకు –బడుగు వర్గాలకి. వడ్డించిన మృష్టాన్న భోజనం కలవారికి.

అవును, మనకి నిజంగానే స్వాతంత్ర్యం వచ్చింది!

(ఆగస్టు 20, 2012)

అలరించే సీరియల్స్ ఆకట్టుకునే కథలు ప్రతినెలా ప్రత్యేక కథనాలు పాఠకులూ పాల్గొనే ఫీచర్స్ శ్రీ కౌముది వినూత్నమైన సినీ విశేషాలు కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు.. ప్రతి పేజీలో కొత్తదనం.. ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (August 27,2012) Kotikokkadu కోటికొక్కడు

వి.వి.యస్.లక్ష్మణ్ క్రికెట్ కెరీర్ కి స్వస్తి పలికాడు. అందరూ ఏదో ఒక సమయంలో ఆ పని చెయ్యాల్సిందే. కానీ నేటి నుంచీ జరగబోతున్న న్యూజిలాండ్ మాచ్ లో జట్టుకి ఎంపిక అయిన తర్వాత – తన ఆటని చాలించుకోబోతున్నానని ప్రకటించాడు. ప్రపంచ చరిత్రలో ఇది మరొక రికార్డు. మనిషి జీవితంలో తనంతట తాను 'ఇకచాలు' అనుకోవడం అతని హుందాతనానికీ, ఆత్మతృప్తికీ, సమ్యమనానికీ – వెరసి వ్యక్తి గంభీరమైన శీలానికీ తార్కాణం.

లక్ష్మణ్ మొదటి నుంచీ అందరిలాంటి మనిషి కాడు. అందరిలాంటి ఆటగాడూకాదు. తన పనిని తాను నెరవేర్చి, తనవాటా బాధ్యతను నిర్వర్తించి, బోరవిరుచుకోకుండా తలవొంచుకు పక్కకి తప్పుకునే మనస్తత్వం అతనిది. ఇటీవలి కాలపు క్రికెట్ చరిత్రలో సామర్ధ్యం గల ఇద్దరు గొప్ప ఆటగాళ్ళు – ఈ దేశపు కీర్తిని ఆకాశంలో నిలిపినా – ప్రతీసారి జట్టులో తమ స్థానాన్ని నిలుపుకోడానికి తమ సామర్ధ్యాన్ని ఎప్పటికప్పుడు నిరూపించుకోవలసిన స్థితిలోనే ఉంటూ వచ్చారు – నాకు తెలిసి. ఒకరు మొహీందర్ అమర్ నాథ్. అలనాడు దేశం సాధించిన మొట్టమొదటి ప్రపంచకప్పు పోటీలో కీలక పాత్రని పోషించాడు. (ఫైనల్సు లో అతను మాన్ ఆఫ్ ది మాచ్). ఇక ఎన్నో సందర్భాలలో ఆటమీద మన జట్టు ఆశలు వదులుకున్న సమయంలో మౌనంగా మధ్యకి నడిచి చరిత్రను పదే పదే సృష్టించిన ఘనత లక్ష్మణ్ ది.

2001 మార్చి 13 చరిత్ర. కలకత్తాలో గ్రౌండులోకి నడిచి రెండు రోజులు నిర్విరామంగా ఆడి 281 పరుగులతో ఆస్ట్రేలియా వెన్నెముకలో చలి పుట్టించి, ప్రపంచాన్నే దిగ్భ్రాంతుల్ని చేసి, అలవోకగా 'విస్డన్ ' పుటల్లోకి దూసుకు వెళ్ళిన ఒకే ఒక్క ఆటగాడు వి.వి.యస్ లక్ష్మణ్. అతని ఆట క్రీడ కాదు. ఓ యాత్ర. ఓ ఉద్యమం. ఓ ఆదర్శం. జావీద్ మియాన్ దాద్ లాగ ప్రదర్శనగానో, వివ్ రిచర్డు లాగ పోటోగానో, బ్రియాన్ లారాలాగ పరిశ్రమగానో సాగించే మనస్తత్వం కాదు.

ఏనాడూ ఆట మధ్యలో మాట తూలిన సందర్భం లేదు. ఒక క్రమశిక్షణ, సమన్వయం, కర్మ సిద్ధాంతాన్ని నమ్ముకున్న యోగిలాగ లక్షల మంది మధ్య ఏకాంత యాత్ర సాగిస్తున్న పధికుడిలాగ కనిపిస్తాడు. క్రికెట్ అతని ఊపిరి. ధ్యేయం కాదు.

ఆయన జీవితంలో డాక్టర్ కావాలని ఆశించినట్టు కుటుంబ వర్గాలు తెలిపాయి. ఆశ్చర్యం లేదు. మరో రంగంలో మరో విధంగా ఆ పనే చేశాడు. ఆయన స్క్వేర్ కట్, ఫ్లిక్ – ఏ వైద్యుడో సశాస్త్రీయంగా, అతి సుతారంగా, అలవోకగా, కానీ నిర్దుష్టంగా – మరల్చగలిగిన కత్తివేటు. అవును. తన వృత్తిలో మెలుకువల్ని ఆపోశన పట్టిన అరుదైన డాక్టర్ క్రికెట్ మైదానంలో లక్ష్మణ్.

లక్షల మంది మధ్య ఒంటరి. ఏ ఇంటర్వ్యూ లోనూ తన బృందం గురించీ, దేశాన్ని గురించే తప్ప తన గురించి మాట్లాడిన దాఖలాలు లేవు. క్రికెట్ ఆటనుంచి విరమించుకోడానికి కారణాలు చెప్తూ – యువతరానికి అవకాశానికి దోహదంగా ఆ పని చెస్తున్నానన్నాడు. ఈ మాట అతని హృదయంలోంచి వచ్చిన మాట. మన రాజకీయ నాయకుల 'సమాజసేవ', 'లోకకళ్యాణం' లాంటి బూతు మాటకాదు.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

నా జీవితంలో ఒకే ఒక్కసారి కుర్రతనంగా పెంకితనాన్ని ప్రదర్శించాను. అతని పెళ్ళికి శుభాకాంక్షలు పంపుతూ 'వి.వి.యస్.లక్ష్మణ్, హైదరాబాదు' అని రాశాను. వారాల తర్వాత నాకు కృతజ్ఞతల ఉత్తరం వచ్చింది. ఆ మధ్య టైంస్ ఆఫ్ ఇండియా తరఫున "సురభి" అనే మాసపత్రిక సంపాదకుడిగా తెలుగులో లబ్దప్రతిష్టులయిన చాలామంది గురించి వరసగా వ్యాసాలను ప్రకటించాను. ఆ సందర్భంలో వి.వి.యస్.లక్ష్మణ్ మీదా రాయాలని తలంపు. పదిసార్లు ఆలోచించి ఆలోచించి అతనికి ఫోన్ చేశాను. నాకున్న పేరు ప్రతిష్టలు నాకున్నాయి.

కానీ లక్ష్మణ్ ప్రపంచ ప్రఖ్యాతిని సాధించిన ఆతగాడు. యువకుడు. చిన్న గోరోజనం, నిర్లక్ష్యం, అహంకారం – ఇలాంటివి ఏవయినా, అన్నీ అయినా ఉన్నా ఆశ్చర్యం లేదు. అబ్బురమూ కాదు. చాలా తక్కువ సందర్భాలలో ఇలా ఫోన్ చెయ్యడానికి సందేహించి ఉంటాను. అటు పక్క లక్ష్మణే మొబైల్ తీశారు. నా గొంతు వినగానే అతి మృదువుగా, మర్యాదగా, అణుకువగా "బాగున్నారాండీ?" అన్నాడు. పొంగిపోయాను. గొప్పతనానికి కళ్ళు ఆకాశంలో ఉంటాయి. వినయానికి హృదయం ఆకాశంలో ఉంటుంది. 'వినయం ' అంటే తలవొంచడం, తప్పుకోవడం కాదు. తన గొప్పతనం విలువ ఎరిగి, బేరీజు వేసుకుని దాన్ని సముచితమయిన స్థాయిలో నిలపగలగడం. ఆ పనిని అతి సమర్ధనీయంగా చేసిన సంస్కారి లక్ష్మణ్.

ఆయన దైవచింతనగల కుటుంబానికి చెందినవాడు. సాయి భక్తుడు. ఎదుర్కునే ప్రతి బంతిలోనూ పెదాలు కదుపుతూ దైవం పట్ల విశ్వాసాన్నీ, తోడునీ వదలనివాడు. తన బిడ్డలు – కొడుకుకి 'సర్వజిత్' అని పేరు పెట్టాడు. అంటే అన్నింటినీ జయించినవాడని అర్ధం. కూతురుకి 'అచింత్య' అని పేరు పెట్టాడు. అంటే ఏ చింతాలేని నిరంతనమైన శాంతిని సాధించుకున్నది అని అర్ధం. ఈ రెండు పేర్లూ లక్ష్మణ్ లోని రెండు ముఖ్యమైన స్వభావాలకు అద్దం పడతాయి.

జీవితంలో చాలామంది తమ వృత్తినుంచి రిటైరయే సమయానికి – ఏ వృత్తీ చేయలేని దశకి – వయస్సు రీత్యా రావడం రివాజు. కానీ క్రికెట్ లో పదవీ విరమణ జీవితంలోఒక దశ ముగింపుకి చిహ్నం కానీ రెండవ దశలో ప్రశాంతతకీ, మన్నికయిన జీవికకీ మొదటి దశలోనే పునాదులు వేసుకున్న లక్ష్మణ్ అదృష్టవంతుడు. చరితార్ధుడు. ఇంకొక్క మాట చెప్పాలి – కోటి మందిలో ఒక్కడు.

**(ఆగస్టు 27, 2012)**




# (September 03,2012) Namdo Raja Bhavishyati నందో రాజా భవిష్యతి

ఎంతమందినయినా అడిగాను ఈ లోకోక్తి వెనుక కథేమిటని. ఈ కథ నాకు బాగా నచ్చింది. ఓ రాజుగారికి ఇద్దరు భార్యలు. పెద్ద భార్యకి పెద్దకొడుకు. చిన్న భార్యకి చిన్న కొడు కు. అతని పేరు నందుడు. చిన్న భార్యమీద రాజుగారికి మోజు తీరిపోయింది. చిన్న భార్య తమ్ముడు ఏదో నేరం చేశాడు. ఉరిశిక్షని విధించింది న్యాయస్థానం. చిన్న భార్య బాధపడింది. తండ్రి సముదాయించాడు. కొడుక్కి ఉరిశిక్ష వేశారు. అంతేకద? శిక్ష అమలు జరిగేలోగా ఎన్నయినా జరగవచ్చు. ముసిలిరాజు మరణించవచ్చు. పెద్దకొడుకు రాజు అయాక అతనికి మతి చలించవచ్చు.

మతిలేనివాడికి రాజ్యాధికారం చెల్లదుకదా? అప్పుడు నందుడే రాజు కావచ్చు. ఇందులో ఉపశమనం ఉంది. ఆశావాది ముందుచూపు ఉంది. అంతకుమించి అవకాశవాది పలాయనవాదం ఉంది.ప్రస్థుతం ఆనవాయితీగా జైళ్లకు వెళ్లివస్తున్న నాయకుల ఆంతరంగిక స్నేహితుడు ఒకాయన ఈ మధ్య తారసపడ్డాడు. మాటల్లో "ఏమయ్యా, మీ నాయకులు జైల్లోంచి వచ్చినందుకే పండగ చేసుకుంటున్నారు. ముందుందికదా ముసళ్ల పండగ" అన్నాను. ఆయన నవ్వాడు. "అయ్యా, ఈ దేశంలో ఏ నేరం ఏ దశాబ్దంలో రుజవయింది? ఏ శిక్ష ఎవరికి అమలు జరిగింది? కోట్లు ఖర్చుపెట్టి బెయిల్ కొనుగోలు చేసే దేశంలో –కేసు ముగింపుకి రాకుండా సంవత్సరాల తరబడి సాగేటట్టు చూడడం ఏం కష్టం? ఈ మధ్య బొత్తిగా పత్రికలు, ఛానళ్ల గొడవ ఎక్కవయింది కనుక –చుట్టం చూపుగా ఈ మాత్రమయినా జైళ్లకి వెళ్లడం తప్పలేదు. రాజాగారి కేసే తీసుకోండి. లక్ష కోట్లు మాయం చేయగల నాయకునికి మరో 30 సంవత్సరాల దాకా కేసు ఓ కొలిక్కి రాకుండా చూడడం కష్టమా? అప్పటికి ఏ ప్రభుత్వం ఉంటుంది? ఏ చట్టాలుంటాయి? గడ్డి కరిచే ఏ న్యాయాధిపతులుంటారు? నేరం బయటపడినా పదవుల్ని వదలి ఏ నాయకులుంటారు? రాబోయే కాలంలో ఎందరు నందులో!" అన్నాడు. వారి దృష్టిలో జైలు నుంచి బెయుల్‌తో బయటికి రావడం ఒక విధంగా కేసుకి ముగింపు. మళ్లీ కనిమొళి, కల్మాడీ నేరాలు రుజువయి జైళ్లకి వెళ్తారా? ఏ పాతిక సంవత్సరాల మాటో –అధవా జరిగినా. నందో రాజా భవిష్యతి. అప్పటికి కనిమొళి పుత్రరత్నం ముఖ్యమంత్రి కావచ్చు. కల్మాడీ మనుమడు ప్రధాని కావచ్చు. రాజా మేనల్లుడు సీబిఐ అధిపతి కావచ్చు. పరిపాలనలో కాస్త అవినీతి తప్పుకాదనే ఉత్తరప్రదేశ్ మంత్రి (ములాయం గారి సోదరుడు) వంటి మహానుభావులు ఈ దేశపు నైతిక వ్యవస్థకి కొమ్ము కాయవచ్చు. తాజా ఉదాహరణ –మన కసాబ్‌గారు. మూడు రోజుల పాటు 166 మందిని చంపి, 238 మందిని గాయపరిచిన దౌర్జన్యకారుడి మీద సంవత్సరాల తరబడి విచారణ సాగింది. అన్ని కోర్టులూ అతనికి ఉరిశిక్ష ఖాయం చేశాయి. నిన్న మరొకసారి సుప్రీం కోర్టు ఖాయం చేసింది. చేసినప్పుడల్లా దేశం ఆనందించింది. ఇది రెండో నందుడి కథ. కేసు విచారణ తేలకపోవడం ఒక దశ. తేలినా శిక్ష అమలు జరగకపోవడం మరో దశ. ఆ మధ్య బ్రిటన్‌లో జరిగిన పేలుళ్లకి నిందితుల్ని అరెస్టు చేశారు. సరిగ్గా మూడే మూడు నెలలలో విచారణ ముగించి శిక్షలు అమలుచేశారు. మన దేశంలో కథ వేరు. 21 సంవత్సరాల కింద జరిగిన రాజీవ్‌గాంధీ హంతకులు ఇంకా జైళ్లలో ఉన్నారు. వీరప్పన్ అనుచరులు –సిమోన్. జ్ఞానప్రకాశం, మీసెకార్ మాదయ్య, బిళ్వేంద్రన్ జైలులో ఉన్నారు. అఫ్జల్‌గురు ఉన్నాడు. బబ్బర్ కల్సా దౌర్జన్యకారుడు బల్వంత్ సింగ్ రాజోనా ఉన్నాడు. ఆయన్ని ఈమధ్య –అంటే మార్చి 31, 2012న ఉరి తీయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాని సిక్కు వర్గాలు ధర్నా చేశాయి. శిక్ష అమలు జరగలేదు. ఈ దేశంలో అవినీతికి ఇన్ని దశలలో ఇన్ని సౌకర్యాలున్నాయి.రాష్ట్రపతి గారి దగ్గర 26 మంది




ఉరిశిక్షలవారు తమని రక్షించమన్న దరఖాస్తులున్నాయి. నలుగురు రాష్ట్రపతులు మారారు. కొత్త రాష్ట్రపతి ఏం చేస్తారు? శిక్షలు అమలు జరపడం ప్రారంభిస్తే ఎక్కడనుంచి ప్రారంభిస్తారు? సీనియారిటీ ప్రకారమా? చావు సీనియారిటీలో ఎవరు ముందు? కసాబ్ సాహెబ్‌గారా? అఫ్జల్ సాహెబ్‌గారా? ఈ దేశంలో నేలబారు మనిషి విలువ అతి చవక. మొన్న ముంబై పేలుళ్లలో చచ్చిపోయిన వారికి ఒక్కొక్కరికి 2 లక్షలు ప్రకటించారు ప్రధాని. కసాబ్‌గారి మీద ఇప్పటికి 42 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది ప్రభుత్వం! ఏమిటి ఈ నీతి? ఎవరు దీనికి జవాబుదారీ?

నాయకుల నిర్లజ్జకీ, నేరస్థుల నిస్సిగ్గుకీ ప్రభుత్వం కొమ్ము కాస్తోందనడానికి ఇంతకన్న ఉదాహరణలు ఏం కావాలి?

చట్టాన్ని అటెకెక్కించిన అలసత్వం ఒక పక్క.

చట్టాన్ని ఖరీదు చేసే వ్యాపారం మరొక పక్క.

చట్టాన్ని కాలదోషం పట్టించే చాకచక్యం మరొక పక్క.

హంతకుల్ని రక్షించే ఔదార్యం మరొకపక్క.

మన దేశం లో ఎందరో నందులున్నారు. రాష్ట్రానికొక నందుడు.

(సెప్టెంబర్ 03, 2012)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

## (September 10,2012) Kopparapu Kavulu కొప్పరపు కవులు

విదేశీయులకు నమ్మే అవకాశం ఎలాగూ లేదుకాని, స్వదేశీయుల్ని కూడా నమ్మించాల్సిన రోజులొచ్చేశాయి. ఎందుకంటే మన తెలివితేటలు ఎక్కువగా అక్కడినుంచే దిగుమతి అవుతున్నాయి కనుక. అయితే చూడాలనుకున్నవారికీ, తెలుసుకోదలిచిన వారికీ ఈ వైభవం కనిపించే దాఖలాలు ఈ సంస్కృతిలో ఇంకా ఇంకా మిగిలే ఉన్నాయి. ఇంతకీ ఏమిటి ఆ వైభవం? ఈ దేశంలో విద్య, విద్వత్తు కేవలం పరిశ్రమతో మాత్రమే ఒడిసి పట్టుకునే 'సాధన' మాత్రమే కాదు. ఒక అనూహ్యమైన స్థాయిలో విద్వత్తు, పాండితీ ప్రకర్ష 'దర్శనం'. ఆది శంకరులు తన ఆరవయేట సాహితీ జగత్తులో మకుటాయమానంగా నిలవగల 'కనకధారా స్తోత్రాన్ని' చెప్పారు. (ఈ కాలమ్ రాస్తూ ఈ నిజాన్ని మరొొక్కసారి రూఢి చేసుకోడానికి సామవేదం షణ్ముఖశర్మగారికి ఫోన్ చేశాను. ఆయన అనంతపురంలో ఇప్పుడే 'శంకర విజయం' ప్రవచనం చేసి అనుష్టానానికి కూర్చోబోతున్నారట. మీ ఫోన్ దైవికం అన్నారు). ఆటవికుడు కాళిదాసుకి అమ్మవారి దర్శనమయాక -అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ అద్భుతంగా నిలిచే 'శ్యామలాదండకం' చెప్పారు. దండకం ఒకే వాక్యంతో సాగుతుంది. అటువంటి దండకం నభోతో నభవిష్యతి. ఒక పుట్టుమూగ చెవిటి అయిన మూక కవి దేవీకృపతో నోరిప్పి 500 శ్లోకాలు ఆశువుగా చెప్పి -మళ్లీ మూగకావాలనే వరాన్ని అమ్మ దగ్గర అనుగ్రహంగా పొందాడు. ఈ మూడు తార్కాణాలూ మన కళ్లముందున్నాయి. అయితే మనకి విశ్వాసం స్థాయిపోయి, సహేతుకమయిన స్థాయిలోనే ఆలోచనల్ని పరిమితం చేసుకొనే రోజులొచ్చాయి. ఆశ్చర్యం లేదు. మన ఋషులు ఆచరించి సాధించిన యోగశాస్త్రాన్ని అమెరికా పేటెంటు చేసింది. పతంజలి అటకెక్కాడు. సరే. ఇలాంటి వారికి విద్వత్తు ఉపాసనాబలమని మనతరం లోనే రుజువు చేసిన ఇద్దరు మహానుభావులు పుట్టారు. వారు కొప్పరపు కవులు. పెద్దాయన వేంకట సుబ్బరాయశర్మ. (1885 -1932). చిన్నాయన వేంకట రమణ శర్మ (1887 -1942). చిన్నాయనని చూసిన తరం ఇంకా మన మధ్య ఉన్నది.ఒక భారతీయ సాహిత్యంలోనే కవిత్వాన్ని వినోదంగా, క్రీడగా చేసుకునే స్థాయిని సాధించిన ఘనత కనిపిస్తుంది. అది అవధాన ప్రక్రియ. సంస్కృత సాహిత్యం ఇందుకు మూలం. ఎంతో కొంత కన్నడంలోనూ అవధాన ప్రక్రియ వుంది. అయితే దీన్ని సొంతం చేసుకొని అనూహ్యమైన పరిణతిని సాధించిన ఘనత తెలుగువారిదే. ఇప్పటికీ అష్టావధానాలు, శతావధానాలు, సహస్రావధానాలూ చేసే పండితులు -ప్రముఖులు ఎందరో ఉన్నారు. ఆనాడు కేవలం సభలో కూర్చుని ఆనందించడమే కాక సామాజికులు కూడా తమదైన ప్రతిభతో అవధానులమీద పద్యాలు చెప్పేవారు. అదొక సమగ్రమైన విందు. సుబ్బరాయ కవి తన 5వ యేట హనుమత్ కవచ రూప నక్షత్రమాల అనే 27 పద్యాలు చెప్పారట. కొప్పరపు కవులు తమ ఎనిమిదవ యేటే శతకాలు ఆశువుగా చెప్పారు. తమ 12వ యేట అష్టావధానాలు చేశారు. 16 వ యేట శతావధానాలు చేశారు. 20వ యేటికి గంటకి 300 పద్యాలు చెప్పే ధారని సాధించారు. తెలిసిన పద్యాలు -300 చదవడమే గగనం. అలాంటిది ఆశువుగా చెప్పేవారు. 1916 నాటికి అలా మూడు లక్షల పద్యాలు చెప్పారట. మన దురదృష్టం ఏమిటంటే ఆ రోజుల్లో రికార్డింగులూ, వీడియోలూ లేకపోవడం. ఆ వైభవాన్ని ఈ తరం చూసే అదృష్టం లేకపోయింది. తమ జీవితకాలంలో వారు ఎన్నో లక్షల పద్యాలు చెప్పారు.

ఇదంతా ఒక యెత్తు. ఈ విద్వత్తును మరో అనూహ్యమైన స్థాయికి తీసుకువెళ్లారు. ఒకసారి మార్టేరు సభలో ఎవరో పందెం వేయగా గంటకు 720 పద్యాలు చొప్పున కేవలం అరగంటలో 'మనుచరిత్ర'ను ఆశువుగా చెప్పారట. మరొొక సంఘటన. ఇది ఇంకా విచిత్రం. అద్భుతం. ఇది సరిగ్గా వంద సంవత్సరాల క్రితం జరిగింది. గుంటూరులో అప్పటి ప్రముఖ న్యాయవాది పాటిబండ సూర్యనారాయణ గారు వారిని భోజనానికి




ఆహ్వానించారు. ఇరవై ఆధరువులతో భోజనం వడ్డించి –తృప్తిగా భోజనం చేస్తూనే హనుమంతుని మీద శతకాన్ని చెప్పమన్నారట. ఏ పదార్థమూ వదిలి పెట్టకూడదన్నది కూడా ఒక నియమం. వారు నవ్వు కుని పరిషేచన చేసి ఆశువుగా "నమస్కరింతు హనుమంతా నీ మహా శక్తికిన్" అనే మకుటంతో 350 పైగా పద్యాలు చెప్పి ఉత్తరాపోశన చేశారు. ఇంతకూ వారి సాధన ఎలాంటిది? ప్రముఖ పాత్రికేయులు బూదరాజు రాధాకృష్ణగారి మాతామహులు పంగులూరి వారింట వారు అతిథులుగా ఉన్నప్పుడు ఆయన గమనించిన విషయమిది. ఈ కవులు ఉదయమే లేచి సాధనగా మహాభాగవతాన్ని ఆశువుగా చెప్పుకునేవారట! మరొక్కసారి. ఈ జాతిలో విజ్ఞానం విద్వత్తు –సాధన మాత్రమే కాదు, దర్శనమని నిరూపించిన ఉపాసకులు వీరు. సాధారణంగా ఆశువుగా చెప్తున్నప్పుడు ధార సాగుతుంది కాని కవిత్వపు పలుకు కాస్తంత కొరవడే సందర్భాలుంటాయి. కొండొకచో అది ఆక్షేపణీయమూ కాదు. అయితే వారి పద్యాలు చదువుతున్నప్పుడు ఆ దోషం వారి పద్యాలకు ఏమాత్రమూ అంటదని మనకు బోధపడుతుంది. శబ్దగాంభీర్యం, అర్థ సాంద్రత, ఆశుపటిమా పెనవేసుకొన్న చిక్కదనం వారి పద్యాలలో ద్యోతకమవుతుంది. ఒకే ఒక్క ఉదాహరణ. ఒక శతావధానంలో సీతను రాముడు అరణ్యానికి ఎందుకు పంపాడో సమర్థిస్తూ పద్యం చెప్పమన్నారు. ఈ పద్యం ఆశువుగా చెప్పింది.

అలా లంకాపురి సీత సాధ్వియని వహ్న్యాదుల్ దిశాధీశ్వరుల్
తెలుపం జేర్చితి నీయయోధ్య జనసందేహంబుపో దొంటిరీ
తుల దేవావళి తెల్పునంతవఱకిందున్నిల్పగాదంచు శ్రీ
నళినాక్ష్యంశజ సీత గాన కనిచెన్ రాముండు రాజాగ్రణీ!

'నళినాక్ష్యంశజ' అద్భుతమైన ప్రయోగం. ప్రాసస్థానంలో అర్థగాంభీర్యంతో కూర్చున్న పదం ఇద్దరు ఉపాసకుల మేధాసంపత్తికి చిహ్నం. కొప్పరపు కవుల్లో పెద్దవారైన సుబ్బరాయ శర్మగారి దౌహిత్రుడు మారుతీ సుబ్బరామ శర్మ తమ పితామహుల అవధాన వైభవాన్ని పునరుద్ధరించి గ్రంథస్థం చేసే కార్యక్రమానికి నడుంకట్టి సరిగ్గా పదిసంవత్సరాల క్రితం కొప్పరపు కవుల కళాపీఠాన్ని స్థాపించారు. మొదట వారి వైభవాన్ని ఆకళించుకోడానికి సాధికారికంగా పరిశోధన చేసిన వారిచేత ఆ సంపదను సేకరించి ఇప్పటికి పది గ్రంథాలు వెలువరించారు. ప్రతీయేటా ఆ ప్రక్రియలోనో, తదనుబంధమైన ప్రక్రియల్లోనో కృషి చేసిన లబ్ధప్రతిష్టులను సత్కరిస్తున్నారు. ఈ ప్రణాళికలో భాగంగానే విశాఖ సముద్ర తీరంలో ఆ కవుల శిలా విగ్రహాన్ని ఆవిష్కరింపజేశారు. ఇది వారు తీర్చుకుంటున్న పితృరుణం.

మన సాహితీ వైభవాన్ని సుసంపన్నం చేసిన ఇటువంటి మహానుభావుల్ని స్మరించుకుని నివాళులర్పించడం జాతి తీర్చుకోవలసిన రుషి రుణం.నేడు మన జీవన సరళి –కేవలం ఉపాధికీ, సంపదకి, పదవులకీ పరిమితమైపోతున్న తరుణంలో వ్యక్తిశీలాన్ని మరింత ఉద్బుద్ధం చేసే ఇలాంటి వైభవాన్ని కనీసం తలచుకోవడమైనా చేయగలిగితే ఆ మేరకు జాతికి ఉపకారం జరుగుతుంది.

**(సెప్టెంబర్ 10, 2012)**

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!




gollapudimaruthirao.blogspot.com gmrsivani@gmail.com

# (September 17,2012) Eela Vese Vallu ఈల వేసే వాళ్ళు

తెలుగులో ఈ మాట లేదు కానీ –ఇంగ్లీషులో ఓ అందమైన మాట ఉంది –ఈల వేసేవాళ్లు (విజిల్ బ్లోయర్స్). తమ చుట్టూ జరిగే వ్యవహారాల్లో అన్యాయాన్ని ధైర్యంగా బట్టబయలు చేసేవాళ్లు. దీనికి ప్రధానంగా మూడు కావాలి. మొక్కవోని నిజాయితీ. నిజాన్ని చెప్పి నిలవగల దమ్ము, రెంటినీ సాధించే చిత్తశుద్ధి. వీటిలో ఏదిలోపించినా ఈల గోల అవుతుందేతప్ప –అసలు అవినీతికీ వీరి ప్రత్యేకమైన అవినీతికీ తేడా కనిపించదు. నాకెప్పుడూ ఏసుప్రభువు, మేరీ మాగ్దలీన్ కథ గొప్పగా కనిపిస్తుంది. ఈ కథని పాటని చేసి "నేరం నాదికాదు ఆకలిది" అనే చిత్రంలో వాడాం. ఎన్టీఆర్ నాయకుడు. పతితురాలయిన స్త్రీని కొందరు రాళ్లేసి కొడుతున్నారు. ఏసుప్రభువు అడ్డుపడ్డారు. "చేసేది మంచిపనే బాబూ. కాని మీలో ఏ తప్పూ చెయ్యనివారెవరో మొదటిరాయి విసరండి" అన్నారు.

ఈల వేసేవారికి ముందు అర్హత అది. ఈల నిప్పు. గోల పోకిరీతనం. ఈల వేసేవాళ్లు అనగానే మనకి మొట్టమొదట గుర్తుకొచ్చేది సత్యదేవ దూబే. 2003లో వాజ్‌పేయిగారి హయాంలో దేశమంతటా నాలుగు రోడ్ల రహదారి (గోల్డెన్ క్వాడ్రీలేటరల్) రూపుదిద్దుకుంటున్న వ్యవహారంలో అవినీతిని బయట పెట్టబోయిన దూబేని మాఫియా దారుణంగా హత్య చేయించింది. అలాగే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కి చెందిన ఎస్ .మంజునాథ్ ఘోరంగా హత్యకు గురయాడు. ఇంకా ఐయ్యేయస్‌ల అవకతవకల్ని బయట పెట్టబోయిన ఎమ్.ఎన్.విజయకుమార్, ఎస్ .పి.మహతేష్ యిలాగే ఈల వేసి నేలపాలయారు. ఇది ఒక విధంగా సాహసం, త్యాగం –అంతకుమించి అవినీతిమీద పోరాటం. ఈ మధ్యనే గిరిప్రసాద్ శర్మ అనే ఓ హెడ్ కానిస్టేబులు లక్ష్మీనారాయణ అనే ఎస్పీగారిని ఓ గదిలో బంధించి, కుర్చీకి చేతులు కట్టి, గదిలో నలభై లీటర్ల పెట్రోలు గుమ్మరించి ఆయన్ని విడిపించబోతే నిప్పెట్టేస్తానని చక్కని బూతులతో బెదిరించాడు. ఈయన కోరిక పోలీసు రవాణా సంస్థలో అవకతవకల్ని సవరించాలని. హోంగార్డ్స్‌నే డ్రైవర్లుగా నియమించాలని. ఇవన్నీ మంచి ఆలోచనలే. కాని చెప్పుచ్చుకు కొట్టి నమస్కారం పెట్టడం 'వినయం' అనిపించుకోదు. ఈ శర్మగారు ఇప్పటికే నాలుగుసార్లు ఉద్యోగంలో సస్పెండు అయాడట. అవినీతికి లోనయిన వ్యక్తి నీతికోసం పోరాడడం –అదిన్నీ –డిపార్ట్‌మెంటుని బ్లాక్‌మెయిల్ చెయ్యడం వ్యభిచారి భగవద్గీత వల్లించడం లాంటిది. మరో ఈల గోల. తూర్పుగోదావరి రంపచోడవరంలో పనిచేసే అసిస్టెంట్ పోలీసు సూపరింటెండెంట్ నవీన్ కుమార్‌గారు –తన పై ఆఫీసరు త్రివిక్రమ్‌గారు గంజాయి అక్రమ రవాణాదారులతో లాలూచీ పడుతున్నారని, తనమీద హత్యాప్రయత్నం చేశారని పత్రికలవారిముందు ప్రకటించారు. అదే నిజమైతే ఆ ఆఫీసరు శిక్షార్హుడే. సందేహం లేదు. కానీ ఈ విధంగా ఒక జూనియర్ ఆఫీసరు పత్రికలకెక్కడం రుజువయిన నేరం. డిపార్టుమెంటులో పనిచేసే ఐపీఎస్ ఉద్యోగికి ప్రభుత్వ ప్రవర్తనా నియమావళి తెలియకుండా ఉండదు. ఏ కారణానికయినా ఏ ఆఫీసరయినా పత్రికలకెక్కడం నిషిద్ధం. కాగా తన పై ఆఫీసరుమీదే అభియోగం బహిరంగంగా చేయడం –ఒకవేళ అది నిజమైనా –అది నేరం. ఈ ఆఫీసరు విచక్షణారాహిత్యానికి అందరూ షాకయారు. వెంటనే ప్రభుత్వం స్పందించింది. ఈ నవీన్ కుమార్‌ని సస్పెండు చేసింది. అది సబబు. ఈల వేసే వ్యక్తిలో చిత్తశుద్ధి ఆ ఈలకి బలాన్నిస్తుంది. సత్యదేవ దూబేని హర్షించడానికీ, నవీన్ కుమార్‌ని గర్హించడానికీ అదే తేడా. ఏ ఉద్యమానికయినా –ఆ ఉద్యమకారుని వ్యక్తిత్వమే నిలువుటద్దం. అలనాటి మహాత్ముడు, పొట్టిశ్రీరాములు, నిన్నటి అన్నా హజారే –యిందుకు నిదర్శనాలు.



ఇంకా విశేషమేమంటే –హైదరాబాద్‌లో కొందరు తెలంగాణా న్యాయవాదులు మంత్రి సబితా ఇంద్రారెడ్డి గారిని కలిసి –నవీన్ కుమార్ సస్పెన్షన్ ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఆయన తెలంగాణా ఆఫీసరు కనుక దురుద్దేశంతో ఆయన్ని బలిపశువును చేశారని అన్నారు. విశేషమేమిటంటే ఈ మంత్రిగారు తెలంగాణా ప్రాంతీయురాలు. లోగడ –పిఎస్ఆర్ ఆంజనేయులనే ఎస్పీ ఇలాగే పత్రికలవారికి ప్రకటనలిస్తే చూపిన అలసత్వమే నవీన్ కుమార్‌కీ చూపాలని వీరన్నారు. ఒక తప్పు మరో చర్య రద్దుకి మార్గదర్శి కావాలని వారి ఉద్దేశం. పైగా వీరంతా న్యాయవాదులు. ఈ మధ్య ఈలని గోలగా మార్చే ప్రయత్నాలు బోలెడు జరిగిపోతున్నాయి. దేశంలో అవినీతిని రూపుమాపాలని అరవింద్ కేజ్రీవాల్ గొంతు విప్పగానే ఆయన గొంతు నొక్కడానికి అప్పుడెప్పుడో ఆయన సర్వీసులో ఉండగా జరిగిన స్కాలిత్యాన్ని బయటికి లాగింది ప్రభుత్వం. లక్షల కోట్ల కుంభకోణం బొగ్గు తవ్వకాలలో జరిగిందని రాజ్యాంగం మద్దతు ఉన్న కంట్రోలర్ ఆడిటర్ జనరల్ సహేతుకంగా నిరూపిస్తే ప్రధానమంత్రే స్వయంగా పార్లమెంటులో ఆ వ్యవస్థనే తప్పుపట్టారు. మరొకపక్క –దోపిడీ జరిగిందంటూ కొన్ని కాంట్రాక్టులు రద్దుచేసే కార్యక్రమాన్ని చేపట్టింది. ఇది సంస్థాగతమైన ఆత్మవంచనకి దగ్గరతోవ. ఈ దేశంలో ఈల వేసే నిజాయితీపరుల అవసరం ఎంతయినా ఉంది. అయితే వారు సత్యదేవ్ దూబే కావడమూ దురదృష్టమే. నవీన్ కుమార్ కావడమూ దురదృష్టమే. మరొక్కసారి ఈల నిప్పు. గోల పోకిరీతనం.

(సెప్టెంబర్ 17, 2012)




# (September 24, 2012) Gurajada 'Desam' Paata గురజాడ 'దేశం' పాట

గురజాడ పుట్టి మొన్నటికి 150 సంవత్సరాలయింది. వెళ్లిపోయి 97 సంవత్సరాలయింది. అజరామరంగా నిలిచిన 'దేశమును ప్రేమించుమన్నా' పాట ఆయన కలం నుంచి జాలువారి 102 సంవత్సరాలయింది. ఆ పాట పాఠకుల చేతుల్లోకి వచ్చి 99 సంవత్సరాలయింది. దానికి ప్రముఖ వాయులీన విద్వాంసులు ద్వారం వెంకటస్వామి నాయుడుగారు బాణీని ఏర్పరిచి 98 సంవత్సరాలయింది. ఆ తర్వాత మరో 26 నెలలకు మహాకవి కన్నుమూశారు. ఆ పాటని 1913 ఆగస్టు 9న కృష్ణాపత్రికలో ముట్నూరి కృష్ణారావుగారు ప్రచురించారు ఇంత వివరంగా ఈ తేదీలు ఉటంకించడానికి కారణం ఓ మహాకవి ఆయుష్షు పోసిన పాట జీవలక్షణాన్ని పుణికి పుచ్చుకుని ఇప్పటికీ తెలుగు లోగిళ్లలో మారుమ్రోగుతోందని గర్వపడడానికి.

గురజాడ దాదాపు 29 సంవత్సరాలు ఇంగ్లీషులో రచనలు చేశారు 'ది లీజర్ అవర్'లో, అటు తర్వాత "రీస్ అండ్ రాయిట్"లో వారి ఆంగ్ల రచనలు ప్రచురితమయాయి. ఆ పత్రిక సంపాదకులు శంభు చంద్ర ముఖర్జీ వారిని తమ మాతృభాషలో వ్రాయమని ప్రోత్సహించారు. తరువాత 24 సంవత్సరాలు మాత్రమే తెలుగులో రచనలు చేశారు. కన్నూమూయడానికి అయిదేళ్ల ముందు ఈ దేశభక్తి పాటని రాశారు.

గురజాడ రాసిన గొప్ప రచనలు ఎన్నో ఉన్నాయి. కన్యాశుల్కం నాటకం, దిద్దుబాటు, మీపేరేమిటి? మెటిల్డా వంటి కథలు, లవణరాజు కల, దించు లంగరు. ముత్యాల సరాలు, పుత్తడి బొమ్మ, కన్యక –యిలాగ. ఇవన్నీ రచయిత తన చుట్టూ ఉన్న సమాజం ప్రభావితం చేయగా, సమాజ సంస్కరణ ఆదర్శంగా రాసినవి. ఒక పక్క గిడుగు వ్యవహారికోద్యమం, మరొక పక్క వీరేశలింగం గారి సంస్కరణోద్యమం ఊతం చేసుకుని 120 సంవత్సరాలు తెలుగువారి మనస్సుల్లో నిలిచిన రచనలు చేసిన వైతాళికుడు గురజాడ. అయితే ప్రాంతీయపు ఎల్లలను దాటి, జాతీయ భావాలను సంతరించుకుని నూరేళ్ల ఆయుష్షు పోసిన ఒకే ఒక్క రచన 'దేశమును ప్రేమించుమన్నా' పాట. అంతకుముందు కాని, ఆ తర్వాత కాని ఇంత సమగ్రమైన జాతీయ భావాలను సంతరించుకున్న రచన కనిపించదు. రాయప్రోలు "ఏ దేశమేగినా" వంటి రచనలు బోయభీమన్న "ఒక్కొక దీపం" వంటి రచనలు, 'మా తెలుగు తల్లికి' సుందరాచారి రచనా, కృష్ణశాస్త్రి "జయ జయ జయ ప్రియభారత" –ఇవన్నీ మనస్సులో ఉంచుకునే ఈ మాట అనుకోవాలి. విశ్వమానవత్వాన్ని ప్రతిపాదించిన నూరేళ్ల రచన అది. మరొకాయన, మరొక రాష్ట్రంలో ఇలాంటి పనే చేశారు. ఆయన సుబ్రహ్మణ్య భారతి. వీరంతా భారతమాతను ఆకాశంలో నిలిపిన కవులు. అయితే గురజాడ విశ్వమానవత్వాన్ని ప్రతిపాదించిన కవి. ఆ పాటలో భారతదేశం ఎక్కడా లేదు. అన్నిదేశాలూ ఉన్నాయి. అన్ని మతాలూ ఉన్నాయి. మానవ కళ్యాణాన్ని ప్రతిపాదించిన జీవుని వేదన ఉంది. అందుకే ఆ పాటకి అంత ఆయుష్షు. మరొక సరదా అయిన పోలిక. ఆ రోజుల్లో ప్రభుత్వ నౌఖరీ చేసేవారంతా తలపాగా చుట్టుకున్నారు. అటు సుబ్రహ్మణ్య భారతి, ఇటు గురజాడ, ఇంకా గిడుగు రామ్మూర్తి, వీరేశలింగం పంతులు, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, సర్ సి.పి.రామస్వామి అయ్యర్, సర్వేపల్లి రాధాకృష్ణన్, పరవస్తు చిన్నయసూరి –యిలాగ. సమకాలీన సంప్రదాయాన్ని పాటించిన మహాకవి ఆకాశానికి రెక్కలు విప్పడం గుర్తుంచుకోదగ్గ విషయమని ఈ ఉటంకింపు. మరో గమనిక. గురజాడ ఆ దశలోనే ఇంగ్లీషు సాహిత్యాన్ని ఔపోశన పట్టిన రచయిత. ఆ పరిమళం ఆయన గిరీశం ఒక్క పాత్ర చెప్పక చెప్తుంది. ముఖ్యంగా గిరీశం "ది విడో" మీద చెప్పిన పద్యం చదివి టెన్నిసన్ గుండె బాదుకున్నాడన్నారు రచయిత. టెన్నిసన్ ప్రభావం గురజాడ మీద ఉంది. ఆయన అభిమాన రచయిత. అసలు ఈ విడో పద్యానికి అతి దగ్గర




మాతృక అప్పటి ప్రఖ్యాత బ్రిటన్ రచయిత్రి ఆన్ టేలర్ 'మై మదర్'. ఆశ్చర్యం లేదు. స్ఫూర్తి తను బాగా వంటబట్టించుకున్న సాహిత్యం నుంచి దక్కడం సమంజసం. అలాగే ఆనాటి వాల్ట్ విట్‌మెన్, టెన్నిసన్ ఛాయలు, స్ఫూర్తి ఈ దేశభక్తి గీతంలోనూ ఉంది. న్యాయం. కాలం సమదర్శి. ఒకసారి బెర్నార్డ్ షా అన్నాడట. నేను అన్ని నాటకాలూ పాఠకులు అభిమానిస్తున్నారని రాశాను. కాని నేనభిమానించే నా రచన సెంట్‌జోన్ – అని. ఓ సారి విశ్వనాథ కూడా (రామాయణ కల్పవృక్షం వ్రాయకముందు) అన్నారట –నా రచనలన్నీ కాలగర్భంలో కలిసిపోయినా ఒక్క 'ఏకవీర' నిలుస్తుందని. కాలానికి నిష్కర్ష అయిన పదును ఉంది. కాలం ఒరిపిడికి నిలవని రచనలు జారిపోతాయి. మరికొన్ని ఆ కాలానికి ప్రాతినిధ్యం వహించే రచనలు గానే మిగులుతాయి. కొన్నిటి జ్ఞాపకాలు కూడా మిగలవు. నూట యాభై సంవత్సరాల మహాకవి జీవితంలో ఆయన రచనల్లో కాలానికి ఎదురీది నిలిచిన ఒకే ఒక్క రచన 'దేశమును ప్రేమించుమన్నా' పాట అంటాను. మిగతా రచనలు గొప్పవే. ఒక మేధావి అనూహ్యమైన సృష్టే. కాని ఇటు అదిలాబాదు నుంచి, అలంపూరు నుంచి, అల్లూరు నుంచి, శ్రీకాకుళం, కర్నూలు –ఎటు తిరిగినా తెలుగువాడి నోటిలో ఒక్క చరణమయినా నిలిచే గొప్ప పాట అది. మహాకవి 150 జయంత్యుత్సవాల సందర్భంగా దేశ కాల సమాజ స్థితుల ప్రమేయం లేని చిరంజీవిగా ఒక పాటకి ప్రాణం పోసిన గురజాడకు కృతజ్ఞతతో నివాళు లర్పించడం విధాయకం.

(సెప్టెంబర్ 24, 2012)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (October 01, 2012) Ettaina Akasam ఎత్తైన ఆకాశం

మరో 48 గంటల్లో గాంధీ జయంతి. 143 సంవత్సరాల కిందట గాంధీ పుట్టిన రోజు. 64 సంవత్సరాల కిందట గాంధీ నిర్యాణం. గాంధీ తత్వాన్ని భ్రష్టు పట్టించడం ప్రారంభమయి అప్పుడే 65 సంవత్సరాలయిపోయింది.

ఈ తరంలో చాలామందికి గాంధీ చరిత్ర. కొందరికి జ్ఞాపకం. మరీ ఇటీవలి తరానికి గాంధీ ఓ సినిమా. రాజకీయ నాయకులకి గాంధీ కొంగుబంగారం. ఉద్యమకారులకి సాకు. కాని ఆయా దేశాల చరిత్రల్నే మార్చిన ఇద్దరు ఉద్యమకారులకి గాంధీ స్ఫూర్తి, ఆదర్శం, ఆకాశం. వారిద్దరూ మార్టిన్ లూథర్‌కింగ్, నెల్సన్ మండేలా. ఓ పాతికేళ్ల కిందట ప్రతి తెలుగు సినిమా మద్రాసులో తయారయేది. ఆ రోజుల్లో మెరీనా బీచ్ లో దేవీప్రసాద్ రాయ్ చౌదరీగారి విగ్రహం ముందు ఒక్క షాటయినా తీయడం సెంటిమెంటు. మరీ బాలచందర్, వి.మధుసూదనరావు వంటి దర్శకులు పాటల్నే తీశారు. ఇవాళ గాంధీ విగ్రహాలను మనం వెతుక్కోవాలి. నేడు మతాతీత, కులాతీత వ్యవస్థకోసం జబ్బలు చరుచుకుంటున్న రాజకీయ నాయకులు కోకొల్లలుగా కనిపిస్తున్న, వినిపిస్తున్న రోజులలో –2012లో –ఇటీవల పేర్లు మారిన పసుంపోం ముత్తురామలింగ తేవర్ రోడ్డులే కనిపిస్తాయి. (నేను గడుసువాడిని కనుక తెలుగుపేర్లు ఉటంకించడం లేదు). ఇవాళ గాంధీ విగ్రహాలకు బదులు స్థానిక కుల వీరులు, ప్రాంతీయ నాయకులు, జాతీయ భావాల ముసుగుకింద రొమ్ము విరుచుకునే గూండాల విగ్రహాలు కనిపిస్తాయి. ఇవాళ పదేళ్ల కుర్రాళ్లు పదిమందిని గాంధీ విగ్రహం ముందు నిలబెట్టి ఆయన్ని గుర్తుపట్టమంటే కనీసం నలుగురయినా నీళ్లు నములుతారు. వాళ్లని మనం క్షమించవచ్చు. ఆ మధ్య పార్లమెంటు సభ్యులను 'జనగణమణ' వ్రాసిందెవరని అడిగితే తెల్లమొహాలు వేసిన కార్యక్రమాన్ని టీవీల్లో చూసి ఆనందించాం. ఇవాళ అజ్ఞానానికి బుకాయింపు అందమయిన తొడుగు. నేడు గాంధీ వెలిసిపోయిన జ్ఞాపకం. నిజాయితీని –నిజాయితీగా అనుసరిస్తే సత్ఫలితాలు ఉంటాయని నిరూపించిన –గాంధీగిరి –చిత్రం నేటి ప్రేక్షకులకు వినోదం. చూసి మరిచిపోయారు. అలనాడు అదే నిజానికి కట్టుబడి కొన్ని లక్షలమంది –గ్రామాలకి గ్రామాలు దండీ యాత్రలో గాంధీజీ వెనుక నడిచాయి. ఇప్పుడు 'నిజాయితీ' కేవలం వినోదం స్థాయికి పరిమితమయిపోయింది.

గాంధీ అప్పుడెప్పుడో –143 ఏళ్ల కిందట మహాత్ముడిగా పుట్టలేదు. 123 ఏళ్ల కిందట ఆయన టెంపుల్ ఇన్‌లో బారిస్టరు. 119 సంవత్సరాల కిందట దక్షిణాఫ్రికాలో పౌరహక్కుల కార్యకర్త. 97 సంవత్సరాల కిందట దేశీయోద్యమంలో పాల్గొనడానికి షిప్పు దిగిన ఔత్సాహికుడు. తరువాత ప్రపంచం విస్తుపోయి చూసిన స్వాతంత్ర్య సమరయోధుడు. అటు తర్వాత రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య సింహాసనాన్ని పునాదుల్తో గజగజలాడించిన శాంతి సమర నాయకుడు. ఆ పైన రాజకీయ సిద్ధాంతాలకూ, ఆధ్యాత్మిక చింతనకీ ఊహించనయినా ఊహించలేని వంతెనని నిర్మించిన జిజ్ఞాసి. మతాన్ని మానవ జీవితానికి ఊపిరిగా మలిచిన తత్వజ్ఞుడు. ఒక సమగ్రమైన ఆలోచనా స్రవంతిని జీవితంలో ప్రతీ దశలోనూ ప్రోదుచేస్తూ సంపూర్ణ వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించాడు మహాత్ముడు.




అన్నిటికన్నా ముఖ్యమైన విషయం మరొకటి ఉంది. ముందు ఓ చిన్న ఉదాహరణ. మనం టీవీల్లో ఇంగ్లీషు హాస్య నాటికల్ని చూస్తూంటాం. ప్రతీ హాస్యోక్తికీ ప్రేక్షకుల నవ్వుల్ని ఆ నాటికలోనే చేరుస్తారు. ఆ హాస్యోక్తి పర్యవసానాన్ని క్రియాత్మక దశలోనే పొందుపరిచే ప్రయత్నమది. ఒక కళ, ఒక ఉద్యమం, ఒక పాట –ఏదయినా దాని ఫలితం అవతలి వ్యక్తికి అందినప్పుడే దాని పర్యవసానం. శ్రోతలేని పాటకి వన్నె లేదు. అలాగే ఒక రాజకీయ ఉద్యమానికి –ఆ ఉద్యమ లక్ష్యాన్ని అర్థం చేసుకుని తలవొంచే వ్యవస్థ ఉన్నప్పుడే చరితార్థత. గాంధీజీ శాంతియుత పోరాటంలో బలాన్నీ, సబబునీ, ఆవేశాన్నీ, ఒక జాతి లక్ష్యాన్నీ అర్థం చేసుకుని, వారి ఆవేశాన్ని గౌరవించి తలవొంచే పెద్ద మనసు, ఆబ్జెక్టివిటీ (ఏ జనరల్ దయ్యర్ వంటివారినో మినహాయిస్తే) అలనాటి బ్రిటిష్ ప్రభుత్వం రాజనీతిజ్ఞతకి నిదర్శనం. గాంధీజీ విజయంలో ప్రత్యర్థుల లొంగుబాటు వాటా ఉంది. అలాగే 25 సంవత్సరాలు నిశ్శబ్దంగా జైల్లో మ్రగ్గిన ఓ శాంతి వీరుని (నెల్సన్ మండేలా) సంకల్పబలానికి –ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ శాంతియుత పోరాటానికి దక్షిణాఫ్రికాలో డి క్లార్క్ ప్రభుత్వం తలవొంచింది.

గాంధీజీ ఉద్యమం ఏ నాజీ జర్మనీలోనో, ఏ తాలిబన్ ఆఫ్ఘనిస్థాన్‌లోనో, ఏ సద్దాం హుస్సేన్ ఇరాక్‌లోనో జరిగివుంటే –నాథూరామ్ గాడ్సేదాకా ఆ ప్రభుత్వాలు ఆగేవికావు. ఓ ఉద్యమం కృతార్థత దాని పర్యవసానంలో, ప్రత్యర్థుల మన్ననలో ఉంటుంది. అవగాహనలో ఉంటుంది. గౌరవింపులో ఉంటుంది.

ఎక్కడో తమ మతాన్ని గర్హించే సినిమాని ఎవరో తీస్తే –ఎన్నో దేశాలు భగ్గుమంటున్నాయి. ఇది మత సంయమనం లేమికి నిదర్శనమంటూ గాంధీజీని ఉదహరించారు అమెరికా అధ్యక్షులు ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో. ఒకే ఒక్క సందర్భాన్ని గుర్తు చేస్తాను. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక నోఖాలీలో జరిగిన మారణ హోమంలో నహరీ అనే బీహారీ బాపూజీ దగ్గరికి వచ్చి "నేనో ముస్లిం పసిబిడ్డని దారుణంగా చంపాన"ని చెప్పుకున్నాడు. అప్పుడు బాపూజీ మాటలివి: " నువ్వు నరకం నుంచి బయటపడడానికి దగ్గర దారి నాకు తెలుసు. వెళ్లి, తల్లిదండ్రులు హత్య అయిన ఓ ముస్లిం కుర్రాడిని వెదుకు. అతన్ని నీ కొడుకులాగ –కాని ముస్లిం లాగ పెంచు". మత సామరస్యం, మానవతా విలువల ఔన్నత్యానికి ఇంతకన్న దగ్గర తోవ కనిపించదు. ప్రస్తుతం గాంధీజీ అమెరికా ఐక్యరాజ్య సమితిలో వినిపిస్తున్నాడు. ఆయన పుట్టిన దేశంలో కనిపించడం లేదు.

ఉద్యమాల లక్ష్యాన్ని స్వప్రయోజనాల్ని దృష్టిలో పెట్టుకుని ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకునే పాలక వ్యవస్థల నిర్వాకం మనం చూస్తూనే ఉన్నాం. ఏతావాతా గాంధీజీ ఓ గొప్ప వ్యవస్థకి అభిజ్ఞ. ఆయన్ని ఒక లేబుల్‌గా, చాకలి మార్కుగా, బ్రాండ్‌గా, ఆయన 'శాంతి'ని సాకుగా వాడుకునే తరం వచ్చేసింది. అయితే నాసిరకం సరుకు లేబుల్‌ని ఎప్పుడూ ఆకాశంలో ఉంచుతుంది. అలాంటి ఎత్తయిన ఆకాశం –గాంధీజీ.

(అక్టోబర్ 01, 2012)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (October 08, 2012) Bhumi Putrulu భూమి పు(శ)త్రుల

పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను ఈ తరం గుర్తించినట్టు – ఒకడుగు ముందుకు వేసి చెపితే గుర్తించవలసి వచ్చినట్టు – మరెప్పుడూ రాలేదు. 193 దేశాలకు చెందిన 8000 మంది ప్రతినిధులు 19 రోజులపాటు – తమ తరం చేస్తున్న ఘోర తప్పిదాలను లేదా తమ తరం తప్పనిసరిగా అవలంభించక తప్పని కనీస మర్యాదలను హైదరాబాదులో జరిగే సదస్సులో చర్చించుకుంటారు. ఇది మానవుడి మనుగడకు సంబంధించిన అతి విలువయిన – అవసరమయిన, తప్పనిసరయిన – ఇంకా తెగించి చెప్పాలంటే ఇప్పటికే ఆలశ్యమయిన, చెయ్యక తప్పని పని. మానవుడి మనుగడను అతలాకుతలం చేసే ఎన్నో పనులను మనం ఏనాడో ప్రారంభించేశాం. మన మధ్య తిరిగే పిచ్చుక ఇవాళ కనుమరుగు కావడానికి, రుతుక్రమం తప్పకుండా వర్షాలు కురవకపోవడానికి, అతివృష్టికీ, ఆ వ్యవస్థకి, త్సునామీలకు – అన్నిటికీ ప్రముఖంగా మన పాత్రే ఉన్నదని మనం గుర్తించాం. కాని గుర్తించనట్టు నటిస్తున్నం. ఏం చెయ్యాలో మనకి తెలుసు. చెయ్యకపోవడం ఎలాగో కూడా మనకి తెలుసు. మానవుడి అభ్యుదయానికి అర్రులు చాచడంలో ఆత్మవంచన ఉంది. ముందు తరాల దోపిడీ ఉంది. బాధ్యతల్ని విదిలించుకునే అలక్ష్యం ఉంది. వెరసి భయంకరమైన భవిష్యత్తు తొంగిచూస్తోంది.

ఒకాయన – బొత్తిగా సంప్రదాయంలో వేళ్ళున్న వ్యక్తి అన్నాడు. మనం ముందు తరాలకి ఏమీ మిగల్చడంలేదు. ఇలాగే భూమి వనర్లను ఊహించలేనంత వేగంగా, క్రూరంగా కబలించుకుంటూ పోతే మరో 70 సంవత్సరాల తర్వాత – మానవుడి ప్రాధమికమయిన వనర్లు ఉండవు. నీరుండదు. పరిశుభ్రమయిన గాలి ఉండదు. ఆరోగ్యం ఉండదు.

బతుకు మీద ఆశ ఉండదు. చచ్చిపోతే బాగుణ్ణనే ధ్యాస ఎక్కువవుతుంది. చావు సుఖంగా ఉండదు. తమ ముందు తరాలు తమని ఎంత దారుణంగా దోచుకున్నాయో అర్ధమౌతుంది. అన్నిటికన్నా భయంకరమైన నిజం – పునర్జన్మల్ని – కర్మ పరిపాకాన్ని నమ్మే ఈయన – అప్పుడూ మనమే పుడతాం కనుక – ఈ నరకాన్ని అనుభవిస్తాం – అన్నాడు.

ఈ సమావేశాలకి వందకోట్లు ఖర్చుపెడుతున్నారట. ఇలాంటి వృధా సమావేశాలకి ఖర్చుచేసే బదులు – గిరిజనులకు గోచీలు, పురజనులకు వాచీలూ ఇవ్వవచ్చుకదా అని ఓ నాయకుడు వాపోయాడు. ప్రజల్ని మురిపించే కబుర్లు చెప్పే ఈ నాయకులే ఇలాంటి వినాశానికి మూల పురుషులు. నిజానికి ఆ మేళ్ళు జరగాల్సిందే. కానీ అంతకంటే అవసరమైన – ఈ భూమి మీద మానవుని ఉనికినే సరిదిద్దాల్సిన కృషికి ఈ ప్రయత్నం. మనం పదవుల కోసం, ఎన్నికల కోసం, విగ్రహాల కోసం, సీట్ల కోస్మ నోట్ల కోసం కొట్టుకు చస్తున్నాం. కానీ నిశ్శబ్దంగా మన దారుణమయిన చావుకి పునాదులు వేసుకుంటున్నామని చాలామందికి తెలియదు.

ఒక చిన్న – కేవలం నమూనా ఉదాహరణ. ఒక కారు రోడ్డు మీద నూరు కిలోమీటర్లు నడిస్తే – ఓ మనిషి జీవితకాలం సరిపోయే ప్రాణవాయువు ఖర్చు అవుతుంది. ఈ లెక్కన – పారిస్, బీజింగ్, వాషింగ్టన్, ముంబై, కలకత్తా రోడ్ల మీద గంటకి ఎన్నివేల లక్షల మందికి సరిపోయే ప్రాణవాయువు ఖర్చవుతుందో ఎవరయినా ఊహించగలరా?




ఈ సమావేశాలలో పాల్గొంటున్న 193 దేశాల ప్రతినిధులలో కనీసం 6,000 మందయినా ఈ అనర్థాన్ని గుర్తుపట్టి ఉంటారు. మరి మిగతా 2,000 మంది? వారు మన నయకులు, మన మంత్రులు, మన ప్రభువులు. వీరంతా ఎవరో రాసిచ్చిన భాషణలు చదువుతారు. వారికి ఆ చదివే విషయాలు అర్థం కాలేదని మనకి అర్థమవుతూంటుంది. అర్థమయే నిపుణులు వింటారు. వారికి ఏం చెయ్యాలో తెలుసు. వీరికి ఎందుకు చెయ్యకూడదో తెలుసు. ఈ రెండు వర్గాల అంతరంతో పాటు అభివృద్ధి దేశాల పొగరూ, పెద్దరికం, దబాయించే గడుసుదనం – ఇవాళ తప్పనిసరిగా ఆలోచించ్చజేసే త్సునామిలు, అనావృష్టి, అకాలంలో వృక్ష, పక్షి, క్రిమి, జలచరాల వినాశనం – ఇదంతా రాజకీయ విషవలయం. మనవుడు తెలిసి తెలిసి – తనంతట తానే మునిగిపోతున్న ఊబి.

మనిషి తెలివైన వాడు. జంతువు విజ్నత గలది. ఒకటి విజ్నత (ఇంటలెక్ట్). రెండోది విజ్నానం (ఇంటలిజెన్స్ ) ఒకటి జన్మతహ వచ్చిన శక్తి. 80 శాతం మానవాళి అర్థంలేని వైరుధ్యాలతో, అవసరంలేని బంధాలతో సతమతమౌతూ సమూహికమైన వినాశానికి, విధ్వంసానికీ హేతుభూతమౌతున్నాడు – అన్నారు స్వామి పార్థసారధి, అడవిలో సింహం ఆకలివేసినప్పుడే జంతువుని వేటాడుతుంది. తిన్నాక ఎనిమిది రోజులు తన చుట్టూ తిరిగే సాధుజంతువుల్ని పట్టించుకోనయినా పట్టించుకోదు. అది తినగా వదిలేసిన ఆహారాన్ని నక్కలు, దుమ్ముల గొండీ, తోడేళ్ళూ తింటాయి. ఇంకా మిగిలిన వాటిని గద్దలూ, రాబందులూ తింటాయి. ఇంకా మిగిలినవాటిని చీమలు, సూక్ష్మక్రిములూ తింటాయి. ఇది ఒక అపూర్వమైన జీవన వలయం (లైఫ్ సైకిల్). ఇది సహజీవనానికి ప్రకృతిలోనే ఏర్పడిన క్రమశిక్షన. మనవుడు మేధావి. దురాశ, దుర్మార్గం అతను పెంచుకున్న లక్షణాలు.

ఏనుగు అంతం కోసం కొన్ని వ్మదల ఏనుగుల్ని మట్టుబెట్టిన ఒక్క వీరప్పన్ ఉదాహరన ఇందుకు చాలు. ఎన్ని వందల ఎకరాల అరణ్యం ఎస్ ఈ జెడ్ ల పేరిట స్వాహా అవుతోంది? ఎన్ని వందల జంతుజాలానికి రక్షణ లేక కాలగమనంలో అంతరించిపోతున్నాయి. సిమ్మెంటు జనరణ్యాల మధ్య మృగ్యమౌతున్న వృక్ష సంపదలేమికి మన చిన్నతనంలో మన మధ్య తారట్లాడిన పిచ్చుక ఏమయింది? పువ్వు ఫలం కావడంలో సీతాకొక చిలుక ఎంత గొప్ప పాత్ర వహిస్తోందో ఎందరికి తెలుసు? మన పక్కన పెరిగే చెట్టుకీ, మన పక్కన తిరిగే బల్లికీ, మన ఉనికికీ సంబంధం ఉంది. సమస్త జీవకోటీ పరస్పరాశ్రయంతో జీవిస్తున్నాయి. ఈ మాటని పురాణాలు చెప్పాయి. పెద్దలు చెప్పారు. శాంతియుత సహజీవనం ఔదార్యం కాదు. అవసరం. ప్రతీ జీవరాశికీ హక్కు. మన ముత్తాతలు పర్యావరణ పరిరక్షణ గురించి ఆలోచించలేదేం? వాళ్ళ జీవన సరళి పొరుగు జీవిని కబళించేది కాదు కనుక. కానీ మనం ఉంటున్న చలువ గది – ఎంత భయంకరమైన పర్యావరణ కాలుష్య హేతువో ఎందరీ తెలుసు? తెలిసినా ఎందరు ఒప్పుకుంటారు? తెలిసి చర్య తీసుకోవాలంటే ఎన్ని పరిశ్రమలు మూతబడతాయి? ఎన్ని బలమైన లాబీలు కత్తులు దూస్తాయి?

అంతర్జాతీయంగా ఐక్యరాజ్య సమితి అనుబంధంగా ఓ బృహత్తర ప్రణాళిక – భూమిపై జీవన పరిరక్షణ శక్తుల గుర్తింపుకు (ఇది సరైన అనువాదం కాదు – ఎర్త్ లైఫ్ సపోర్టింగ్ సిస్టంస్ EOLSS) కృషి జరుగుతోంది.

ప్రపంచ మేధావుల పరిశోధనలు, పరిశీలనలను గ్రంధ బద్ధం చేసే ఈ అనూహ్యమైన, అసాధారణమైన కార్యక్రమంలో 18 విజ్నాన సర్వస్వాలను – రూపొందిస్తోంది. ఇప్పటికి 800 గ్రంధాలు (ఈబుక్స్) ఇంటర్నెట్ లో ఉన్నాయి. ప్రపంచంలో ఎన్నో దేశాల శాస్త్రజ్నులు, మేధావులు ఉన్న ఈ

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

స్మృష్ఠ సంపాదక మండలిలో – అదృష్టవశాత్తూ నేనూ ఒక సంపాదకుదిని. అంతేకాదు. ఈ సంస్థ ప్రణాళికను సిద్ధం చేసే జాయింట్ కమిటీలో ప్రపంచంలో కేవలం 14 మందే ఉంటారు. అందులో నేనొకడిని. ఈ విమర్శ బాధ్యతారహితమని తోచిపుచ్చుతారేమోనని నన్ను నేను సమర్ధించుకోడానికి ఈ విషయాన్ని సాక్ష్యం తెచ్చుకుంటున్నాను నా గొప్పలు చెప్పుకోడానికి కాదు.

ఇది చాలా అవసరమైన , మనల్ని మనం – పొరపాటు మనల్ని మనం ఎలాగూ దోచుకుంటున్నాం( నేను స్కాంల గురించీ, పదవుల గురించీ మాట్లాడడం లేదు – కొందరయినా భుజలు తడువుకుంటున్నారని నాకు తెలుసు) ముందు తరాల వనరలను రక్షించాల్సిన ఆవశ్యకత ఎంతయినా ఉంది. 70 ఏళ్ళ తర్వాత 'స్నానం' అంటే ఏమీటో తెలియని పరిస్థితి వస్తుందని నిరూపించిన ఒక నిపుణుడి రిపోర్ట్ నా దగ్గర ఉంది. మనసుంటే – చేతనయితే ప్రముఖ దర్శకుదు యాన్ ఆర్తస్ బెర్ట్రాండ్ తీసిన "హోం" అనే అద్భుతమైన పరిశోధనాత్మక చిత్రాన్ని చూడండి. 35 దేశాలలో చిత్రించిన ఈ అపూర్వమైన చిత్రానికి ప్రముఖ హాలీవుడ్ నటి గ్లెన్ క్లోస్ కామెంటరీ చెప్పింది. ఈ భూగ్రహం రూపుదాల్చడం, అపూర్వమైన ప్రకృతి పరిణామం, వైభవం, క్రమంగా శిధిలమౌతున్న వనర్లు, జరుగుతున్న దోపిడీ – ఇంకా ఇంకా ఎన్నో తెలుస్తాయి. దీనిని ఫ్రెంచి, ఇంగ్లీష్, జర్మనీ, స్పెయిన్, రష్యన్, అరబిక్ భాషల్లో తర్జుమా చేశారు. ఇక్క ఇంటర్నెట్ లోనే 320 లక్షల మంది చూశారు. ఒక్క గ్రాన్స్ లోనే 83 లక్షల మంది చూశారు. గొప్ప చిత్రాలు చూసే అవసరం మనకు ఎలాగూ లేదు కనుక – తెలుగులోకి తర్జుమా కాలేదు. జరిగే అన్యాయానికి జరిపే మన తరం 'ఎరుక ' కూడా ఒక చికిత్సకి ప్రారంభమే. ఆ ప్రయత్నమే హైదరాబాదులొ ఈ 19 రోజుల సదస్సు చేయగలదని ఆశిద్దాం.

(అక్టోబర్ 08, 2012)




## (October 15,2012) Arachakaniki Akhari Malupu అరాచకానికి ఆఖరి మలుపు

ఇంటికి పెద్దవాడుంటాడు. పెద్దరికం ఒకరిచ్చేది కాదు. ముఖ్యంగా ఇంటి పెద్దరికం. తండ్రినో, తాతనో మనం నిర్ణయించలేదు. మన ఉనికిని వారు నిర్ణయించారు. ఆ పెద్దరికాన్ని ఎదిరిస్తే ఏమవుతుంది? మన ఉనికికి కారణమయిన పాపానికి వారు తలొంచుతారు. నిస్సహాయంగా బాధపడతారు. కృతఘ్నతకి పరిహారం లేదు. "నువ్వెంత?" అని ముసిలి తండ్రిని ఎదిరిస్తే అతని గుండె పగులుతుంది. అందువల్ల ఆ గుండెకే గానీ దేశానికి నష్టం లేదు. కానీ ఓ వ్యవస్థ కూలిపోవడానికి అది ప్రారంభం. ఈ ఎదిరింపుకి ఒక పేరుంది. అవ్యవస్థ. అందువల్ల వచ్చే పరిణామం పేరు అరాచకం.ఇక దేశం విషయం. దేశానికి పెద్దని మనం ఎన్నుకున్నాం. ప్రాంతాల్లో పెద్దల్ని ఆ ప్రాంతాల ప్రజలు ఎన్నుకున్నారు.

ఈ వ్యవస్థ సుగమంగా నడవడానికి కేంద్రమూ, రాష్ట్రమూ పరస్పర అవగాహనతో, ఒకరినొకరు గౌరవించుకుంటూ నడవాలి. రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రం కాదన్నా, పార్టీ ప్రయోజనాలకు కేంద్రం రాష్ట్రాన్ని చిన్న చూపు చూసినా అవ్యవస్థ ఏర్పడుతుంది. అలాంటి పరిస్థితులు ఏర్పడతాయి. అప్పుడే సంప్రదాయం బలం. తల ఒంచుకు నష్టపోమని మన సంస్కారం నేర్పింది. కానీ కేంద్రం మాటకి తలొంచి తన పదవిని, తన ప్రభుత్వ ఆధిక్యాన్ని – వెరసి తన స్వలాభాన్ని నష్టపోయే ప్రాంతీయ పాలక్ల సంస్కారం ఇవాళ ఎక్కడేడిసింది? ఫలితం – అరాచకం. ఇంకా ముందుకు పోతే పరాయి దేశాల దోపిడీకి దగ్గర తోవ. ఇది – కొండకచో – చట్టాలూ, శిక్షలూ, ఆంక్షలకు మించి వ్యవస్థ పాటించవలసిన – 'ధర్మం '. అదీమాట. కానీ రాజకీయ నిఘంటువులలో ఇది బూతు మాట.

ఈ ధర్మాన్ని పాటించకపోతే? దేశం కుక్కలు చింపిన విస్తరవుతుంది. వ్యవస్థ బలహీనమవుతుంది. ప్రాంతాలు నీరసపడతాయి. ఒకరికొకరు ఆసరా కారు. ఇలాంటి కప్పల తక్కిడి వాతావరణంలో మనదేశాన్ని చీల్చి వాడుకున్న ఈస్టిండియా కంపెనీ, బుడకీచుల కథలు మనకి తెలుసు. తండ్రిని ఎదిరించిన కొడుకు తన మునిమనుమడికి ఈ అరాచకాన్ని వారసత్వంగా ఇస్తాడు. మూడు తరాలనాటికి ఈ స్వార్ధానికి బలమైన బలమైన వేళ్ళు నిలదొక్కుకుంటాయి. కేంద్రాన్ని కాదన్న రాష్ట్రం మరొక అవకాశవాదికి ఆసరా అవుతుంది. ఒక నాయకుడికి పబ్బం పదవి వస్తుంది. బొజ్జ నిండుతుంది. కాని వ్యవస్థ అడుక్కుతింటుంది. తండ్రిని ఎదిరించిన కొడుకు అరాచకాన్ని ఎవరూ పట్టించుకోరు. అతి వ్యక్తిగతమైన కుసంస్కారం. వ్యవస్థలో ఈ కుసంస్కారానికి బలం చేకూరడానికి దశాబ్దాలు పడుతుంది. అప్పటికి వేళ మించిపోతుంది. ఒక బ్రిటిష్ పాలన పునాదులకు 150 ఏళ్ళు పట్టింది. ఒక మహాత్ముడి అవసరం కలిగింది. ఇది చరిత్ర.

ఇలాంటి అరాచకానికి ఈ మధ్యనే పునాదులు పడుతున్నాయి. మూడే మూడు ఉదహరణలు:

ఒకప్పటి సైన్యాధిపతిని – ఏ కారణం చేతనయినా ఇద్దరు హత్యచేశారు – పంజాబులో. ఆ హంతకుల కుటుంబాలను అమరవీరులుగా ప్రభుత్వ యంత్రాంగమే మొన్న సత్కారాలు చేసి అభినందించింది. నిన్న ఓ ఛానల్లో ఓ పాత్రికేయుడు 'ఇది తప్పుకాదా?' అని అడిగాడు. అ పార్టీ ప్రతినిధి ఆవేశంగా మొన్న కాశ్మీరులో జరిగింది, అటు మొన్న పార్లమెంటులో జరిగింది, ఆ మధ్య ముంబైలో జరిగినవాటికి ఈ వ్యవస్థ ఏం పీకింది? అని గొంతు చించుకున్నారు. భేష్. ఇదీ ఈనాటి రాజకీయ వ్యవస్థ బుకాయింపు. మీరు మీ నాన్నని 'వెధవా' అన్నారు. కనుక నేను మా నాన్నని 'లంజా

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

కొడకా' అనవచ్చు. నీతికి పాత తప్పుల్ని ఓరవడిగా చేసుకోవడం 'సాకు అవుతుంది కానీ 'సమర్ధన' అవదు. ఇదీ ఈనాటి అరాచకానికి పునాదులు వేస్తున్న తరానికి ప్రతినిధులు. బురదలోంచి పద్మం రావడం సృష్టి. బురదలోకి పంది రావడం సహజ లక్షణం.

మరో కథ. కావేరీ జలలు తమిళనాడుకి ఇవ్వాలని ఒప్పందం. ఇవ్వవలసిందే అన్నారు మొన్న ప్రధాని కర్ణాటక ప్రతినిధి వర్గంతో. కోర్టూ నిర్దేసించింది. కానీ కర్ణాటక ప్రభుత్వం తమిళనాడుకి నీరు ఇవ్వడాన్ని నిలపవేసింది. కోర్టూ, ప్రధానీ, రెండు రాష్ట్రాల ఒప్పందం – ఇన్నిటిని కాదన్నాక ఇక ఈ వ్యవస్థలో బలమెక్కడ? జలల పంపిణీ ప్రసక్తి కాదిక్కడ. చట్టం పట్ల. ప్రభుత్వం పట్ల మర్యాద మాట.

మూడో కథ. గత నెలలో రాజస్థాన్ లో కేవలం 15 మానభంగాలు మాత్రమే జరిగాయి. 'అన్ని చోట్లా జరుగుతున్నాయి. మా రాష్ట్రంలోనే కాదు' అని తృప్తి చెందారు ఓ రాజస్థాన్ మంత్రిగారు. మాజీ ముఖ్యమంత్రి ఓం ప్రకాష్ చౌతలా గారు. మరొకడుగు ముందుకు వేసి "అందుకే నేనంటాను – పదిహేనేళ్ళ లోపు అమ్మాయిలకు పెళ్ళిళ్ళు చేసెయ్యండి. లేకపోతే మానభంగాలు తప్పవు" అంటూ అనూచానంగా వస్తున్న గ్రామీణ ఛందసపు (ఖాప్) పంచాయితీల ధోరణిని సమర్ధించారు. పదిహేనో ఏట పెళ్ళిళ్ళు చట్టరీత్యా నేరం. ఆ విషయం ఒకప్పటి ముఖ్యమంత్రిగారికి తెలియదా? వారు ప్రస్తుతం పదవిలో లేరు. రేపటి ఓట్లకి ఈ ఉవాచ పెట్టుబడి. ఈ దేశంలో అందరు నయకులూ ఈ మాటల్ని వినీవిననట్టు ముఖాలు అటు తిప్పుకున్నారు. ఒక నీచపు ఉదాహరణ. అశుద్దాన్ని మొహం మీద విసిరితే ముఖం తిప్పుకున్నా, ఎక్కడ పడినా దాని దుర్వాసన భరించక తప్పదు.

మన శత్రువులు ఈ ప్రాంతీయ నాయకుల విశృంకలత్వాన్ని గమనిస్తూనే ఉంటారు. మరో పదేళ్ళకి కాకపోయినా మరో ఇరవై ఏళ్ళకయినా ఓ పాకిస్థాన్ (అప్పుడే ఐ.యస్.ఐ ఖాలిస్థాన్ దౌర్జన్యకారులను దువ్వుతోందని వింటున్నాం), మరో చైనా, మరో నేపలు, మరో బర్మా మనకి పాలకులయితే ఆశ్చర్యం వద్దు. నేపాలు, బర్మాల గురించి చెప్పినప్పుడు కొందరికి నవ్వు రావచ్చు – మనం అంత తీసిపోయమా అని. అయ్యా, బలహీనమయిన సర్పానికి చలిచీమ చాలు. అలనాడు ఈస్టిండియా కంపెనీ అలాంటి చలిచీమే!

( **అక్టోబర్** 15, 2012)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (October 22, 2012) Keeerti కీర్తి

ప్రముఖ అమెరికన్ రచయిత్రి ఎమిలీ డికిన్సన్ కీర్తి గురించి అతి చిన్న కవిత రాసింది. కవిత చిన్నదయినా కవితా హృదయం ఆకాశమంత ఉన్నతమయింది. ఆవిడ అంటుంది: "కీర్తి తేనెటీగలాంటిది. పాట పాడి లాలిస్తుంది. కాటువేసి జడిపిస్తుంది. ఆఖరికి రెక్కలు విప్పుకు ఎగిరిపోతుంది" అని.

మనం సంపాదించుకున్న కీర్తికి అతి పరిమితమయిన, క్రూరమైన ఎల్లలున్నాయి. మొన్న మా అబ్బాయి చెన్నై నుంచి హైదరాబాదు వచ్చి నాకీ కథ చెప్పాడు. అతని ముందు వరసలో – అంటే విమానం మొదటి వరసలో కేంద్ర మంత్రి గులాం నబీ అజాద్ కూర్చున్నారట. సాధారణంగా ప్రముఖుల సీటు పక్క సీటుని ఖాళీగా వదిలేస్తారు. కానీ ఆయన పక్క సీటులో ఓ రాష్ట్ర మంత్రి (పేరు అనవసరం) కూర్చున్నారట. చెన్నైలో విమానం సర్వీసు వారికి గులాం నబీ అజాద్ అనే కేంద్రమంత్రి అని తెలుసు. ఆ పక్కన కూర్చున్న వ్యక్తి తెలీదు. అజాద్ గారికి ఎయిర్ హోస్టెస్ ఉచితంగా కాఫీ ఫలహారాలు ఇవ్వబోయింది. ఆయన మంచినీళ్ళు చాలునన్నారు. పక్కనున్న రాష్ట్ర మంత్రిగారు నాకూ మంచినీళ్ళు కావాలన్నారు. ఎయిర్ హోస్టెస్ ముక్తసరిగా "మంచినీళ్ళకి మీరు డబ్బు చెల్లించాలి" అంది. మంత్రిగారు కంగారు పడిపోయారు. ఆయన పరపతి ఆంధ్రదేశపు ఎల్లలు దాటలేదు. అజాద్ గారి పరపతి దాటింది. మంత్రిగారి ఇబ్బంది కనిపెట్టి అజాద్ గారు చిన్న రాజీసూత్రాన్ని ప్రయోగించారు. "నేను సమస్యని పరిష్కరిస్తాను" అంటూ ఒక గ్లాసు ఇవ్వమన్నారు ఎయిర్ హోస్టెస్ ని తన సీసాలో నీళ్ళు పోసి రాష్ట్ర మంత్రి గారికిచ్చారు. ఇబ్బంది సర్దుకుంది. ఇది రాష్ట్ర పరపతి కథ.

అజాద్ గారు రాష్ట్ర మంత్రిగారితో తన అనుభవం ఒకటి చెప్పారు "ఇంతకన్నా విచిత్రమైన సంఘటన నాకు ఎదురైంది" అంటూ. ఓసారి విదేశీ విమానంలో విదేశాలకు వెళ్తున్నారట. విదేశీ విమనాల్లో అజాద్ గారు ఎవరో ఆయా విమానాల ఎయిర్ హోస్టెస్ లకు తెలియకపోవచ్చు. (అమెరికలో షారూక్ ఖాన్ పరపతికే దిక్కులేదు!) ఇలాగే మంచి నీళ్ళు అడిగారట. ఎయిర్ హోస్టెస్ తెచ్చి ఇస్తూ డబ్బు ఇవ్వాలందట. ఆయన ఫలనా వెనుక వరసలో ఇద్దరు ఏషియన్ మహిళలు కూర్చున్నారు. వాళ్ళ దగ్గర తీసుకోమన్నారట. ఎయిర్ హోస్టెస్ వెళ్ళి అంతలో చటుక్కున తిరిగి వచ్చింది. "అక్కడ ఎవరూ కనిపించలేదు" అంటూ ఆయన చేతిలోంచి మంచినీళ్ళ సీసా లాక్కుందట. దేశీయ స్థాయి పరపతి విదేశాల్లో వీగిపోయిన సందర్భమిది.

రాజకీయ పరపతికి – చాలా చిన్న తెర – ముందు రోజు రాజాగారు కేబినెట్ మంత్రి మరునాడు తీహార్ జైల్లో ఖైదీ. "కారే రాజులు రాజ్యముల్ కలుగవే, గర్వోన్నతిం బొందరే, వారేరీ.."

మరో పరపతి కథ. దాదాపు 22 ఏళ్ళ కిందట నేనూ, జే.వీ.సోమయాజులు (శంకరాభరణంలో శంకర శాస్త్రి), పద్మనాభం, తులసి – అంతా కలిసి అమెరికా వెళ్ళాం. శ్రీలంక నుంచి పారిస్ కి విమానం ఎగిరింది. సిగరెట్లు లేక సోమయాజులుగారు ఇబ్బంది పడుతున్నారు. ఏం చెయ్యాలో తెలీక అందరూ తెల్లమొహం వేశాం.




మరో రెండు గంటల తర్వాత – పక్క వరసలో సోమయాజులుగారు కనిపించలేదు. విమానం ఎగురుతోంది. ఎక్కడికి వెళ్ళారు? వెదుక్కుంటూ విమానంలో నడిచాను. ఆఖరి వరుసలో ఇద్దరు మలేషియా ప్రయాణీకులతో కూర్చుని విలాసంగా సిగరెట్లు కాలుస్తున్నారు సోమయాజులుగారు. ఆశ్చర్యపోతున్న నన్ను చూసి నవ్వారు. "మరేమిటి? శంకరాభరణం దెబ్బ" అన్నారు. అదీ ఓ విమాన ప్రయాణంలో – ఓ సినీమా ఓ సినీనటుడికి చేసిన ఉపకారం.

ఇంకో గొప్ప సంఘటన. తిరుగు ప్రయాణంలో మా విమానం ఉదయం ఏడున్నరకి కొలంబో చేరింది. చెన్నై వెళ్ళే విమానం రాత్రి ఎనిమిది గంటలకి. అంతవరకూ విమానాశ్రయంలో పడిగాపులు పడాలి. అమెరికా నుంచి వచ్చిన ప్రయాణంలో – జెట్ లాగ్ తో అలసిపోయి ఉన్నాం ఏం చెయ్యాలో తెలియని నిస్సహాయపు పరిస్థితి మాది.

ఒక శ్రీలంక ఉద్యోగి – మహిళ – సోమయాజుగారిని చూసి చటుక్కున ఆగిపోయింది – కళ్ళు పెద్దవి చేసుకుని. "మీరు – ఆ సినిమాలో" అంటూ.

నేను పరిచయం చేశాను. "శంకరాభరణంలో శంకరశాస్త్రి" అంటూ.

అంతే. మా ఇద్దరినీ తీసుకువెళ్ళి ఎయిర్ పోర్టు మేనేజరుకి పరిచయం చేసింది. వారిద్దరూ మరెవరితోనో మాట్లాడారు. ఫలితం – మా నలుగురికి – నాకు, మా ఆవిడ, సోమయాజులు, మా అబ్బాయికి తాత్కాలిక వీసాలు ఇచ్చి – సాయంకాలం వరకూ కొలంబోలో ఓ హోటల్ లో వసతిని ఇచ్చారు. రోజంతా విశ్రాంతి తీసుకుని – రాత్రి పువ్వుల్లాగ చెన్నై విమానాన్ని ఎక్కాం.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

మరో సరదా అయిన సంఘటన. చాలా సంవత్సరాలకిందట అబూదాబీలో ఉన్న మిత్రులు గంటి ప్రసాదరావుగారి దంపతులూ నేనూ, మా ఆవిడా టాంజానియా యాత్రకి బయలుదేరాం.

దార్ ఎస్ సలాం అనే రాజధాని నగరం నుంచి కిస్సివానీ అనే అటవీ



ప్రాంతానికి ప్రయాణం చేస్తున్నాం. ఊరు దాటుతూండగా ఆడవాళ్ళిద్దరూ అడవిలో వంటకి టమాటలు కావాలన్నారు – ఆఫ్రికాలో అడవిలో ఇబ్బంది పడకుండా నేనూ ప్రసాదరావుగారూ ఓ చిన్న ఊరు బజారు దగ్గర ఆగాం.

నాలుగడుగులు వేశామోలేదో చక్కని తెలుగు పలకరింత వినిపించింది:

"మారుతీరావుగారూ!" అంటూ. తెలుగువాడు. నన్ను చూసి పొంగిపోయాడు. అడవిలో ఆవకాయలాంటిది తెలుగు పలకరింత. మాతో తిరిగి ఏవేం కొనుక్కోవాలో, ఎక్కడ దొరుకుతాయో చెప్పాడు. "ఎన్నాళ్ళు అడివిలో ఉంటారు? ఎప్పుడు తిరిగిరాక?" తెలుసుకున్నాడు. మా ఫోన్ నంబర్లు తీసుకున్నాడు. మరో అయిదారు రోజుల తర్వాత తిరిగి వచ్చాం. ఆ సాయంకాలం పెళ పెళలాడే పట్టు చీరెలతో, తెలుగు వంటకాలతో దార్ ఎస్ సలాంలో ఓ హోటల్లో చక్కని విందు , సభ, సత్కారం ఏర్పాటు చేశారు. అది మరిచిపోలేని మర్యాద అనుభవం.

అధికారంతో వచ్చే కీర్తి ఎల్లలు దాటదు. అభిమానంతో వచ్చే కీర్తికి ఎల్లలు లేవు.

(అక్టోబర్ 22, 2012)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (October 29, 2012) Gandhi Puttina Desam గాంధీ పుట్టిన దేశం

గాంధీ పుట్టిన దేశమిది. చిన్న అంగవస్త్రం చుట్టుకుని, చేతికర్ర పట్టుకుని, గొర్రెపాలు తాగి, మూడో తరగతి కంపార్టుమెంటులో ప్రయాణం చేస్తూ రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య పాలకుల్ని గద్దెదించిన ఓ'బికారి' పుట్టిన దేశం. ఈ దేశంలో మంత్రిగారు 71 లక్షలో దుర్వినియోగం చేస్తే తప్పులేదని సమర్థించే ఓ కేంద్ర మంత్రి, పని సజావుగా చేశాక, కాస్త దోచుకున్నా తప్పులేదని ఐయ్యేయస్ అధికారులకు హితవు చెప్పే ఓ రాష్ట్ర మంత్రీ ఉన్నారు. భారతదేశం అవకాశవాదులు, రోగ్స్, అవినీతి పరుల పాలిట పడుతుంది –అని ఆనాడే వక్కాణించిన మాజీ బ్రిటిష్ ప్రధాని విన్స్టన్ చర్చిల్ జోస్యాన్ని అక్షరాలా నిజం చేసే రోజులొచ్చాయి. కేంద్ర మంత్రి బేణీ ప్రసాద్ వర్మ టీవీ కెమెరాల ముందు ముసి ముసి నవ్వులు నవ్వుతూ 'కేంద్రమంత్రికి 71 లక్షలు ఓ లెక్కా? 71 కోట్లు అయితే ఆలోచించవచ్చు' అనే హాస్యోక్తి దేశం చూసి పులకించింది. ఈ దేశంలో ఇలాంటి మాటలు అన్నాక కూడా చెల్లుబాటయిపోయే గాజులు తొడిగించుకున్న పాలక యంత్రాంగం వుంది, దీనిపేరు ప్రజాస్వామ్యం.

గాంధీ జీవితంలో రెండే రెండు సంఘటనలను ఇక్కడ గుర్తు చేసుకోవడం సముచితంగా వుంటుంది. దక్షిణాఫ్రికాలో భారతీయుల హక్కులకోసం బాపూజీ పోరాటం సాగిస్తున్న రోజులివి. ఆనాటి ప్రభుత్వం –ప్రతీ భారతీయుడూ తమ గుర్తింపు కార్డుల కోసం వేలి ముద్రలివ్వాలని చట్టాన్ని చేసింది. ఎట్టి పరిస్థితులలోనూ యివ్వరాదని గాంధీజీ భారతీయులకు ఉద్బోధించారు. తత్ఫలితంగా –వందలాది మందిని అరెస్టు చేశారు.

అప్పటి బ్రిటిష్ ప్రభుత్వానికి 'సహాయ నిరాకరణ', 'సామూహిక చట్ట ఉల్లంఘన' వంటి ఉద్యమాల రుచి తెలియదు. ప్రభుత్వ యంత్రాంగం నిలిచిపోయింది. ఏం చెయ్యాలో ప్రభుత్వానికి కొరుకుడు పడలేదు. జైలులో ఉన్న గాంధీజీని –గవర్నరు జనరల్, అప్పటి ఫీల్డ్‌మార్షల్ క్రిస్టియన్ స్మట్స్ తన కార్యాలయానికి పిలిపించారు. జైలు దుస్తుల్లో, చేతులకి బేడీలతో గాంధీజీని తీసుకువచ్చారు. బేడీలు తీసి, ఆయన్ని స్మట్స్‌గారి సమక్షంలో నిలిపారు. గాంధీజీ మాటలకి లొంగే ఘటం కాదని తేల్చుకుని –ఈ చట్టాన్ని ఉపసంహరిస్తూ –అక్కడికక్కడే గాంధీజీని జైలు నుంచి విడుదల చేశారు. ఒకడుగు వేసి, తన జైలు దుస్తుల్ని చూసుకొని గాంధీజీ ఆగారు. "ఈ బట్టల్లో నడిచి వెళ్లడం కన్నా –టాక్సీలో వెళ్తాను, నాకు డబ్బు అప్పుకావాలి" అన్నారు గాంధీజీ గవర్నర్ జనరల్‌తో. స్మట్స్ నిర్ఘాంతపోయారు. "ఎంతకావాలి?" అన్నారు. 'ఒక షిల్లింగ్'. స్మట్స్‌కి ఏం చెయ్యాలో తెలీక తన సహచరుడు డేనియల్‌ని అడిగారు. ఈ నిజాయితీ వారికి అర్థం కానిది, ఊహించనిది. జేబులోంచి ఒక షిల్లింగ్ తీసి యిచ్చారు.

కోట్లు స్వాహా చేసి, అరెస్టయి నెలల తరబడి జైళ్లలో ఉండి నిరపరాధిగా కాక, కేవలం బెయిల్‌మీద విడుదలయిన –మన కాలం నాటి కేంద్ర మంత్రులు (ఉదాహరణకు ఏ రాజా) ఒక సామ్రాజ్యాన్ని జయించినట్టుగా జైలు తలుపులు తీసుకురావడం, వారి చెంచాలు "సత్యమేవ జయతే" అనే నినాదాలు చేయడం చూస్తున్నాం. అలనాడు గాంధీ తనని అరెస్టు చేసిన గవర్నరు జనరల్ దగ్గర ఒక షిల్లింగ్ అప్పుచేసి టాక్సీలో ఇంటికి వెళ్లాడు. మహా గౌరవనీయులయిన బేణీ ప్రసాద్ వర్మ గారి కిది పాఠంగా చెప్పాల్సిన సంఘటన. బాబూ! మనది ప్రజాస్వామ్యం. మరొక సంఘటన. భారత స్వాతంత్ర్య పోరాటపు రోజుల్లో బీహార్‌లో చంపారన్ ప్రాంతంలో ఇండిగో కార్మికుల ఇక్కట్లను పరిష్కరించడానికి




గాంధీజీని ఆహ్వానించారు. ఆయన రైలు దిగినప్పుడు వేలాదిమంది స్వాగతం పలికారు. బ్రిటిష్ పోలీసులకి పచ్చి వెలక్కాయ నోట్లో పడిన పరిస్థితి. ఏం చెయ్యాలో తెలీక గాంధీజీని అరెస్టు చేశారు. ఆయన్ని మెజిస్ట్రేట్ ముందు నిలబెట్టారు. చంపారన్ శాంతి భద్రతల దృష్ట్యా వెంటనే రాష్ట్రాన్ని వదిలివెళ్లవలసిందిగా మెజిస్ట్రేటు శాసించారు. నేను వెళ్లనన్నారు గాంధీజీ. ఏం చెయ్యాలో మెజిస్ట్రేట్‌కి అంతుబట్టలేదు. "అయితే నిన్ను విడుదల చెయ్యడానికి వంద రూపాయలు జరిమానా విధిస్తున్నాను" అన్నారు. నేను వంద రూపాయలు చెల్లించనన్నారు. మెజిస్ట్రేటు జీవితంలో – బహుశా భారత దేశ చరిత్రలోనే ఇటువంటి ఖైదీని ఎవరూ చూసివుండరు. ఏం చెయ్యాలో తెలీక –విలవిలలాడి "అయితే వంద రూపాయలు చెల్లించనక్కరలేకుండానే నిన్ను విడుదల చేస్తున్నాను" అన్నారు మెజిస్ట్రేట్. ఒక షిల్లింగ్, వంద రూపాయలూ –విలువ కేవలం డబ్బు కాదు. (ఏ.రాజాలూ, బేణీప్రసాద్ వర్మలూ తమరు గ్రహించండి) ఒక వ్యక్తి నైతికమయిన, ఒక జాతి సగర్వంగా తలెత్తుకోవలసిన అపురూపమయిన క్షణాలు. ఆ వ్యక్తి మహాత్ముడయ్యాడు. మన దేశానికి స్వాతంత్ర్యాన్ని సముపార్జించి పెట్టారు. మరో 60 ఏళ్ల తర్వాత 71 లక్షలు దోచుకోవడం అంత పట్టించుకోవలసిన విషయం కాదని కెమెరా ముందే చెప్పి, పదవిని నిలుపుకొన్న దోపిడీ దారుల పాలనలో వున్నాం. పనిచేసి దోచుకోవచ్చునని బోధించే రాష్ట్ర మంత్రుల హయాంలో బ్రతుకుతున్నాం. వారికి గాంధీజీ అప్పుచేసిన ఒక షిల్లింగ్, చెల్లించడానికి నిరాకరించిన వందరూపాయలూ గడ్డిపరకల్లాగ, గాంధీజీ వెర్రిబాగుల వారిలాగ కనిపించవచ్చు.

బాబూ!మనది ప్రజాస్వామ్యం. అదే మన దరిద్రం.

(అక్టోబర్ 29, 2012)




## (November 05 , 2012) Anni Unnavade..Emee Leni Vadu అన్నీ ఉన్నవాడే ఏమీలేనివాడు.

ఇంటర్నెట్ లో చాలా మంది మిత్రులు – ప్రపంచం అన్ని మూలల నుంచీ రకరకాల కథలు, సందర్భాలను ఉటంకిస్తూంటారు. ఇది నలుగురితో పంచుకోవలసినంత గొప్ప సగతి:

1923 లో అమెరికాలోని చికాగోలో ఉన్న ఎడ్జి వాటర్ బీచ్ హోటల్ లో దేశంలో కల్లా శ్రీమంతులైన తొమ్మిది మంది కలుసుకున్నారు. వాళ్ళందరి ఆస్తుల్ని కలిపితే ఆనాటి అమెరికా దేశపు సంపద కన్నా ఎక్కువ. డబ్బుని ఎలా సంపాదించాలో, ఎలా కూడబెట్టాలో వంటబట్టించుకున్న మహానుభావులు వీరు.

అసలు వీళ్ళెవరు?

1. దేశంలో కల్ల పెద్ద స్టీలు కంపెనీ ప్రెసిడెంటు.
2. దేశంలో కల్లా పెద్ద వినియోగ వస్తువుల కంపెనీ ప్రెసిడెంటు.
3. న్యూయార్క్ స్టాక్ ఎక్స్ ఛేంజి అధ్యక్షుడు.
4. అంతర్జాతీయ వాణిజ్య బాంకు ప్రెసిడెంటు.
5. దేశంలో కల్లా పెద్ద గోధుమ కొనుగోలు వ్యాపారి.
6. వాల్ స్ట్రీట్ లో షేర్ల వ్యాపారం చేసే అతి పెద్ద వ్యాపారి.
7. అప్పటి ప్రపంచంలో కల్లా పెద్ద పెట్టుబడిదారీ సంస్థ అధ్యక్షుడు.

ఏ దేశంలోనయినా, ఎక్కడయినా, ఎప్పుడయినా ఇంతకన్నా శ్రీమంతుల జాబితాను మనం చూడలేము.

కానీ, 25 సంవత్సరాల తర్వాత వీరంతా ఎలావున్నారు? ఆ ప్రశ్నకంటే ముందు వీరికేమయిందో తెలుసుకోవడం మంచిది. ఆనాటి అతి పెద్ద స్టీలు కంపెనీ (బెత్లెహాం స్టీల్ కార్పో రేషన్) ప్రెసిడెంటు చార్లెస్ స్వాబ్ అయిదేళ్ళు అప్పుల పెట్టుబడితో వ్యాపారం చేసి బికారిగా చచ్చిపోయాడు. దేశంలో కల్లా పెద్ద గాస్ కంపెనీ ప్రెసిడెంటు హోవర్డ్ హబ్సన్ పిచ్చివాడయాడు. దేశంలో కల్లా పెద్ద గోధుమ కొనుగోలు వ్యాపారి ఆర్థర్ కాటన్ బికారి అయాడు. అంతర్జాతీయ వాణిజ్య బాంకు ప్రెసిడెంటు రిచర్డ్ విట్నీ జైలుకి వెళ్ళాడు. అమెరికా ప్రెసిడెంటు హార్డింగ్ మంత్రి వర్గ సభ్యుడు జైలు నుంచి కోర్ట్ ద్వారా విడుదలని పొంది ఇంటి దగ్గర ప్రాణాలు వదిలాడు. వాల్ స్ట్రీట్ లో షేర్స్ వ్యాపారి జెస్సీ లివర్ మోర్ ఆత్మహత్య చేసుకున్నాడు.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

ప్రపంచంలో కల్లా పెద్ద పెట్టుబడిదారీ సంస్థ అధ్యక్షుడు ఇవార్ క్రూగర్ ఆత్మహత్య చేసుకున్నాడు. అంతర్జాతీయ వాణిజ్య బాంకు ప్రెసిడెంటు లియోన్ ఫ్రేజర్ ఆత్మహత్య చేసుకున్నాడు. దేశంలో కల్లా పెద్ద వినియోగ వస్తువుల కంపెనీ ప్రెసిడెంటు దామ్యూల్ ఇన్సెల్ చేతిలో చిల్లిగవ్వలేక కన్నుమూశాడు.

వాళ్ళు జీవితంలో డబ్బుని కూడబెడుతూ జీవించి, అసలు జీవనానికి అవసరమయిన విలువల్ని మరిచిపోయారు. డబ్బు ఎన్నటికీ కీడు చెయ్యదు. ఆకలి గొన్నవాడికి అన్నం పెడుతుంది. అనారోగ్యంతో ఉన్నవాడికి చికిత్స చేయిస్తుంది. బట్టలేనివాడికి గుడ్డనిస్తుంది. డబ్బు మన జీవనోపాధికి కేవలం ఒక పరికరం. ఒక ఊతం. అవసరం.

మనకి రెండు రకాలయిన అవగాహనలు కావాలి. 1.జీవితాన్ని ఎలా గడపాలి? జీవితాన్ని ఎందుకు గడపాలి? మనలో చాలామంది డబ్బుని సంపాదించే యంత్రాలుగా మారిపోతారు. భార్య, పిల్లల శ్రేయస్సు, వారి ఉనికి, సాంఘిక బాధ్యతలు మరుగున పడిపోతాయి. "ఎందుకయ్యా ఈ డబ్బు?" అని ఎవరినయినా అడగండి. "నా కుటుంబం కోసం" అని సమాధానం

కానీ ఎక్కడుంది ఆ కుటుంబం? నువ్వు ఇల్లు వదిలేముందు నీ పిల్లలు నిద్రలేవలెదు. నువ్వు ఇల్లు చేరేతప్పటికి నీ పిల్లలు మేలుకుని లేరు.

ఇరవైయ్యేళ్ళ తర్వాత వాళ్ళంతా వాళ్ళ మానాన వాళ్ళు వెళ్ళిపోతారు – వాళ్ళ వాళ్ళ బతుకులు బతకడానికి, వాళ్ళ ఆశయాలను నెరవేర్చుకోడానికి. నువ్వు కట్టిన ఇల్లు, నీ అనారోగ్యం, నీ సంపద – అవసరంలేని, ఎందుకో అర్ధం కాని సంపద – నీతో ఉంటుంది. ఏం చేస్తావు దాన్ని? ఇప్పుడు జెస్సె లివర్ మోర్ ఎందుకు నిస్పృహ లో పడ్డాడో, హోవర్డ్ హ్యూస్ ఎందుకు పిచ్చివాడయాడో కాస్త అర్ధమౌతూ ఉంటుంది.

నీరు లేనిదే ఓడ నడవదు. కానీ ఓడనిండా నీరు నిండితే ఓడకి ప్రమాదం. నీరు ఉండవలసినచోట, ఉండవలిసినంతే ఉండాలి. ఇంకా ముఖ్యం – ఉంచాలి. లేకపోతే ప్రయాణం సాగదు. ఓడ మునిగిపోతుంది.

సంపాదన అవసరమే. కానీ అదే మన మనస్సంతా ఆక్రమించుకోరాదు. కావలసినంత మాత్రమే నింపుకుని – మిగతా మనస్సులో మీ భార్యా, పిల్లలు, చుట్టూ ఉన్న సమాజం – ఇందరికి చోటిస్తే – జైళ్ళు, పిచ్చాసుపత్రిల అవసరం ఉండదు. ప్రయాణం సజావుగా సాగుతుంది. ప్రపంచంలో కల్లా అనూహ్యమైన సంపదని ఆర్జించి – దయనీయంగా చచ్చిపోయిన తొమ్మిది మంది శ్రీమంతులు తాము చచ్చి మనం ఎలా బతకాలో చెప్పే నీతికథ ఇది.

( **నవంబర్** 5, 2012)




## (November 19,2012) Hasyapu Karuvu హాస్యపు కరువు

ఆ మధ్య నాగపూర్ కార్టూనిస్టు ఆసీం త్రివేదీని – కార్టూన్లు వేసినందుకు దేశద్రోహ నేరానికి అరెస్టు చేసినప్పుడు – ఈ పాలక వ్యవస్థకి, నాయకులకీ బొత్తిగా హాస్యపు రుచి తెలియదని చాలామంది దుమ్మెత్తిపోశారు.

పార్లమెంటుని పాయిఖానా తొట్టిగా, సత్యమేవ జయతే అన్న జాతీయ ఆదర్శాన్ని 'భ్రమేవ జయతే ' అన్నప్పుడు, అజ్మాల్ కసాబ్ ఈ దేశపు రాజ్యాంగం మీద ఉచ్చ పోసినప్పుడు – పాలక వ్యవస్థకి, నాయకులకీ బొత్తిగా హాస్యపు రుచి తెలియదని చాలామంది దుమ్మెత్తిపోశారు. పార్లమెంటుని పాయిఖానా తొట్టిగా, సత్యమేవ జయతే అన్న జాతీయ ఆదర్శాన్ని 'భ్రష్టమేవ జయతే' అన్నప్పుడు, అజ్మాల్ కసాబ్ ఈ దేశపు రాజ్యాంగం మీద ఉచ్చపోసినప్పుడు – పాలక వ్యవస్థకి కోపం రావడం సహజమే.

కవ్వించి నవ్వించే కార్టూన్లు అంతగా బరితెగించాలా? అని కొందరు అనుకోవడమూ సహజమే. కార్టూన్లు చిన్న చురకలు. వాస్తవాన్ని అన్వయించే చిన్న మెలికలు. జరిగిన సంఘటనలో అసందర్భాన్నో, విపర్యాస్నో ఎత్తి చూపే ఒక సున్నితమైన ప్రక్రియ. అంతే దాని పరిమితి. కార్టూన్ బరితెగించకూడదు. అయితే బరితెగించిన కార్టూన్ 'దేశద్రోహం' అవుతుందా? అసమర్థు డయిన కుర్రాడి చేతిలో తుపాకీ అతడిని హంతకుడిని చేస్తుందా?

ఇది మరో కథ. మరో మీ మాంస. ఏమయినా ఈ పాలకవ్యవస్థకి, నాయకులకీ హాస్యాన్ని ఆస్వాదించే అభిరుచి లేదని ఈ మధ్య వాపోయారు. 'ఇండియా టుడే' – ఈ విషయమై ఒక ప్రత్యేక సంచికనే ప్రచురించింది. ఈ విమర్శకి సమాధానాన్ని ఈ మధ్య మన నాయకులు సమృద్ధిగా సమాధానం చెప్పారు. హాస్యం విషయంలో తాము తీసిపోమని నిరూపించారు. ఇందుకు బోలెడన్ని ఉదాహరణలు: కాంగ్రెసు నాయకులు దిగ్విజయ సింగుగారు "అరవింద్ క్రేజీవాల్ అవినీతి ముసుగు విప్పుతానంటున్నాడు. ఆయనా, రాఖీసావంత్ ఎంత విప్పినా లోపల సరుకు ఏమీలేదు" అన్నారు.

ఈ జోక్ కి 90 కోట్లు ఖర్చవుతుందని పాపం, సింగుగారికి తెలీదు. రాఖీ సావంత్ ప్రస్తుతం దిగ్విజయ సింగ్ గారి మీద పరువు నష్టం దావా వెయ్యబోతున్నారు.

భారతీయ జనతా పార్టీ నాయకులు యశ్వంత సిన్హా గారు రాహుల్ గాంధీ గురించి మాట్లాడుతూ : రాహుల్ గాంధీ పెళ్ళిలో పెళ్ళికొడుకు ఎక్కే గుర్రం లాంటివాడు. అదెప్పుడూ ఒకే చోట ఆగిపోతుంది. ముందుకి కదలదు. రాహుల్ గాంధీ అంతే. ఆయన్ని కదపాలని మన్మోహన్ సింగుగారు మరి కొందరు నాయకులు ఎంత ప్రయత్నించినా ఆయన కదుల్తే కద – అన్నారు.

ఇక ఛత్తీస్ గడ్ ముఖ్యమంత్రి రమణ్ సింగుగారు తమ రాష్ట్రంలో ఆక్సిడెంట్ల గురించి మాట్లాడుతూ – అందమయిన మోటారు సైకిళ్ళూ, అందుబాటులో ఆక్సిడెంట్ల గురించి మాట్లాడుతూ – అందమయిన మోటారు సైకిళ్ళూ, అందుబాటులో ఉండే మొబైలు ఫోన్లూ, వెనుక అందమైన గర్ల్ ఫ్రెండ్స్ కూర్చుంటే – ఆక్సిడెంట్లు జరగకుండా ఎలా వుంటాయి? అన్నారు.




వయసు మళ్ళిన మన కేంద్ర బొగ్గుగనుల మంత్రి శ్రీ ప్రకాష్ జైస్వాల్ గారు కాన్ పూర్ కవి సమ్మేళనంలో మాట్లాడుతూ – శ్రీ లంకలో 20ఓవర్ల మాచ్ లో పాకిస్థాన్ మీద ఇండియా విజయాన్ని గురించి ఓ ఉపమానం చెప్పారు. కొత్త విజయం, కొత్త పెళ్ళి మీద ఎప్పుడూ మోజు ఎక్కువ. పాతబడుతున్న కొద్దీ పెళ్ళాల మీద మోజు తగ్గిపోతుంది – అన్నారు. మంత్రిగారన్నారు గనుక ఇది తప్పు పట్టాల్సిన విషయమైపోయింది. గుజరాత్ కాంగ్రెసు అధ్యక్షులు అర్జున్ మద్వారియాగారు నరేంద్ర మోడీని కోతి అన్నారని చాలామంది తప్పుబట్టారు. ఆయన నెత్తీ నోరూ కొట్టుకుంటూ "నేను అలా అనలేదు బాబూ. ఆయన్ని ఏ ప్రాణితోనూ నేను పోల్చలేదు. అందునా కోతి అని ఎలా అంటాను? కోతి మన పూర్వీకులు. మన పూర్వీకుల్ని మనం గౌరవించుకోవాలి కదా? అందుకని ఈ పోలిక సరికాదు" అన్నాఉర్. ఆరోపణ కంటే వివరణ మరింత ఘాటుగా ఉంది.

ఇక ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ములాయం సింగుగారు తాము మహిళా రిజర్వేషన్ బిల్లుని ఎందుకు వ్యతిరేకిస్తున్నారో బయట పడ్డారు. "బాబూ, పల్లెటూళ్ళలో మన ఆడవాళ్ళు అందంగా ఉండరు. ఈ బిల్లువల్ల వారికి అన్యాయం జరుగుతుంది" అన్నారు. బిజేపీ ప్రతినిధి నిర్మలా సీతారాంగారికి ఈ మాటలు బొత్తిగా నచ్చలేదు. "మేమేం ముడిసరుకు కాదు. ములాయంగారి మాటలకి నేను అభ్యంతరం తెలుపుతున్నాను" అన్నారు.

ఇటీవల గుజరాత్ ఎన్నికల సబలో మణిశంకర్ అయ్యర్ మాట్లాడుతూ – "నరేంద్ర మోడీగారు తన నియోజిక వర్గం నుంచి ఎందుకు పోటీ చెయ్యడం లేదు? ఓడిపోతారని భయం. ఆయన లాహు పురుష్ (రక్తాన్ని పీల్చుకు తాగే జలగ లాంటివారు)" అన్నారు. ఇక ప్రముఖ న్యాయవాది, బిజేపీ నాయకులు రాం జెత్మలానీగారు ఈ మధ్య శ్రీరాముడి గురించి మాట్లాడారు "నా ఉద్దేశంలో రాముడు చెడ్డ భర్త. ఎవరో జాలరివాడు నిందవేసినంత మాత్రాన పెళ్ళాన్ని వదిలేస్తాడా? ఆ మాటకి వస్తే లక్ష్మణుడు చెడ్డ తమ్ముడు. వదినని వెదికి తీసుకురా – అని అన్న అడిగితే వెళ్ళకుండా ఆగిపోతాడా?" అన్నారు. ఇబ్బంది ఏమిటంటే తనపేరులోనే రాముడిని పెట్టుకున్న పెద్ద న్యాయవాదిగారు రామాయనం విషమ్యోనే పప్పులో కాలేశారు. రాముడి మీద నింద వేసింది జాలరి కాదు. చాకలి. ఇంక సీతని వెదకమని రాముడు లక్ష్మణుడిని పంపలేదు. రాముడికి సహాయంగా వెళ్ళమని సీత లక్ష్మణుడిని వేడుకుంది. అనడానికీ, ఎదిరించి సమాధానం చెప్పడానికీ సరసత, స్వారస్యం గల సహజమైన చమత్కారం – ఆనాటి బ్రిటన్ పార్లమెంటు సభ్యుల గురించి ఇక్కడగుర్తుచేసుకోవడంలో సరదా ఉంది.

ఆనాటి హౌస్ ఆఫ్ కామన్స్ లో చర్చిల్ ని చీల్చిచెండాడే ప్రతిపక్ష నాయకురాలు లేడీ ఆస్టర్. ఇద్దరూ ప్రసిద్ధులు. సరసులు. ఒకరికొకరు తీసిపోనివారు. ఓసారి లేడీ ఆస్టర్ చర్చిల్ తో అన్నారు: సార్, నాకు మీలాంటి భర్త ఉంటే విషం ఇచ్చేదాన్ని" అని. చర్చిల్ వెంటనే సమాధానం చెప్పారు. "అమ్మా, నాకు మీలాంటి భార్య ఉంటే వెంటనే విషాన్ని తాగేసేవాడిని" అని.

ఏతావాతా – ఇంతమంది నాయకులు ఇంత సరసంగా మాట్లాడగలిగే ఈ దేశంలో ఆసీం త్రివేదీ ఏం పాపం చేశారు? కొందరు నవ్వుతారు. కొందరు నవ్విస్తారు. కొందరు నవ్వించబోయి నవ్వులపాలవుతారు. మన నాయకుల నిర్వాకం ఆఖరుది.

(నవంబర్ 19, 2012)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (November 26,2012) Ekkadiki Potondee Vyavastha ఎక్కడికి పోతోంది ఈ వ్యవస్థ?

1948 నాటికి నాకు సరిగ్గా తొమ్మిదేళ్ళు. మహాత్మాగాంధీ హత్య జరిగింది. అదెంత నష్టమో, జాతి ఎంతగా కృంగిపోయిందో అర్థం చేసుకునే వయస్సు కాదు. కానీ ఆనాడు విశాఖపట్నమంతా – ముస్లింలు, హిందువులు, పెద్దా చిన్నా – అంతా సముద్రతీరానికి వచ్చి కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ సముద్ర స్నానం చెయ్యడం నాకు గుర్తుంది. నా చేత కూడా మా అమ్మా నాన్నా స్నానం చేయించారు. ఓ మహాత్ముడి నిర్యాణానికి దేశ ప్రజలు సమర్పించిన నివాళి అది. అది హత్య. మరణం కాదు.

మరో 39 సంవత్సరాల తర్వాత ప్రముఖ సినీనటుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.జి.రామచంద్ర అనారోగ్యంతో మరణించారు. ప్రజలు చెలరేగిపోయి దుకాణాలు ధ్వంసం చేసారు. బస్సుల్ని తగలెట్టారు. మందు షాపుల్ని దోచుకున్నారు. 23 మంది చచ్చిపోయారు. 47 మంది పోలీసులు గాయపడ్డారు.. కనీసం ఒక్కడు దోచుకున్న మందు షాపుల్లో మందుని తప్పతాగి రోడ్డుమీద పడి చచ్చాడు. దుఃఖం నుంచి విముక్తికి రెండు మార్గాలు. కృంగిపోవడం. మానవప్రయత్నానికి లొంగని ఆవేశానికి గుండె బాదుకోవడం. తన పరిసరాల్లో విధ్వంసం సృష్టించడం ఆ వ్యవస్థ సంస్కారానికి సంబంధించిన విషయం. అతి ప్రాథమికమయిన మానవ చేతన – నిస్సహాయంగా తన ఉదాసీనతకి దారులు వెదుక్కోవడం కుసంస్కారం. అంతకన్నా మరో వివరణ అందదు.

ఓ గొప్ప నాయకుడు – తన జీవితకాలంలో తనవయిన విశ్వాసాలకు తన చుట్టూ ఉన్న సమాజాన్ని చైతన్యవంతం చేయగలిగిన నాయకుడు – బాలా సాహెబ్ ధాకరే కన్నుమూశారు. సమాజంలో అన్యాయాన్నీ, అవినీతినీ వెక్కిరించి, హేళన చేసే కళకి దక్షత గల ప్రతినిధిగా – కార్టూనిస్టుగా జీవనాన్ని ప్రారంభించి – ఆ 'వెక్కిరింత'ని హక్కూ, శాసనం చెయ్యాలన్న విధానాలను అమలు జరిపి, అనారోగ్యం కారణంగా కన్నుమూశారు. విచిత్రంగా దేశం స్పందించింది. ఆయన అనుయాయులు, అభిమానులు, సానుభూతిపరులు – 2 లక్షల మంది శోక సముద్రంగా ఆయన భౌతిక కాయం వెనుక నడి చారు – శాంతియుతంగా. ఇది అనూహ్యమైన స్పందన. ఇదేమిటి? అవినీతి పట్ల అతి చిన్న కారణానికి అసహనాన్ని చూపే పార్టీ – ఇంతగా శోక సముద్రంలో మునిగిపోయినందుకు చాలామంది విస్తుపోయారు. కానీ అందరూ హర్షించారు.

ఆ రోజు ముంబైలో జనజీవనం స్థంభించిపోయింది. హోటళ్ళు మూతపడ్డాయి. చేతిని నోటిని ఆసరా చేసుకు బ్రతికేవారు విలవిలలాడారు. అయితే 21 సంవత్సరాల అమ్మాయి షబీనా ధారా బాలధాకరే కారణంగా జనజీవనం స్థంభించడాన్ని నిరసిస్తూ ఫేస్ బుక్ లో తన అభిప్రాయాన్ని వెల్లడించింది. ఆ అభిప్రాయాన్ని రేనూ శ్రీనివాసన్ అనే మరో అమ్మాయి సమర్థించింది. ఆవిడ మాటలివి: "గౌరవాన్ని సంపాదించుకోవాలి. ఎవరూ ఇవ్వరు. బలవంతంగా పొందలేరు. ఇవాళ కేవలం గౌరవం వల్ల ఖాక భయంవల్ల ముంబై స్థంభించిపోయింది. బాలధాకరే వంటి నాయకులు ప్రతీరోజూ పుడతారు. వెళ్ళిపోతారు. ఆ కారణంగా నగరాన్ని స్థంభింపజేయడం అన్యాయం. ఒక్కసారి ఆనాటి స్వాతంత్ర్యోద్యమ కాలంనాటి మహనీయుల్ని గుర్తుచేసుకోవాలి."

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

అంతే. అంతవరకూ బిగపట్టుకున్న శివసేన ఆవేశం కట్టలు తెంచుకుంది. అసలు రంగు బయటపడింది. ఇప్పుడేం చెయ్యాలి? ఆమె మామయ్య అబ్దుల్ గఫార్ దాదా క్లినిక్ ని ధ్వంసం చేశారు. పేషెంట్లనూ, వారి బంధువుల్నీ తరిమికొట్టి శివసేన కార్యకర్తలు ఆసుపత్రిని సర్వనాశనం చేశారు.

అసలు కథ ఇదికాదు. పోలీసులకి శివసేన శక్తిసామర్థ్యాలు తెలుసు. వారి కోపానికీ, ఆవేశానికీ ఎవరయినా బలికాక తప్పదని తెలుసు. అందుకని వారేం చేశారు? ఫేస్ బుక్ లో ఇంట్లో కూర్చుని తమ అభిప్రాయం చెప్పిన ఇద్దరు అమ్మాయిల్నిమతపరమైన అవ్యవస్థని సృష్టిస్తున్నారని అరెస్టు చేశారు.

ఈ దేశంలో పాలక వ్యవస్థ దుస్థితికి ఇంతకన్నా మరో ఉదాహరణ ఉండదు. ఇది నిరంకుశపాలనికి నిదర్శనం. వ్యక్తి స్వాతంత్ర్యం ఏ మంటలో కలిసిపోయింది – అని వాపోయారు కమ్యూనిస్టు పార్టీ నాయకులు డి.రాజా. పార్టీల బెల్లింపులకూ, బెదిరింపులకూ – నీతి పునాదులు సరిగ్గా లేని, మెజారిటీలను నమ్ముకుని ఆయుష్షును నిలుపుకునే నేటి రాజకీయ పార్టీల నిర్వాకం ఇది. ఒకే ఒక్క స్పందన – ఈ దేశపు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు మార్కండేయ కట్జూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి పృధ్వీరాజ్ చౌహాన్ కి ఉత్తరం రాశారు. దాని సారాంశం ఇది:

ఇద్దరమ్మాయిల వ్యక్తిగత అభిప్రాయాలు ఈ దేశంలో మత విశ్వాసాలను కించపరిచేవిగా ఉన్నాయన్న కారణానికి అరెస్ట్ చేశారు. మనది ప్రజాస్వామ్యం. ఫాసిస్టు నిరంకుశపాలన కాదు. మీరు వెంటనే ఈ అరెస్టుకి కారణమయిన అధికారుల మీద చర్య తీసుకోవాలి. అలా చెయ్యకపోతే రాజ్యాంగ నిబద్ధతతో ఈ రాష్ట్రాన్ని పాలించలేని మీ అసమర్థత వెల్లడవుతుంది. ఇందు మూలంగా జరిగే పర్యవసానాలు మీరు బాధ్యత వహించాల్సి వస్తుంది.

ఒక మహాత్ముడి మరణానికి జాతి ఉదాత్తంగా నివాళులర్పించే దశనుంచి – ఒక నాయకుడి మరణాన్ని తమ దౌష్ట్యానికి వాడుకుంటున్న శక్తులకు కొమ్ము కాసే దశకి ప్రభుత్వం దిగజారడం భయంకరమైన పతనం. ఒక ప్రభుత్వ నేతని ఈ విషయంలో ఒకప్పటి ఈ దేశపు ప్రధాన న్యాయమూర్తి నిలదీసే స్థాయికి రావడం దురదృష్టం. ఒక వ్యవస్థ నైతిక పతనానికి ఇది దయనీయమయిన పరిస్థితి.

**(నవంబర్** 26, 2012)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (December 3, 2012) Readymade Jeevithalu రెడీమేడ్ జీవితాలు

ఇప్పుడిప్పుడు జీవితం మరింత సుఖవంతమయిపోయింది. మన సుఖాల్ని ఎరిగిన పెద్దలూ, మన అవసరల్ని తెలుసుకున్న నాయకులూ, మన కష్టాల్ని గుర్తించిన మంత్రులూ – జీవితం ఎన్నడూ లేనంత హాయిగా మూడు పువ్వులూ ఆరుకాయలుగా తీర్చిదిద్దుతున్నారు. చిన్నప్పుడు తల్లిదండ్రులు మనకి తాయిలాలు  ఇస్తారు. మనం చేసే ప్రతి పనికీ చిన్న 'ఎర 'ని చూపిస్తారు. ఆ పనికి మనం ఉద్యుక్తులు కావడానికి అది రుచి. పోను పోనూ తాయిలాలు తగ్గిపోతాయి. నలభయ్యో ఏట మనకి ఎవరూ తాయిలాలు ఇవ్వరు నిజానికి మనం పిల్లలకి ఇచ్చే వయసది.  ఈ మధ్య కాలంలో ఏం జరిగింది? తాయిలాలు ఇస్తూనే మన శక్తి సామర్ధ్యాల్ని పెంచేదారుల్ని మనకి పెద్దలు నేర్పుతారు.సామర్థ్యాన్ని, దక్షతనీ పెంచుకునే శక్తిని తల్లిదండ్రులు కల్పిస్తారు. తాయిలం ప్రోత్సాహకమే కాని లబ్దికాదు. ఊతమేకాని సిద్ధికాదు. తర్వాత మనం తాయిలాల గురించి ఎదురుచూడం. వాటిని అడిగే పిల్లలకి మనం రుచిచూపుతాం. ఒకవేళ ఆ సామర్ధ్యాన్ని మనం అలవరుచుకోవాలని ఎవరూ నేర్పకపోతే? అదీ దుర్మార్గం. అదీ లోపం. ఆ పని ప్రస్తుతం మనదేశంలో జరుగుతోంది. ఇప్పుడు రాజకీయ పార్టీలు – రెడిమేడ్ సుఖాలకు తోవలు వేస్తున్నయి. అవన్నీ గొప్ప పనులు. మీకు కలర్ టీవీలు కొని ఇస్తారు. సైకిళ్ళు ఇస్తారు. పిల్లల చదువులకి పుస్తకాలు కొని ఇస్తారు. పెళ్ళి చేసుకోవాలంటే మంగళ సూత్రాలు ఇస్తారు. పెళ్ళికాని పిల్లలకి డబ్బులిస్తారు. మీకు తక్కువ మార్కులు వచ్చినా పాసు చేస్తారు. పరీక్షలు కాన్సిలు చేస్తారు. ఉద్యోగం లెదా? లేనందుకు డబ్బులిస్తారు. మీ భర్త పోయాడా? వెయ్యి రూపాయలిస్తారు. మీకు కాలు చెయ్యి లేదా? పదిహేను వందలు. ఊరికే ఇళ్ళు కట్టించి ఇస్తారు. ఆడవాళ్ళకయితే చీరలు ఇస్తారు. లక్షల ఉద్యోగాలిస్తారు. ఇలాంటి భూతల స్వర్గాన్ని – మన పాతనాయకులు చూపలేదు. ఇలాంటి ఉపకారాలు చెయ్యాలని అప్పటి నాయకులకి తోచలేదేం?

ఇప్పుడు కేంద్రం మరో పెద్ద ఉపకారం చెయ్యబోతోంది. మీకు వారు జరిపే ఉపకారం దళారుల పాలు కాకుండా సరాసరి మీకు చేరడానికి 'సరాసరి డబ్బు బదిలీ ' (డైరెక్ట్ కాష్ ట్రాన్స్ ఫర్  ) ఏర్పాటు చేస్తారు. ఆధార్ కార్డులు ఉన్నవారందరికీ ఈ ఉపకారం అందుతుంది. ఈ దేశంలో 1.2 బిలియన్ల జనాభా ఉంది. చదువురానివారు, పద్దతులు తెలియనివారు, అసలు మాట్లాడడమే తెలియని వారు, బాంకు అంటే అర్ధమే తెలియని వారు ఈ దేశంలో లక్షల మంది ఉన్నారు. వీరందరికీ కొన్ని  కోట్ల బాంకు ఎక్కౌంట్లు ఏర్పరచడానికి ఎన్ని వందల బాంకులు కావాలి? ఎన్ని లక్షల సిబ్బంది కావాలి? గ్రామంలో చదువులేని సాదాసీదా మనిషికి ఈ లబ్దిని చేర్చడానికి ఈ బాంకుల్లో దళారులు ఏర్పడుతారు. దోచుకునే మనసు ఉండాలేకాని మార్గాలు బోలెడు. ఇది తెలివైన పథకం. ఢిల్లీ బాబుల ఆలోచనలో పుట్టినది కాని ఆచరణలో అనూహ్యమైంది. నా కయితే ఊహకందని విషయం. ఇక – పదవుల్లో లేని నాయకులకి అరచేతిలో స్వర్గాన్ని చూపడం సుళువు. ఇచ్చే వాడికి బాధకాని హామీలు ఇచ్చేవాడికి బాధేముంది? ఇప్పుడు పబ్బం గడుస్తుంది. రేపు పదవిలోకి వచ్చినప్పటి మాటకదా! ఎన్నిసార్లు ఏరు దాటలేదు? ఎన్ని తెప్పల్ని తగలెయ్యలేదు? కష్టపడి పనిచెయ్యడం గురించీ, చదువుకుని బాగుపడడం గురించీ, ప్రయత్నించి రాణించడాన్ని గురించీ ఎవరూ మాట్లాడినట్టు కనిపించదు. తాయిలాలు ప్రకటించడంలో నాయకులు ఒకరితో ఒకరు పోటీ పడుతున్నారు. ప్రజలకీ ఒక విషయం అర్ధమయిపోయింది. ఓట్ల కోసం వీళ్ళది దేబిరింపు అని. వాళ్ళూ – మా సంగతేమిటని బొడ్డులో చెయ్యేసి నిలదీయడం మరిగారు. దీపముండగానే ఇల్లు చక్కపెట్టుకోవాలి? పదవికి దగ్గర తోవని వెదికే నాయకులకు – లబ్ధి పొందే ఓటర్లకీ మధ్య అనుబంధాలు,  ఆత్మీయతలకీ ఆస్కారం లేదు. నిజానికి అవసరమూ లేదు. ఆనాడు గాంధీని దేశం ప్రేమించింది. మా అమ్మ విజయనగరం రాజుగారికి ఓటు వెయ్యాలనేది. ఒకటి ఔన్నత్యం, రెండోది సంప్రదాయం.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!






ఇప్పుడు రెంటికీ స్థానం లేదు. ఓ నమూనా ఉపన్యాసం: "మీ ఊరిలో నలుగువేల ఇళ్ళు కట్టిస్తాం. అందులో ప్రతీ దూలానికి బల్బు ఉంటుంది. 24 గంటలూ అందులో కరెంటు ఉంటుంది. మీ పిల్లలందరికీ బట్టలిస్తాం. ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు చేస్తాం. అత్తారింటికి మేమె పంపిస్తాం. మొదటి పురుడు మేమే పోస్తాం. బారసాలకి అయిదువేలు. కుర్రాడికి ఉగ్గు గిన్నెలు, బొంతలూ ఉచితం. జబ్బు చేస్తే ఆసుపత్రి ఖర్చులు మావి. మీకు చేసినా మావే."

నిన్నటి తరాల నాయకులకు ఇంతటి ఔదార్యం ఎందుకు లేకపోయింది? నెహ్రూగారు ఇంత ఉదారులుకారా? నీలం సంజీవరెడ్డిగారికి ఈ మాత్రం సహృదయత లేకపోయిందా? ముఖ్యకారణం – చేస్తేకాని పదవుల్లోకి రాలేని దుస్థితిలో వారు లేరు. వారి దక్షతని నిజమైన సేవతో నిరూపించుకున్నారు. తాయిలాలు ఇవ్వడం ద్వారానే ఓట్లు వస్తాయని దేబిరించాల్సిన వ్యక్తిత్వాలు కావు వారివి. దీర్ఘకాలికంగా ఈ జాతికి ఏది అవసరమో వారు ఆలోచించారు. వారు ఆలోచించగలరని ప్రజలూ గుర్తించారు . అన్నిటికన్నా ముఖ్యం – తాయిలాలు ఇస్తేకాని వోట్లు రావన్న స్థితిలో వారు లేరు. వారి హయంలోనే నాగార్జున సాగర్, భక్రానంగళ్, హీరాకుడ్ వంటి ప్రాజెక్టులు – ఈ దేశపు ఆర్థిక స్థితినే మార్చగలిగినవి వెలిశాయి. ఈ రోజుల్లో ప్రాజెక్టులు లేవా? ఉంటే అవి పోలవరాలవుతాయి. వాన్ పిక్లవుతాయి. కొత్త దళారుల ద్వారా కాంట్రాక్టుల ఫలహారానికి ఆధారాలవుతాయి. ఎందుకంటే ఇప్పటి నాయకుల ఆయుష్షు కేవలం అయిదేళ్ళు. అప్పటి నాయకుల వయస్సు జీవితకాలం. నెహ్రూగారు మంత్రి పదవి అయాక అలహాబాదులో బట్టల కొట్టుపెట్టుకోవడాన్ని మనం ఊహించలేం. జైళ్ళలో మ్రగ్గడాన్ని అస్సలు ఊహించలేము. ఈ ప్రజాస్వామ్యంలో అదనూ, అవకాశం వచ్చినప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలి . వస్తువులు కొనుక్కునే స్తోమతు, ఆత్మస్థైర్యం, శక్తి ఇవ్వడానికి వ్యవధి లేదు. మేమే కలర్ టీవీలు కొనిస్తాం. జీతాలు కడతాం. తర్వాత మా గతి? అడగాలని ప్రజలకి తెలీదు. నాయకులు ఒక విధంగా పబ్బం గడుపుకుంటున్నారు. తెలివి మీరిన ఆయా వర్గాల నాయకులు మరో విధంగా వారిని బెల్లిస్తున్నారు. భవిష్యత్తు? ఎవడిక్కావాలి? భవిష్యత్తులో నిర్వీర్యమైన జాతి మిగులుతుంది. గవర్నమెంటు ఇచ్చే రాయితీల మీద బతికేవాడు – సామర్థ్యాన్ని పెంచుకోనవసరం లేని బానిస అవుతాడు. ఇది మరో రకమైన బానిసత్వం. బ్రిటిష్ వారు మనకి అలవాటు చేసింది ఇదే! 'నువ్వు ఎందుకు పనికొస్తావో మేం నిర్ణయిస్తాం. ఏం చదవాలో మేం చెపుతాం. ఉద్యోగాలు మేం ఇస్తాం. మాకు నౌఖరీ చెయ్యి. అదేమిటో నీకు తెలియాల్సిన అవసరం లేదు. నువ్వు చచ్చేదాకా నీకు డబ్బిస్తా. నువ్వు చచ్చాక నీ పెళ్ళానికీ డబ్బిస్తాం '. ఇది మా అమ్మ వంటివారికి చాలా మన్నికమయిన ఏర్పాటు. మా అమ్మకి చదువులేదు. ఆమె పెట్టుబడి విశ్వాసం. 65 సంవత్సరాల పైగా మనం ఈ బానిసత్వానికి అలవాటు పడిపోయాం. ఇప్పుడెందుకూ మార్చడం? ఏతావాతా అక్షరాలు పలక మీద రాయడానికి కుర్రాడికి అప్పుడప్పుడు తాయిలాలు ఇవ్వాలి. గొర్రెల్లాగ ఓట్లు గుద్దడానికి చదువులేని పామర జనానికి తాయిలాలే లాయికీ. తాయిలాలను మరిగే జాతి తన ఆత్మగౌరవం గురించీ, సామర్థ్యాన్ని గురించీ ఆలోచించదు. తాయిలాలు మరిగిన కుర్రాడు అక్షరాల మీద దృష్టి పెట్టడు. తండ్రి గల్లా పెట్టెమీదే దృష్టి పెడతాడు.

ప్రజలు ప్రస్తుతం ఆ పనే చేస్తున్నారు.

(**డిసెంబర్** 3, 2012)



# (December 10,2012) Abhinava Keechakulu అభినవ కీచకులు

రాబిన్ పాల్ 23 ఏళ్ళ అమ్మాయి. న్యాయంగా ఆమె మీద ఈగవాలడానికి కూడా వీల్లేదు. కారణం ఆమె అమృతసర్ లో పోలీసు అసిస్టెంటు సబ్ ఇన్ స్పెక్టర్ రవీందర్ పల్ సింగ్ కూతురు. కానీ హెడ్ కానిస్టేబుల్ గారి కొడుకే ఆమెని ఏడిపిస్తూంటే? అదే స్టేషన్ లో పనిచేస్తున్న గుర్ బీర్ సింగ్ బీరా కొడుకే వెంటబడుతున్నాడు. ఆ అమ్మాయి – 20 రోజుల కిందట పోలీసు స్టేషన్ లో పిర్యాదు చేసింది. ఎవరూ పట్టించుకోలేదు. నిన్న తన కూతుర్ని ఏడిపిస్తున్నవాళ్ళకి తండ్రి అడ్డుపడ్డాడు. ఏడిపిస్తున్నవారికి తుపాకీ చూపించాడు. అమృతసర్ అకాళీదళ్ జనరల్ కార్యదర్శి రంజిత్ సింగ్ రాణా రివాల్వర్ లో బులెట్లు అయిపోయాయి. అందుకని ఇంటికి వెళ్ళి బులెట్లు నింపుకుని వచ్చి పట్టపగలు నట్టనిడిరోడ్డుమీద అందరూ చూస్తూండగా రవీందర్ పల్ సింగుని కాల్చిచంపాడు. రాజకీయ దురహంకారం తలకెక్కిన – ఈ మధ్యకాలపు దజన్ల కథలలో ఇది ఇటీవలిది.

పార్టీ ముసుగులో ఏం చేసినా చెల్లిపోతుందనే ధీమా ఈ మధ్య కలంలో రాజకీయ దురహంకారికి తెలుసు. అదే మన వ్యవస్థకి పట్టిన దరిద్రం. మొన్ననే తను ఉంటున్న కాలనీలో అమ్మయిని కొందరు పోకరీ యువకులు పీడిస్తున్నప్పుడు సంతోష్ విచివారా అనే కుర్రాడు ఆ అమ్మాయికి బాసటగా నిలిచి వారిని ఎదిరించాడు. అంతే. ఆ దుండగులు అతన్ని పొడిచి చంపేశారు. సంతోష్ తండ్రి రెండేళ్ళ కిందటే కన్నుమూశాడు. అతనే ఆ కుటుంబానికి ఆధారం. ఇప్పుడు ఆ కుటుంబం వీధిన పడింది.

మరో చక్కని కథ. ప్రస్తుతం ప్రజాహితం గురించి ఆవేశంగా కబుర్లు చెప్పే పశ్చిమ బెంగాలు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆ మధ్య సజావయిన కారణానికే పోలీసులు అదపులోకి తీసుకున్న తన పార్టీ కార్యకర్తలను స్వయంగా పోలీస్ స్టేషన్ కి వెళ్ళి, పోలీసు చెంపపగలగొట్టి మరీ విడిపించుకు వచ్చారు.

ఈ దేశంలో న్యాయవ్యవస్థ కూడా పాలక వ్యవస్థకి తలవొంచుతున్న భయంకరమైన దుశ్శకునాలివి. ఇంకా భయంకరమైన హత్య అక్టోబరు 20 న జరిగినది. ముంబైలో హోటల్లోంచి వస్తూండగా తమతో ఉన్న అమ్మాయిల్ని ఆటపట్టిస్తున్న 17 మందిని ఇద్దరు కుర్రాళ్ళు ధైర్యంగా ఎదిరించారు. ఆ 17 మందీ వెళ్ళి ఇరవై మందితో కత్తులతో, కొడవళ్ళతో వచ్చి – ఆ ఇద్దర్నీ – కీనన్ (24), రూబెన్ (29) దారుణంగా పొడిచి చంపారు.

ఈ సందర్భంలోనే గుర్తుచేసుకోవలసిన మరో అరాచకం – ఉత్తర ప్రదేశ్ లో ప్రముఖ రాజకీయ నాయకుడు – డి.పి.యాదవ్ సుపుత్రుల భాగోతం. తమ చెల్లెల్ని ప్రేమిస్తున్నాడనే కారణానికి యాదవ్ గారి పుత్రులు – వికాశ్ యాదవ్, విశాల్ యాదవ్ లు నితీష్ కటారా అనే యువకుడుని దారుణంగా హత్యచేసి – న్యాయస్థానానికి దొరకకుండా తమ చెల్లెలు భారతిని విదేశాలకు పంపేశారు. నితీష్ తల్లి – నీలం కటారా అనే వీరవనిత – పుత్రశోకాన్ని దిగమింగి, సంవత్సరాల తరబడి పోరాడి ఆ సోదరులకు శిక్ష పడేటట్టు చూసింది. ఇది అవినీతిలో మొదటి భాగం మాత్రమే. సదరు వికాశ్ యాదవ్ అనారోగ్యం అనే మిషమీద సంవత్సరంలో కేవలం 66 సార్లు మాత్రమే అయిదు నక్షత్రాల ఆసుపత్రిలో గడిపారు. గమనించాల్సిన విషయం – ఇందులో న్యాయవాదుల, డాక్టర్ల, జైలర్లకీ వాటా ఉంది. రాజకీయ నాయకులు శిక్షలకు కూడా ప్రత్యామ్నాయాన్ని ఈ దేశంలో సాధించగలరనడానికి ఈ ఉదాహరణ తలమానికం.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

ఈ దేశంలో చట్టానికి అధికార దురహంకారులు గాజులు తొడగ గలరన్న వాస్తవాన్ని ఈ కథలన్నీ నిరూపిస్తాయి. ఎప్పుడో – 1869 లో – అంటే బ్రిటిష్ వారికాలంలో రూపుదిద్దుకున్న చట్టాలే ఇప్పటికీ మన దేశంలో వర్తిస్తున్నాయి. ఇప్పటికీ అమ్మాయిల్ని ఆట పట్టించే శృంగార రాయుళ్ళను శిక్షించే చట్టం మన దేశంలో లేదు. హత్యదాకా వెళ్ళింది కనుక ఈ కథని మనం వింటున్నాం కాని – అంధేరీలో అమ్మాయిల్ని ఆటపట్టించడంతో ఆగిపోతే వారిని శిక్షించే చట్టం మనకు లేదు.

దుశ్శాశునుడి కథ భారతకాలం నాటిది. ఈ అభినవ దుశ్శాశనుల నిస్సిగ్గు వీరంగం మూడు నిజాల్ని మన ముఖం మీద కొట్టినట్టు చెపుతోంది. అనుమానం లేదు – చట్టం గాజులు తొడుక్కుంది – లేదా యాదవ్, పోలీసుని చంపిన రంజిత్ సింగ్ రాణా వంటి గూండాలు చక్కని గాజులు తొడిగారు. న్యాయస్థానం శిక్షించినా శిక్షలు అమలు జరగకుండా తప్పించుకునే సౌకర్యం మరే దేశంలో దొరుకుతుంది? ఇక రెండో నిజం – కూతురు పరువుని కాపాడుకోడానికి – మాములు మనుషులకు సరే – పోలీసు ఆఫీసరయినా దిక్కులేదు. మూడు: రాజకీయ పార్టీ ముసుగు ఉంటే – ఏ నేరమయినా – ఆఖరికి హత్య అయినా – ఈ దేశంలో చెల్లిపోతుంది.

మన కళ్ళముందే ముసిలి కంట్రాక్టరు చెంప పగులగొట్టిన ముంబై కార్పొరేటరూ, తప్పుడు నేరాలకి అరెస్టయినా పోలీసుల చెంప పగులగొట్టి విడిపించుకురాగల ముఖ్యమంత్రులూ, కూతురుకి అడ్డుపడిన పోలీసు తండ్రిని నడి రోడ్డుమీద చంపిన ఓ పార్టీ కార్యదర్శి ఈ నిజాల్ని నిరూపిస్తున్నారు.

ఆ మధ్య ఒక వృద్ధుడిని అమెరికాలో అడిగాను – ఇక్కడెందుకున్నారని. కొడుకు బాగా సంపాదిస్తున్నాడని చెప్తాడనుకున్నాను. "మన దేశంలో అవినీతి విశ్వరూపానికి బ్లడ్ ప్రెజర్ ఎక్కువవుతోందండి. ఆరోగ్యాన్నీ, మనశ్శాంతినీ కాపాడుకోడానికి" అన్నాడు. ఏ రోజు పేపరు తెరిచినా ఆ పెద్దమనిషిమీద నాకు ఈర్ష్య కలుగుతోంది.

(డిసెంబర్ 10, 2012)



# (December 17,2012) Nijam Nidrapoyindi నిజం నిద్రపోయింది.

దాదాపు 50 సంవత్సరాల కిందట నేనో నాటిక రాశాను. దాని పేరు 'నిజం నిద్రపోయింది '. ఆ రోజుల్లో అది – అప్పటి నాటక ప్రక్రియకి పదేళ్ళు ముందున్న రచన. ఈ సృష్టిలో అన్ని నిజాలూ చెప్పుకోదగ్గవి కావు. ఒప్పుకోదగ్గవికావు. పంచుకోదగ్గవి కావు. ఎంచుకోదగ్గవికావు. కొన్ని నిజాలు బయటికి రావు. రానక్కరలేదు. ఆ కారణానే మన జీవితాలు ఆనందంగా, ప్రశాంతంగా సాగుతున్నాయి.

అయితే ఏ నిజాలు బయటికి రావాలి? ఎంతవరకూ రావాలి? ఎప్పుడు రావాలి? వీటిని నిర్ణయించే దక్షత గల పెద్దల చేతుల్లోనే ఈ నిజాలు మిగలాలి.

ఓ భయంకరమైన క్షణంలో "ఈ రాక్షసిని ఎందుకు పెళ్ళి చేసుకున్నాను?" అని పెళ్ళాం గురించి మొగుడు అనుకోవచ్చు. "ఇలాంటి తిరుగుబోతుని ఎలా కట్టుకున్నాను?" అని పెళ్ళామూ అనుకోవచ్చు. ఆ రెండు నిజాలూ బయటపడితే వాళ్ళ జీవితాలు వేరుకానూవచ్చు. కాని మన్నికయిన సాహచర్యంలో – ఇద్దరూ మనస్సు మార్చుకున్న 'సమ్యమనం' వాళ్ళ 50 సంవత్సరాల వైవాహిక జీవితానికి ప్రతీక కావచ్చు. ఆ క్షణంలో మనస్సుల్లో ఆలోచనలకన్న – వాళ్ళ సాహచర్యం కాలదోషం పట్టకుండా కాపాడగల 'అబద్ధం' ఆ మేరకు వారికి ఉపకారి కావచ్చు. ఇదే నాటిక ఇతివృత్తం.

రాజకీయ, సామాజిక రంగాల్లో ఏ నిజాన్ని ఎవరు ఎప్పుడు బయట పెట్టాలి? దానివల్ల ఏం ప్రయోజనం? – ఇవన్నీ చాలా బరువైన ప్రశ్నలు. ఒక్కొక్కప్పుడు సమాధానం రాని ప్రశ్నలు.

మాజీ ప్రధాని పీవీ నరసింహారావుగారి మీద లెబర్హాన్ కమిషన్ విచారణ జరుగుతున్న రోజుల్లో నేను ఆయన్ని రెండు మూడుసార్లు ఢిల్లీలో కలిశాను. ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూ "కొన్ని విషయాలు తెలియడం వల్ల ఎవరికీ ఉపయోగం ఉండదు. కాగా, కుండ బద్దలవుతుంది. నాకు తెలిసిన – నాకు మాత్రమే తెలిసిన కొన్ని నిజాలు నాతోనే కాటికి పోతాయి" అన్నారు. మాటలు ఇవే కాకపోవచ్చు. అర్థం ఇదే. అది బాధ్యతని నెత్తిన ఎత్తుకున్న ఒక దేశపు పాలకుని గాంభీర్యం.

నిన్న సి.బి.ఐ చైర్మన్ గా రిటైరయిన యు.ఎస్.మిశ్రా నోరిప్పారు. తమ వ్యవహారాల్లో రాజకీయ పక్షాల, మంత్రుల, శక్తివంతమయిన నాయకుల జోక్యం ఉందన్నారు. ఆ జోక్యం బి.జె.పి పాలనలోనూ, కాంగ్రెసు పాలనలోనూ సాగిందన్నారు. ఎవరీ పక్షాలు? ఎవరీ మంత్రులు? ఏ వ్యవహారంలో జోక్యం చేసుకుని వత్తిడి తెచ్చారు? అప్పుడేమయింది? చెప్పనన్నారు. సి.బి.ఐ.మీద రాజకీయ పార్టీల వత్తిడి అందరికీ తెలిసిందే. ఇప్పుడు మిశ్రాగారు ఆ విషయాన్ని శంఖంలో పోశారు. వత్తిడివచ్చిన రోజుల్లో ప్రభుత్వాన్ని ఎదిరించడమో, రాజీనామా చేయడమో నిజాయితీ అనిపించుకుంటుంది. లేదా బయటపడి – ఆ నాయకుల పేర్లు బయట పెట్టడం సాహసం అనిపించుకుంటుంది. నిన్న మొన్నటి వికీ లీక్స్ వల్ల ఏం ఒరిగింది?




బాధ్యతగల పదవుల్లో ఉన్నవారి మొదటి కర్తవ్యం – తమ ఉద్యోగ నిర్వహణలో తెలిసే ఎన్నో నిజాలను మనస్సులోనే నిలుపుకోవడం. వాటిని వీధిని పెట్టే పని – అంత ఉన్నత పదవుల్లో ఉన్న ఉద్యోగులు చెయ్యవలసిందికాదు. చెయ్యదగింది కాదు. చెయ్యనక్కరలేదు. చెయ్యమని ప్రతిజ్ఞలు చేసి కుర్చీల్లో కూర్చున్నారు కనుక.

అలాగే – నిన్న క్రికెట్ ఆటగాడు మొహీందర్ అమర్ నాథ్ – ఆ మధ్య టీముని ఎంపిక చేయండంలో ధోనీని తొలిగించాలని ఇద్దరు ముగ్గురు అన్నట్టు బయటపడి చెప్పాడు. ఇది బొత్తిగా బాధ్యతారహితమని నా ఉద్దేశం. జట్టుని నిర్ణయించడంలో ఆయా ఆటగాళ్ళ మంచి చెడుల్ని చర్చించడం పరిపాటి. వినోద్ కాంబ్లీని తొలగించిన రోజుల్లో ఆయన 'తాగుడు' గురించీ మాట్లాడుకుని ఉంటారు. చర్చించడం సహజం. అంతమాత్రాన ఆ అభిప్రాయాలు వీధిన పడనక్కరలేదు. సాముహికంగాకమిటీ నిర్ణయానికే సభ్యులంతా కట్టుబడి ఉంటారు. ఉండాలి. ఆ పని అప్పుడు మహీందర్ అమర్ నాథ్ కూడా చేశారు. ఇప్పుడు బయటపడి చెప్పడం ఎందుకు? అందునా తెల్లవారితే టెస్ట్ ప్రారంభమవుతూండగా, అసలే ఓటమిని రుచి చూసిన స్వదేశపు కేప్టెన్ ని గురించి – బయటపడి చెప్పనక్కరలేదని, చెప్పకూడదని, చెప్పడానికి అధికారం లేని – ఓ సీనియర్ సభ్యుడు చెప్పడం బొత్తిగా దుర్మార్గం. చెప్పాలన్న నిజాయితీ ఆనాడే ఉంటే అప్పుడే తన సభ్యత్వానికి రాజీనామా చేసి వీధిన పడాల్సింది. ఓటమిని రుచిచూస్తున్న టీం నాయకునిపై కాలుదువ్వడం విచక్షణా రాహిత్యం. అప్పుడే దొంగలు పడి ఆరునెలలు దాటిపోయింది. మరి కమిటీమీద బీసీసి ఐ అధ్యక్షుడు, వారి అనుయాయుల ఒత్తిడి ఎలా బయట పడుతుంది? బయట పెట్టే వ్యక్తుల నిజాయితీ సమృద్ధిగా ఉన్నప్పుడు. నిజానికి ఎప్పుడూ రెండు ముఖాలుండవు. అబద్దానికి ఆరు ముఖాలుంటాయి. సందర్భం లేని సమయంలో నోరిప్పడమూ అవినీతే అవుతుంది. ఛానల్ లో ఆలశ్యంగా నోరిప్పడం రాజకీయం అవుతుంది.

ప్రభుత్వం సామూహికంగా జరిపే పాలనలో మంచికీ చెడుకీ, నీతికీ అవినీతికీ, తప్పిదానికీ ఒప్పుకీ – ఎవరిది బాధ్యతో పదిమందిలో నోరిప్పడం – అనుచితమైన వ్యక్తిత్వాల పతనానికే నిదర్శనం.

తమ తమ స్వల్పకాలిక ప్రయోజనాలకు – నీతిని తప్పి కొన్ని విషయాల్ని బయటపెట్టడం – నిజాయితీగా భావించే, కనిపించాలని తాపత్రయపడే నిజమైన అవినీతిపరుల కాలమిది.

లేకపోతే కొందరు మంత్రులు జైలులో ఉండి, కొందరు బయట ఉండి, కొందరు ఎక్కడ ఉండాలో తెలియక ఎవరిది అవినీతో తెలియని అవ్యవస్థ ఇప్పటిది.

పొత్తూరి వెంకటేశ్వరరావుగారి వంటి సీనియర్ పాత్రికేయులు – జైళ్ళలో ఉండాల్సిన వారు బయట ఉన్నారు. బయట ఉండాల్సినవారు జైళ్ళలో ఉన్నారు – అన్నారు ఈ మధ్య. సరే. ఎవరి మాటల్లో నిజం ఉంది? లేకపోతే ఏ నిజం ఎక్కడ ఎంతగా నిద్రపోయింది? మిత్రాలూ, అమర్ నాథ్ లూ ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పరు. ప్రశ్నలను మరింత సంక్లిష్టం చేస్తారు. వ్యవస్థలో మరో కొత్తరకం అవినీతికి తెర తీస్తారు.

(డిసెంబర్ 17, 2012)




# ( December 24, 2012) Manavatvamaa.Ekkada nuvvu?మానవత్వమా! ఎక్కడ నువ్వు ?

ఆడవారికి స్వాతంత్ర్యం వచ్చిందని భుజాలు చరుచుకుంటున్న రోజులివి. కాని ఆడవారి స్వేచ్ఛని ఆరోగ్యకరమైన దృష్టితో చూడడం చేతకాని పశువులున్న రోజులు కూడా ఇవే.

వాళ్లు చిన్న కుటుంబాలకు చెందినవాళ్లు. కార్లలో డ్రైవర్లతో తిరిగే స్తోమతు చాలని వాళ్లు. తప్పనిసరిగా బస్సుల్ని నమ్ముకోవలసినవాళ్లు. వాళ్లు పడే కష్టాలు, అవమానాలూ ఇళ్లలో చెప్పుకుంటే ఆ చదువుకొనే అవకాశం పోతుందేమోనని గుండెల్లోనే మంటల్ని దాచుకునేవాళ్లు. జీవితంలో ఏ కాస్త అవకాశాన్నయినా అందిపుచ్చుకుని ఆ మేరకి, తమ, తమ కుటుంబాలకి ఆసరా కావాలనే కలలు కనేవాళ్లు. ఈ ఈమెయిల్ నాకు ఓ అరవైయేళ్ల ముసలాయన పంపిస్తూ -దయచేసి కాలమ్ రాయమని అర్థించాడు. మొన్న ఆదివారం ఢిల్లీలో జరిగిన అనర్థం తరువాత రెయిన్ ట్రీ ఫిలింస్ డైరెక్టర్ నిష్ఠా జైన్ 'ఫేస్ బుక్'లో రాసిన ఉదంతం ఇది.

''ఢిల్లీ మారిందంటారు. అవును. మారింది. మరింత అధ్వాన్నమయింది. కార్లూ డ్రైవర్లూ నోచుకోని మధ్యతరగతి ఆడపిల్ల నిస్సహాయంగా వీధిన పడింది. ప్రతీరోజూ కాలేజీకి, యూనివర్సిటీకి వెళ్లే ఆడపిల్లలు రద్దీగా ఉన్న బస్సుల్లో ప్రయాణం చెయ్యడం తప్పనిసరి. కావాలని దొమ్మీలో నిలబడి, శరీరాలకు రాసుకుంటూ -ఆడపిల్లల పిర్రలూ, తొడలూ నొక్కి, గిల్లి, వేళ్లతో పొడిచి -కోపంగా చూస్తే 'ఏం చేస్తావన్న'ట్టు ధీమాగా చూస్తూ స్థనాలపై కొట్టే పోకిరీరాయుళ్లు పెచ్చురేగిపోతున్న రోజులివి. వాళ్ల ముఖాలు ఆడపిల్లలకి తెలుసు. వీళ్లేమీ చెయ్యలేరని ఆ దౌర్భాగ్యులకి తెలుసు. ఇది దైనందిన విలాసం. ఆడపిల్లకి దిన దిన గండం. ఆ దౌర్భాగ్యుడు ఆ పనికే ఒరుసుకుంటున్నాడని తెలుసు. తప్పించుకునే మార్గం లేదు. కండక్టర్లకీ తెలుసు. వారూ చిలిపిగా నవ్వుకుంటారు. కొందరు నిస్సహాయంగా తలతిప్పుకుంటారు. చాందినీచౌక్, కరోల్ భాగ్ వంటి చోట్లకి వెళ్లి మతిచెడి ఇంటికి చేరిన సందర్భాలు బోలెడు. కొంత పెద్దదాన్నయాక నామీద చెయ్యేసిన మగాడిని తిప్పికొట్టిన సందర్భాలున్నాయి. ఆ మగాడు సిగ్గుపడకుండా ఈసారి తెలిసేటట్టు స్థనాల మీద బలంగా కొడతాడు. బస్సులో అందరికీ ఇది కనిపిస్తూనే ఉంటుంది. కాని ఆ క్షణాన ఆ పని తనకు జరగలేదని ఊపిరి పీల్చుకుంటారు. ఇది మధ్యతరగతి పలాయనవాదం. ఢిల్లీలో రాత్రి తొమ్మిది దాటాక బస్సుల్లో ఆడపిల్ల ప్రయాణం చేస్తే -ఆమె వ్యభిచారి కిందే లెక్క. ఆమెని ఎవరయినా ఏదయినా చెయ్యవచ్చు. ఇది నేను చెప్తున్నమాట కాదు. తాగిన ఒక మగాడు నాకు చెప్పినమాట. డిటిసి బస్సులో ప్రయాణం చేస్తున్న నా తొడమీద తాగిన మగాడు వచ్చి కూచున్నాడు. బస్సు కండక్టరు చూస్తున్నాడు. ఎదిరించబోయాను. బస్సు కండక్టరు అన్నాడు కదా: 'తొమ్మిది తర్వాత బయటికి రావడం నీదీ తప్పు'! అని'' ఇవి నిష్ఠా జైన్ మాటలు. ఇదీ మన దేశం. మన నీతి. మన మగతనం. మన మహిళ పరిస్థితి. 23 ఏళ్ల వైద్య డిగ్రీ చదువుతున్న ఆడపిల్ల ఢిల్లీలో ఒక మగాడితో ప్రయాణం చేస్తూంటే నడుస్తున్న బస్సులోనే ఏడుగురు కొట్టి మానభంగం చేసి, అడ్డుపడిన మగాడిని ఇనుప పూచలతో చావబాది నడుస్తున్న బస్సులోంచి బయటికి తోసేసిన గుండెనిబ్బరాన్నిచ్చిన రాజధాని మనది.

బిడ్డని చదివించుకోడానికి ఉపాధి చాలని తల్లీదండ్రీ ఉప్పు, రొట్టె తిని -కడుపుకట్టుకుని చదివించుకుంటున్నారు. ఆ అమ్మాయికి డాక్టరు కావాలని కల. కాని బతుకుమీద ఆశకూడాలేని దశలో పేషెంటు అయింది. తల్లిదండ్రులు బిక్కచచ్చిపోయారు. ''నేనెవరినీ నిందించను. ఇలాంటి ఘోరం మరో ఆడపిల్లకు జరగకూడదు'' అన్నాడు ఆమె తండ్రి తడి ఆరిపోయిన కళ్లతో.



దేశమంతా ఒక్కటయి ఈ సంఘటనని గర్హించింది. "నేను చేసింది పరమ ఘోరం. నన్ను ఉరి తీయండి" అన్నాడట –ఈ ఘోరాన్ని చేసిన ఒక నీచుడు. సోనియాగాంధీ, స్పీకర్ మీరాకుమార్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి వచ్చారు. ప్రధాని ఈ సంఘటనని గర్హించారు. నాకు హింస మీదా, ప్రతీకారం మీదా, పగ మీదా, రక్తపాతం మీదా నమ్మకం లేదు. కాని ఈ దేశంలో ఇలాంటి పశువుల్ని నలుగురిమధ్యా నిలబెట్టి కాల్చి చంపాల్సిన సమయం వచ్చిందని నాకనిపిస్తుంది. సిద్ధాంతాల కోసమో, రాజకీయ కారణాలకో చైనాలో తినామన్‌స్క్వేర్ దగ్గర వేలమంది యువకుల్ని చంపి రక్తపు మరకల్ని చెరిపేసింది ప్రభుత్వం. ఇలాంటి వారిని అతి ఉదారంగా ఆ పని చేసి –రక్తపు మరకల్ని అలాగే ఉంచాలని నా ఉద్దేశం.

ఇంత దారుణమైన నైచ్యానికి ఈ దేశంలో అతి భయంకరమైన 'ఆంక్ష' లేకపోవడం దయనీయమైన పరిస్థితి. సోనియాగాంధీ, జయాబచ్చన్ వంటి వారి సానుభూతి "అమ్మా, నాకింకా బతకాలని ఉంది" అని ఆక్రోశించిన ఆ అమ్మాయికి ప్రాణం పోయదు. కాని మరో అమ్మాయికి ఇలాంటి దుస్థితి రాకుండా చూడవలసిన చర్య –మూగగా, నిస్సహాయంగా, నిశ్శబ్దంగా రంపపుకోతని అనుభవిస్తున్న నిష్ఠా జైన్ వంటి ఎందరో ఆడపిల్లల మనసుల్లో ఏ కాస్తో 'ఆశ'ని నింపుతుంది.

ఈ ఆడపిల్లకి జరిగిన అత్యాచారం కంటే 'ఉరిశిక్ష' అమానుషమయినదా? మానవహక్కుల సంఘాల వారు అవసరమైన సమయాల్లో నోరు విప్పరేం! అన్యాయం జరిగిందని గొంతులు చించుకునేవారు, జరగకముందు ఇలాంటి ఘోరాల్ని గర్హించరేం? ఆత్మవంచనకు అద్దం పట్టే ఈ 'హక్కుల' హక్కుదారులు ఏ మానవుల గురించి మాట్లాడుతారో ఆ భగవంతుడికే తెలియాలి.

వారందరికీ ఈ 23 ఏళ్ల అమ్మాయి ఫొటో, సామూహిక మానభంగం జరిగిన అమ్మాయిని హోటల్‌కి పిలిచి రేప్ చేసిన పోలీసు ఉద్యోగి ఫొటోని, ఈస్ట్ ఢిల్లీలో న్యూ అశోక్‌నగర్ కాలనీలో నవంబర్ 28న 20 ఏళ్ల అమ్మాయిని రేప్ చేసిన పొరుగింటి ప్రబుద్ధుడి ఫొటోని, కొన్ని పువ్వుల్ని ఇచ్చి –వాళ్ల కాళ్ల ఫొటోల్ని పేపర్లో వేయించండి. నోరెత్తని వారి మానవీయతకి మురిసిపోయి ఇక్కడి నుంచే మేం దండం పెట్టుకుంటాం.

( **డిసెంబర్** 24, 2012)




# (December 31, 2012) Telugu Tegullu తెలుగు తెగుళ్ళు

అమెరికా అధ్యక్షుడిగా ఒబామా ఎన్నికయినప్పుడు – ప్రపంచమంతా సంబరపడింది తమకేదో మేలు జరిగినట్టు. ఆయన ప్రసంగాన్ని – తమ నాయకుడే చెపుతున్నంతగా విని పొంగిపోయింది. అదొక వెల్లువ. రెండోసారి ఆయన ఎన్నికయినప్పుడు ఆయన చికాగోలో ప్రసంగించారు. కానీ ఆయన ప్రత్యర్ధి మిట్ రామ్నీ చెప్పిన నాలుగు మాటలూ నన్ను పులికింపజేశాయి ఆ వాక్యాలు. ఇంగ్లీషులో కవిత్వమంత పదునైనవి. తప్పనిసరిగా – తెలుగులో రాస్తున్నాను.

"ఇవాళ దేశం క్లిష్ట పరిస్థితిలో ఉంది. ఇలాంటి సమయంలో రాజకీయమయిన కుమ్ములాటనీ, అభిప్రాయబేధాలనే గుద్దులాటతో పరిస్థితిని మరింత దిగజార్చకూడదు. ప్రజాహితాన్ని చేయడానికి – మన నాయకులు – అవసరమయితే వ్యక్తుల్ని దాటి నడవడం అలవాటు చేసుకోవాలి. పౌరులుగా ఈ సమయంలో కాలానికి తగ్గట్టు కలిసి నిలబడాలి. ఒబామాకి నా శుభాకాంక్షలు"

ఇంతకన్న గాంభీర్యం, ఠీవి, ఔదార్యం, విచక్షణ ఒక ప్రత్యర్ధిలో చూడం. మన 'నీలం ' తుఫాన్ రోజుల్లోనే అమెరికాలో 'శాండీ ' తుఫాన్ వచ్చింది. అప్పటికి ఒబామా – రామ్నీ మధ్య బాహాబాహీగా చర్చలు ప్రసారమవుతున్నాయి. ఎప్పుడూ లేనంతగా – ఇద్దరూ స్పష్టంగా విమర్శించుకున్నారు. ఈలోగా తుపాన్ వచ్చింది. ఈ ఎన్నికల చర్చావేదికని వాయిదా వేశారు. ఒక్కమాట –ఒక్కసారి, ఒబామా అసమర్ధతని గానీ, ప్రభుత్వ వైఫల్యం గానీ రామ్నీ దుమ్మెత్తి పోయలేదు. ఇది అతి హృద్యమయిన అతి హుందా అయిన ప్రవర్తన.

పోటీలో ఒకరు ఓడారు. కానీ దేశం ముఖ్యం – సమాజం ముఖ్యం – పౌరుడు ముఖ్యం – పోటీ ముగిసిపోయింది. పాలన జరగాలి. దాన్ని వక్రీకరించే సంకుచితాన్ని రామ్నీ ప్రదర్శంచలేదు . మరొక్కసారి – మరొక్కసారి – ???తెలిసి ఇంత ఉదాత్తతని చూపిన సందర్భంగాని, ప్రత్యర్ధిని కాని – నేనెన్నడూ చూడలేదు. ఒకటి ఎన్నికలో ఓటిమి, రెండోది ప్రకృతి వైపరీత్యం. ఇందులో ప్రభుత్వం అసమర్ధతని – ఆ దశలో దుయ్యపట్టడం ఏ నాయకునికయినా అనౌచిత్యం.

ఆ పని 'నీలం ' తుఫాన్ రోజుల్లో ప్రతిపక్ష నాయకులూ చేశారు. ప్రకృతి వైపరీత్యాన్ని తమకు అవకాశంగా మలచుకోడానికి ఉవ్విళ్ళూరారు. ఇది 'శవ ' రా జకీయం వంటిదని నేను కాలం రాశాను.

ఇప్పుడు మరొక సందర్భం. 37 సంవత్సరాల తర్వాత ఆంధ్ర ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహా సభల్ని నిర్వహిస్తోంది. 30 సంవత్సరాల పాటు ఏ ప్రభుత్వాలు ఈ పని చెయ్యాలన్న ఆలోచనయినా చెయ్యలేదు. ఈ దేశపు రాష్ట్రపతి ఆ సభల్ని ప్రారంభిస్తున్నారు. ప్రపంచంలోని తెలుగువారంతా చూస్తున్నారు. బర్మా, మారిషస్, అమెరికా, బ్రిటన్, మలేషియా వంటి ఎన్నో ప్రపంచ దేశాల నుంచి ప్రతినిధులు వచ్చారు. జర్మనీ నుంచీ, రష్యా నుంచీ తెలుగు నేర్చుకుని అభిమానించే విజ్ఞులు వచ్చారు.




ఈ సభలు రాజకీయ లబ్ధిని దృష్టిలో పెట్టుకున్నవి కావు. ఇందులో పార్టీలు ప్రమేయం లేదు. దేవులపల్లి, శ్రీశ్రీ, సురవరం ప్రతాపరెడ్డి వంటి ఎందరో మహాకవులు, నాయకులు, సేవా తత్పరులు ఉన్నారు. ఇది తెలుగు వారికి అరుదైన బంగారు పండగ. అందరూ ఆనందించాల్సిన పండగ. భాషకి, సంస్కృతికి పట్టాభిషేకం.

తెలుగు సభలను బహిష్కరిస్తామని స్థానికీ ఎమ్మెల్యేభూమన కరుణాకర రెడ్డిగారు ప్రకటించారు. తెలుగు తల్లి విగ్రహం ముందు నిరాహార దీక్షను ప్రారంభించారు. ప్రపంచ తెలుగు మహాసభలలో నిరసనను తెలియచేస్తామని అభ్యుదయ రచయితల సంఘ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ప్రకటించారు. దానికి వారి వారి కారణాలను తెలిపారు. అలాగే మరొక పార్టీ ప్రతినిధి – పేరు అనవసరం. లోపాలు ప్రతీ పనిలోనూ ఉంటాయి. కాని ఉద్దేశం, ఆ కార్యక్రమ లక్ష్యం – వాటిని ఆ మేరకి కప్పిపుచ్చుతాయి.

ఆ మధ్య ప్రపంచ తమిళ మహా సభలను ప్రపంచం ఏకమయి జరుపుకుంది. పార్టీల ప్రమేయం లేకుండా పార్టీల ప్రమేయం లేకుండా అన్ని పార్టీలూ ఏకమయి వేదిక మీద నిలిచారు. తమిళ భాష మనకంటే ముందే అధికార భాష అయింది. తమకి సమష్టిగా మేలుచేసే ఏ కార్యక్రమానికైనా తమిళులు రాజకీయమయిన పరిధుల్ని చెరిపేస్తారు. అందుకే వారికి మనపట్లా, వారి సంఘటిత శక్తి పట్లా కేంద్రానికి గౌరవం.

మనకి దక్కే గౌరవం ఏమిటో – తెలంగాణా వివాదంలో పోలవరం వంటి విషయాల్లో కేంద్రం తటస్థాన్ని చూస్తున్నాం కదా! మన మీద, మన సంస్కృతి మీదా మనకే బేధాలున్నప్పుడు – మరొకరు – మనకిచ్చే గౌరవం, విలువా అంతంత మాత్రంగానే ఉంటుంది. ప్రపంచమంతా ఏకమయి జరుపుకునే తెలుగు పండగ – రాజకీయ ప్రమేయం లేని ఈ పండగని – తమ పార్టీలు గిరులు దాటి – ప్రపంచ ప్రతినిధుల మధ్య ఉదాత్తతని చాటలేని – మన పార్టీల ఒంటిపిల్లి తనానికి – ఇది అతి హృదయ విదాకరకమయిన నిదర్శనం అని నా కనిపిస్తోంది.

ఈ సభల పట్ల నిరసనని ప్రతిపక్షాల తీరు చూశాక మిట్ రామ్నీ వంటివారు మరీ ఆకాశంలో కనిపిస్తారు.

(**డిసెంబర్** 31, 2012)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బా నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!